వాడ్రేవు చినవీరభద్రుడు

# ఉదారచరితులు

## వారిది వసుధైక కుటుంబం

వాడ్రేవు చినవీరభద్రుడు

# ఉదారచరితులు

వారిది వసుధైక కుటుంబం

**UDARA CHARITULU**

VARIDI VASUDHAIKA KUTUMBAM

Occasional writing on history,
social transformation, and personal narratives

**VADREVU CHINAVEERABHADRUDU**

August, 2025

Cover painting in watercolor, page design,
composing and lay-out
Vadrevu Ch Veerabhadrudu

e-book released by

Vadrevu Ch Veerabhadrudu
First Floor, House No.56, Navodaya Colony
Mehdipatnam
HYDERABAD, Telangana state, 500 028

chinaveera@gmail.com
mobile: +91 94909 57129

కల్లూరి భాస్కరంగారికి

# వరుసగా

## అంతర్జాతీయ రంగం


| | |
|---|---|
| ఐతిహాసిక బృందగానం | 7 |
| మనమెందుకు గుర్తుపెట్టుకుంటాం? | 12 |
| బెన్ ఒక్రి | 16 |
| గూగి వా థియోంగో | 22 |
| గ్రేటా థున్‌బెర్గ్ ఎఫెక్టు | 28 |
| సల్మాన్ రూష్దీ | 35 |
| ఏమి పాఠం నేర్చుకున్నాం? | 39 |
| మెలకువలో కన్న కల | 43 |
| బహురూపుల వాడు | 50 |


## జాతీయ రంగం


| | |
|---|---|
| కలాం ఎఫెక్టు | 56 |
| మహాశ్వేతాదేవి | 60 |
| సాహిత్య విలాసం | 64 |
| నా చరిత్ర | 67 |
| ఆదర్శ ఉపాధ్యాయుడు | 71 |
| ఒక భారతీయ తీర్థయాత్రీకుడు | 76 |

ప్రిన్స్ ఆఫ్ ద పేట్రియాట్స్ 82
విప్లవాత్మక జాతీయవాది 85
అప్రమేయమైన ఆనందం 91
లోహియా గురించి 95
ఒక తల్లి ఆత్మకథ 98
భవభయదారుణం 102

**తెలుగుసమాజం**

జాతిని మేల్కొల్పినవాళ్ళు 108
ఒక తల్లిదండ్రుల కథ 121
ఒక మనిషి జీవితకథ 127
అద్వితీయ జయగాథలు 131
ఒక చరిత్రకారుడి ప్రయాణం 135
ఒక ఫీల్డ్ వర్కర్ డైరీ 141
గిరోయి 148

**చరిత్ర, పురాణాలు, సామాజికగమనం**

సాహసం, కానీ ఎంతో అవసరం 151
పురాణపాత్రలపై కొత్తవెలుగు 163
కొత్తవెలుగులో మహాభారతం 168
పెరిప్లస్ ఆఫ్ ద ఎరిత్రియన్ సీ 174

**మరో రెండు మాటలు**

స్పష్టంగా చెప్పగలిగేనా? 178
మన పిల్లలకి మంచిది కాదు 182

# ఐతిహాసిక బృందగానం

**నిన్న** సాయంకాలం రాజిరెడ్డి ఫోను చేసి ఈ ఏడాది నోబెలు ప్రైజు ఒక రష్యను రచయితకి ఇచ్చారని చెప్తూ ఆమె గురించి మీరేమైనా రాయగలరా అనడిగాడు. ఆమె పేరు కూడా చెప్పాడు గాని, ఫోన్లో వినబడలేదు. నేనామె పేరెప్పుడూ వినలేదనీ, ఆమె రచనల గురించేమీ తెలియదనీ సదాశివరావుగారిని గానీ, ముకుందరామారావు గారిని గానీ అడగమని చెప్పాను.

సరిగ్గా ఈ అజ్ఞానం మీదనే స్వెత్లానా అలెక్జీవిచ్ గత పాతికేళ్ళకు పైగా పోరాటం చేస్తూ ఉందని ఇప్పుడర్థమయింది నాకు.

ఆమె గురించి తెలుసుకుంటున్న కొద్దీ, ఇప్పటి కాలంలో రచయితలు తమ మానవత్వాన్ని ప్రకటించడానికీ, తోటి మనిషికి బాసటగా నిలబడటానికీ ఎటువంటి కొత్త దారులు అన్వేషిస్తున్నారో, ఎటువంటి నిర్విరామ ప్రయత్నాలు చేస్తున్నారో స్వెత్లానా ఒక గొప్ప ఉదాహరణ అనీ, ఆమె రచనలకు నోబెలు బహుమతి ప్రకటించడం, సాహిత్య ప్రక్రియలంటూ ప్రత్యేకంగా ఉంటాయనుకునే ఒక మనస్తత్వానికీ, అలవాటుకీ పెద్ద కుదుపు అని అర్థమయింది నాకు.

'గొప్ప చారిత్రిక సమాచారాన్ని ఆమె మనకొక కొత్త ప్రక్రియగా అందించింది' అని ప్రస్తుతించింది స్వీడిషు అకాడెమీ 2015 కు సాహిత్య పురస్కారాన్ని ఆమెకు ప్రకటిస్తూ.

మిన్స్క్ లో తన ఇంట్లో గుడ్డలు ఇస్త్రీ చేసుకుంటూండగా స్వీడిషు అకాడెమీ నుండి ఆమెకి ఫోన్ వచ్చింది. గత 115 ఏళ్ళల్లో ఇటువంటి అరుదైన ఫోను కాలుకి నోచుకున్న 14 వ మహిళ ఆమె.

ఆ క్షణం ఆమె మనసులో విరుద్ధ భావాలు చెలరేగాయి. మహనీయ సాహిత్యవేత్తలూ, నోబెలు పురస్కారం పొందిన పూర్వరచయితలు ఇవాన్ బునిను, బోరిస్ పాస్టర్నాకూ చిత్రిస్తూ వచ్చిందో అవన్నీ గుర్తొచ్చాయి. ఒకవైపు 'అద్భుతంగా' మరొకవైపు 'అలజడి' గా అనిపించిందామెకి.

కాని తనను తాను సంబాళించుకుని తన దేశప్రజలతో చెప్పిందామె : 'ఈ అవార్డు నాకు మాత్రమే కాదు, మన సంస్కృతికీ, మన చిన్నదేశానికీ కూడా.'

స్వెత్లానా అలెజీవిచ్ 1948 లో పశ్చిమ యుక్రెయినులోని ఇవనో-ఫ్రాంకివిస్క్ పట్టణంలో పుట్టింది. తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయులు. జర్నలిజం చదువుకుంది, ఉపాధ్యాయినిగా, జర్నలిస్టుగా పనిచేసింది. ఆ క్రమంలో 'మానవ హృదయావేదనకి సంబంధించిన గళాల్ని, వాఙ్మూలాల్ని, సాక్ష్యాల్ని' చేజిక్కించు కోగలిగింది. సి.వి. కృష్ణారావు గారి మాటల్లో చెప్పాలంటే 'ఒక లక్ష బొటమన వేళ్ళు చదివింది.'

ఆమె రచనల్లో ఇప్పటిదాకా ఇంగ్లీషులోకి అనువాదమైన మూడు ముఖ్యమైన రచనల్లోనూ కనవచ్చేది సోవియెటు కాలానికీ, సోవియెటు అనంతర కాలానికీ చెందిన చరిత్ర, మనకు తెలియని చరిత్ర. రెండవ ప్రపంచయుద్ధంలో దాదాపు పదిలక్షలమంది సోవియెటు మహిళలు పాల్గొన్నారనీ, వారి సాహసం, త్యాగం చరిత్రలో నమోదు కాకుండా పోయాయనీ వివరిస్తూ ఆమె రాసిన Wars Unwomanly Face (ప్రొగ్రెసు పబ్లిషర్సు, 1984) తో ఆమె ప్రయాణం మొదలయిందని చెప్పవచ్చు.

ఆఫ్ఘనిస్థానులో సోవియెటు యుద్ధం మిగిల్చిన చేదు అనుభవాల్ని Zinky Boys: Soviet Voices from the Afghanistan War (1992) పేరిట వెలువరించింది.

ముఖ్యంగా 1986 లో చెర్నోబిలులో సంభవించిన అణుశక్తి రియాక్టర్ల వైఫల్యం వల్ల సంభవించిన అణుశక్తి సంబంధిత విపత్తువల్ల దెబ్బదిన్న వేలాది కుటుంబాల్ని స్వయంగా కలిసి ఆ బాధితుల్ని ఇంటర్వ్యూ చేసి వారి గాథల్ని Voices from the Chernobyl: The Oral History of a Nuclear Disaster (1997) పేరిట వెలువరించింది.

ఈ రచనా ప్రక్రియని కేవలం జర్నలిజంగా భావించలేం. ఒక నవలకన్నా, కవిత కన్నా భిన్నమైన ఈ ప్రక్రియకి తాను మరొక బేలోరష్యన్ రచయిత అలెస్ ఆడమోవిచ్ కి ఋణపడిఉంటానని స్వెత్లానా పేర్కొంది. ఈ ప్రక్రియను ఆమె 'సమష్టినవల' గా, 'వక్తృత్వ నవల (novel-oratorio)'గా, 'సాక్ష్యరచన' (novel-evidence) గా, ఐతిహాసిక బృందగానం' గా (epic chorus) పేర్కొంది. మనుషులు తమ గురించి తాము మాట్లాడుకునే ఒక అవకాశంగా తన రచనా ప్రక్రియను వివరించింది. ఒకప్పుడు రావూరి భరద్వాజ 'జీవనసమరం' పేరిట ఇటువంటి ప్రయత్నమే చేసారని గుర్తు చేసుకోవలసి ఉంటుంది.

అయితే సమకాలిక రష్యను, బేలో రష్యను సాహిత్యవేత్తలు వీటిని కేవలం వార్తా-కథనాలుగా భావించడంలేదు. 'ఈ రకమైన డాక్యుమెంటరీ తరహా సాహిత్యం, సామాన్య మానవుడిపట్ల చూపించే ఈ శ్రద్ధ పూర్తిగా బేలోరష్యాకే స్వంతమైన సాహిత్యప్రక్రియగా చెప్పవచ్చు. సోవియెటు రచయితల దృష్టి ఎంతసేపూ బ్రహ్మాండమైన పురాణాలు నిర్మించడం మీదనే. బేలోరష్యను రచయితలు అలాకాదు, ఈ రచయితలూ, సినిమా దర్శకులూ చిన్న చిన్నమనుషుల్నీ, వాళ్ళ అనుభవాల్నీ చిత్రించడం కోసమే ఎక్కువ తహతహలాడుతారు' అంది గాలినా షుర్ అనే ఒక కళావిమర్శకురాలు.

బేలోరష్యను ప్రతిపక్షనాయకుడు ఆంద్రే సన్నికోవ్ మాటల్లో 'ఆమె సోవియెట్ మానవుడి (రెడ్ మాన్) చరిత్ర రాస్తున్నది. ఆ మానవుడు ఇంకా అంతరించలేదనే ఆమె చెప్తున్నది. అతడు మనలో, ప్రతి ఒక్క సోవియెటు మానవుడిలోనూ ఉన్నాడనే ఆమె వివరిస్తున్నది. ఆమె ఇటీవలి పుస్తకం Second Hand Time ఈ అంశానికే కేటాయించింది'. అతడింకా ఇలా అన్నాడు: 'మనుషుల్తో మాట్లాడించడంలో ఆమె నేర్పు అద్భుతం. కఠినమైన ప్రశ్నల్నీ, సమస్యల్నీ ఆమె ఎక్కడా వదిలిపెట్టదు.

మానవవిషాదమే ఆమె ప్రధాన ఇతివృత్తం. తాను వింటున్న విషాదగాథల్ని తనలోపలకంటా తీసుకుని, మానవుడి అంతరంగంలో ఏం జరుగుతోందో అదంతా ఒక శస్త్రచికిత్సలాగా ఎంతో నిశితంగానూ, నేర్పుగానూ బయటపెడుతుంది.'

'నేను మనుషుల్ని సోషలిజం గురించి అడగను, ప్రేమ గురించి, వాళ్ళ అసూయలగురించి, పసితనం గురించి, వృద్ధ్యాప్యం గురించి అడుగుతాను' అని రాసిందట ఆమె తన Second-Hand Time లో. 'సంగీతం, నాట్యం, హెయిర్ స్టయిళ్ళు గురించి అడుగుతాను. అదృశ్యమైపోయిన ఒక జీవితం గురించిన అసంఖ్యా-కమైన ఎన్నో చిన్ని చిన్ని విశేషాల గురించి. అట్లా అడిగితే తప్ప, ఒక విపత్తు మన దైనందిన జీవితంలోకి ఎట్లా జొరబడిందో అర్థం కాదు, అప్పుడు గాని ఆ అనుభవం కథగా మారదు' అని కూడా.

ఆమె రచనల ఫ్రెంచి అనువాదాల సంపాదకుడు జాకె టెస్టార్డ్ ఇలా అన్నాడు: 'అదంతా ఒక మౌఖిక చరిత్ర. ఆమె పుస్తకాలన్నీ కూడా ఒకప్పటి సోవియెటు యూనియను పట్ల బెంగతో రాసినవే.' అతడింకా ఇలా అన్నాడు: 'సోవియెటు యూనియను కుప్పకూలి పోయాక ఆమె మనుషుల్ని కలుసుకుంటూ, ప్రశ్నిస్తూ రష్యా అంతా తిరిగింది. ఒకప్పటి సోవియెటు యూనియను సామూహిక అంతరంగమెట్లా ఉండేదో తనకై తాను తెలుసు కోవాలని చేసిన ప్రయత్నమది. ఆమె పుస్తకాలన్నిటిలోనూ కనవచ్చేదొకటే, తమదైన ఒక గుర్తింపును, తమ జాతిముద్రను పోగొట్టుకున్న బాధ, నువ్వింకెంతమాత్రం గుర్తుపట్టలేని ఒక దేశంలో నిన్ను నువ్వు పోల్చుకోవడానికి చేసే ప్రయత్నం. ఇరవయ్యవశతాబ్దపు ఉత్తరార్థంలో, పుతినుకాలందాకా, రష్యా తాలూకు సూక్ష్మచారిత్రిక విశ్లేషణ ఆమె సాహిత్యం.'

ఆమె రచనల్ని ఇంగ్లీషులోకి అనువదిస్తున్న బెలా షాయేవిచ్ మాటల్లో ' సోవియెటు రష్యాలోనూ, సోవియెటు అనంతర రష్యాలోనూ జీవితసత్యం ఊహకందనిది, ఆ నిజాలు అంత తేలిగ్గా మింగుడు పడేవి కావు. ఆమె రచనలకు బహుమతి రావడం నాకు సంతోషాన్నెందుకిస్తున్నదంటే, కనీసం ఈ విధంగానైనా మరింత మరింతమంది పాఠకులు సోవియెటు రష్యను విషాదానికి చేరువకాగలుగుతారు కనుక.'

రష్యనువ్యవస్థను ప్రశ్నించింది కాబట్టి రాజకీయ కారణాలవల్ల ఆమెకి నోబెలు బహుమతి లభించిందన్న విమర్శను స్వీడిషు కమిటీ కొట్టిపారేసింది. అయినా కూడా స్వెత్లానాకు బహుమతి ఇవ్వడం ద్వారా నోబెలు సాహిత్యబహుమతికీ సాహిత్యానికీ సంబంధం లేదని మరోసారి ఋజువైందని ఒక రష్యను సాహిత్యవారపత్రిక సంపాదకుడు ఇప్పటికే విమర్శనాస్త్రం ఎక్కుపెట్టాడు. ఆ విమర్శలకు స్వెత్లానా ప్రతిస్పందన గమనించ-దగ్గది.

'నేటి కాలంలో మనుషులు నిజాయితీగా జీవించడం చాలా కష్టం' అందామె.

స్వెత్లానాకు నోబెలు బహుమతి రావడం నుంచి రచయితలు, ముఖ్యంగా తెలుగు సాహిత్యం తెలుసుకోవలసిందేమైనా ఉందా?

ఉందనే అనుకుంటున్నాను. రెండు విషయాలు, ఒకటి, నేటికాలంలో రచయిత ఇంకెంతమాత్రం ఒంటరిగా కూచుని రచనలు చేస్తూ ఉండటంలో అర్థం లేదు. నేటి సాహిత్య ప్రక్రియలు సామూహిక ప్రక్రియలు. సమష్టి ప్రక్రియలు.

రెండవది, మన చుట్టూ సంభవిస్తున్న విషాదాలు చెర్నోబిలు దుర్ఘటనల్లాంటివే. గత రెండుమూడు నెలలుగా జరుగుతున్న రైతుల ఆత్మహత్యలకన్నా పెనువిషాద-మేముంటుంది? కాని మనకి తెలీనిదల్లా ఆ రైతుల, వాళ్ళ భార్యల, బిడ్డల, బంధువుల కథనాలు, సాక్ష్యాలు, సమష్టిరోదనలు. మననుంచి ఒక స్వెత్లానా రావడానికి ఇంతకన్నా మించిన చారిత్రికసందర్భం మరొకటి ఉండబోదు.

9-10-2015

# మనమెందుకు గుర్తుపెట్టుకుంటాం?

**స్వెత్లానా** పుస్తకం చాలాకాలం కిందటే తెలుగులోకి వచ్చిందని తెలిసినప్పుడు ఎంత గర్వంగా అనిపించిందో. కాని ఆ పుస్తకం అప్పుడు చదవలేకపోయానే, ఎంత సిగ్గుగా ఉందో. ఆ పుస్తకమెట్లానూ తెలుగులోకి వచ్చింది కాబట్టి, Voices from Chernobyl నుండి ఒక వాఙ్మూలాన్నిట్లా తెలుగు చేసాను. ఎస్. ప్యాతోర్ అనే మానసిక వైద్య నిపుణుడి మాటల్ని స్వెత్లానా మనకిట్లా అందిస్తోంది:

---

## మనమెందుకు గుర్తుపెట్టుకుంటాం?

నువ్వు దీని గురించి రాయాలనుకుంటున్నావా? దీనిగురించి? కాని నాకేం జరిగిందో, ఏ అనుభవాలు తటస్థించాయో అవెవరికీ తెలియకూడదను కుంటున్నాను. కాని మరోవేపు నా గురించి మొత్తం చెప్పేసుకోవాలనీ, అంతా పంచుకోవాలనీ ఉంది, మరోవేపేమో, అట్లా చెప్పుకోవడమంటే నన్ను నేను బయటపెట్టేసుకోవడం లాగా అనిపిస్తుంది, అందుకని ఏమీ చెప్పాలనీ లేదు.

అప్పుడు టాల్‌స్టాయిలో ఎట్లా ఉండిందీ నీకు గుర్తుందా? పియెర్రి బెజుకోవ్ యుద్ధాన్ని చూసి ఎంతగా చలించిపోయాడంటే, ఇక తర్వాత అతడూ ప్రపంచమూ కూడా మొత్తం మారిపోయాయనే అనుకుంటున్నాడు. కొంత కాలం గడిచేక, అతడు: 'నేను మునుపటిలానే బండివాడి మీద అరుస్తున్నాను కదా, ఇంతకుముందులాగానే చికాకు పడుతున్నాను కదా' అని తనకి తాను సర్ది చెప్పుకుంటున్నాడు. మరి అట్లాంటప్పుడు మనుషులెందుకు గుర్తు పెట్టుకోవాలి? వాళ్ళ జ్ఞాపకశక్తి ఎందుకింకా క్షీణించకుండా ఉంది? అంటే మన జ్ఞాపకాల్ని బట్టి మనం సత్యమేమిటో నిగ్గుతేల్చుకోవచ్చనుకుంటున్నామా? లేదా నిజాయితీగా ఉండాలన్న ప్రయత్నమా? లేదా జరిగిందంతా మర్చిపోయి తమని తాము బయట పడేసుకోగలరా? లేదా జరిగిపోయిన ఒక మహా సంఘటనలో తాము కూడా ఏదో ఒక మేరకు భాగమని అనుకుంటున్నారా? లేదా తమని తాము మర్చిపోడానికి గతాన్ని పట్టుకు వేలాడుతున్నారా? ఇదంతా ఏమైనా కానీ, ఒక విషయం మాత్రం చెప్పుకోవాలి, జ్ఞాపకాలు చాలా పెళు సైనవి, పొగలగా ఇట్టే ఆవిరైపోతాయి, వాటినిబట్టి విషయాలు మనకి పూర్తిగా తెలుస్తాయని చెప్పలేం. మహా అయితే వాటినిబట్టి మనుషులు తమ గురించి తామెంతో కొంత ఊహాగానం చేసుకోగలరంతే. జ్ఞాపకాల్ని బట్టి జ్ఞానం కలుగుతుందని కూడా చెప్పలేం. అవి కేవలం సున్నితమైన కొన్ని భావోద్వేగాలు మాత్రమే.నా భావోద్వేగాలు..నేను అతికష్టమ్మీద నా జ్ఞాపకాల పొరల్ని తవ్వి చూసుకున్నాను. నా జీవితంలో, నా బాల్యంలో, అత్యంత భీతావహమైన విషయం యుద్ధం.

నా చిన్నప్పుడు మేం కుర్రాళ్ళం అమ్మానాన్నా ఆటాడుకోవడం నాకిప్పటికీ గుర్తే. మేం మా గుడ్డలు తీసేసి ఒకళ్ళమీద ఒకళ్ళం పడుకునే వాళ్ళం. యుద్ధం తర్వాత పుట్టిన తొలిశిశువులం, యుద్ధం జరుగుతున్నంత కాలం, అందరూ పిల్లలనేమాటే మర్చిపోయారు. యుద్ధమైపోగానే మేమ మళ్ళా జీవితం తలెత్తాలని ఆశగా ఎదురుచూసాం. అందుకోసం అమ్మా నాన్నా ఆటాడు కునేవాళ్ళం, అట్లా ఆడుకుంటూ ఉంటే, జీవితం మళ్ళా ప్రాణం పోసకుంటుం-దేమోనని ఒక ఆశ. ఇంతాచేస్తే ఎనిమిది పదేళ్ళ వయసు పిల్లలం.

నేనొకసారి ఒకామె తనని తాను చంపుకోడం చూసాను. ఏటిఒడ్డున పొదల మాటున. ఆమె ఒక బండరాయితో తన తలమోదుకుంటూండటం చూసాను. మా ఊరిని ఆక్రమించిన సైన్యానికి చెందిన సైనికుడొకడు ఆమెని గర్భవతిని చేసాడు. వాణ్ణి మా ఊరంతా అసహ్యించుకునేది. అట్లానే, నా చిన్నప్పుడు, పిల్లి పిల్లల్ని పెట్టడం కూడా చూసాను. ఆవు ఈనుతూంటే, లేగదూడని మా అమ్మ బయటకి లాగుతుండే దృశ్యం కూడా. మా పందుల్లో ఆడపందీ, మగపందీ ఒకదానిమీద మరొకటి పొర్లే దృశ్యాలూ నాకు గుర్తే. నాకు గుర్తు- ఇప్పటికీ గుర్తే- వాళ్ళు మా నాన్న కళేబరాన్ని మోసుకొచ్చిన దృశ్యం. అప్పుడాయన వంటిమీద స్వెట్టరుంది. దాన్ని మా అమ్మే తన చేతుల్తో అల్లింది. మా నాన్నని మెషిన్‌గన్నుతో కాల్చేసారు. ఆ స్వెట్టర్లోంచి నెత్తుటిముద్దలు బయటకి వేలాడుతున్న దృశ్యం. మా ఇంట్లో ఉండే ఒకేఒక్క మంచం మీద ఆయన్ని పడుకోబెట్టారు. అది తప్ప ఆయన్ని పడుకోబెట్టడానికి మరోచోటేమీ లేదు. ఆ తర్వాత ఆయన్ని మా ఇంటిముందే పూడ్చిపెట్టారు. మట్టి. మట్టి అంటే పత్తి కాదుకదా. బీటురూటు దుంపల చేలో పాతిపెట్టారు. చుట్టూ ఎటుచూసినా యుద్ధం చప్పుళ్ళే. వీథులన్నీ చచ్చిపోయిన మనుషులతోనూ, గుర్రాల పీనుగు ల్తోనూ నిండిపోయుండేవి.

ఈ జ్ఞాపకాలు నావరకూ నాకెంతో వ్యక్తిగతమైనవి. నేను వాటినెప్పుడూ ఎవరిముందూ బాహాటంగా చెప్పుకోలేదు.

అప్పట్లో నాకు చావు గురించిన ఆలోచనలకీ, బతుకు గురించిన ఆలోచనలకీ మధ్య పెద్ద తేడా ఏమీ ఉండేది కాదు. ఆవు లేగదూడని ఈనుతూంటే ఎట్లా అనిపించేదో, పిల్లి పిల్లల్ని పెడుతూండటం చూసినప్పు డేమనిపించేదో, ఆ పొదలమాటున ఆ ఆడమనిషి బండరాయితో తన తలని మోదుకుంటూండటం చూసినప్పుడూ అలానే అనిపించింది. ఎంచాతనో తెలీదుగానీ, అవి రెండూ- అంటే చావూ, బతుకూ కూడా-ఒకే విషయంలాగా అనిపించేది.

పందిని కోస్తున్నప్పుడు మా ఇల్లంతా ఎట్లాంటి వాసన అల్లుకునేదో నా చిన్నప్పటినుంచీ నాకు గుర్తే. చూడు, నువ్వు నన్నిట్లా కదిపేవో లేదో, నేనెట్లా

జారిపోతున్నానో, నా భయానకమైన స్మృతిసముద్రంలోకి. ఆ భీతావహ కాలం లోకి. అందులోకి ఎగిరిపోతున్నాను. మా చిన్నప్పుడు మా ఊళ్ళో ఆడ వాళ్ళు స్నానాలగదుల్లోకి పోయినప్పుడు మేం కూడా వాళ్ళ వెంటపోయే వాళ్ళం. అక్కడవాళ్ళు జారిపోతున్న తమ పొత్తికడుపుల్ని జారిపోకుండా గట్టిగా గుడ్డల్తో పట్టీ కట్టుకోవడం నాకు గుర్తే. (వాళ్ళట్లా వాటిని జారిపోకుండా కట్టుకుంటున్నారని మాకు అప్పుడే అర్థమయ్యేది కూడా).

అదంతా నేను చూసాను. తట్టుకోలేని కాయకష్టం వల్ల అవి జారిపోయేవి. అప్పట్లో మగవాళ్ళెవ్వరూ ఊళ్ళల్లో ఉండేవారు కాదు. వాళ్ళంతా యుద్ధ భూమి లోనే ఉండేవారు. ఊళ్ళో గుర్రాలు కూడా  ఉండేవి కావు. పనంతా ఆడవాళ్ళే చేసుకోవలసి వచ్చేది. వాళ్ళే పశువుల్లాగా పొలాలు దున్నుకోవలసి వచ్చేది., ఆ కొల్కోజ్ పొలాలు. నాకు కొద్దిగా వయసు వచ్చాక, ఒకామెతో కొంత సన్నిహితంగా ఉండేవాణ్ణి, కాబట్టి ఇదంతా నాకు తెలుసు, అప్పట్లో నా చిన్నప్పుడు ఆ స్నానపుశాలల్లో చూసిందంతా.

నేనిదంతా మర్చిపోవాలనుకున్నాను. ప్రతి ఒక్కటీ మర్చిపోవా- లనుకున్నాను. మర్చిపోగలిగాను కూడా. జరగవలసిన పెనువిపత్తు ఏదో ఎలానూ జరిగి పోయిందనుకున్నాను. యుద్ధం. యుద్ధం ముగిసిపోయింది కాబట్టి, ఇంక నేను క్షేమంగా ఉన్నాననుకున్నాను, ఉంటాననుకున్నాను.

అదిగో, అప్పుడు నేను చెర్నోబిలు దుర్ఘటన జరిగిన ప్రాంతానికి వెళ్ళవలసి వచ్చింది. ఇప్పటికి చాలాసార్లే వెళ్ళవలసివచ్చింది. నేనెంత చాతకానివాణ్ణో నాకొక్కసారిగా తెలిసివచ్చింది. నేను ముక్కలయి పోతున్నాను. నా గతం నన్నింకెంతమాత్రం కాచుకోలేకపోతున్నది. ఇప్పుడు నా నా దగ్గర ఎలాంటి సమాధానాలూ లేవు. ఒకప్పుడుండేవి, కాని ఇప్పుడవి ఎంతమాత్రం పనికి రావడం లేదు. నన్నిప్పుడు ధ్వంసం చేస్తున్నది, భవిష్యత్తు, గతం కాదు.

9-10-2015

# బెన్ ఒక్రి

**పాశ్చాత్య** రచయితల్ని, ముఖ్యంగా ఐరోపా రచయితల్ని చదువుతుంటే, ఒక సెమినారు హాల్లో ఒక మేధావితోనో, తాత్త్వికుడితోనో గంభీరమైన విషయాల గురించి మాట్లాడుకున్నట్టు ఉంటుంది.

కాని ఆఫ్రికా రచయితల్ని చదివినప్పటి అనుభవం వేరు. వాళ్ళు పూర్వపు రచయితలైనా, ఇప్పటి రచయితలైనా కూడా, వాళ్ళని చదువుతుంటే, మన గ్రామాలకి వెళ్ళి, అక్కడి మట్టి అరుగులమీద కూచుని, ఆ గ్రామ వృద్ధులో, రైతులో, లేదా అక్కడి ముంగిళ్ళలో గృహిణులో చెప్పే సుద్దులు విన్నట్టుంటుంది.

బెన్ ఒక్రి A Time for New Dreams, Poetic Essays (2011) చదువుతుంటే, అట్లానే అనిపించింది. బెన్ ఒక్రి నైజీరియను కవి, నవలా రచయిత, బుకరు ప్రైజు విజేత. రానున్న కాలంలో నోబెలు పురస్కారాన్ని కూడా పొందే అవకాశమున్నవాడు. ఆఫ్రికా గురించి, మనిషి గురించి, బాల్యం గురించి, సాహిత్యం గురించి అతడు రాసుకున్న ఆలోచనల్లోంచి మీకోసం కొన్ని:

# 1

మునపటికన్నా కూడా ఇప్పుడు మనకి కవిత్వం చాలా అవసరమని ఆకాశానికి తెలుసు. కవిత్వం చెప్పే సత్యం మనల్ని ఇబ్బంది పెడుతుంది, అయినా అది మనకి కావాలి. వినడంలోని మహిమని అది మనకి పరోక్షంగా గుర్తు చేస్తూనే ఉంటుంది. పరస్పరం ఎక్కుపెట్టుకున్న తుపాకుల ప్రపంచంలో, బాంబుల వాదవివాదాల మధ్య, మన పక్షం, మన మతం, మన రాజకీయాలే సరైనవైన వని నమ్మే ఉన్మాదం మధ్య, ఎప్పుడూ యుద్ధం వైపే ఒరిగిపోయినట్లుండే ప్రపంచంలో–మనకొక కంఠం కావాలి, మనలోని ఉదాత్తమైనదానితో మటుకే సంభాషించే కంఠం. మన సంతోషాలతో, మన బాల్యాలతో, మన వ్యక్తిగత, జాతీయ పరిస్థితుల చిక్కుముడితో మాట్లాడే ఒక స్వరం కావాలి మనకి. మన సందేహాలతో, మన భయాలతో మాట్లాడే ఒక గొంతుక. ఒకవైపు మనం మనుషులుగానూ మరొకవైపు నక్షత్రాలకు మిత్రులుగానూ ఉంటున్నప్పుడు మనలో ఏయే పార్శ్వాలు మేలుకుంటాయో, ఆ పార్శ్వాలన్నిటితోనూ సంభాషించే ఒక గొంతుక కావాలి మనకి.

# 2

నిజానికి మనకి రాజకీయాలకన్నా కవిత్వమే ఎక్కువ సన్నిహితం. తినడం లానూ, నడవడంలానూ, అది మనకి చాలా సహజం. అసలు మనం పుట్టడంలోనే శ్వాసించడంతో పాటు కవిత్వం కూడా ఉంది. పుట్టుక కవిత్వం. అభౌతికం రక్తమాంసాలు ధరించడం అది. మరణించడం కూడా కవిత్వమే. రక్తమాంసాలు అభౌతికంలో విలీనమైపోవడం అది. ఒక వలయం పూర్తవడంలోని ఇంద్రజాలం. ఒక అమేయ నిశ్శబ్దంలోకి అనాహత జీవనరాగం మరలిపోవడం అది. చావుకీ, పుట్టుకకీ మధ్య, మన రోజువారీ క్షణాలు కూడా ప్రాథమికంగా కవితామయమే. అంతరంగానికీ, బహిరంగానికీ మధ్య ఒక

విచిత్రమైన సాంధ్యస్థితి. మన లోపల స్ఫురించే కాలాతీత స్పృహకీ, కళ్ళముందే కరిగిపోయే బాహ్యదృశ్యానికీ మధ్య ద్వైదీభావస్థితి.

## 3

బాల్యం ఎప్పటికీ అంతుబట్టని ఒక రహస్యం. ఆత్మ కాలాతీతం, శరీరం కొత్తది, ప్రపంచం సంక్లిష్టం. ఎట్లాంటి పరిస్థితి. చిన్న దేహంద్వారా ఒక మహిమోన్నత భవిష్యత్తు విప్పారడం. అందుకనే బాల్యం మనల్ని విభ్రాంత పరుస్తుంది. అది ఎప్పటికీ చేతికందదు. మనలో ఎప్పటికీ చేతికందని పార్శ్వమది. మనం పెద్దవాళ్ళమవడంలో మన బాల్యం అదృశ్యమైపోయింది. జ్ఞాపకాలుంటాయి, సంవేదనలు మిగుల్తాయి, కాని ఆ స్థితి దాటిపోతుంది. దాంతో పాటే ఆ ప్రపంచమూ తరలిపోతుంది.

అవును బాల్యమొక ప్రపంచం. ఒక ప్రత్యేకమైన లోకం. దాని అద్భుతమైన కోణాలు మళ్ళా మళ్ళా దొరికేవి కావు. అప్పటి సంక్షోభాలు, అయోమయాలన్నీ తప్పుడు తథ్యాలుగా స్థిరపడి పోతాయి. ఆనాటి భయాలు మనలో కదలాడుతూనే ఉంటాయి, కాని ఎక్కడో గుర్తుపట్టలేం. ఇక మనం చేసేదల్లా ఇతరుల బాల్యాన్ని చూస్తూండటమే. అద్దంలో చూసుకున్నట్టు వాళ్ళ బాల్యాన్ని మనం పరికిస్తూంటాం. చూడబోతే బాల్యం అందరికీ కూడా వర్తించేదే అన్నట్టు. కాని బాల్యం శిశువులకు మటుకే సొంతం.

అందుకనే మనం బాల్యమనే అద్దంలో చూసినప్పుడు మనకి కనిపించే ప్రతిబింబం మసగ్గా ఉంటుంది. మనం పోగొట్టుకున్న ప్రపంచం అస్పష్టమైన జ్ఞాపకాల్ని మనలో రేపుతుంది. కాని మనకి మళ్ళా వెనుతిరగడానికి తలుపులు తెరిచి ఉండవు. ఆ సరిహద్దులు మూసుకుపోయి ఉంటాయి. అద్దంలో కనిపించే ఆ తలం ప్రపంచంలోంచి అదృశ్యమైపోయి ఉంటుంది. ఆ విధంగా మనం పెద్దరికంలోకి ప్రవాసమైపోయి ఉంటాం.

ఆ అద్భుత రహస్యాలకి కొన్ని సార్లు ఇంకా విభ్రాంతపడుతోనేనా ఉంటాం. లేదా వాటికి శాశ్వతంగా అంధులమేనా అయిపోతాం.

## 4

జాతులు పతమనమవుతున్నాయంటే, అందులో రహస్యమేమీ లేదు. వాటి రచయితలు పతనమయినప్పుడే ఆ జాతులు పతనం కావడం కూడా మొదలవుతుంది. జాతుల వైఫల్యానికి మొదటి కొండగుర్తు, అవి వాటి రచయితల్ని గౌరవించుకోలేకపోవడం. ఎందుకట్లా? ఎందుకంటే, ఒక జాతి అవ్యక్తసత్త్వానికీ, ఒక దేశ జీవస్ఫూర్తికీ ఆ జాతి రచయితలే ప్రతినిధులు కాబట్టి.

## 5

ఈ సూత్రం చాలా ఖండాల్లో పనిచేస్తూండటం చూసాన్నేను. ఆఫ్రికానే తీసుకోండి, స్వాతంత్ర్యస్ఫూర్తి రగిలిన తొలిరోజుల్లో సత్యాన్వేషులైన దాని రచయితలు గొప్పగా గానం చేసారు. కాని వాళ్ళేం చెప్తున్నారో చాలా దేశాలు వినిపించుకోనేలేదు. దాంతో పతనమూ, అంతర్యుద్ధమూ తప్పలేదు. కనీసం ఆ దేశాలు ఇప్పుడైనా వింటాయని ఆశిద్దాం. తమ రచయితల్ని హింసించే, ఖైదు చేసే, హత్య చేసే, దేశం నుంచి తరిమేసే జాతులు తొందరలోనే తమ అజ్ఞానాంధకారంలో మృత్యుభూములుగా మారిపోతాయి. అట్లాంటి జాతుల్ని ఎవ్వరూ ప్రేమించలేరు. నిజానికి అట్లాంటి జాతులు తమని తామే ప్రేమించు-కోలేవు.

## 6

ఒక నాగరికత తాలూకు పతాకదశ దాని స్వర్ణయుగమే కానక్కరలేదు. నిజానికి అది దాని ఫలితదశ. ఒక నాగరికత పతాకదశకు చేరుకునేది నిజానికి దాని

తొలిదశల్లోనే. దీర్ఘకాల ప్రతికూల దశల్ని దాటుకుని ఒక జాతిజనులు తమని తాము నియంత్రించుకుంటూ, తమ సత్యాల్ని తాము కనుగొనగలుగుతూ గణనీయమైన, విలువైన లక్ష్యాల్ని తమకై తాము నిర్దేశించుకుంటూ నమ్మకంతో ఆ లక్ష్యాల దిశగా ప్రయాణిస్తో, వాటిని ఒక్కొక్కటే సాధిస్తున్నప్పుడు గొప్ప ఆనందానికి లోనవుతో ఉన్నప్పుడే ఒక జాతి నిజంగా ఉచ్ఛదశలో అడుగు పెట్టినట్టు. దరయిసుని ఓడించినప్పుడు అలెగ్జాండరులాగా, ఎలిజబీతు కాలంలో ఇంగ్లాండు లాగా: మనుషులు నిజంగా తమకు తాముగా రూపొందే కాలమది.

## 7

లావోత్సే చెప్పినట్టు, నిజమైన ఆతిథ్యం ఎప్పుడంటే, అతిథి గృహస్థులానూ, గృహస్థు అతిథిలానూ ఉండగలినప్పుడు.

## 8

ఆఫ్రికాని కొట్టిపారెయ్యడం చాలా సులభం. ఆఫ్రికాని ఆదరించడం చాలా సులభం. ఆఫ్రికాని అభిమానిస్తున్నట్టు చెప్పుకోవడం చాలా సులభం. ఆఫ్రికాని దోచుకోవడం చాలా సులభం. ఇక ఆఫ్రికాని అవమానించడం కూడా చాలా సులభమే. కాని ఆఫ్రికాని యథార్థంగా చూడటం చాలా కష్టం. దాని వైవిధ్యాన్ని, దాని సంక్లిష్టతని, దాని సారళ్యాన్ని, దాని మనుషుల్ని చూడటం చాలా కష్టం. దాని ఆలోచనల్ని, దాని ఉపాదానాల్ని, దాని సాహిత్యాన్ని చూడటం చాలా కష్టం. దాని నవ్వుల్ని వినగలగడం, దాని క్రూరత్వాల్ని అర్థం చేసుకోవడం, దాని ఆత్మశక్తిని దర్శించడం, దాని దుఃఖాన్ని తట్టు కోవడం, దాని ప్రాచీనదర్శనాల్ని అవగతం చేసుకోవడం చాలా కష్టం. ఆఫ్రికాని దర్శించడం ఎందుకు కష్టమంటే, దాన్ని చూసే హృదయముండాలి కాబట్టి. ఎట్లాంటి అయోమయానికీ లోనుకాకుండా దాన్ని చూడాలంటే, చూసేవాళ్ళ ఆత్మలో

ఎంతో సారళ్యముండాలి. పరిణతి చెందిన మనుషులకి మాత్రమే అపోహలు లేకుండా ఆఫ్రికాని చూడటం సాధ్యపడుతుంది.

## 9

కాంతి తెలివితేటలుగా ఫలదీకరణం చెందటమే ఐరోపా అనే ఒక పురాణగాథ. ఒక హృదయం ఆ పురాణగాథలో ఇరుక్కుని విలపిస్తోనే ఉంది.

## 10

చెప్పే విషయమే నిలబడుతుందనుకొంటారు కొందరు. కాని చెప్పే పద్ధతి వల్లనే, రూపం వల్లనే సారానికి నిలబడే శక్తి వస్తుంది.

## 11

మనలో ప్రతి ఒక్కరిలోనూ ఆఫ్రికా అనే ఒక చోటు ఉంది. మనందరిలోనూ ఆఫ్రికా ఉంది.

## 12

బయటి ఆఫ్రికా సమస్యల్తో రుజాగ్రస్తంగా ఉంటే, మన లోపలి ఆఫ్రికా మనల్ని మానసికంగా అస్వస్థుల్ని చేస్తుంది.

## 13

ఆఫ్రికాని మనం మళ్ళా కొత్తగా కనుగొనవలసి ఉంది. యూరోపు ఆఫ్రికాని మొదటిసారి చూసినప్పుడు తప్పుగా చూసింది. నిజానికి అది కలుసుకోవడం

కాదు, కాజేయడం. వాళ్ళు చూసిందీ, తదనంతర తరాలకీ వారసత్వంగా అందచేసిందీ తమ అపోహనే. వాళ్ళసలు ఆఫ్రికాని చూడనే లేదు. వాళ్ళు ఆఫ్రికాని చూడటంలో పడ్డ పొరపాటే ఇప్పటి సమస్యలకు దారితీసింది. వాళ్ళు దాన్ని అత్యాశతోనే చూసారు, దాన్నుంచి ఏది పొందాలో అదే పొందారు. వాళ్ళు చేసిన అన్యాయాలన్నింటినీ తమ అత్యాశతోనే సమర్థించు-కున్నారు.

## 14

పిల్లల్లో ఉండే నిష్కాపట్యం ఏ కొంచెమో పెద్దల్లో కూడా కనిపించినప్పుడే ఆ జాతులు అత్యుచ్ఛదశలో ఉన్నట్టు. ప్రాచీన దేవాలయాల్లో కనిపిస్తుందే, అట్లా సరళంగా ఉండగలిగే పరిణతి సాధ్యపడ్డట్టు.

15-9-2016

# గూగి వా థియోంగో

**గూగి వా థియోంగో** (1938) కెన్యాకి చెందిన రచయిత. సమకాలిక ఆఫ్రికను రచయితల్లో అగ్రశ్రేణికి చెందినవాడు. కథ, నవల, నాటకం వంటి ప్రధాన ప్రక్రియల్లో చెప్పుకోదగ్గ రచనలు వెలువరించాడు. ముఖ్యంగా ఆఫ్రికను తెగల్లో ఒకటైన గికుయు తెగ వారి భాషలో ప్రస్తుతం రచనలు చేస్తున్నాడు. ఆ భాషలో 'ముతీరీ' అనే ఒక పత్రిక కూడా నడుపుతున్నాడు. అతణ్ణి కొన్నాళ్ళు కెన్యా ప్రభుత్వం జైలో నిర్బంధించింది. అమెస్టీ జోక్యంతో జైలునుంచి విడుదలైన గూగీ ప్రస్తుతం కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా పనిచేస్తున్నాడు.

గూగి రచనలు చదువుతుంటే, ఆఫ్రికా గురించి సరే, అంతకన్నా కూడా, మన దేశం గురించీ, మన సమాజం గురించీ, గ్లోబలైజేషను కాలంలో మనం ఎదుర్కొంటున్న సమస్యల గురించీ మనకి మరింత బాగా అర్థమవుతుంది. తాను పుట్టిన లిమురులో జీవితం గురించి అతడు రాసింది చదువుతుంటే నాకు పాడేరు గిరిజనుల గురించే చదువుతున్నట్టు అనిపిస్తుంది.

గూగి వ్యాస రచయిత కూడా. బాలసాహిత్యం మొదలుకుని అఖండ ఆఫ్రికా దాకా అతడు ఎన్నో అంశాల మీద విస్తారమైన పరిజ్ఞానంతోనూ, విస్పష్టమైన

దార్శనికతతోనూ రాస్తాడు. అటువంటి ఏడు వ్యాసాల సంపుటి Secure the Base (సీగలు బుక్సు, 2016).

గ్లోబలైజేషను గురించి మనవాళ్ళు కూడా పుస్తకాలు రాస్తారు కాని గూగీ వ్యాసాల్లో ఉన్న స్పష్టత వాటిలో కనిపించదు. ప్రధానమైన తేడా ఎక్కడుందంటే, గూగీ ఆర్థిక విషయాల్నీ, రాజకీయ పరిణామాల్నీ చర్చించేటప్పుడు ఆఫ్రికను సాంస్కృతిక నేపథ్యాన్ని అడుగడుగునా గుర్తు చేసుకుంటూ ఉంటాడు. ముఖ్యంగా, గ్లోబలైజేషను యుగంలో, పోస్టు మాడర్ను బహుళతా వాదం బలపడ్డాక, వివిధ ప్రాంతాలు, కులాలు, భాషలు తమ అస్తిత్వాల్ని ప్రకటించడం మొదలుపెట్టాక, వాటిని ఏ విధంగా తమ ఆశయాలతో సమన్వయపరుచుకోవాలో మనరచయితలకి అర్థం కాలేదు. ఎందుకంటే, మన వాళ్ళు ప్రధానంగా పందొమ్మిదో శతాబ్ది భాషలోనే ఆలోచించడానికి అలవాటు పడ్డారు కాబట్టి. కాని గూగి ఒకవైపు ఆఫ్రికాలోని తెగల, జాతుల, దేశాల సాంస్కృతిక అస్తిత్వం గురించి మాట్లాడుతూనే, మరొక వైపు అఖండ ఆఫ్రికా అనే ఆదర్శం వాస్తవం కాగలదని నమ్ముతాడు. ఆ రెండింటినీ తనకై తాను సమన్వయపరుచుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఆ ప్రయత్నం ఎంతో విశ్వసనీయంగానూ, అభినందనీయంగానూ కనిపిస్తుంది మనకి.

ఈ పుస్తకంలో మొదటి వ్యాసం 'తెగ' అనే పదం ఆఫ్రికా రాజకీయవాస్తవికతను ఏ విధంగా మరుగుపరుస్తున్నదనే అంశం మీద చర్చించిన రచన. ఆఫ్రికా అభివృద్ధికి అక్కడున్న తెగల విభేదాలే కారణమనీ, ఆ తెగలు తమలో తాము ఎప్పుడూ కలహించు కుంటూ ఉంటాయనీ, వాళ్ళు ప్రజాస్వామికం కాలేకపోయారనీ బయట ప్రపంచానికి ఏర్పడ్డ భావాలు పాశ్చాత్యప్రపంచపు సృష్టి అంటాడు గూగీ. జనాభా, ప్రాంతం, భాష ఏ ప్రాతిపదికన యూరోపులో జాతులు, జాతీయ రాజ్యాలు ఏర్పడ్డాయో అవే అవకాశాలు ఆఫ్రికాలో ఉన్నా కూడా పాశ్చాత్యప్రపంచం ఆఫ్రికా దేశాల్ని ఇప్పటికీ జాతులుగా గుర్తించడానికి ఇష్టపడటం లేదనీ, వాళ్ళని తెగలుగా మాత్రమే పేర్కొంటున్నందువల్ల, అఫ్రికాలో సదా ఒక రాజకీయ అనిశ్చితి నెలకొనేలా చూస్తున్నదనీ చెప్తాడు.

3 లక్షల మంది ఐస్‌లాండు జనాభాని ఒక జాతి అని పిలుస్తున్నప్పుడు, 3 కోట్ల ఇబోల్ని ఒక జాతిగా ఎందుకు గుర్తించడం లేదని అడుగుతాడు. ఆఫ్రికాను రాజకీయ

విభాగాలుగా విడగొట్టిన వలస పాలకులు జాతి, తెగ, భౌగోళిక ప్రదేశం వంటి ఏ ప్రాతిపదికను కూడా పాటించలేదనీ, కేవలం వనరులు, వనరుల మీద ఆధిపత్యం మాత్రమే ప్రధానంగా చూసుకున్నారనీ, అందువల్ల, బాగా అభివృద్ధి చెందిన ప్రాంతాలూ, అభివృద్ధి చెందని ప్రాంతాలుగా ఆఫ్రికా విడిపోయిందనీ, ఆఫ్రికను రాజకీయ అశాంతికి కారణం ఆ అసమానతలో చూడవలసి ఉంటుందనీ అంటాడు. ఆఫ్రికా మొత్తం మీద ఇప్పుడు రెండే తెగలున్నాయనీ, ఒకరుఉన్నవాళ్ళూ, రెండవది లేనివాళ్ళూ అని తేల్చేస్తాడు.

రెండవ వ్యాసం గ్లోబలైజేషను, పెట్టుబడిదారీ ఫండమెంటలిజాల నేపథ్యంలో ఆఫ్రికా పరిస్థితిని గుర్తుపట్టే రచన. పుస్తకంలో అతి పెద్ద వ్యాసం ఇది. చాలా విశిష్టమైన, ఆలోచనాత్మకమైన రచన. గత నాలుగైదువందల ఏళ్ళుగా ప్రపంచంలో సంభవిస్తున్న ఆర్థిక–రాజకీయ పరిణామాలు ఆఫ్రికాను ఎట్లా ప్రభావితం చేసాయో, ఆ చారిత్రిక క్రమాన్ని అతడు గొప్ప స్పష్టతతో వివరిస్తాడు. యూరోపులో మొదలైన మెర్కంటైలిజం ఆఫ్రికన్లను బానిసలుగానూ, పారిశ్రామిక విప్లవం ఆఫ్రికనుదేశాల్ని కాలనీలుగాను మారిస్తే ఇప్పుడు గ్లోబలు ఫైనాన్సు ఆఫ్రికాను సరికొత్త బానిసత్వంలోకి నెట్టివేసిందని చెప్తాడు. దీన్నతడు debt slavery అంటాడు. ఇది కొత్తతరహా కలోనియలిజం అని కూడా ఆంటాడు.

కలోనియలిజం రోజుల్లో పెట్టుబడి ప్రవర్తనకీ, ప్రస్తుత నియో కలొనియలిజం రోజుల్లో ప్రవర్తనకీ మధ్య ఉన్న తేడా ఏమిటంటే, ఇప్పుడు పెట్టుబడి ఒక ఫండమెంటలిస్టు ధోరణిని సంతరించుకోవడమే అంటాడు. ఫండమెంటలిజం–ఆర్థికంగానీ, రాజకీయం గానీ, మతపరమైంది గానీ, దాని స్వభావమేమిటంటే, అది మన చుట్టూ ఉన్న వాస్తవాన్ని మనం ఒకే మూసలో, ఒకే చట్రంలో అర్థం చేసుకోవాలని మనల్ని నిర్బంధిస్తుంది. గ్లోబలు పెట్టుబడి సహజంగానే జాతీయరాజ్యాల్ని బలహీనపరుస్తుంది. కాని అది చెప్పే వాదన ఏమిటంటే, పెట్టుబడి (మానవవనరులతో సహా) జాతీయ సరిహద్దుల్ని దాటి ప్రపంచమంతా విస్తరించాలనీ, దానిమీద ఎటువంటి ఆంక్షలూ నిర్బంధాలూ ఉండకూడదనీ.

కానీ గూగీ అడిగే ప్రశ్న ఏమిటంటే, నిజంగా పెట్టుబడి జాతీయ సరిహద్దుల్ని దాటి గ్లోబలు కాగలిగిందా? మనం బహుళజాతి సంస్థలుగా పేర్కొంటున్నవేవీ తమ

పెట్టుబడినీ, లాభాల్నీ పంచడంలో బహుళజాతి సంస్థలు కానే కావనీ, అవి ఇప్పటికీ పాశ్చాత్యదేశాల, అభివృద్ధి చెందిన దేశాల ఆస్తిపాస్తులుగానే ఉంటున్నాయనీ మనకి తెలుసు. ఒకప్పుడు ఆయుధాలతో, రక్తపాతంతో పాశ్చాత్యదేశాలు ఆఫ్రికాను కొల్లగొట్టు-కున్నాయనీ, ఇప్పుడు వస్తుసేవల రూపంలో, చౌకకూలీ రూపంలో మళ్ళా కొల్లగొట్టు-కుంటున్నాయనీ గూగీ వాపోతున్నాడు.

ఇది మనకి కూడా తెలిసిందే, మనం కూడా అనుభవిస్తున్నదే. అయితే, ఈ సందర్భంగా గూగీ చెప్తున్న కొత్త అంశం, ఆఫ్రికను మధ్యతరగతి పోషించవలసిన పాత్ర గురించి. కలోనియలు రోజుల్లో ఆఫ్రికాను మేల్కొల్పింది మధ్యతరగతి మాత్రమేననీ, వాళ్ళ వద్ద ఏ వనరులూ లేకపోయినప్పటికీ, ప్రజలనే ఒకే ఒక్క అతి పెద్ద వనరును వాళ్ళు నమ్ముకున్నారనీ, ప్రజలతో కలిసి పనిచేసినందువల్లా, వాళ్ళకి అర్థమయ్యేటట్టు మాట్లాడిగలిగినందువల్లా మాత్రమే వాళ్ళు ఆఫ్రికాకు రాజకీయస్వాతంత్ర్యం తీసుకు రాగలిగారనీ చెప్తూ, ఇప్పుడు మధ్య తరగతి దగ్గర చాలా వనరులున్నాయి గానీ లేనిదల్లా ప్రజలతో సాన్నిహిత్యం మాత్రమే అంటాడు. అతడిలా రాస్తున్నాడు:

> ఒకటి మటుకు చాలా స్పష్టం. ఆఫ్రికా పురోగమించాలంటే, ఆఫ్రికన్ మేధావి వర్గం తన యథార్థమైన ప్రాతిపదిక దగ్గరకు -అంటే ప్రజలకి- చేరువకావాలి. అంతగా అభివృద్ధి చెందని దేశంలో మధ్యతరగతి తాను నిజంగా తన పాత్ర నిర్వహించాలనుకుంటే, వలసవాదులు తనకి అప్పగించినపాత్రగా అంటే పెట్టుబడిదారులకి పనికొచ్చే పరికరంగా బతకడం మానెయ్యాలి అని ఫ్రాంజ్ ఫేనాను రాసాడు. అంతేకాక, వాళ్ళు 'ప్రజలకి ప్రాతినిధ్యం వహించే విప్లవశీల మూలధనానికి పూర్తివిధేయం కావాలి'. అటువంటి మధ్య తరగతి తన కాలం నాటి విశ్వవిద్యాలయాల్లోంచి కూడగట్టిన 'మేధాపరమైన, సాంకేతికమైన పరిజ్ఞానాన్ని ప్రజలకు తిరిగి అందించాలి.'

మధ్యతరగతి నిర్వహించవలసిన ఈ విప్లవాత్మక పాత్ర ఆఫ్రికాకన్నా ముందు భారతీయ మధ్యతరగతికి మరింతగా వర్తిస్తుంది. వలసవాదం రోజుల్లో భారతీయ మధ్యతరగతి వలసవాద సాధనాలైన యూనివెర్సిటీలు, రైళ్ళు, పత్రికలు, తంతితపాలాల్ని

వాడుకునే ప్రజల్ని కార్యోన్ముఖుల్ని చేసింది. కాని, ఇప్పుడు కొత్త వలసపాలన రోజుల్లో, మునుపటికన్నా శక్తిమంతమైన సమాచారప్రసార సాధానాలు తన చేతుల్లోకి వచ్చిన ఈ తరుణంలో భారతీయ మధ్యతరగతి ఆ సాధనాల్ని వినోదానికీ, కాలక్షేపానికీ, ఇంకా చెప్పాలంటే ద్వేషవ్యాప్తికీ వాడుకుంటూ ఉంది. మధ్యతరగతి మళ్ళీ ప్రజలదగ్గరికి వెళ్ళాలని చెప్పడంతో ఆగకుండా గూగీ ఈ మాటలు కూడా రాస్తున్నాడు:

> మధ్యతరగతిలోని ఈ చిన్ని భాగం, అఫ్రికను మేధావివర్గంగా పిలవబడే ఈ సమూహం, కలోనియలు మూసల్ని తిరస్కరించడమంటే, యూరపియను జ్ఞాపకాల నుంచి బయటపడటం. తమ చుట్టూ ఉన్న వాస్తవాన్ని అర్థం చేసుకోవడానికీ, తమ కలల్ని ప్రకటించడానికీ ఐరోపీయ భాషలు మాత్రమే తగినవనే భ్రమనుంచి బయటపడటం. ఇంటా బయటా యూనివెర్సిటీల్లో ఉన్న విజ్ఞానాన్ని కొల్లగొట్టుకుని పైకొచ్చిన మధ్యతరగతి ఆ పరిజ్ఞానానికి బందీలుగా మారి పోగూడదు. ప్రజలభాషల్ని అందిపుచ్చుకోవడం, ఆ భాషల్ని ఉపయోగించుకోవడం కూడా మొదలుపెట్టాలి.

అయితే ఇటువంటి భాషావైవిధ్యం ఆఫ్రికను ఏకత్వానికి అవరోధం కాదా? కాదంటాడు గూగీ. వివిధ భాషల్లో వచ్చిన సారస్వతాన్నీ,విజ్ఞానాన్నీ పరస్పరం అనువదించుకోవడం ద్వారా, భాషావైవిధ్యాన్ని గౌరవించుకోవడం ద్వారా, భిన్నత్వంలో ఏకత్వం సాధించు కోవచ్చని చెప్తాడు. భిన్నత్వంలో ఏకత్వం భారతీయ ఆదర్శం. కానీ, ఇక్కడ ఒక భాషలో వస్తున్న విజ్ఞానమూ, సాహిత్యమూ పక్క భాషలోకి ఏ మేరకు ప్రవహిస్తున్నాయి?

ఈ కొత్త సందర్భంలో ఆఫ్రికను సాంఘికశాస్త్రవేత్త కర్తవ్యం ఏమిటనేది మూడవ వ్యాసంలో చర్చిస్తాడు. అతడిలా రాస్తున్నాడు:

> ఈ రోజు ఆఫ్రికాలో సాంఘిక శాస్త్రజ్ఞుడి ముందున్న సమస్య ఇదే: గ్లోబలైజేషను యుగంలో ఆఫ్రికా ఖండాన్ని మరింత చేరువగా తీసుకురావడ మెట్లా అన్నదే. ఒక ఉమ్మడి ఆఫ్రికను ప్రాతిపదికను రూపొందించడమెట్లా, తక్కిన ప్రపంచంతో

సంవదించడానికి వీలుగా దాన్ని బలపరచడమెట్లా? ఆర్థికంగానూ, రాజకీయం గానూ, సాంస్కృతికంగానూ ఆఫ్రికాను ఏకోన్ముఖం చెయ్యడమొక్కటే పరిష్కారం. ఇందులో రాజకీయ,ఆర్థిక సమగ్రతని సాధించడం రాజకీయ నాయకుల నిర్ణయాల మీద ఆధారపడ్డ విషయం కాగా, ఒక ఉమ్మడి మేధా ప్రాతిపదికను ఏర్పరచడం మేధావుల చేతుల్లో ఉన్నదే. ప్రజల భాషల్లో వేళ్ళూనుకుని వాదించి, చర్చించి, నిజమైన ప్రజా ప్రాతిపదికన ఏర్పడగల ఆఫ్రికను యూనియను కోసం ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయవలసిన బాధ్యత ఆఫ్రికను మేధావులదే.

తక్కిన నాలుగు వ్యాసాలూ కూడా విలువైనవే. మొత్తం అన్ని వ్యాసాల్లోనూ అతడు మాట్లాడుతున్నదాన్ని స్థూలంగా ఇట్లా చెప్పవచ్చు. ఇప్పుడు గ్లోబలైజేషనుయుగం మానవుడికి, జాతులకి, దేశాలకి ముందెన్నడూ లేనన్ని అవకాశాల్ని తెచ్చింది, అలాగే మున్నెన్నడూ లేనంత వినాశనానికి, దోపిడీకీ, పీడనకీ కూడా తలుపులు తెరిచింది. ఇప్పుడు ప్రపంచం చాలా కొద్దిపాటి సంపన్నదేశాలూ, అత్యధికసంఖ్యలో బీదదేశాలుగా విడిపోయింది. ఒకే దేశంలో కూడా చాలా కొద్దిసంపన్న కుంటుంబాలుగా మారుతుండగా, అత్యధికసంఖ్యాకులు నిరాశ్రయులుగా మిగిలిపోయే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. ఈ పరిస్థితుల్ని కొద్దిమంది ప్రయోజనాలకి అనువుగా మలుచుకోవడం గ్లోబలైజేషను. కాని, ఈ కొత్త అవకాశాల్ని అందిపుచ్చుకుని అత్యధికసంఖ్యాకుల ప్రయోజనాల కోసం పాటుపడటం 'గ్లోబలిజం' అంటాడు గూగీ. అటువంటి గ్లోబలిస్టు దృక్పథంతో రాసిన వ్యాసాలివి. గ్లోబలిస్టు దృక్పథం ఉన్న సాహిత్యం ఏమి చెయ్యాలో అతడిట్లా చెప్తున్నాడు:

> మనం జీవిస్తున్న ప్రపంచం గురించిన పదచిత్రాల్ని మనకి సాహిత్యం అందిస్తుంది. ఆ పదచిత్రాల ఆధారంగా మనం ప్రపంచాన్ని ఒక నిర్దిష్ట పద్ధతిలో చూడటం నేర్చుకుంటాం. ప్రపంచాన్ని మనం ఏ పద్ధతిలో చూస్తాం అన్నదాన్నిబట్టే, మనం ఏదైనా చెయ్యడానికి పూనుకుంటామో, పూనుకోమో లేదా ఏదో ఒక పద్ధతిలో చెయ్యడమో, చెయ్యకపోవడమో ఆధారపడుతుంది.

ఒక జాతిప్రజల్లోనూ, వివిధ జాతులమధ్యా కూడా ఒకళ్ళమీద ఒకళ్ళు పరాన్న-భుక్కులుగానూ, ఒకళ్ళని ఒకళ్ళు దోచుకునేవాళ్ళుగానూ ఉండే పరిస్థితిని భరించలేకుండానూ, అటువంటి పరిస్థితుల్తో రాజీపడలేకుండానూ ఉండేలా మనుషుల్ని రూపొందించడమే నిజమైన శాంతికాముక రచన అనిపించు-కుంటుంది. ఒకడు శుభ్రంగా ఉండటానికి మరొకడి జీవితం మురికికానక్కర లేకుండా ఉండటానికీ, ఒకడు ఆరోగ్యంగా ఉండటానికి మరొకడు అస్వస్థుడు కాకుండా ఉండటానికీ, ఒకడి సంక్షేమానికి మరొకడి దైన్యం కారణం కాకుండా ఉండటానికీ పోరాటం సాగించాలి. ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్క జాతీ అభివృద్ధి చెందితీరే ప్రపంచం ఉన్నప్పుడే శాంతి సుసాధ్య-మవుతుంది. దురాశ, మానవవిధ్వంసాల మీద ఆధారపడ్డ గ్లోబలైజేషనుకి, మానవసృజనాత్మకతా, మానసిక స్వస్థతా పునాదిగా కలిగిన గ్లోబలిజం ఒక్కటే సమాధానం కావలసి ఉంటుంది.

10-9-2017

# గ్రేటా థున్‌బెర్గ్ ఎఫెక్టు

**గ్రేటా థున్‌బెర్గ్** ఒక స్వీడిషుబాలిక. 2003 లో పుట్టింది.

ఇప్పుడామెకు పదహారేళ్ళు. మన రాష్ట్రంలో ఉండి ఉంటే ఐ.ఐ.టి కోసం ఏ కార్పొరేటు కాలేజీలోనో ఇంటర్మీడియెటు చదువుతూ ఉండేది.

కాని ఆమె బడిమానేసింది. బడి మానేసి ఆమె ఇప్పుడు ప్రపంచాన్ని కుదిపేస్తున్నది, తన మాటల్తో, తన ఆవేదనతో, మానవాళి మనుగడ కోసం పరితపిస్తున్న హృదయంతో ఆమె ప్రపంచాన్ని కుదిపేస్తున్నది.

గ్రేటా తండ్రి రంగస్థల కళాకారుడు. తల్లి అంతర్జాతీయఖ్యాతి గడించిన ఒపేరా గాయని. మన పర్యావరణానికి సంభవిస్తున్న ముప్పు గురించి ఆమె తన ఎనిమిదేళ్ళప్పుడు మొదటిసారిగా వింది. అప్పుడామెకేమీ అర్థం కాలేదు. మరొక మూడేళ్ళు గడిచాయి. పర్యావరణమంటే ఏమిటో, జీవావరణమంటే ఏమిటో ఆమెకి నెమ్మదిగా తెలిసివచ్చింది. పదకొండేళ్ళ వయసువచ్చేటప్పటికి ఆమెని గొప్ప దిగులు కమ్మేసింది. ముభావంగా మారిపోయింది. నలుగురితో మాట్లాడటం మానేసింది. ఆమె లోపల్లోపల చెప్పలేనంత సంక్షోభానికి లోనయ్యింది.

'బహుశా నేను ఎక్కువగా ఆలోచిస్తానేమో. కొంతమంది విన్నవి విన్నట్టు మర్చిపోతారు. జరిగేవి జరగనీ అనుకుంటారు. నేనలా అనుకోలేను. అందులోనూ నన్నేదన్నా బాధపెట్టేదీ, నాకు దిగులుపుట్టించేదీ ఎదురైతే దాన్నస్సలు మర్చిపోలేను. నా చిన్నప్పుడు స్కూల్లో మా టీచర్లు సినిమాలు చూపించేరు. సముద్రాల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్కు గురించీ, ఆకలితో కృశించిపోతున్న ధ్రువప్రాంతపు ఎలుగుబంట్ల గురించీ చూపించేరు. అవి చూస్తున్నంతసేపూ నేను ఏడుస్తూనే ఉన్నాను. నా తోటి విద్యార్థులు కూడా వాటిని చూస్తున్నంతసేపూ బాధపడుతూనే ఉన్నారుగాని, ఆ సినిమాలు చూడటం అయిపోగానే వాటిని మర్చిపోయేరు. నేనట్లా మర్చిపోలేకపోయాను. ఆ దృశ్యాలు నా బుర్రలో ఇరుక్కుపోయాయి' అందామె గార్డియను పత్రికకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో.

ఆమెకి పన్నెండేళ్ళ వయసురాగానే మానసికంగా అస్వస్థతకి లోనైందని గుర్తించారు. ఆమె లోపల్లోపల చెప్పలేనంత ఆందోళన సుళ్ళు తిరగడం మొదలుపెట్టింది. 'ఈ పరిస్థితి మీద ఏదోలా నా నిరసనని వ్యక్తం చెయ్యకపోతే నేను బతకలేననిపించింది' అందామె. ఆ ఆందోళనలోనే పోయిన ఏడాది ఆగస్టులో ఆమె బడికి వెళ్ళడం మానేసింది.

ఆగస్టు 20, 2018.

ఆ రోజు ఆమెకి బడికి వెళ్ళలేదు. అందుకు బదులు ఒక అట్టముక్క తీసుకుని ఒక నినాదం రాసుకుంది. నేరుగా తన సైకిలు మీద స్వీడిషు పార్లమెంటు ప్రాంగణానికి చేరుకుంది. ఆ పార్లమెంటు భవనం ముందు ఆ ప్లకార్డు పక్కన పెట్టుకుని పొద్దున్న ఎనిమిదిన్నర నుంచి మధ్యాహ్నం మూడింటిదాకా కూర్చుంది. ఒక్కర్తే. ఒక్క మాటలేదు, ఒక్క స్లోగను లేదు. ఒక్కర్తే. మౌనంగా, లోపల రగులుతున్న అగ్నిపర్వతం లాంటి ఆవేదనతో, సమస్త మానవాళి భవిష్యత్తుకోసం చల్లారని తపనతో.

రెండో రోజు కొంతమంది మిత్రులు ఆమె పక్కన చేరారు.

మూడవ రోజుకి మరికొంతమంది.

ఆ పదిహేనేళ్ళ బాలిక మొదలుపెట్టిన ఆ మౌన పోరాటం కార్చిచ్చుగా మారింది.

15 మార్చి 2019.

112 దేశాల్లో 14 లక్షలమంది పిల్లలు బడికి వెళ్ళడం మానేసారు. స్కూలు స్ట్రైకు మూమెంటు ప్రపంచవ్యాప్త ఆందోళనగా మారింది.

24 మే 2019. ఇప్పుడు ఆ దావానలం 125 దేశాలకు పాకింది.

టైము పత్రిక ఆ నెల తన ముఖచిత్రంగా గ్రేటాను ఎంపిక చేసుకుంది. ఆమెకి నోబెలు శాంతి బహుమతి ఇవ్వాలని నార్వేజియను పార్లమెంటు తీర్మానం చేసింది.

కాని గ్రేటా దృష్టి వీటిమీద లేదు. ఆమె మరింత మరింతగా ప్రపంచాన్ని మేల్కొల్పు-తూనే ఉంది. వాణిజ్యశక్తుల్ని ఉద్దేశించి నిర్మొహమాటంగా మాట్లాడుతూనే ఉంది. అన్నిటికన్నా ముందు ఆమె తన జీవితవిధానాన్ని మార్చుకుంది. తన ప్రయోగాల్ని తన తల్లిదండ్రుల మీదనే చేయడం మొదలుపెట్టింది. ఆమె మాట విని ఇంట్లో తల్లిదండ్రులు మాంసాహారం మానేసారు. పర్యావరణాన్ని కాపాడాలంటే ముందు విమానప్రయాణాలు మానెయ్యాలని చెప్పింది తన తల్లితో. ఆమె అంతర్జాతీయస్థాయి గాయని. విమానాల్లో ప్రయాణించకపోతే ఆమెకి గడవదు. కాని ఆమె తన కుమార్తె మాటల ప్రభావానికి తన కెరీరు వదిలేసుకుంది. ఈ ఒక్క ఏడాది లోనే స్వీడిషు రైల్వే ప్రయాణీకులు ఎనిమిది శాతం పెరిగారని అంచనా. పర్యావరణం కోసం ఏర్పాటైన ఒక సమావేశానికి ప్రతినిధులంతా విమానాల్లో వచ్చారు. గ్రేటా మాత్రం 32 గంటల పాటు రైల్లో ప్రయాణించి మరీ వచ్చింది. 'మీరు ఆచరణలో చూపకుండా పర్యావరణాన్ని కాపాడలేరు' అని చెప్పిందామె ఆ ప్రతినిధులతో.

ఇప్పుడు ప్రపంచమంతా ఎక్కడ చూసినా గ్రేటా థున్‌బెర్గ్ ఎఫెక్టు. ఒక బ్రిటిషు రాజకీయ నేత అన్నట్టుగా ఆమెని వింటున్నంతసేపూ ప్రపంచం చెప్పలేనంత ఆరాధనకీ అదే సమయంలో అపరాధభావనకీ, సిగ్గుకీ కూడా లోనవుతున్నది. కాని కొత్త బాధ్యతను కూడా తలకెత్తుకోడానికి ఉత్సాహపడుతున్నది.

గ్రేటా థున్‌బెర్గ్ ప్రసంగాలు వింటుంటే మనకి మహాత్మాగాంధీని వింటున్నట్టు అనిపిస్తే ఆశ్చర్యం లేదు. మాటల్లో అదే సూటిదనం, అదే సత్యసంధత. అదే నిర్భరత్వం, అదే నిర్భయత్వం. ఆమె ప్రసంగాలు రెండు, తెలుగులో, మీ కోసం.

## మనమంతా కలిస్తే ఎంత మార్పు తేగలమో ఊహించండి

నా పేరు గ్రేటా థున్‌బెర్గ్. నాకు పదిహేనేళ్ళు. నేను స్వీడనునుంచి వచ్చాను. మన పర్యావరణానికి మనం చేస్తున్న అన్యాయం గురించి, చెయ్యవలసిన న్యాయం గురించీ మాట్లాడాలనుకుంటున్నాను.

చాలామంది దృష్టిలో స్వీడను చిన్నదేశం. ఇక్కడ మేమేం చేసినా ప్రపంచానికేమీ కాదు అని వాళ్ళ నమ్మకం. కాని, నేనొకటి గ్రహించాను. ప్రపంచాన్ని మార్చడానికి ముందుకొచ్చే వాళ్ళెవ్వరినీ చిన్నవాళ్ళుగా భావించలేం. ఎక్కడో కొద్దిమంది పిల్లలు బడికి వెళ్ళడం మానేస్తే ప్రపంచమంతా వార్తాపత్రికలు పతాకశీర్షికల్లో రాస్తున్నాయంటే, గ్రహించండి, మనమంతా కలిస్తే ఎంత మార్పు తేగలమో ఊహించండి.

కానీ అలా చెయ్యాలంటే ముందు మనం స్పష్టంగా మాట్లాడుకోవాలి. అలా మాట్లాడుకోవడం ఎవరికి ఎంత ఇబ్బందిగా అనిపించినా సరే. మీరెప్పుడూ సతతహరిత ఆర్థికాభివృద్ధి గురించే ఎందుకుమాట్లాడతారంటే, అది కాక మరొకటి మాట్లాడితే, ఎక్కడ అపకీర్తి మూటగట్టుకోవలసి వస్తుందో అని మీ భయం. మీరెంతసేపూ ఆ పాతకాలపు ఆలోచనల్తోనే ముందుకు పోవాలనుకుంటారు. ఆ ఆలోచనలే మననీ రొంపిలో పడేసాయి. ఇప్పుడు, ఎమెర్జెన్సీ బ్రేకు నొక్కడం తప్ప మనం మరొకటేమీ చెయ్యలేని వేళ కూడా, అవే పాత మాటలు.

ఉన్నదున్నట్టుగా చెప్పే పరిణతి లేదు మీకు. చివరికి ఆ భారం కూడా మీరు పిల్లల మీదకి నెట్టేస్తున్నారు. నాకేమీ కీర్తిమూటగట్టుకోవాలన్న తాపత్రయం లేదు. నా ధ్యాస మొత్తం మన వాతావరణం మీదా, మనం జీవిస్తున్న ఈ గ్రహం మీదా మాత్రమే. కొద్ది మంది మనుషులు అపారంగా సంపద మూటగట్టుకోవడం కోసం మన మొత్తం నాగరికతనే బలి ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు. నా దేశం లాంటి దేశాల్లో మనుషులు విలాసవంతంగా జీవించడం కోసం మన జీవావరణం మొత్తాన్ని బలిచ్చేస్తున్నారు. కొద్ది మంది విలాసాల కోసం అత్యధికసంఖ్యాకులు కడగండ్ల పాలవుతున్నారు.

2078 నాటికి నా డెబ్బై అయిదవ పుట్టినరోజు వస్తుంది. బహుశా నాకు పిల్లలుంటే ఆ రోజు నేను వాళ్ళతో గడుపుతానేమో. వాళ్ళా రోజు నన్ను మీ గురించి అడుగుతారు. ఏదో ఒకటి చెయ్యడానికి ఇంకా సమయమున్నా కూడా ఈ రోజు మీరా పనులెందుకు చెయ్యలేదని వాళ్ళు ఆ రోజు నన్ను నిలదీస్తారు.

మీరేమో మీకు మీ పిల్లలంటే ఇష్టమంటారు గాని, వాళ్ళ కళ్ళముందే వాళ్ళ భవిష్యత్తుని దొంగిలించేస్తున్నామని ఒప్పుకోరు. రాజకీయంగా ఏది సాధ్యమా అని కాదు, అసలు అన్నిటికన్నా ముందు మనం చెయ్యవలసిందేమిటని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోనంతకాలం, మనకి దిక్కు లేదు.

ఒక సంక్షోభాన్ని సంక్షోభంగా గుర్తించకుండా దాన్ని పరిష్కరించలేం. చమురునీ, సహజవాయువుల్నీ భూగర్భంలోనే ఉండనిద్దాం. భూమ్మీద ప్రతి ఒక్కరం నిర్వహించవలసిన బాధ్యత నిర్వహించటమెట్లానో ఆలోచిద్దాం మనం . ఒకవేళ ప్రస్తుతం ఉన్న వ్యవస్థలో పరిష్కారాలు వెతకడం సాధ్యం కాకపోతే, అసలు ముందు ఈ వ్యవస్థనే మార్చేద్దాం. మనం ఇక్కడికొచ్చింది ప్రపంచనేతల్ని ప్రాధేయపడటం కోసం కాదు. మీరు మమ్మల్ని గతంలోనూ పట్టించుకోలేదు, ఇప్పుడూ పట్టించుకోరు. మాకు సంజాయిషీలు వినే ఓపికా లేదు, తీరికా లేదు. మేమిక్కడికొచ్చింది, మీకు ఒక స్పష్టంగా ఒక మాట చెప్పడానికే, అదేమంటే, ప్రపంచం చాలా తొందరగా మారిపోతున్నది, ఏదో ఒక నిర్ణయం తీసుకునే అంతిమాధికారం ప్రజలదే! ఆ మాట చెప్పడానికే నేనిక్కడి కొచ్చాను. ధన్యవాదాలు!

(డిసెంబరు 12, 2018 న జరిగిన COP 24 ప్లీనరీ సమావేశంలో చేసిన ప్రసంగం)

## మన ఇంటికి నిప్పంటుకుంది

మన ఇంటికి నిప్పంటుకుంది. మన ఇల్లు తగలబడిపోతోందని చెప్పడానికే నేనిక్క–డున్నాను. ఐ.పి.సి.సి చెప్పేదాన్ని బట్టి చూస్తే, మనం మన తప్పుల్ని దిద్దుకోలేని స్థితికి చేరడానికి పుష్కరకాలం కూడా పట్టేట్టులేదు.

ఆ లోగా మనం ఇప్పటిదాకా చెయ్యని పనులెన్నో చెయ్యాల్సి ఉంటుంది. మనం విడుదల చేస్తున్న కార్బన్ డై ఆక్సైడు కనీసం సగానికన్నా తగ్గించవలసి ఉంటుంది. ఇది కాక పారిసు ఒడంబడికని ప్రపంచవ్యాప్తంగా అమలు చెయ్యాలంటే, మనం ప్రతి ఒక్కరం సమానంగా పంచుకోవలసిన బాధ్యత కూడా ఉంది. వీటితో పాటు ఆర్కిటిక్కు హిమరాశులు కరగడం మొదలుపెట్టాక విడుదల అవుతున్న మీథేను వాయువుని నియంత్రించవలసిన బాధ్యత కూడా మనమీదే ఉంది.

ఇక్కడ దావోసులాంటి చోట, మనుషులు తమ జయగాథలు చెప్పడానికి ఇష్ట పడతారు. కాని వాళ్ళ ఆర్థికవిజయాలకు మనం చెల్లించవలసి వచ్చిన ధర చాలా చాలా ఎక్కువ. వాతావరణ పరిరక్షణ విషయంలో మనం విఫలమయ్యామని ఒప్పుకోక తప్పదు. రాజకీయ ఉద్యమాలన్నీ కూడా ఇప్పుడున్న రూపంలో ఈ అంశంలో విఫల మయ్యాయి. ప్రజలకి ఈ అంశం పట్ల కలిగించవలసిన జాగృతి కలిగించలేకపోవడంలో సమాచారప్రసార సాధనాలు కూడా ఘోరంగా విఫలమయ్యాయి. కాని, ఒక జాతిగా, హోమోసెపియన్సు పూర్తిగా విఫలం కాలేదు. అంటే మనం విఫలమవుతున్నాం కానీ, మన చుట్టూ ఉన్న దాన్ని పరికించి చూసుకోడానికీ,సరిదిద్దుకోడానికీ, ఇంకా కొంత అవకాశం లేకపోలేదు. ఇంకా సమస్య మన చేతుల్లోంచి పూర్తిగా జారిపోలేదు. కానీ ప్రస్తుతం ఉన్న వ్యవస్థలు పూర్తిగా విఫలమయ్యాయని మనం గుర్తించకపోతే మాత్రం మనకి దిక్కులేదు.

అత్యధికసంఖ్యాకులకి అపారమైన దుఃఖాన్నీ, వేదననీ తీసుకువస్తున్న ఈ మహోత్పాతం గురించి ఎవరూ మాట్లాడటం లేదు. మనం కూడా ఇంకా మెత్తగా మాట్లాడుతూ కూచోలేం. ఇప్పుడు మనం దీని గురించి మాట్లాడగలమో, మాట్లాడలేమో తేల్చుకోవలసి ఉంది. మాట్లాడవలసిందేదో స్పష్టంగా మాట్లాడవలసి ఉంది. బహుశా హోమో సెపియన్సు తమ చరిత్రలో ఇంత పెద్ద, ఇంత సంక్లిష్టమైన సంక్షోభాన్ని ఇంతదాకా ఎదుర్కొని ఉండలేదు.

చావో బతుకో తేల్చుకునే సమయాల్లో అస్పష్టతకి తావులేదు. ఏదో ఒకటి ఎంచుకునే అవకాశం మనకింకా లేకపోలేదు. ఇప్పుడున్నట్టే ఇలానే యథాతథపరిస్థితి కొనసాగిస్తూ

విఫలమయిపోవడమా లేకపోతే ఒక సమూల పరివర్తన దిశగా అడుగులు వేస్తూ మానవాళి భవిష్యత్తును కాపాడుకోవడమా? నువ్వూ, నేనూ కూడా తేల్చుకోవలసిందిదే.

దీనికిట్లా ఉద్యమాలు చెయ్యడమెందుకంటారు కొందరు. మీరు ఓటేసి ఎన్నుకుంటున్న రాజకీయ నాయకులకే ఈ విషయాన్ని వదిలిపెట్టవచ్చు కదా అంటారు. కాని ఆ రాజకీయ నాయకులకు ఈ విషయంలో దృఢసంకల్పం లేకపోతే మనమేం చెయ్యాలి? అటువంటి రాజకీయకార్యకలాపాలు కనుచూపు మేరలో కూడా లేకపోతే మనమేం చెయ్యాలి?

తక్కినచోట్లలోలాగే, ఇక్కడ దావోసులో కూడా, ప్రతి ఒక్కళ్ళూ డబ్బు గురించే మాట్లాడుతున్నారు. డబ్బు సంపాదించడం, ఆర్థికంగా పైకి ఎదగడం- ఈ రెండే సమస్తమన్నట్టుగా కనిపిస్తోంది. వాతావరణసంక్షోభాన్ని ఇప్పటిదాకా ఒక సంక్షోభంగా చూడనందువల్ల, మన నిత్యజీవితం మీద ఆ సంక్షోభం చూపించగల ప్రభావమేమిటో ప్రజల ఊహకి కూడా అందడం లేదు.

అత్యధిక సంఖ్యాకులైన ప్రజలకు కార్బను బడ్జెటు అంటూ ఒకటుంటుందని తెలీదు. ఆ బడ్జెటులో మనకి మిగిలింది స్వల్పాతిస్వల్పమేనని కూడా వాళ్ళకి తెలీదు. ఈ పరిస్థితి ఇప్పుడు మారాలి. త్వరితంగా అంతరించిపోతున్న కార్బను బడ్జెటును కాపాడుకోవడమే ఇవాళా, రేపూ కూడా మన అర్థశాస్త్రపాఠం కావాలి.

వినడానికి ఎంత కటువుగా ఉన్నా, ఈ మాటలు చెప్తూండటం ఆర్థికంగా లాభసాటి కాకపోయినా కూడా, ప్రతి ఒక్కళ్ళూ స్పష్టంగా పర్యావరణ ప్రమాదం గురించి స్పష్టంగా మాట్లాడవలసిన సమయం నేడు చరిత్రలో ఆసన్నమైంది. మన ప్రస్తుత సామాజిక జీవన విధానాన్ని మనం సమూలంగా మార్చుకోవాలి. నువ్వు కార్బనునిల్వల్ని ఎంత ఎక్కువ ఖర్చు చేస్తుంటే, నీ నైతికబాధ్యత అంత ఎక్కువన్నట్టు. నీ ఆర్థికవ్యవస్థ ఎంత పెద్దదైతే నీ బాధ్యత కూడా అంతే పెద్దది.

పిల్లలకి రేపటి పట్ల ఆశ కలిగించడం తమ బాధ్యత అని పెద్దవాళ్ళు అంటూంటారు. కాని నాకు మీ ఆశ వద్దు. మీరు కూడా ఆశావహులుగా ఉండకండి. మీకు చెప్పలేనంత

బెంగ పుట్టాలని కోరుకుంటున్నాను. రోజూ నాకెంత భయం కలుగుతోందో మీకూ అంత భయం కలగాలని కోరుకుంటున్నాను. మీరు ఏదో ఒకటి చెయ్యాలని కోరుకుంటున్నాను. మీరో ప్రమాదంలో చిక్కుకుంటే ఏదో ఒకటి చెయ్యకుండా ఉండలేరే అట్లా ఏదో ఒకటి చెయ్యాలని కోరుకుంటున్నాను. మీ ఇంటికి నిప్పంటుకుంటే ఏం చేస్తారో అలా అన్నమాట. చూడండి, నిజంగానే మీ ఇంటికి నిప్పంటుకుంది.

(2019 లో దావోసులో జరిగిన వరల్డు ఎకనామిక్ ఫోరములో చేసిన ప్రసంగం)

22-7-2019

# సల్మాన్ రూష్దీ

**సల్మాన్ రూష్దీ** పైన జరిగిన హత్యాప్రయత్నం అత్యంత దురదృష్టకరం. ఒకవైపు సాంకేతిక పరిజ్ఞానం వల్ల సరిహద్దులు చెరిగిపోతూ దిక్కులు మరింత దగ్గరగా జరుగుతున్న ప్రపంచం భావోద్వేగాల పరంగా మధ్యయుగాల్లోకి ప్రయాణిస్తుండటం నిజంగా విచారకరం.

అందులోనూ మతాధికారీ, రాజకీయనాయకుడూ, ఉగ్రవాదీ కానీ ఒక వ్యక్తిని, నిరాయుధుణ్ణి ఒక సాహిత్యసభలో ఒక ఉన్మాది హత్యచెయ్యాలనుకోవడం ఈ ప్రపంచభద్రత పట్ల, భవిష్యత్తు పట్ల అపారమైన ఆందోళనని కలగచేస్తున్నది.

రూష్దీ పేరు, ఆ పేరు చుట్టూ అల్లుకున్న వివాదాల గురించి గత మూడు దశాబ్దాలకు పైబడి వింటూ ఉన్నాను. ఆయన రాసిన రచనల్లో సుప్రసిద్ధమైన 'మిడ్ నైట్స్ చిల్డ్రన్', మరొక కథా సంపుటి కూడా కొనుక్కున్నాను. కాని రెండు పుస్తకాలూ చదవలేకపోయాను. మిడ్‌నైట్స్ చిల్డ్రన్ కొన్ని పేజీల తరువాత ముందుకు సాగలేదు. అతణ్ణి వివాదాల్లోకి లాగిన 'శాటానిక్‌వర్సెస్' ఎలానూ దొరకలేదు. కాబట్టి ఒక రచయితగా రూష్దీ పట్ల నేనొక అభిప్రాయాన్ని ఏర్పరచుకోలేకపోయాను, ఆ మధ్య ఆయన సాహిత్య వ్యాసాలు Languages of Truth, Essays, 2003-2020 (2021) వెలువడిందాకా.

ఆ వ్యాససంపుటిలో రూష్డీ విశ్వరూపం చూసాను. సమకాలిక రచయితల్లోనూ, సాహిత్యవేత్తల్లోనూ అతడు చాలా పొడగరి అని అర్థమయింది. ఆ వ్యాసాల్లో అతడు ఎంతో సూక్ష్మదృష్టితో, వివేచనతో, సంతులిత భావోద్వేగాల్తో కనిపించాడు. ఈ రచయిత మీదనా ఇంత గొడవ చేస్తున్నది, ఇతడి ప్రాణాల మీదనా ఫత్వా విధించింది అని ఆశ్చర్యపోయాను. ఆ వ్యాసాల్లో సాహిత్యం మీద మాత్రమే కాక, చిత్రకళమీదా, చిత్రకారుల మీద కూడా అతడు ఎంతో అద్భుతమైన పరిచయాలు, సమీక్షలు రాసి ఉన్నాడు. నాకు తెలిసి సమకాలిక భారతీయ రచయితల్లో ఈ రెండు రంగాల్లోనూ కూడా ఇంత సాధికారికంగా రాయగలిగినవాళ్ళు, వేళ్ళమీద లెక్కపెట్టగలిగినవాళ్ళు కూడా లేరు.

ఆ వ్యాసాల్లో Another Writers Beginning అనే వ్యాసంలో అతడు తన సాహిత్య ప్రయాణం గురించి కొంత చెప్పుకున్నాడు. Joseph Anton అనే ఒక స్మృతిరచనలో అతడు తన గురించి రాసుకున్నదానికి ఇది అదనం. అందులో అతడు తనొక రచయిత కావడానికి, తన సొంత గొంతు తాను వెతుక్కోడానికి ఎంతగా నలుగులాట పడ్డాడో అదంతా చాలా వివరంగా, విశ్వసనీయంగా రాసుకొచ్చాడు. చివరికి ఇలా రాస్తున్నాడు:

> మిడ్ నైట్స్ చిల్డ్రన్ రాయడానికి నాకు అయిదేళ్ళు పట్టింది. ఎందుకంటే ఆ నవల రాస్తున్నంతసేపూ ఆ నవల ఎలా రాయాలో నాకు నేను బోధపరుచు కుంటూనే ఉన్నాను. రెండు శతాబ్దాల కాలానికి చెందిన స్వతంత్రభారతదేశపు తొలి పౌరుల తరంలో నేను కూడా ఒకణ్ణి. మాలో స్వాతంత్ర్యస్ఫూర్తితో పాటు, ఆ స్వాతంత్ర్యభానూదయవేళ ముస్లిములు, హిందువులు ఒకరినొకరు ఊచకోత కోసుకున్న ఆ నరమేధం, ఆ రక్తపాతం కూడా మాకు గుర్తే. ఆ జ్ఞాపకాలు మేమింకా మోసుకు తిరుగుతూనే ఉన్నాం. అటువంటి పరివర్తన యుగాలకీ, దశలకీ చెందిన తరాలు నిజంగానే ప్రత్యేకమైనవి. అవి పూర్తిగా గతానికీ చెందవు, అలాగని పూర్తిగా భవిష్యత్తుకీ చెందవు. ఆ విలక్షణక్షణాన్ని పొదివి పుచ్చుకోవడం నాకు జన్మతః దక్కిన ఒక వరంగా భావిస్తాను. ఆ పరివర్తనశీల కాలాన్ని అక్షరాల్లోకి అనువదించడమెట్లానో నేర్చుకున్నాను. మన జీవితాల్లోని

అత్యంత వైయక్తిక అనుభవాల్ని అత్యంత పౌర జీవితానుభవాలతో అల్లుకుంటూ, ఊరికే మాటలు పోగెయ్యడం కాకుండా, ఆ సన్నివేశాల్ని దృష్టాంతపూర్వకంగా నిరూపిస్తూ, అదే సమయంలో మనల్ని చరిత్ర ఏ విధంగా రూపొందింస్తోందో గమనిస్తూ, ఈ ప్రశ్న కూడా వెయ్యగలగడం నేర్చుకున్నాను: అదేమంటే మనం మన కాలాల్ని నిర్ణయిస్తున్నామా లేక మన కాలమే మన జీవితాల్ని నిర్ణయిస్తున్నదా? మనం చరిత్రను రూపొందిస్తున్నామా లేక భగ్నం చేస్తున్నామా? మనం, కేవలం మన ఇష్టాయిష్టాలతో, కార్యాచరణతో ప్రపంచాన్ని మార్చగలమా? తీర్చిదిద్దుకోగలమా?

ఈ వాక్యాలు ఎంతో స్పష్టంగా ఉన్నాయి కదా. మరి ఇటువంటి సున్నితమనస్కుడు, భావుకుడు, జీవితప్రేమి అయిన రచయితని ఇలా ద్వేషమూ, మృత్యువూ ఎందుకు వెన్నాడుతున్నాయి?

మధుజైన్ అనే ఒక పాత్రికేయురాలు రాసిన వ్యాసం ఒకటి నిన్న నాకో మిత్రుడు పంపించారు. తన పుస్తకం మీద అనవసరమైన వివాదం చెలరేగడానికి ఇండియా టుడే పత్రికలో మధుజైన్ రాసిన సమీక్షనే కారణమని రూష్దీ భావిస్తూ ఉన్నాడట. అందుకు ఆమెను ఇప్పటిదాకా కూడా క్షమించలేదట. ఆమెతో మాట్లాడటం మానేసాడట. ఆ విషయాలన్నీ చెప్తూ, మధుజైన్ తన సమీక్ష గురించీ, తదనంతర పరిణామాల గురించీ కొంత వివరణాత్మకంగానే రాసింది.

కాని ఆ వ్యాసం చదివాక నాకు ఏమి అర్థమయిందంటే, రచయితలకి నిజమైన శత్రువులెవరంటే పుస్తకాలు పూర్తిగా చదవనివాళ్ళు. సగం సగం చదివి, పుస్తకాలమీద తీర్పులు ఇచ్చే పాఠకులు, ఆ పుస్తకాల్ని సెన్సేషనుగా మార్చుకోడానికి ఎంతమాత్రం వెనకాడని పాత్రికేయులు. వాళ్ళు మతోన్మాదుల కన్నా ప్రమాదకరం.

రూష్దీ పుస్తకం మీద వివాదం సంగతినే చూడండి. ఆ సమీక్షకురాలు పుస్తకం ఇంకా పూర్తిగా విడుదల కాకుండానే మొదటి ప్రూఫుని పట్టుకుని సమీక్ష రాసింది. ఆ సంపాదకుడు పుస్తకంలోంచి సందర్భంతో నిమిత్తం లేకుండా, కొన్ని వాక్యాల్ని ఒక వర్గం వారి భావోద్వేగాలు రెచ్చగొట్టే విధంగా, రెచ్చగొట్టే ఉద్దేశ్యంతో అర్జంటుగా

ప్రచురించాడు. మొదట్లో బ్యురోక్రేటుగా పనిచేసి ఆ తర్వాత రాజకీయనాయకుడుగా మారిన ఒక పెద్దమనిషి (ఆ పుస్తకమింకా బయటికి రాకుండానే, తాను చదవకుండానే) ఆ పుస్తకాన్ని నిషేధించాలని పిలుపునిచ్చాడు. ఆ పిలుపు మీద కరాచీలో అల్లర్లు, కాల్పులు జరిగాయి. అమాయికులు మరణించారు. అది టివిలో చూసి ఆయతొల్లా ఖొమేనీ రచయితమీద ఫత్వా జారీచేసాడు. ఈ మొత్తం సంఘటన క్రమం దీనికిదే ఒక హార్రరు ఫిల్మ్‌గా ఉంది కదూ! ఆశ్చర్యంలేదు. పుస్తకం పట్లా, స్త్రీ పట్లా మనుషులు చాలా తొందరగా తమ లేకితనాన్ని చాటుకుంటారు అన్నాడు భవభూతి కనీసం వెయ్యేళ్ళ కిందట.

రూష్దీ మీద గత మూడు దశాబ్దాలుగా నేను చదువుతూ వస్తున్నదంతా ఒక రొడ్డ కొట్టుడు వివాదం. దానిలో రెండు శిబిరాలున్నాయి. ఒకరు పాశ్చాత్య ఉదార వాదులు. వారేమంటారంటే మనిషికి, ముఖ్యంగా రచయితకి తన అభిప్రాయాలు ప్రకటించే స్వేచ్ఛ ఉండాలి. వాటిని ప్రకటించడానికి అతడికి ప్రాణభయం ఉండకూడదు. మరొక శిబిరం ఆసియాఖండానికి చెందిన మతవర్గాలు. వారేమంటారంటే, స్వేచ్ఛ పేరిట, భావ, వాక్స్వాతంత్ర్యాల పేరిట అత్యధిక సంఖ్యాకుల విశ్వాసాల్ని భంగపరిచే మాటలు మాట్లాడటానికి ఎవరికీ హక్కులేదు, అది ఎంత గొప్ప రచయిత కానీ అని. ఇది ఇంత తేలిగ్గా తేలే వివాదం కాదు.

కానీ ఒక రచయితగా, సాహిత్యాభిమానిగా, కులమతాలకి అతీతంగా తోటిమనిషిని ప్రేమించాలనుకునేవాడిగా నేనేమంటానంటే ఏ రచయితకైనా నలుగురి సానుభూతి, మద్దతు అవసరం కావడం కన్నా విషాదం మరొకటి ఉండదు. నువ్వు రచయితవి, నువ్వు నలుగురికీ మద్దతు కూడగట్టవలసిన వాడివి, నలుగురికి నీ సహానుభూతి ప్రకటించవలసిన వాడివి. నువ్వు ఒక రచయితగా సాధించవలసింది, చెప్పవలసింది, ప్రచారం చెయ్యవలసింది చాలా ఉంది. కులమతాల అడ్డుగోడలు కూల్చేప్రయత్నాలు మరింత ఓపిగ్గా, మరింత విపులంగా, విస్పష్టంగా చెయ్యవలసిన ప్రయత్నాలు. మన రాసే రచనలు ఎటువంటి అస్పష్టతకీ తావివ్వని విధంగా చెప్పాలి. నీ భావప్రకటనా స్వాతంత్ర్యాన్ని నేను గౌరవిస్తాను అని మరొకడు చెప్పవలసిన అవసరం లేకుండా

చెప్పాలి. ఒకసారి నీ భావాలు ప్రకటించిన తరువాత 'నేను అంటున్నది అది కాదు, ఇది' అంటూ ప్రభుత్వాల ముందూ, పాఠకులముందూ, న్యాయస్థానాలముందూ, మూర్ఖత్వపు మూకలముందూ సంజాయిషీ చెప్పుకోవలసిన అవసరం పడకూడదు. బహుశా నాకు రూష్దీని కలుసుకునే అవకాశం కలిగిఉంటే ఈ మాటలే చెప్పి ఉండేవాణ్ణి.

అతడి సాహిత్యవ్యాసాలు చదివిన తరువాత అతడినుంచి ఈ ప్రపంచం నిజంగా పొందవలసింది ఎంతో ఉందనీ, అదేమీ ఇంకా పూర్తిగా పొందనే లేదనీ అనిపించింది. కరోనా మహమ్మారి తన పట్టు విదిలించిన తరువాతి ప్రపంచంలో జీవించడానికి మనందరికన్నా ఎక్కువగా ఉత్సాహపడ్డవాడు రూష్దీనే అని Pandemic: A Personal Engagement with Coronavirus అన్న వ్యాసం చదివితే అర్థమవుతుంది. అందులో అతడు I guess Im immune అని రాసుకున్నాడు. కాని వైరసుకి మందుకనుక్కున్న సైన్సు ద్వేషానికి ఇంకా కనుక్కోలేకపోయింది.

రూష్దీ బతకాలి. అతడికి పూర్తి ఆరోగ్యం సిద్ధించాలి. అతడు మళ్ళా రచనలు చెయ్యాలి, ఎందుకంటే అతడే రాసుకున్నట్టుగా the story was his birthright, and nobody could take it away.

14-8-2022

# ఏమి పాఠం నేర్చుకున్నాం?

**మనుషులు** చాలా బలంగా మర్చిపోవాలనుకుంటున్నవాటిలో బహుశా కరోనా కాలం అన్నిటికన్నా మొదట ఉంటుందనుకుంటాను. ఎందుకంటే, ఆ కాలంలో మనుషులు ఎంతో విచిత్రంగా ప్రవర్తించేరు. కుటుంబాలూ, జాతులూ, దేశాలూ కూడా. లాక్ డౌను కాలంలో ఒక చిన్న ప్రయాణంకోసం, కరోనా రెండోసారి దండెత్తినప్పుడు ఒక ఆక్సిజను సిలిండరు కోసం, మొత్తం కరోనాకాలంలో చనిపోయినవాళ్ళకి ఒక గౌరవప్రదమైన దహనసంస్కారం కోసం మనుషులు ఎంతెంత పెద్ద యుద్ధాలు చెయ్య వలసివచ్చిందో మనలో చాలామందికి తెలుసు. మామూలు రోజుల్లో మాట్లాడే నీతి వాక్యాలు, సిద్ధాంతాలు, మామూలు సందర్భాల్లో తోటిమనిషిమీద ఉదారంగా తీర్చే తీర్పులు కరోనా కాలంలో తల్లకిందులయ్యాయి.

ఆ సంఘటనల గురించిగాని, ఆ ఒత్తిడిలో, ఆ ఆందోళనలో మనుషులు ఎలా ప్రవర్తించారన్నదానిమీద గాని కరోనా రోజులు గడిచిన తర్వాత పెద్దగా రచనలు ఏమీ వచ్చినట్టు నేను చూడలేదు. విమర్శనాత్మకంగానో, ఆత్మవిమర్శనాత్మకంగానో, ఆ రోజుల నాటి మన ప్రవర్తన నమోదు కావడం చాలా అవసరమని నేననుకుంటాను. ఎందుకంటే, రేపు మరో అంటువ్యాధినో, లేదా యుద్ధమో, అంతర్యుద్ధమో లేదా ఓ

భూకంపమో సంభవిస్తే నువ్వూ, నీ ఇరుగుపొరుగూ ఒకరితో ఒకరు ఎలా ప్రవర్తిస్తారో తెలియకుండా పోతుంది.

అన్నిటికన్నా ముఖ్యం, కరోనా ఎంత భయాన్ని తీసుకొచ్చిందో, అంతకన్నా ఎక్కువగా దుఃఖాన్ని కూడా పరిచయం చేసింది. ఆ దుఃఖంలో మనకు తెలియని మన ముఖమొకటి కొత్తగా కనిపించడంలోని అపరాధభావం కూడా ఉంది. మంచి రచయితలు చేసే పని అటువంటి ఒక రోజునో, ఒక గంటనో, ఒక మరణాన్నో, ఒక వియోగాన్నో నమూనాగా తీసుకుని, భయస్వరూపాన్ని, దుఃఖస్వరూపాన్ని విశ్లేషించుకోడానికి పూను-కోవడం. చిమమంద గోజి అడిచే రాసిన Notes on Grief (2021) అందువల్లనే నాకు ఒక విలువైన రచన అనిపించింది.

అడిచే, చినువా అచెబె తర్వాత అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన నైజీరియను రచయితల్లో ఒకరు. అమెరికాలో ఉంటుంది. ఆమె రచనల గురించి నేను మొదటిసారిగా సత్యవతిగారి ద్వారా విన్నాను. ఈ చిన్నపుస్తకం, నిజానికి పుస్తకం అని కూడా అనడానికి లేదు, ఇది కథ కాదు, వ్యాసం కాదు, ఒక మెమొయిరు లాంటిది. ఆమె తండ్రి జేమ్స్ నోయె అడిచే స్టాటిస్టిక్సు ప్రొఫెసరు. యూనివెర్సిటీ ఆఫ్ నైజీరియాలో విశ్రాంత ప్రొఫెసరుగా పనిచేస్తుండగా, 2020 లో కరోనా తలెత్తిన మొదటినెలల్లోనే చనిపోయాడు. ఆయన నైజీరియాలో మరణించినప్పుడు రచయిత్రి అమెరికాలో ఉంది. ఆ సంఘటన చుట్టూ ఆమె రాసుకున్న జ్ఞాపకాలు ఈ పుస్తకం. నిజానికి దీన్ని ప్రచురణకర్తలు వ్యాసం అనీ, non-fiction అనీ వ్యవహరించారుగానీ, రచయిత్రి సిద్ధహస్తురాలు కాబట్టి ఈ పుస్తకానికి ఒక సాహిత్యలక్షణం కూడా సమకూరింది.

ఆమె పుస్తకం మొదలుపెడుతూనే మూడో పేజీలో grief is a cruel kind of education అని రాసింది. నిజానికి నేను ఆ వాక్యం దగ్గరే ఆగిపోయాను. కరోనా రోజుల గురించి, కరోనా తర్వాత, సాహిత్యం రాలేదని నేను అనడం వెనక బహుశా నేను మాట్లాడుతున్నది ఈ అంశం గురించే అనుకుంటాను. ఒక విపత్తు, కుటుంబాలకు గానీ, సమాజాలకు గానీ, సంభవించాక, అది నేర్పే పాఠాలు మన జాతిస్మృతిలో, సమాజస్మృతిలో భాగం కావాలి. అంటే విపత్తు విద్యగా మారాలి. ఆ పాఠాలు ఎంత

క్రూరంగానైనా ఉండనివ్వు. కాని ఆ అనుభవాలు పాఠాలుగా మారకపోతే, మళ్ళా అలాంటి పరిస్థితులే సంభవించినప్పుడు, మనుషులు మళ్ళా అంతే క్రూరంగా ప్రవర్తిస్తారు.

కరోనా రోజుల్లో, గడ్డు లాక్‌డౌను కాలంలో కూడా, నేను ఒక్కరోజు కూడా 'వర్క్ ఫ్రమ్ హోమ్' చేసింది లేదు. రోజూ ఆఫీసుకో, లేదా ఏదో ఒక విజిటుకో పోతూనే ఉండేవాణ్ణి. పోక తప్పేది కాదు. లాక్ డౌను సడలించి ఆఫీసుల్లో సిబ్బంది యాభై శాతం చొప్పునో లేదా రకరకాల నిష్పత్తుల్లోనో హాజరు కావాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినప్పటి ఒక జ్ఞాపకం మీతో పంచుకోవాలని ఉంది.

ఆ రోజు నేను పటమటలో ఉన్న కార్యాలయంలో ఉన్నాను. ఇబ్రహీంపట్నంలో మరొక కార్యాలయం ఉండేది. అక్కణ్ణుంచి ఫోను వచ్చింది. ఆఫీసు సిబ్బంది అంతా ఒక్కసారిగా ఆఫీసు వదిలిపెట్టి వెళ్ళిపోయారనీ, తలుపులు వెయ్యడానికి కూడా ఎవరూ లేరనీ. నేను హుటాహుటిన ఆ కార్యాలయానికి వెళ్ళాను. నా ఛాంబరు నాలుగో అంతస్తులో ఉంది. లిఫ్టు ఆపరేటరు కూడా ఆఫీసు వదిలి పెట్టివెళ్ళిపోయాడు. నేను మెట్లెక్కి నాలుగో అంతస్తుకు చేరుకుని నెమ్మదిగా దగ్గరలో ఉండే ఆఫీసు సిబ్బందిని పట్టుకుని విచారిస్తే, తెలిసిందేమంటే, ఆ రోజుల్లో ఢిల్లీలో ఒక మహ్మదీయసమావేశానికి వెళ్ళివచ్చిన ఒకాయనతో మా ఆఫీసు సూపర్నెంటు ఒకాయన చేతులు కలిపి నడుస్తూండటం మా ఆఫీసులో ఎవరో చూసారట. ఆ వార్త తీసుకొచ్చి మా ఆఫీసులో ఎవరికో చెప్పాడు. అంతే, ఆఫీసు సిబ్బంది మొత్తం కకావికలై పారిపోయారు. మైగాడ్! నేను విన్నది నమ్మడానికి నాకు చాలాసేపే పట్టింది. కరోనా వల్ల మనుషుల మతిస్థిమితం అంత తప్పిపోగలదని అప్పటిదాకా నేను ఊహించలేదు.

ఆ కథ అక్కడితో పూర్తవలేదు. మా ఆఫీసు సూపర్నెంటు నాకు ఎక్కణ్ణుంచో ఫోను చేసాడు. తనని ఆఫీసులో ఎవరూ మనిషిగా చూడటం లేదనీ, దగ్గరకు రావడం సరే, ఫోను చేసి మాట్లాడటానికి కూడా భయపడుతున్నారనీ, తనకి అన్నిటికన్నా ముందు ఆ సాంఘిక బహిష్కరణ భరించలేనిదిగా ఉందనీ, తనేం చెయ్యాలో చెప్పమనీ అడిగాడు.

నా ముందు రెండు మార్గాలు కనబడ్డాయి. ఒకటి, అతణ్ణి ఆఫీసుకు రమ్మని, అతడు రాగానే నలుగురూ చూస్తూండగా (అప్పుడు నా దగ్గర కనీసం నలుగురు మనుషులు కూడా లేరు) హగ్ చేసుకోవడం. కానీ అంతకన్నా మంచి ప్రత్యామ్నాయం అతణ్ణి కోవిడు టెస్టు చేయించుకొమ్మని చెప్పడం. అతనికి (సహజంగానే) నెగటివు రిపోర్టు వచ్చింది. అయినా కూడా మనుషులు అతణ్ణి మామూలు మనిషిగా చూడటానికి మరికొన్ని రోజులు పట్టింది.

ఇది నిజంగా ఒక క్రూరమైన అనుభవం. దీన్నుంచి నువ్వు ఏమి పాఠం నేర్చు-కుంటావు? ఏ పాఠాన్ని నీ తర్వాత తరాలకి అందచేయగలుగుతావు?

అడిచే తన తండ్రి గురించి రాసిన దానిలో కరోనాకి సంబంధించింది ఏమీ ప్రధానంగాలేదు. ఆ మరణం సంభవించినప్పుడు తాము లాక్ డౌనులో ఉండటం, ఆ మృతి కరోనా రోజుల్లో జరగడం తప్ప, తక్కిన జ్ఞాపకాలన్నీ ప్రధానంగా ఒక తండ్రి గురించి ఒక కూతురు రాసుకున్న జ్ఞాపకాలే. ఆ దుఃఖం ప్రధానంగా కౌటుంబికం, వైయక్తికం. కానీ, ఆ మెమొయిరు చదువుతున్నంతసేపూ, కరోనా కాలానికి సంబంధించి నమోదు కావలసిన అనుభవాలు, అసంఖ్యాకం, నమోదు కాకపోకుండా ఉండి పోయాయనే నాకనిపించింది.

రచయిత్రి తన పుస్తకంలో చివరివాక్యం ఇలా రాసింది:

> I am writing about my father in the past tense, and I cannot believe I am writing about my father in the past tense.

ఈ వాక్యం చదవగానే బహుశా మనకు కరోనాకాలం ఇంకా గతంగా మారి పోలేదనీ, మన surface memory లో అది కదలాడకపోయినా, ఇంకా అక్కడే ఉందనీ, అది deep memory గా మారితే తప్ప దాని జ్ఞాపకాలు సాహిత్యంగా మారవేమో అనీ అనిపించింది.

3-4-2023

# మెలకువలో కన్న కల

**రాపోలు** సీతారామరాజు నల్గొండ జిల్లాకి చెందిన యువకుడు. చాలామంది తెలుగు వాళ్ళు చాలా దేశాల్లో ఉద్యోగం చేస్తున్నట్టే ఈయన కూడా చాలాకాలంగా దక్షిణాఫ్రికాలో జొహాన్నెసు బర్గులో పనిచేస్తున్నాడు. కాని ఎన్నో దేశాల్లో నివసిస్తున్న ఎందరో తెలుగు వాళ్ళు ఆ దేశాల్లో పుట్టి పెరిగి మానవాళికి మహోపకారం చేసిన మహనీయులెవరి గురించీ పుస్తకాలు రాసినట్టు నేను వినలేదు. ఉదాహరణకి, అమెరికాలో ఎంతమంది తెలుగువాళ్ళు లేరు! కాని ఒక్కరేనా అబ్రహాం లింకను గురించో లేదా ఫ్రెడరిక్ డగ్లసు గురించో ఒక్క పుస్తకమేనా రాసారా? అలానే ఇంగ్లండులో ఉన్నవాళ్ళు షేక్స్పియరు గురించో, జర్మనీలో ఉన్నవాళ్ళు హెగెలు గురించో, మార్క్సు గురించో ఒక పుస్తకమేదన్నా రాసినట్టు మీరు చూసారా?

కాని సీతారామరాజు దక్షిణాఫ్రికాలో ఉన్నందుకు, టంకసాల అశోక్ గారు చెప్పినట్టుగా 'ముందు ఆఫ్రికాతో ప్రేమలో పడ్డాడు.' ఆ తర్వాత మండేలాతో ప్రేమతో పడ్డాడు. ఆ అభిమానం ఆరాధనగా మారి అక్కడితో ఆగిపోక, ఇప్పుడు 'స్వేచ్ఛ కోసం సుదీర్ఘ ప్రయాణం, నెల్సన్ మండేలా' (2024) పేరిట అద్భుతమైన పుస్తకాన్ని తీసుకొచ్చే లాగా చేసింది.

వారం పదిరోజుల కిందట సీతారామరాజు మా ఇంటికొచ్చాడు. ఆయన ఆ రోజు తన పుస్తకం గురించి చెప్తూ, అంతకన్నా కూడా ముఖ్యంగా, తాను ఉన్నంతసేపూ, మండేలా జీవితం గురించే మాట్లాడుతూ ఉన్నాడు. తన మాటల్లో మండేలా జీవితంలోని కొన్ని ఘట్టాల్ని అతడు తలుచుకుంటూ ఉన్నప్పుడు, ఉదాహరణకి, దక్షిణాఫ్రికా జైళ్ళల్లో ఖైదీలు తమ మలమూత్రాల కోసం ఇచ్చిన కుండను తామే పొద్దున్న ఎత్తిపోసుకోవలసి ఉంటుందని చెప్తూ, మండేలా సహచర ఖైదీకి అస్వస్థతగా ఉన్నప్పుడు, అతడు కూడా మండేలాని నిర్బంధించిన జైల్లోనే పై అంతస్తులో ఉన్నప్పుడు, మండేలా ఆ మెట్లన్నీ ఎక్కి, అతడి దగ్గరికి వెళ్ళి అతడి మలమూత్రాల పాత్ర కూడా తానే మోసుకొచ్చి శుభ్రం చేసాడని చెప్తున్నప్పుడు, ఆ యువకుడి కళ్ళల్లో ఒక నిర్మలకాంతి కనిపించింది. నా చుట్టూ ఉన్న మనుషుల్లో, తెల్లవారి లేస్తే నేను చూడకతప్పని మీడియాలో, సోషలు మీడియాలో ఇటువంటి ఒక సంఘటనని ఇంత పునీత నేత్రాల్తో స్మరించుకునే మనుషులింకా ఎవరైనా ఉన్నారా అని ఆలోచనలో పడ్డాను.

అతడు అక్కడితో ఆగలేదు. దేశానికి స్వతంత్రం లభించి, జాతీయప్రభుత్వం ఏర్పడి మండేలా దేశాధ్యక్షుడయ్యాక, వర్ణవివక్షని మించిన మరొక మహోపద్రవం ఎయిడ్సు రూపంలో తన ప్రజల్ని చుట్టుముట్టిందని తెలిసినప్పుడు, దాని గురించి బహిరంగంగా మాట్లాడటమే ఒక టాబూగా మారినప్పుడు, మండేలా, స్వయంగా తన కొడుకే ఎయిడ్సు బారిన పడి మరణించాడని సమస్త ప్రపంచం వినేట్టుగా చెప్పి మరీ ఆ నిశ్శబ్దాన్ని భగ్నం చేసాడని కూడా చెప్పుకొచ్చాడు.

ఇటువంటి పని ప్రపంచ చరిత్రలో మరొకరెవరు చెయ్యగలరు? మహాత్మాగాంధీ తప్ప. కానీ ఇప్పుడీ దేశంలో గాంధీ గురించి మాట్లాడటమే ఒక టాబూ. ఆయన పేరు ఎత్తడానికే మనుషులు అసహ్యానికో, భయానికో, తెలియని ద్వేషానికో లోనవుతున్న కలికాలంలో, ఒక యువకుడు తాను నివసిస్తున్న దేశంలో గాంధీని పోలిన మరొక మనిషి గురించి తెలుసుకుని, తన హృదయంలో అతడికి చోటిచ్చి, ఇదుగో, ఇంతదూరం మా ఇంటికొచ్చి మరీ, నాతో ఆ విషయాలు మననం చేసుకుంటున్నందుకు, నేనతడికి ప్రత్యుపకారంగా ఏమి చేయగలుగుతాను?

అందుకనే, నిన్న రవీంద్రభారతిలో, అతడి పుస్తకం 'నెల్సన్ మండేలా' ఆవిష్కరణ సందర్భంగా నేను కూడా పోయి నలుగురిముందూ హృదయపూర్వకంగా అతణ్ణి మరొక్క మారు అభినందించకుండా ఉండలేకపోయాను.

నెల్సన్ మండేలా పుస్తకాన్ని అనువాదంగా రాజు పేర్కోడం అతడి నిజాయితీ తప్ప మరేమీ కాదు. కాని దాన్ని మనం పూర్తిగా అతడి స్వీయరచనగా చెప్పుకోవచ్చు. ఎందుకంటే, మండేలా గురించి ఎవరు రాసినా మండేలా తన గురించి తాను రాసుకున్న దానికన్నా అదనంగా మరేమీ రాయలేరు, చెప్పలేరు. కాని మండేలా ముఖ్యమైన రచనలు Long Walk to Freedom (1994), Conversations with Myself (2011) లోంచి పాఠకులకు ఎంత అవసరమో అంత మాత్రమే ఎంచి, ఆయన చెప్పినదాన్ని సంక్షిప్తీకరించి తిరిగి చిన్న చిన్న తెలుగు వాక్యాల్లో చెప్పడం చిన్నపాటి పని కాదు. ఈ పునఃకథనానికి గొప్ప ఎడిటింగు నైపుణ్యం కావాలి. మూలంలో ఎంత ఉత్తేజముందో, ఎంత భావతీవ్రత ఉందో అదెక్కడా నష్టపోకుండా చూసుకోగలిగే ఔదార్యం కావాలి. ఈ నైపుణ్యాలు రాజులో పుష్కళంగా ఉన్నాయని ఈ పుస్తకం మనకు ఋజువు చేస్తుంది. కాబట్టే, దీన్ని రాజు తన స్వీయరచనగా పేర్కొన్నా నేనైతే అభ్యంతరం చెప్పి ఉండేవాణ్ణి కాను.

నన్ను ముగ్ధుణ్ణి చేసినవి, మిమ్మల్ని కూడా ముగ్ధుల్ని చేయబోయేవి మూడు విషయాలున్నాయి. మొదటిది, ఆ పుస్తకం ముద్రణలోని శ్రేష్ఠత. అంతర్జాతీయస్థాయి ప్రచురణకర్తలు ముద్రిస్తున్నప్పటికీ డా.కలాం పుస్తకాలు కూడా అంత నాణ్యంగా వెలువడ్డాయని చెప్పలేను. ఈ పుస్తకం మన చేతుల్లోకి రావడమే ఒక కానుక అన్నట్టుగా ఉంది. రెండోది, ఆ పుస్తకంలోని పాఠ్యశీలత. నేను చేతుల్లోకి తీసుకున్న రెండున్నర గంటల్లో 350 పేజీల పుస్తకం చదవడం పూర్తిచేసేసానంటే అర్థం చేసుకోండి. ఎక్కడా ఆగనివ్వదు. నిజానికి ఆ పుస్తకం మన చేతుల్లో ఉన్నంతసేపూ ఒక విద్యుచ్ఛక్తి మనలోకి ప్రవహిస్తూనే ఉంటుందని చెప్పగలను. ఇక మూడవది, ఆ శైలి, ఆ భాష, ఆ ఔచిత్యం. మొదట నాలుగైదు పేజీలు చదవగానే, సీతారామరాజు పక్కకు తప్పుకుని నేరుగా మండేలానే మనముందు ప్రత్యక్షమవుతాడు. ఇక ఆ తరువాత మనం వినేదంతా మండేలా ముఖతః వింటున్నట్టే వినబడుతుంది.

మండేలా విధానాల మీద దక్షిణాఫ్రికా మొత్తం ఏకగ్రీవం కాదనీ, ఆయన మీద విమర్శలున్నాయనీ, ఆయన తెల్లవారితో రాజీపడ్డాడనీ కొంతమంది అంటూ ఉండటం నేను వినకపోలేదు. కానీ ఈ పుస్తకం చదివాక, మండేలా మధ్యాహ్నసూర్యుడిలాగా పరిపూర్ణంగా ప్రకాశిస్తో నాకు కనబడ్డాడు. మనకి జీవితంలో, సమాజంలో, రాజకీయాల్లో లెవెలు–4 లీడర్లు చాలు. అంటే ఎంతసేపూ తమని తామే పైకెత్తి చూపుకుంటూ ఎదుటి మనిషినో, వర్గాన్నో, వర్ణాన్నో, ప్రాంతాన్నో, దేశాన్నో ద్వేషించడం నేర్పుతూ, ఆ ద్వేషమే తమ ప్రభావశీలత్వానికి పెట్టుబడిగా జీవించే నాయకులు మనల్ని ఆకర్షించి నట్టుగా, గాంధీ, కలాం, మండేలా లాంటి లెవెలు–5 నాయకులు మనల్ని ఆకర్షించరు.

లెవెలు–5 నాయకుడు అన్నిటికన్నా ముందు ఆత్మజేత. జీవించినంతకాలం తనలోని అంతశ్శత్రువు పట్ల అతడు సదా జాగరూకుడిగా ఉంటాడు. తనలోని శత్రువుని ఏ మేరకు అతడు అణచివేస్తూ పోగలడో ఆ మేరకు తన బాహ్యశత్రువుని జయించడమే కాదు, క్షమిస్తాడు కూడా. ఈ క్షమాగుణం మనకి అర్థం కాదు. కుల, వర్ణ, జాతి విద్వేషాలు నెలకొన్న వైరి వర్గాల్లో ఒకరు మరొకర్ని ఎప్పుడు, ఎప్పటికి పూర్తిగా నిర్మూలిస్తారు, ఆ శుభ ముహూర్తమెప్పుడు అన్న ఆతృతలోనే మన జీవితం గడిచి పోతుంది. కాని చరిత్ర చెప్తున్నది మరోలా ఉంది:

ఇలా ఒక పీడక–పీడిత వైరివర్గంలో పీడితులు పీడకుల్ని భౌతికంగా నిర్మూలించేక, ఆ చిట్టచివరి జార్ కూడా మరణించేక, అప్పుడు ఆ మొదటి బోల్షివిక్కు తనే ఒక జార్‌గా మారతాడని. నువ్వు నీలో ఉన్న జార్‌ని నిర్మూలించనంతవరకూ బయట జార్‌లని ఎంతమందిని నువ్వు వధించినా లాభం లేదు. లేదని ఇదుగో రష్యా–యుక్రెయిను యుద్ధమే చెప్తోంది. (నిజానికి ఈ వైరివర్గంలో ఇద్దరూ జార్‌లే కావడం మరొక విషాద వికారం.)

కాని మండేలా ఆ ప్రమాదం నుంచి తాను బయటపడటమే కాదు, తన జాతిని కూడా బయటపడేసాడు. ఎందుకంటే, ఏళ్ళ తరబడి వర్ణవివక్షకు గురయిన తరువాత, మానసికంగా తనలోని ఆఫ్రికను స్థానంలో ఒక శ్వేతజాతీయుడు తలెత్తడంలో ఆశ్చర్యం లేదని ఆయనకు తెలుసు.

ఈ వాక్యాలు చూడండి. తమ పోరాటానికి సోదర ఆఫ్రికా దేశాల మద్దతు కూడగట్టు కోడానికి అతడు ఘనానుంచి అడిస్ అబాబా వెళ్ళే విమానం ఎక్కినప్పుడు ఇలా రాసుకున్నాడు:

> అక్కడ నుండి అడిస్ అబాబా విమానం ఎక్కాను. ఆ ప్రయాణంలో ఓ వింత అనుభవం ఎదురైంది. పైలట్ ఒక నల్లజాతి వ్యక్తి. ఇంతకుముందెన్నడూ ఒక నల్లజాతి పైలట్‌ని చూసి ఎరుగను. ఒక నల్లజాతి వ్యక్తి పైలట్ అవ్వడమేంటన్న ప్రశ్న మనసును తొలిచి, భయమేసింది. వర్ణవివక్షాలోకంలో బతికిన నాకు తెలియకుండానే బానిస మనస్తత్వం ఏర్పడిందని అర్థమయ్యింది. (పే. 173)

ఇక్కడ మన దేశంలో వివిధరకాల వివక్షల్ని ధిక్కరిస్తూ పోరాటాలు చేసేవారు ముందు ఇటువంటి వాక్యాల్ని గమనించాలి. 27 ఏళ్ళ పాటు లేదా పదివేలరోజుల పాటు కఠినకారాగారశిక్ష అనుభవించినందువల్ల మండేలా పట్ల నాకు కలిగిన గౌరవం కన్నా, ఇదుగో, తనను తాను సూక్ష్మంగా పరిశీలించుకున్న ఇటువంటి క్షణాలలో మండేలా పట్ల నా గౌరవం రెట్టింపయ్యింది.

నిజమే, ఇందులో కూడా శాంతియుత సత్యాగ్రహాల ఘట్టాలు, ఆత్మత్యాగాలు, నిజాయితీతో కూడిన ప్రవర్తన తన శత్రువుల్లో కూడా తీసుకురాగల పరివర్తన కనిపిస్తుంది, గాంధీ జీవితంలో కనిపించిన సంఘటనలే, ఇక్కడ కూడా కనిపించడంలో ఆశ్చర్యం లేదు. ఈ వాక్యాలు చూడండి. 1962 లో మండేలా మీద మోపిన దేశద్రోహం కేసి విచారణ ముగింపుకి వచ్చిన సందర్భంలో, మండేలా ఇలా రాస్తున్నాడు:

> వాదప్రతివాదాలలో నా వంతు వచ్చినప్పుడు నేనెవరిని సాక్షులుగా విచారించడం లేదని, నా వాదనను ఇంతటితో ముగిస్తున్నానని ప్రకటించాను. నిర్ఘాంతపోయిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ 'దేవుడా' అనడం నాకు వినిపించింది... కోర్టు మరుసటి రోజుకు వాయిదా పడింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నా దగ్గరికి వచ్చి మండేలా, నా వృత్తిజీవితంలో మొదటిసారి రేపు నాకు కోర్టుకు రావాలని

పించడం లేదు. నిన్ను శిక్షించాలని న్యాయమూర్తిని కోరలేకపోతున్నాను అంటూ నా చేతిని తన చేతిలోకి తీసుకుంటూ నీకంతా మంచే జరగాలని కోరుకుంటున్నానన్నాడు. (పే. 193-194)

మరొక సంఘటన గురించి చెప్తున్నప్పుడు ఇలా రాసుకున్నాడు:

నిజానికి ఒకరిని దూషించడం నా స్వభావానికి విరుద్ధం. కాని ఆ రోజు నన్ను నేను ఆపుకోలేకపోయాను. నీలాంటి వ్యక్తిత్వంలేని మనిషితో మాటల–నవసరం, ఇంకోసారి అలాంటి భాష పునరావృతమైతే పరిణామాలు వేరేలా ఉంటాయని తీవ్రస్వరంతో హెచ్చరించి విసురుగా బయటికొచ్చాను. నా మాటలతో ఆ అధికారి నోరు మూయించినా స్వీయనియంత్రణ కోల్పోడమనేది ప్రత్యర్థి చేతిలో నేను ఓడిపోయినట్లేనని భావిస్తాను.

మండేలాని ఎందుకు నాయకుడు అంటానంటే ఇందుకు. ఆయనకి సత్యాగ్రహం గాని, సాయుధపోరాటంగాని, యుద్ధంగాని, చర్చలుగాని ఏవైనా రెండోస్థాయి అంశాలే. ఆయనకి ప్రధానం తన జాతీయ సమగ్రత. తన మనుషులు స్వతంత్రపౌరులుగా జీవించే క్షణాన్ని తాను కళ్ళారా చూడాలనుకున్నాడు. తక్కినవన్నీ దానికి సాధనాలే తప్ప అవే అంతిమ లక్ష్యాలు కావు. ప్రజల్ని నిజంగా ప్రేమించినవాడు వ్యూహకర్త అయితే ఇలా ఉంటాడు. అటువంటివాడు మాత్రమే, తన సహచరులు చెరసాలలో మగ్గుతున్నప్పటికీ తాను ఒక్కడే శత్రువుతో చర్చలకు సాహసిస్తాడు. కాబట్టే ఇలా రాసుకోగలిగాడు:

నేను నా మిత్రులం ఒకే జైలులో ఒకే భవంతిలో ఉన్నా వాళ్ళని కలవాలంటే ఒక దరఖాస్తు పెట్టుకోవాలి. ఆ అభ్యర్థన ప్రిటోరియాలో ఉన్న జైళ్ళ ప్రధాన కార్యాలయానికి వెళుతుంది. అక్కడ అనుమతి మంజూరు చేస్తే ఇక్కడ మేము కలుసుకోడానికి ఏర్పాట్లు చేస్తారు. అందుకు వారాలు పట్టొచ్చు. అలా కొన్ని రోజుల తర్వాత మేం కలుసుకున్నాం. నేనెవరికీ చెప్పకుండా గోప్యంగా ప్రయత్నిద్దామని అనుకున్నాను కనుక, నైతికంగా తప్పని తెల్సినా చర్చల

విషయం వాళ్ళతో మాట్లాడలేదు. తెలిసి కూడా చెబితే ఆదిలోనే వాళ్ళు నా ఉత్సాహాన్ని నీరుగారుస్తారని నా భయం. ఆత్మవిశ్వాసమున్న నాయకుడు అనుకున్న ఫలితాలను సాధించడానికి సమూహానికి భిన్నంగా ఒక్కోసారి అపసవ్యదిశలో నడవాల్సి ఉంటుంది. (పే. 273-74)

ఎందుకంటే ఒక జాతి విముక్తి చెందే క్రమంలో ఇదొక్కటే దారి అని ఏ మార్గం గురించీ నిశ్చయంగా చెప్పలేం. ఈ పుస్తకంలోనే మండేలాతో అల్జీరియా విప్లవ నాయకుడు చెప్పినట్టుగా (పే. 176) కొన్నిసార్లు 'జెట్ యుద్ధ విమానాల సముదాయం కంటే కూడా అంతర్జాతీయ ప్రజాభిప్రాయం ఎక్కువ విలువైందిగా' కనిపిస్తుంది.

తీరుబడిగా కూచుని ఒకరినొకరం త్వరత్వరగా ముక్కలు చేసుకుంటున్న మన సమాజంలో, మనం మండేలా చరిత్ర చదువుతున్నప్పుడు, ఆ నాయకుడూ, అతని వ్యూహాలూ మనమూహించినంత రొమాంటిక్ గా లేవని బాధపడటంలో అర్థం లేదు. ఎందుకంటే తన దేశం గురించి, తన జాతి గురించి మనకన్నా కూడా మండేలాకి ఎక్కువ తెలుసు. ఈ వాక్యాలు చూడండి:

చాలామంది ప్రజలు ఆఫ్రికన్ సమాజంలోని సోదరభావం, సమానత్వ స్వభావం గురించి గొప్పగా ఒక ఆదర్శవంతమైన చిత్రాన్ని చిత్రిస్తుంటారు. ఆ చిత్తరువును నేనూ అంగీకరిస్తుంటాను. కానీ వాస్తవానికి అంత సమానత్వం ఆఫ్రికన్ సమాజంలోనూ ఉండదు. ఒకరినొకరు సమానంగా చూసే భావన కనిపించదు. ..(పే. 164)

ఒక చిన్న స్థానిక తెగకు చెందిన ఒక యువకుడు విశ్వమానవుడిగా మారిన కథ ఇది. ఇలాంటి పుస్తకాలు ఎందుకు చదవాలంటే, కనీసం ఇది చదివినంతసేపేనా మనం మన పరిమితకక్ష్య నుంచి బయటపడగలుగుతాం. అలాకాక, మనం మన fragmented identities తోనే ఆ జీవితాన్ని అంచనా వెయ్యడానికి పూనుకుంటే, నష్టపోయేది మనమే.

ఈ సూక్ష్మ రాజకీయ విశ్లేషణల జోలికి పోకుండా కూడా ఒక మెట్రిక్యులేటు, ఒక గృహిణి, ఒక ఆటో డ్రైవరు, ఒక లారీ క్లీనరు కూడా ఈ పుస్తకంలో ప్రయాణించి తమ జీవితాల్లో వెలుగు నింపగల గొప్ప స్ఫూర్తిని మూటగట్టుకోగలరు. ఎందుకంటే ఇందులో కనిపించే మనిషి ఒక తండ్రి, ఒక కొడుకు, ఒక భర్త, ఒక తాత, ఒక అనుచరుడు, ఒక నాయకుడు, ఒక ఖైదీ, ఒక దేశాధ్యక్షుడు కూడా. ఈ పుస్తకానికి మూలమైన తన ఆత్మకథ గురించి మండేలా ఇలా రాసుకున్నాడు:

> ఆ రాత్రుళ్ళు నిశ్శబ్ద వాతావరణంలో సెల్ లో నేనొక్కడినే రాసుకుంటున్నప్పుడు నా బాల్యం, యవ్వనం, నేను తిరిగిన ప్రదేశాలు, నేను పెరిగిన విధానం, కలుసుకున్న మనుషులు మొత్తం నా పూర్తిగా నా జీవితాన్నే సింహావలోకనం చేసినట్లయింది. అదంతా మెలకువలో కన్న కలలా కనిపించింది. దాన్ని వీలైనంత సరళంగా, నిజాయితీగా కాగితం మీదకి తర్జుమా చేయడానికి ప్రయత్నించాను. (పే. 251)

మెలకువలో కన్న కల! మండేలా జీవితానికి ఇంతకన్నా సముచితమైన పదం మరొకటి కనిపించదు. మన నాయకత్వాలూ, మన పోరాటాలూ కలతనిద్రలో కనే కలలు. కాని మండేలా పూర్తి జాగరూకతతో ఒక కలగన్నాడు. కలగన్నాడు అనడం కూడా సరైన క్రియాపదం కాదు. పూర్తి మెలకువలో అతడు తన కలని తాను ఎప్పటకప్పుడు స్పష్టపరుచుకుంటూ వచ్చాడు. కాబట్టే అది మనం చెప్పుకునే సిద్ధాంతాల ప్రకారం, మనం రాసుకునే వ్యూహాల ప్రకారం నడిచినట్టు కనిపించదు. కాని అంతిమంగా ఆ కలనిజం కావడం అతడు చూసాడు, అతడి జాతి చూసింది, మొత్తం ప్రపంచం చూసింది.

8-1-2025

# బహురూపుల వాడు

**హైన్రిష్ ష్లీమన్** (1822-1890) ఒక్క జీవితకాలంలో అనేక అవతారాలెత్తాడు. మృత్యువు అంచులదాకా ఎన్నోసార్లు ప్రయాణించాడు. అలా వెళ్ళి వచ్చిన ప్రతిసారీ తన జీవితంలో మున్నెన్నడూ అధిరోహించని కొత్త శిఖరాలకు చేరుకుంటూనే ఉన్నాడు.

పుట్టింది పోలాండు సరిహద్దుల్లోని ఒక జర్మను కుగ్రామంలో. పెరిగింది రష్యాలో. దుర్భరమైన దారిద్ర్యాన్ని చవిచూసాడు. కాని కోట్లకు పడగలెత్తే వ్యాపారాలు చేసాడు. దాదాపుగా ప్రపంచమంతా పర్యటించాడు. ఇండియా, చైనా, జపానులతో పాటు అమెరికా కూడా చూసాడు. కాలిఫోర్నియా గోల్డురష్షులో తాను కూడా పాలుపంచుకున్నాడు. ప్రపంచమంతా ఒక వ్యాపారసామ్రాజ్యాన్ని నిర్మించుకున్నాడు. అహంభావి, పెత్తందారు, అబద్ధాలకు తక్కువేమీ లేదు. కానీ ఈ రోజు ప్రపంచం తన గురించి గౌరవంతో తలుచుకునే లాంటి విజయాలు కూడా సాధించి తన వారసత్వంగా వదిలిపెట్టి వెళ్ళాడు. వాటన్నిటిలోనూ తలమానికం అని చెప్పదగ్గది హోమరు రాసిన ఇతిహాసాల్లో వర్ణించిన ట్రాయి నగరం ఆనవాళ్ళు వెతకడానికి చేసిన ప్రయత్నం.

కేవలం కవి కల్పన మాత్రమే అనుకున్న ఒక నగరాన్ని ఒక చారిత్రిక యథార్థంగా నమ్మి దాని ఉనికిని వెలికితియ్యడానికి అతడు చేసిన ప్రయత్నం అతణ్ణి తదనంతర కాలంలో మరెందరో పురాతత్త్వవేత్తలకి స్ఫూర్తిగా నిలబడింది. అది ఎల్లల్లేని స్ఫూర్తి. 1920 ప్రాంతాల్లో భారతదేశంలో అప్పటి బ్రిటిషు ఆర్కియాలజిస్టులు సింధునాగరరిక అవశేషాల్ని తవ్వితీయడానికి హరప్పా, మొహెంజొదారోల్లో తవ్వకాలు చేపట్టడం వెనక, రామాయణంలోని లంక గురించి సంకాలియా మధ్యభారతదేశంలో అన్వేషణ చేపట్టడం వెనక ష్లీమను కూడా ఉన్నాడని చెప్పవచ్చు.

అటువంటి జీవితం గురించి తెలుగు పాఠకులు తెలుగులో చదివే అవకాశం రాగలదని నేనే కాదు, నిన్న ఆ పుస్తక ఆవిష్కరణ సభలో మాట్లాడిన మిత్రులు కూడా అనుకోలేదు. కాని కల్లూరి భాస్కరంగారి ఇటీవలి పుస్తకం 'బహురూపుల వాడు' (అస్త్ర, 2024) ష్లీమను జీవితం, అతడి వ్యక్తిత్వం, అతడు చేసిన సాహసప్రయత్నాల సమాహారం.

నిన్న సోమాజిగూడ ప్రెస్సు క్లబ్బులో ఆ పుస్తకాన్ని నలుగురికీ చూపించే అవకాశం నాకు లభించింది. ఆ పుస్తకం గురించి డా. గోవిందరాజు చక్రధర్, డా.విరించి విరివింటి, డా.బుసుసు శ్రీనివాసులు ప్రసంగించారు. తాడి ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన ఆ సమావేశంలో ఆ పుస్తకం గురించి నా అభిప్రాయాలు పంచుకునే అవకాశం కూడా నాకు లభించింది.

ఎక్కడో గ్రీసులో ఎప్పటిదో ఒక పౌరాణిక-చారిత్రిక నగరం ట్రాయి గురించి ఒక జర్మను-అమెరికను పరిశోధకుడు చేసిన అన్వేషణ గురించి ఇప్పుడు, 2025 లో తెలుగువారికి తెలియచెప్పవలసిన అవసరం ఎందుక్కలిగింది?

దీనికి జవాబుగా భాస్కరంగారు పుస్తకం మొదట్లోనే 'ష్లీమన్ గురించి ఎందుకు చదవాలంటారా?' అని ఒక ముందుమాట రాసారు. అందులో ఆయన రెండు కారణాలు చెప్పారు. ఒకటి, అత్యంత ఆకర్షణీయమైన ఆ వ్యక్తిత్వం. పరస్పర వైరుధ్యాలతో నిండి ఉన్న ఆ జీవితకథలో ఊహించలేని మలుపులున్నాయి. భాస్కరంగారు ఆ కథ చెప్పిన పద్ధతిలో మనల్ని నిలవనివ్వని ఉత్కంఠ దానికి జోడయ్యింది. రెండో కారణం, ష్లీమను

గొప్ప భాషావేత్త కావడం. ముఖ్యంగా మన సంస్కృత పండితుల్లాంటి భాషావేత్త కావడం, ఆయన జీవితకాలం ఆరాధించిన హెూమరుకీ, మన వ్యాసుడికీ మధ్య ఎన్నో పోలిక–లుండటం అని చెప్పుకున్నారు భాస్కరంగారు.

అయితే ఈ రెండింటికన్నా కూడా ముఖ్యమైన కారణం ఒకటుంది. దానివల్లనే భాస్కరంగారు 'మంత్రకవాటం తెరిస్తే మహాభారతం మన చరిత్రే' (2022) అనే ఉద్గ్రంథం రాసారు. ఇటీవలికాలంలో 'ఇవీ మన మూలాలు' (2023) అనే గ్రంథం వెలువరించారు. ఇప్పుడు రామాయణం మీద విస్తృత అధ్యయనం చేపట్టారు. గత పదేండ్లుగా ఆయన చేపడుతూ వస్తున్న ఈ అధ్యయనాల వెనక ఒక తపన ఉంది.

గత పదిపదిహేనేళ్ళుగా, ముఖ్యంగా, 2010 తర్వాత, భారతదేశంలో సోషలు మీడియా వ్యాప్తి చెందాక, భారతదేశ గతం గురించీ, చరిత్ర గురించీ నలుగురూ మాట్లాడుకోవడం మొదలయ్యాక, నెమ్మదిగా రెండుశిబిరాలు రూపొందుతుండటం మనం చూస్తున్నాం.

ఒక శిబిరంవారి దృష్టిలో గతంలో భారతదేశంలో అత్యున్నత సంస్కృతి, నాగరికతలు వర్ధిల్లడమే కాదు, ఇక్కణ్ణుంచే సమస్త ప్రపంచానికి అవి వ్యాపించాయి. రాకెట్లు, విమానాలు, అస్త్రాలు మొదలుకుని పురాణాల్లో వర్ణించిన సైన్సుని తక్కినదేశాలు భారత దేశం నుంచి కొల్లగొట్టుకుని తమవిగా చెప్పుకుంటూ ఉన్నాయి.

ఇవన్నీ భారతదేశంలోనే పుట్టాయి. ఆర్యులు బయటి నుంచి రాలేదు, భారతదేశం నుంచే ప్రపంచదేశాలకు పయనించారు, సంస్కృతం అన్ని భాషల్లోనూ గొప్పది, అది దేవభాష– ఇటువంటి వాదనలన్నమాట. భారతదేశంలో వర్ధిల్లిన ఆర్యసంస్కృతి, వేదాలు, పురాణాలు ప్రశ్నించడానికి వీల్లేనంత పరిశుద్ధ పరిజ్ఞానం. వాటిని చారిత్రిక దృష్టిలో పరిశీలించాలని చెప్పడం పాశ్చాత్యదేశాలు భారత్ పురోగమనాన్ని అడ్డుకోడానికి చేస్తున్న రాజకీయ కుట్ర– ఇలా నడుస్తుంది ఆ శిబిరం వారి ఆలోచనలూ, వాదనలూను.

ఈ ఆలోచనలు రాజకీయంగా 'హిందుత్వ' భావజాలంగా ఘనీభవించడం కూడా మనం చూస్తున్నాం.

మరొకవైపు ఈ భావజాలాన్ని ఖండించే వాదనలు కూడా మనం గమనిస్తున్నాం. కానీ చాలా సార్లు ఈ ఖండనచేసేవాళ్ళ అధ్యయనానికి ఉన్న పరిమితులవల్లా, వాళ్ళ సిద్ధాంతాలకు ఉన్న పరిమితుల వల్లా, వారు మొదటిశిబిరంవారి వాదనల్ని ఖండిస్తున్న-ప్పటికీ, ఆ ఖండనకి తగినంత బలం చాలడంలేదనేది నాలాంటి వాళ్ళు గమనిస్తున్న విషయం. మొదటి శిబిరం వారికి స్పష్టంగా ఒక ఎజెండా ఉంది, ఒక రాజకీయ ప్రయోజనం ఉంది. వాళ్లది గోబెల్సు తరహా ప్రచారం. దాన్ని ఖండించడానికి కేవలం ఒక ఎజెండానో, ఒక రాజకీయ ప్రయోజనమో ఉంటే సరిపోదు. సత్యం కోసం నిలబడి, అవసరమైతే ఒంటరిగానైనా, పోరాటం చేయగల ఆత్మస్థైర్యం కావాలి, నిర్విరామమైన కృషి కావాలి. అన్నిటికన్నా ముందు చేయవలసింది భారతీయ సమాజానికి మూలకందాలుగా ఉన్న మూలగ్రంథాలను చదవడం, అధ్యయనం చేయడం, వాటిని ప్రపంచవ్యాప్తంగా వికసించిన వివిధ సామాజికశాస్త్రాల నేపథ్యంలో తులనాత్మక అధ్యయనం చేయడం.

ఒక ఉదాహరణ చెప్తాను. రాముడు పధ్నాలుగువేల ఏళ్ళు పరిపాలన చేసేడని నమ్మే వారొక శిబిరంగానూ, అసలు రాముడనే వాడే లేడనేవారు మరొక శిబిరంగానూ వాదించుకుంటున్న కాలంలో రాముడనే ఒక ఊహ, ఒక భావన, ఒక నామం, ఒక ఆకృతి, ఒక గాథ– నెమ్మదిగా ఒక ఉపఖండం మొత్తాన్ని ప్రభావితం చేసే స్థితికి ఎలా చేరుకున్నాయి, వాటి మూలాలు ఎక్కడున్నాయి, వాటి ప్రభావాలు ఎంతదాకా ఉన్నాయి అని అన్వేషించడం సముచితమైన పద్ధతి. రాముడు లేడని వాదించినంత మాత్రాన భారతీయసమాజం మీద రాముడు నెరిపిన ప్రభావం అదృశ్యమైపోదు. లేదా రాముడు దేవుడని వాదించినంత మాత్రాన, ఈ దేశంలో కొన్ని వర్గాలు తమ ప్రయోజనాలు కాపాడుకోడం కోసం ఆ దేవుణ్ణి ఏ విధంగా చేజిక్కించుకున్నాయో, తద్వారా తక్కిన బలహీనవర్గాల మీద ఏ విధంగా అధిపత్యం నెరిపాయో ఆ వాస్తవాలూ అదృశ్యమైపోవు. ఇప్పుడు కావలసింది, ఈ రెండు శిబిరాలతో సంబంధం లేకుండా, అసలు సత్యమేదో తెలుసుకోవాలన్న తపన, అన్వేషణ, అకుంఠిత కృషీ మాత్రమే.

భాస్కరం గారు చేస్తున్నది సరిగ్గా ఈ పనే.

భారతదేశ ప్రాచీనచరిత్రను exclusivist ధోరణిలోనూ, isolationist ధోరణిలోనూ చదివి (చాలాసార్లు చదవకుండానూ) ఊహాజనితమైన కట్టుకథలను ప్రచారం చేసేవారికి ఎవరేనా చెప్పగల సమాధానం 'వాస్తవాలు, మరిన్ని వాస్తవాలు' అని మాత్రమే భాస్కరం గారు నమ్ముతారు. కాబట్టే ఆయన ఇండాలజి, ఆర్కియాలజి, ఆంత్రొపాలజి, ఫిలాలజి, మైథాలజి, కంపేరిటివు రిలీజియను, తులనాత్మక సాహిత్యంతో సహా చివరికి జెనెటిక్సు దాకా కూడా వివిధ రంగాల్లో అధ్యయనం చేసిన గొప్ప పండితుల రచనల్ని నిరంతరం అధ్యయనం చేస్తూ, ఆ వెలుగులో, భారతీయ గ్రంథాల్నీ, చరిత్రనీ ఎప్పటికప్పుడు పునఃపరిశీలిస్తూ ఉన్నారు.

ఇటువంటి కృషి చేపడుతున్నవాళ్ళు మరికొందరు ఉండవచ్చుగాని, వీళ్ళల్లో భాస్కరం గారు చేస్తున్న కృషిని నేను దగ్గరగా చూస్తున్నాను. ఆయన కూడా తాను కొత్త పుస్తకం వెలువరిస్తున్న ప్రతి సారీ, నన్ను కూడా ఆ వేడుకలో భాగస్వామిని చేస్తూనే ఉన్నారు. అలాగని నేను ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలన్నిటికీ మద్దతుదారునని కాదు. కాని అసలు ముందు అలాంటి ఒక వివేచన చెయ్యగల ఆ scientific method కి నేను అభిమానినని చెప్పుకోగలను.

ఇప్పుడు ఈ పుస్తకమే చూడండి. ఇది ష్లీమను అనే ఒక వ్యాపారవేత్త జీవితకథగా నన్ను ఆకర్షించలేదు. ష్లీమను అనే ఒక gold digger కథగా కూడా నన్ను ఆకర్షించ లేదు. అన్నిటికన్నా ముందు ఇది ఒక బహుభాషావేత్త కథ. కేవలం భాషాపరిజ్ఞానంతో, ఆ పరిజ్ఞానానికి పదును పెట్టుకుంటూ ఒక బీద పచారీకొట్టు పనివాడు ప్రపంచస్థాయి వాణిజ్యవేత్త కాగలడని చూపించిన కథ. అంత మాత్రమే అయితే కూడా దీని గురించి మాట్లాడి ఉండేవాణ్ణి కాను. కాని తాను నేర్చుకున్న భాషలన్నిటిలోనూ గ్రీకు అతడికి అత్యంత అభిమాన భాష కావడం, తన జీవితమంతా తన సంభాషణలు, ఉత్తర ప్రత్యుత్తరాలు, డైరీలు ప్రతి ఒక్కటీ ప్రాచీన గ్రీకులోనే రాసుకున్న ఒక ప్రాచీన గ్రీకు ప్రేమికుడి కథ ఇది.

తన చిన్నప్పుడు తన తండ్రి ద్వారా విన్న ఇలియడు, ఒడెస్సీ కథల్ని దాటి అతడు మానసికంగా ఒక్కరోజు కూడా ఒక్క అడుగు కూడా బయటికి రాలేదు. చివరిదాకా ఆ ప్రాచీన ఇతిహాసాల పట్ల ఆ వ్యామోహమే అతణ్ణి ఒక passionate పరిశోధకుడిగా

మార్చింది. తన మొదటి వివాహం విఫలమయినప్పుడు మళ్ళీ పెళ్ళి చేసుకోడానికి అతడు వెతుక్కున్నది ఒక గ్రీకు వనితనే. ఆ పెళ్ళి చూపుల్లో ఏమి జరిగిందో భాస్కరం గారి మాటల్లో (పే. 133) చూడండి:

కాసేపటికి సోఫియా వచ్చింది. తెల్లని దుస్తులు ధరించింది. జుట్టు రిబ్బన్‌తో ముడేసుకుంది. గంభీరంగా ఉంది. అందరిముందూ వైనూ, కేకులూ ఉంచారు. సోఫియా తలవంచుకుని కూర్చుంది. ష్లీమన్ తన ప్రపంచయాత్రా విశేషాలను చక్కని గ్రీకులో చెప్పడం ప్రారంభించాడు.అతడు మధ్యలో సోఫియా వైపు తిరిగి 'నీకు దూరప్రయాణాలు ఇష్టమేనా?' అని అడిగాడు.

ఇష్టమేనని ఆమె చెప్పింది.

'రోమన్ చక్రవర్తి హేడ్రియన్ ఏథెన్సును ఎప్పుడు సందర్శించాడు' అని అడిగాడు.

సోఫియా తేదీతో సహా టకీమని చెప్పింది.

'హోమర్ పంక్తులు కొన్ని అప్పజెప్పగలవా?' అని అడిగాడు.

గడగడా అప్పజెప్పింది. పరీక్ష నెగ్గింది.

ఇదే ఈ కథలో మనల్ని దగ్గరకు లాక్కునే అంశం. ష్లీమను అనే మనిషి పరస్పర వైరుధ్యాలతో కూడిన ఎన్నో దారుల్లో నడిచి ఉండవచ్చుగాక, కానీ అతనిలో పసితనం నుంచి చివరిదాకా కూడా ఈ గ్రీకుప్రేమనే అతడి జీవితానికొక పరమార్థాన్ని సంతరించింది.

ఈ సందర్భంగా భగవద్గీతలోని ఈ శ్లోకం (2:41) నాకు గుర్తొస్తున్నది. నిన్న నా ప్రసంగంలో కూడా ఈ శ్లోకాన్నే తలుచుకున్నాను:

వ్యవసాయాత్మికా బుద్ధిః ఏకేహ కురునందన
బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయో2వ్యవసాయినామ్

(ఏదైనా ఒక్క పనిలో నిమగ్నుడైనవాడి బుద్ధి ఒక్కతీరుగానే ఉంటుంది. కాని చాలా పనుల్లో సంచరించే బుద్ధి అనేకకొమ్మలుగా చీలినట్టుగా అంతూపొంతూ లేకుండా ఉంటుంది.)

ష్లీమను జీవించిన జీవితం పైకి చూడటానికి అత్యంత అవ్యవసాయికం. అనేక దారుల్లో నడిచిన నడక. కాని ఆ బహురూపుల వెనక, ప్రాచీన గ్రీకు భాష పట్ల, హోమరు పట్లా, ఆయన సృజించిన కావ్యప్రపంచం పట్లా అతడికున్న నిశ్చయాత్మకత అత్యంత దృఢంగా ఉంది కాబట్టే, తనతో తాను ఆడుకున్న జూదంలో అతడు గెలిచాడు, స్మరణీయుడయ్యాడు.

10-3-2025

# కలాం ఎఫెక్టు

**కలాం** ఆత్మకథను నేను అనువదించిన కొత్తలో, ఒక ప్రసిద్ధ విప్లవరచయిత నాతో ఆ పుస్తకం గురించి మాట్లాడుతూ 'కలాం ప్రొడక్షను గురించి మాట్లాడినట్టుగా డిస్ట్రిబ్యూషను గురించి మాట్లాడలేదు కదా' అన్నాడు. గ్లోబలైజేషను సందర్భంగా దేశంలో సంపద సృష్టి ముమ్మరమైన సమయంలో కలాం కూడా సంపద సృష్టించడం గురించి మాట్లాడేడు తప్ప, సృష్టించిన సంపద నలుగురికీ అందుబాటులోకి రావడం గురించీ, అసమానతలు తొలగిపోవడం గురించీ ఆయన మాట్లాడలేదనీ, పోరాడలేదనీ, ఆ రచయిత భావన.

కాని కలాం పట్ల నా ఆరాధనకి కారణం ఆర్థిక, రాజకీయ రంగాలకి సంబంధించింది కాదు. ఉత్పత్తి పెరిగినంత మాత్రాన, లేదా పంపిణీ వ్యవస్థ మెరుగు పడినంత మాత్రాన, మన సమాజం మరింత మెరుగైన సమాజం కాగలదని నేనెప్పుడూ నమ్మలేదు.

చిన్నప్పుడు హైస్కూల్లో నా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు, సోషలిజం గురించి చెప్తూ ఉత్పత్తి సాధనాలు సామాజికనియంత్రణలోకి రావడమే సోషలిజమని చెప్పాడు. కాని ఆచరణలో సమాజమంటే రాజ్యమేననే తెలుసుకోవడానికి ప్రపంచం 1917

నుంచి 1980 దాకా ఆగవలసి వచ్చింది. అయినా కూడా ప్రపంచమంతా వామపక్ష ఉద్యమాలు ఉత్పత్తి సాధనాల్ని సమాజమెట్లా నిర్వహించగలదో అధ్యయనం చెయ్యడం మానేసి, ప్రయోగాలు చెయ్యడం మానేసి, రాజ్యాధికారం కోసం పోరాటాలు సాగిస్తూనే ఉన్నారు. ఇంతదాకా అప్రధానీకరణకు లోనైన వివిధ సమూహాలు కూడా తమ అస్తిత్వాన్ని, తమ సాంఘిక ముద్రనీ గుర్తుపట్టే క్రమంలో వామపక్ష ఉద్యమాలు నడిపిన తోవనే నడుస్తూ, తాము కూడా రాజకీయాధికారం కోసం తపిస్తూ ఉన్నారు.

ప్రపంచం రెండు శిబిరాలుగా చీలిపోయిందని కమ్యూనిష్టు మానిఫెస్టో అన్నప్పణ్ణుంచీ, మనుషుల్ని రెండు శిబిరాలుగా విడగొట్టి చూస్తూనే ఉన్నాం. చాలాకాలం పాటు ఆ శిబిరాల్ని వర్గప్రాతిపదికన విడగొట్టారు. ఆ తర్వాత జాతి, వర్ణం, రంగు, లింగం, ఇక్కడ భారతదేశంలో కులం–

కాని నేనేమనుకుంటానంటే, మనుషులు అన్నిదేశాల్లోనూ, చైనాలోనూ, స్వీడను లోనూ కూడా, ప్రధానంగా రెండే విభాగాలు– privileged, under privileged. సదుపాయాలూ, సౌకర్యాలూ ఉన్నవాళ్ళూ, అవి లేనివాళ్ళూను. కొందరికి అటువంటి సదుపాయాలు పుష్కలంగా ఉండటానికీ, చాలామందికి కనీస సౌకర్యాలు కూడా లేక పోవడానికీ వర్గం, లింగం, కులం కారణం కావచ్చు, ఆ అసమానతలు కొనసాగడానికి కూడా అవి ఆస్కారం కావచ్చు. కాని మనం ధిక్కరించవలసిందీ, వ్యతిరేకించవలసిందీ ఆ సౌకర్యాల్ని కొందరే అనుభవించడాన్ని, వారు అటువంటి సౌకర్యాలు అనుభవించడానికి చాలామందికి అవి లేకుండా చెయ్యడాన్ని.

అటువంటి సౌకర్యనిర్మూలన రాజ్యాధికారం ద్వారా సాధ్యపడుతుందా?

పారడాక్సు ఏమిటంటే, ఏ అసమానతానిర్మూలనకోసం underprivileged రాజ్యాధికారం కోసం పోరాటం చేస్తారో, ఆ రాజ్యాధికారం సిద్ధించగానే వాళ్ళల్లో ఒక చిన్నభాగం, privileged గా మారిపోతారు. అంటే అంతదాకా విమోచనశీలత్వాన్ని కనపరచిన ఆ సమూహం ఇక అప్పణ్ణుంచీ తిరిగి మళ్ళా ఆధిపత్య ధోరణిని సంతరించుకుంటుంది. అంటే, రాజ్యంగా మారిపోతుంది. ఇదొక విషమ ప్రహేళిక. దీని ప్రకారం underprivileged కి ఎప్పటికీ రాజ్యాధికారం సిద్ధించదు. ఇంకా చెప్పాలంటే,

రాజ్యాధికారం స్వభావతః privileged కాబట్టి, పాలనాధికారం పొందిన ప్రతివాడూ పాలకుడుగానే ప్రవర్తిస్తాడు.

అందుకనే గత మూడు దశాబ్దాలుగా, పాలక స్వభావాన్ని సంతరించుకోని పాలకుడి కోసమే నేను అన్వేషిస్తూన్నాను. ఒకప్పుడు వామపక్షవాదులు అటువంటి ఆలోచనల్ని యుటోపియను భావాలుగా కొట్టిపారేసేవారు. కాని సోవియెటు రష్యా కూలిపోయిన తర్వాత, సమసమాజాన్ని కోరుకునేవాళ్ళంతా ఆలోచించక తప్పని ప్రశ్న ఇది: రాజ్యాధికారం లేకుండా అత్యధికసంఖ్యాకులకు మేలు చెయ్యలేం. కాని రాజ్యాధికారం సిద్ధించగానే పాలకస్వభావాన్ని సంతరించుకోకుండానూ ఉండలేం. పాలకస్వభావాన్ని సంతరించుకోకుండా రాజ్యాధికారాన్ని పొందడమెట్లా, బహుజనహితం కోసం దాన్ని వినియోగించడమెట్లా?

కాని అటువంటి ప్రవర్తన సాధ్యం చేసుకోవడం కోసం ప్రయత్నిస్తున్నవాళ్ళు సమకాలిక ప్రపంచంలో కొందరు మనముందున్నారు. వారందరిలోనూ నన్ను కలాం ఎక్కువగా ఆకర్షించడానికి కారణమదే. ఇప్పుడు పి.ఎం.నాయర్ రాసిన 'కలాం ఎఫెక్టు' (హార్పరు కాలిన్సు, 2011) చదివిన తరువాత కలాం పట్ల పట్ల నా నమ్మకం మరింత బలపడింది.

పి.ఎం.నాయర్ భారతీయ పాలనా సర్వీసులో 1967 బాచికి చెందిన అధికారి. కలాం రాష్ట్రపతి అవగానే ఆయన్ని పిలిపించి రాష్ట్రపతి కార్యదర్శిగా నియమించారు. వారిద్దరూ అయిదేళ్ళూ కలిసి పనిచేసారు. ఆ సందర్భంగా రాష్ట్రపతి స్థానంలో కలాం లోని మానవుడు ఎలా ఆలోచించేవాడో, మాట్లాడేవాడో, ప్రవర్తించేవాడో చాలా దగ్గరనుంచి చూసిన నాయర్ తన అనుభవాల్ని ఎంతో హృద్యంగా వివరించేడు.

ఆ అనుభవాలన్నీ మనం మళ్ళా మళ్ళా చెప్పుకోవలసినవీనూ, మన పిల్లలకు నూరిపొయ్యవలసినవీను. ముఖ్యం, ఈ అనుభవం చూడండి. నాయర్ ఇట్లా రాస్తున్నాడు:

> 'నేను లేనప్పుడు ఈ పెన్సిలెవరు తీసారు?' ఆ ప్రశ్నిస్తున్నది నా తండ్రి, కోపంతో అరుస్తున్నాడు. మేమప్పుడు కేరళలో తొడుప్పుళలో ఉండేవాళ్ళం.

మా నాన్న అక్కడ జిల్లా మున్సిఫు. ఇంటిదగ్గరకూడా ఆయన కేసుఫైళ్ళు రాసుకోవడానికి ఒక బల్లా, కొంత స్టేషనరీ ఉండేవి. మా ఇంటి మొత్తానికి అదొకటే టేబులూ, ఆ కాగితాలూ, కలాలే ఏకైక స్టేషనరీ.

నేనప్పుడు అయిదోక్లాసు చదువుతున్నాను. నా హోంవర్కు పుస్తకంలో ఏదో అండరులైను చేసుకోవలసి ఉండింది. అందుకని నేను మా నాన్న ఆఫీసు పెన్సిలు వాడుకున్నాను. మళ్ళా దాన్నక్కడే పెట్టేసాను. మా నాన్నకి తెలీదను-కున్నాను. కాని నా ఊహ తప్పయింది. ఆయన దాన్ని కనిపెట్టేసాడు. ఆయనకి ఎదురు చెప్పే ధైర్యం మా ఇంట్లో ఎవ్వరికీ లేదు. ఇక అబద్ధం ఆడటం ఊహించడానికి కూడా లేదు.

అందుకని నేను ముందుకి అడుగేసి 'నాన్నా, నేనే తీసాను...అండరులైను చేసుకోవడానికి ..' ఆ మాటలు కూడా కష్టంగా పలికానే తప్ప, క్షమించండి అనడానికి కూడా ధైర్యం చాలకపోయింది నాకు.

'ఆఫీసు సామాను ఆఫీసు పనికేగాని, ఇంటిపనికి కాదని తెలీదా నీకు?' ఆ ప్రశ్న వెనకనే నా వంటిమీద మూడు బెత్తం దెబ్బలు కూడా. ఆ బెత్తం నాకో పాఠం నేర్పింది. నా జీవితమంతా నాకు దారిచూపించిన పాఠం. నైతిక ప్రవర్తనవరకూ అదే అత్యున్నత ఉదాహరణ అనుకున్నాను. కాని నేను పొరబడ్డాను. దివంగతుడైన నా తండ్రి పట్ల నా గౌరవం చెక్కుచెదరలేదుగానీ, నేను చూడవలసింది మరికొంత మరికొంత మిగిలేఉందని తెలుసుకున్నాను.

మే, 2006.

'నాయర్, మా బంధువులు వారం పదిరోజులుండటానికి ఇక్కడి కొస్తున్నారు. వాళ్ళకయ్యే ఖర్చు ఆఫీసు లెక్కల్లోకి పోకుండా చూడండి, అదంతా నా ప్రైవేటు ఖర్చు' అన్నారు కలాం నాతో.

ఆయన బంధువులు మొత్తం 52 మంది వచ్చారు.. వాళ్ళల్లో తొంభై ఏళ్ళ వయస్కుడైన ఆయన పెద్దన్నయ్యనుంచి ఏడాదిన్నర వయసు కలిగిన ముని

మనమరాలుదాకా. కలాం ఒక మాట చెప్పారంటే ఆ మాటకెంత విలువ ఇస్తారో నాకు తెలుసు.'

వాళ్ళంతా వచ్చారు. ఎనిమిదిరోజులపాటున్నారు. అజ్మీర్ షరీఫుకి వెళ్ళారు. వాళ్ళల్లో యువతీయువకులు ఢిల్లీలో షాపింగుకి కూడా వెళ్ళారు. తిరిగి వాళ్ళంతా వెళ్ళిపోయారు. అసాధారణమైన విషయమేమిటంటే, వాళ్ళున్నన్ని రోజులూ, ఒక్కసారి కూడా ప్రభుత్వవాహనం వాడలేదు. ముఖ్యంగా వచ్చిన వాళ్ళు అంతమందైనప్పుడు!

తన బంధువులు రాష్ట్రపతి భవన్లో నివసించిన గదులకు కలాం అద్దె చెల్లించారు. చివరికి వాళ్ళు తాగిన టీ కప్పులకి కూడా లెక్కగట్టారు. మొత్తం బిల్లు 3 లక్షల 52 వేలు. మొత్తం కలాం తన జేబునుంచి చెల్లించారు. ఆయన ఆ విషయమెవ్వరికీ చెప్పుకోలేదు. నేను రాస్తున్నానంటే కారణం, ఇప్పుడైనా నలుగురికీ తెలియాలనే. నేనీ విషయం బహిరంగం చేసినందుకు ఆయన నన్ను మన్నిస్తారనే అనుకుంటున్నాను.

ఒకప్పుడు తౌడుప్పళలో ఆ సంఘటన జరిగినప్పుడు నేను నా తండ్రి ముందు నిలబడలేకపోయాను. కాని ఇప్పుడు ఈ మానవుడి ముందు, ఇంత నిరాడంబర మైన ఉదాహరణ ముందు, నిలబడి సగౌరవంగా నా ప్రణతులు చెల్లిస్తున్నాను.

7-2-2016

# మహాశ్వేతాదేవి

**అయిదేళ్ళ** కిందట ఒక ఇంటర్వ్యూలో మహాశ్వేతాదేవి చెప్పిన మాటలివి.

> నేను రాసేదంతా అణగారిన మనుషులగురించే...వాళ్ళనుంచే నేను నా శక్తి కూడదీసుకుంటున్నాను. మన చుట్టూ నడుస్తున్న ఆదివాసి ఉద్యమాల నుంచే నా శక్తి కూడగట్టుకుంటున్నాను. సింగూరు, నందిగ్రాంలు నా జీవితంలో కొత్త అధ్యాయం తెరిచాయి. నేనూ, మేధాపాట్కరూ ఏ రాజకీయపక్షమో స్వాగతిస్తే సింగూరు వెళ్ళలేదు. సింగూరు ప్రజలు మమ్మల్ని తమ మధ్యకు ఆహ్వానించేరు. ప్రజాశక్తిలో నా విశ్వాసాన్ని బలోపేతం చేసినందుకు వారి కెంతో ఋణపడిఉంటాను. బిర్సాముండా నుంచి నందిగ్రాం, సింగూరు ప్రజల దాకా, ఎవరైనా కావచ్చు, నేనెప్పుడూ ప్రజలతోటే కలిసి నడుస్తాను.

అందుకనే, మహాశ్వేత నిష్క్రమించిందంటే, ఒక సాహిత్యవేత్త మాత్రమే మనమధ్య నుంచి వెళ్ళిపోయినట్టుకాదు, ఒక ప్రజా ఉద్యమకారిణి, అరుదైన ఒక సాహసి కూడా ఇక నుంచీ మనకు కనిపించరు.

మామూలుగా గొప్ప సాహిత్య సృజన చేసినవాళ్ళు, ప్రజాజీవితంతో మమేకం కావటం అరుదు. వాళ్ళు ప్రజల్తో కలిసి తిరిగినా వాళ్ళకి జరిగే అన్యాయాల గురించి సంఘాన్నీ, రాజ్యాన్నీ నిలదీసేవాళ్ళు మరీ అరుదు. సామాజికంగా ఎంతో క్రియాశీలకంగా ఉండే ఉద్యమకారులు స్వయంగా రచయితలైన వాళ్ళు లేకపోరు గానీ, సాహిత్యశిల్ప దృష్ట్యావారిని గొప్ప రచయితలుగా గుర్తించలేం. కాని మహాశ్వేతాదేవిలో ఈ రెండు పార్శ్వాలూ ఎంతో శ్రేష్ఠంగా వికసించేయి. అందుకనే, ఆమె లేరంటే, ఈ దేశం నిజంగా పేదదైందనిపిస్తుంది. 'ఆ లోటు పూడ్చలేనిది' అని ఇట్లాంటి సందర్భాల్లో వాడే పడికట్టుపదం నిజంగానే ఈ సందర్భంలో ఎంతో నిజమనిపిస్తున్నది.

మహాశ్వేత బాణభట్టుడి కాదంబరిలో పాత్ర. మహాశ్వేతాదేవిని తలుచుకున్నప్పుడు ఏ అతీత కావ్యయుగం నుంచో ఏ ఆకాశలోకాలనుంచో భూమ్మీదకు దిగి మట్టిమనుషుల మధ్యకు చేరుకున్న పాత్రలాగా తోస్తుంది. ఆమె పుట్టిందే విద్వాంసుల, కళాకారుల కుటుంబంలో. తండ్రి మనీష్ ఘటక్ 'యువనాశ్వ' పేరిట కల్లోల ఉద్యమంలో భాగంగా కవిత్వం చెప్పాడు. చిన్నాన్న, భారతీయ సినిమా గర్వించదగ్గ తొలితరం దర్శకుల్లో ఒకరైన ఋత్విక్ ఘటక్. తల్లి ధరిత్రీ దేవి నిజమైన విదుషి. ఆమె మహాశ్వేతాదేవికి చిన్నతనంలోనే చెకోవునీ, టాల్‌స్టాయినీ, డికెన్సునీ పరిచయం చేసింది.

మహాశ్వేత మొదటి భర్త, బిజొన్ భట్టాచార్య ప్రసిద్ధ నాటకకర్త, ప్రజా రంగస్థల ఉద్యమకారుడు, కొడుకు నవారుణ్ భట్టాచార్య కూడా ప్రసిద్ధిచెందిన నవలా రచయితనే. ఆమె రవీంద్రుడి సన్నిధిలో శాంతినికేతనంలో కొన్నాళ్ళు చదువుకున్నారు. 36-38 మధ్యకాలంలో తనని టాగోరు తీవ్రంగా ప్రభావితం చేసాడని కూడా చెప్పుకున్నారు.

కాని ఆమె జీవితం ఆ కళాత్మకతకీ, ఆ కాల్పనికతకే పరిమితం కాలేదు. ఆమె జీవితంలో మూడు దశలున్నాయి. మొదటి దశ 1926 లో ఆమె పుట్టినప్పటినుంచీ, 1975 దాకా దాదాపు యాభై ఏళ్ళు నడిచింది. ఆ దశలో ఆమె చదువుకున్నారు, రచనలు మొదలుపెట్టారు, ఝాన్సీరాణి మీద తానే స్వయంగా వివరాలు సేకరించి ఒక నవల రాసారు, ఆ కాలంలోనే పెళ్ళి చేసుకున్నారు, విడిపోయారు కూడా.

నగ్జల్బరీ ఉద్యమం నేపథ్యంగా ఆమె 1975 లో రాసిన 'హజార్ చౌరాసీర్ మా' (1084 తల్లి) ఆమెను ఒక జాతీయస్థాయి రచయితగా మార్చేసింది. ఆ నవలకే ఆమెకు 1996 లో జ్ఞానపీఠపురస్కారం లభించింది. ఆ ఇరవయ్యేళ్ళ మధ్యకాలంలో ఆమె అసంఖ్యాకంగా కథలు, నవలలు రాసారు. వాటిల్లో బిర్సాముండా ఇతివృత్తంగా రాసిన 'అరణ్యేర్ అధికార్' (1977, తెలుగులో 'ఎవరిదీ అడవి'), 'అగ్నిగర్' (1978), 'బసాయి తుడు', 'ఛోటీ ముండా ఏవం తార్ తీర్' (1980) లాంటి సుప్రసిద్ధ రచనలున్నాయి.

ఆమె ముఖ్యమైన నవలలు, కథలు ఇంగ్లీషులోకి, చాలా భారతీయ భాషల్లోకి అనువాదమయ్యాయి. స్వాతంత్ర్యానంతర బెంగాలు నుంచి అంత విస్తారంగా అనువాద-మైన రచయిత మరొకరు లేరు. అంతగా పాఠకాదరణ పొందిన రచయిత కూడా మరొకరు లేరు. ఆమె రాసింది ప్రతీదీ ఏడాది తిరక్కుండానే రెండవముద్రణకు వచ్చేదని ఒక ప్రచురణ కర్త అన్నాడు.

ఈ ఇరవయ్యేళ్ళ సాహిత్య సృజనలో ఆమె లేవనెత్తిన ప్రశ్నలు దాదాపుగా 60 ల నుంచీ ఆమెని బాధిస్తున్నవే. 67 లో నక్సల్బరీ గ్రామంలో రక్తం చిందకముందే ఆమె సంతాలు వారి దయనీయ స్థితిని కళారా చూసి, వారి పరిస్థితి గురించి తక్కిన ప్రపంచాన్ని హెచ్చరిస్తూనే ఉన్నారు.

అట్లానే ఆమె జీవితంలో మూడవ దశ 1982 లో మొదలై, చివరిదాకా కొనసాగింది. ఈ దశలో ఆమె ఒక రచయిత్రిగానే కాక ఒక సామాజిక ఉద్యమకారిణిగా కూడా ప్రత్యక్షంగా పాల్గొన్నారు. అత్యంత క్రియాశీలకంగా పనిచేసారు.

ఆమె రచనల్లో ఆదివాసుల అధికారాల గురించీ, భూస్వాములూ, వడ్డీ వ్యాపారస్థులూ, ప్రభుత్వాధికారులూ ఒక్కటై వారినెట్లా అణగదొక్కుతున్నారో ఆ వైనమంతా అత్యంత సాహసంతో, కత్తివాదరలాంటి వ్యంగ్యంతో చిత్రించారు. కాని, ఆమె క్రియాశీల జీవితం ప్రధానంగా విముక్తజాతుల (denotified tribes) చుట్టూ అల్లుకుంది.

విముక్త జాతులంటే, బ్రిటిషు ప్రభుత్వం 1871 లో చేసిన క్రిమినలు ట్రైబ్సు చట్టం కింద నోటిఫై అయి, తిరిగి 1952 లో స్వతంత్ర భారతదేశంలో డీ-నోటిఫై అయిన

తెగలు. బెంగాల్లో అటువంటి జాతులు మూడున్నాయి. మేదినీపూరు జిల్లాలో 'లోధా'లు, పురులియాలో 'ఖేడియా సౌబర్లు', భీర్ భూములో 'ధికారో' లు. కాని సుమారు ఒక శతాబ్దకాలం పాటు నేరస్థజాతిగా ముద్రపడ్డందువల్ల, వారిని స్థానిక సమాజాలూ, స్థానిక ప్రభుత్వాధికారులూ ఎట్లా హింసిస్తున్నారో, వేధిస్తున్నారో మహాశ్వేతాదేవి స్వయంగా చూసారు, వారి గురించి ఆందోళన చెందారు. వారికి న్యాయం జరగడం కోసం చెయ్యవలసిందంతా చేస్తూనే వచ్చారు.

ముఖ్యంగా 1998 లో పురులియాకి చెందిన బూదన్ శౌబర్ అనే గిరిజనుణ్ణి పోలీసులు రెండువారాల పాటు లాకప్పులో హింసించి కిరాతకంగా చంపారు. అది తన జీవితంలో తనకు తెలిసిన అత్యంత హీనమైన అత్యాచారంగా మహాశ్వేతదేవి చెప్పుకున్నారు. ఆమె అతడి కోసం హైకోర్టులో ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యం వేసి, అతడి భార్యకి నష్టపరిహారంతో పాటు, అందుకు కారణమైన అధికారులకి శిక్ష పడేలా చేసారు.

ఆ అనుభవం ఇచ్చిన ఉత్తేజంతో ఆమె గుజరాతులో జి.ఎన్.దెవితో, మహారాష్ట్రలో లక్ష్మణ గయక్వాడు (అతడు కూడా ఒక నేరస్థ జాతికి చెందిన కుటుంబం నుంచి వచ్చాడు. తన అనుభవాల్ని 'ఉచల్యా' పేరిట నవలగా రాసాడు. ఆ పుస్తకం తెలుగులో కూడా లభ్యమవుతున్నది) లతో కలిసి విముక్తజాతుల సంక్షేమం కోసం దేశవ్యాప్త ఆందోళన కొనసాగించారు. జాతీయ మానవహక్కుల కమిషను ఛైర్మనుగా పనిచేసిన జస్టిస్ వర్మ వారికి అందించిన సహకారం వల్ల ప్రభుత్వం విముక్తజాతుల అధ్యయనానికి ఒక జాతీయ కమీషనును ఏర్పాటు చేసింది.

కాని ఆ కమిషను ఇప్పటిదాకా ఏమీ చెయ్యలేకపోయిందని మహాశ్వేతా దేవి వాపోయారు. (ఇక ముందు చెయ్యగలదని కూడా నేననుకోను. ఎందుకంటే, ఆ కమిషను ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వస్తోందన్నప్పుడు, విముక్తజాతులంటే ఎవరని ప్రభుత్వంలో ఒక సీనియరుసెక్రటరీ నన్ను ప్రశ్నించాడు. ఆ విషయం మీద సాధికారికంగా మాట్లాడగలిగింది వకుళాభరణం లలితగారేనని ఆమె నంబరు ఆయన కిస్తే, ఇప్పటిదాకా మాట్లాడటానికి ఆయనకి సమయం దొరకలేదు.)

టాగోరు నుంచి మహాశ్వేతాదేవి దాకా బెంగాలీ సాహిత్యంలో ఆదివాసులు ఎట్లా చిత్రించబడ్డారో చూడటం గొప్ప ఆసక్తి కలిగించే అంశం. టాగోరు కవిత్వంలో ప్రశాంత వృక్షఛాయలోనో, అటవీక్షేత్రాల్లోనో కనిపించే సంతాలులు, అత్యంత దుర్భరమైన జీవన స్థితిగతుల మధ్య మహాశ్వేతాదేవి రచనల్లో కనిపిస్తారు. గోపీనాథ మొహంతి కూడా ఆ దుర్భర స్థితిగతుల్ని చూశాడు గాని, అది స్వాతంత్ర్యం కన్నా ముందటి మాట. స్వతంత్ర భారతదేశంలో ఆదివాసులకి బతకడానికి కూడా హక్కు లేకపోయిందనేది మహాశ్వేతాదేవి చూసి, చెప్పిన మాట. దాదాపుగా ఆమెకి సమకాలికంగా తెలుగు కళింగాంధ్ర కథకులు భూషణం వంటివారు కూడా ఆ మాటే చెప్తూ వచ్చారు. పురులియా నుంచి పాడేరుదాకా పరిస్థితులవే. కాని తాము చూసినదాన్ని ఆమెలాగా విస్తృతమైన కాన్వాసుమీద, నిష్ఠురమైన వ్యంగ్యంతో, విస్తారంగా రాయగలిగిన రచయితలు తెలుగులో లేకపోయారు.

మేధాపాట్కర్, గోపీనాథ మొహంతి ఒక్కరిలో కలిసి కనిపిస్తే, ఆమె మహాశ్వేతాదేవి అవుతుందనుకుంటాను.

28-7-2016

# సాహిత్య విలాసం

**చాలా** ఏళ్ళ కిందట, అంటే, 1983 లో నా ఇరవయ్యవ పుట్టినరోజు నాడు, నా కాకినాడ మిత్రుడు, సున్నిత హృదయుడు సి.ఎస్. నాకొక పుస్తకం బహుమతిగా ఇచ్చాడు. అది టాగోరు ఉత్తరాల ఇంగ్లీషు అనువాదం. Glimpses of Bengal: Selected Letters 1885-95.

పట్టుమని నూట యాభై పేజీలు కూడా లేని ఆ చిన్న పుస్తకం, ఇన్నాళ్ళకు, అంటే, 33 సంవత్సరాల తర్వాత చదవగలిగాను. బహుశా నా మిత్రుడు ఆ కానుక ఇవ్వడం కూడా అతడు నాకొక ఉత్తరం రాయడంలాంటిదే అనుకుంటే, ఆ ఉత్తరం ఇన్నాళ్ళకు పూర్తిగా చదివానన్నమాట.

ఆ ఉత్తరాలు రవీంద్రనాథుడు 'టాగోరు' గా ప్రఖ్యాతి పొందక ముందు రాసినవి. ఆయనే ముందుమాటలో రాసుకున్నట్టుగా:

> యవ్వనం తీరికతోనూ, అత్యుల్లాసంతోనూ పొంగిపొర్లే కాలం కాబట్టి, ఏదో దైనందిన వ్యవహారం కోసం కాకుండా ఉత్తరాలు రాయడం నాకు గొప్ప

సంతోషంగా ఉండేది. ఆలోచనలూ, అనుభూతులూ అతిశయించినప్పుడే ఇటువంటి సాహిత్య విలాసం సాధ్యపడుతుందనుకుంటాను.

ఈ ఉత్తరాలు ఆయన తన అన్న కూతురు ఇందిరాదేవికి రాసాడు. వీటినుంచి ఏరికూర్చిన కొన్ని ఖండికల్ని 'ఛిన్నపత్ర' పేరిట వెలువరించాడు. Glimpses of Bengal ఆ ఉత్తరాల ఇంగ్లీషు అనువాదం. అయితే, ఉత్తరాల పూర్తి సంకలనం 'ఛిన్నపత్రావళి' (1960) పేరుతో మళ్ళా వెలువడింది. ఈ మధ్యనే ఆ ఉత్తరాల్ని పూర్తిగా Letters From A Young Poet 1887-1995 (పెంగ్విను, 2014) పేరిట రోసింకా చౌధరి అనే ఆమె ఇంగ్లీషులోకి అనువదించారు.

ఒక జమీందారుగా టాగోరు తూర్పు బెంగాలునుంచి ఒరిస్సాదాకా ఉన్న తమ భూములూ, ఎస్టేట్లూ చూసుకోవడానికి చేసిన ప్రయాణాల్లో రాసిన ఉత్తరాలవి. నదులూ, సరసులూ, మైదానాలూ, గ్రామాలూ, సూర్యాస్తమయాలూ, వెన్నెలా, మబ్బులూ, వర్షాల మధ్య రాసుకున్న ఉత్తరాలవి.

ఆ ఉత్తరాలు చదువుతూంటే, నా యవ్వనకాలంలో కూడా అనుభూతి అతిశయం వల్ల నేను కూడా ఇట్లా ఉత్తరాలు రాసుకున్నది గుర్తొచ్చింది.

నా బాల్యంలోనూ, యవ్వనంలోనూ నేను కొన్ని వందల ఉత్తరాలు రాసేను. వివిధ అవస్థల్లో, వివిధ స్థలాలనుంచి, వివిధ ఉద్వేగాల్లోంచి వందలాది ఉత్తరాలు రాసేను. నా ఉత్తరాలకి దాదాపుగా జవాబులుండేవి కావు, ఏ కొద్దిమంది మాత్రమో తిరిగి జవాబు రాసేవారు.

కాని చాలా సార్లు అవి ఒకవైపే ప్రయాణించేవి. మరీ ముఖ్యం, యువతులకి రాసిన ఉత్తరాలు. ప్రతి ఉత్తరం ఒక కవితతో మొదలుపెట్టేవాణ్ణి, ఎన్నో రోజుల పాటు దానికి జవాబు వస్తుందని చూసేవాణ్ణి, జవాబు రాదని తెలిసేక, మరొక కవిత, మరొక ఉత్తరం.

ఒకసారి, ఒకామె నేను రాసిన ఉత్తరాల్ని చింపివేసిందని తెలిసాక, చెప్పలేనంత వేదన అనుభవించాక (ఎందుకంటే, ఆ ఉత్తరాల్లో నా కవితలెన్నో ఉండిపోయేయి,

వాటికెప్పుడూ కాపీలు రాసి పెట్టుకోలేదు) నేను చెయ్యగలిగిందల్లా మరొక దీర్ఘ కవిత రాయడమే.

అసలు ఎవరేనా ఎవరికన్నా ఉత్తరాలు ఎందుకు రాస్తారు? ఉభయకుశలోపరి కోసమే అయితే, ఉత్తరం మొదటివాక్యం తోటే ఆగిపోతుంది. అంతకన్నా కూడా ముఖ్యమైనదేదో, నేను చెప్పుకుందామనుకున్నా నా పక్కనెవరూ వినడానికి సంసిద్ధంగా లేరనుకున్నప్పుడే, ఎక్కడో సుదూరంలో ఉన్న హృదయానికి ఉత్తరాలు రాసుకోవడం మొదలు పెడతాం. కేవలం క్షేమవార్త కాదు. అంతకన్నా మించిన మరేదో ముఖ్యమైన వార్త అది.

బహుశా మనం రాసే రచనలన్నీ కూడా అట్లాంటి ఉత్తరాలే. 'నా కవితలన్నీ ప్రపంచానికి రాసుకున్న ఉత్తరాలే' నని ఎమిలీ డికిన్సన్ అన్నదని 'మో' ఒకసారి నాతో అన్నాడు. (This is my letter to the world, that never wrote to me).

ఏళ్ళు గడిచేయి. జీవితంలోంచి ఉత్తరాలు అదృశ్యమైపోయ్యాయి కదా అనుకుంటూ ఉండగా, హఠాత్తుగా తట్టింది నాకు, ఇక్కడ నేను రాస్తున్నవి కూడా ఉత్తరాలే కదా అని. అయితే, ఈ ఉత్తరాలు ఏ ఒక్క మనిషికో రాసినవికావు, గోపీచంద్ రాసిన 'పోస్టు చెయ్యని ఉత్తరాలు' లాగా ఇవి కూడా ప్రపంచానికంతటికీ ఉద్దేశించినవి. కాకపోతే ఇవి ఎప్పటి కప్పుడు 'పోస్టు' చేస్తున్న ఉత్తరాలు, అదొక్కటే తేడా.

26-8-2016

# నా చరిత్ర

**మహామహోపాధ్యాయ** యు.వి.స్వామినాథ అయ్యరు ఆత్మకథ 'నా చరిత్ర' నా ఆరాధ్య గ్రంథం అని రాసానే గాని, ఆ పుస్తకం నేనింతకుముందు చదివింది రెండుసార్లే. మొదటిసారి ఎప్పుడో రాజమండ్రి రోజుల్లో చదివాను. పన్నెండేళ్ళ కిందట మరోసారి. సంగం కవిత్వం మీద ఒక వ్యాసం రాస్తున్నప్పుడు, ఆ పుస్తకం కోసం గాలిస్తుంటే, మా అన్నయ్య ఎవరిదగ్గరో తీసుకుని పంపించాడు. నా వ్యాసం పూర్తవగానే మళ్ళా వెనక్కి ఇచ్చేసే షరతు మీద. ఇన్నాళ్ళకు మరొకసారి ఆ పుస్తకం చదివే అవకాశం లభించింది. మూడు దినాల కిందట సంగం కవిత్వం గురించి రాస్తూ ఆ పుస్తకాన్ని తలుచుకోగానే ఏకంగా ఆ పుస్తకం సాఫ్ట్ కాపీనే నా చేతుల్లోకి వచ్చి వాలింది.

ఈ రెండు మూడు రోజులుగానూ ఆ పుస్తకంలోనే జీవిస్తున్నాను. మొదట అక్కడక్కడ కొన్ని పేరాలో, పేజీలో చదవాలనుకున్నవాణ్ణి కాస్తా, వెనకనుంచి ముందుకీ, ముందు నించి మధ్యలోకీ, మధ్యనుంచి ముందుకీ మొత్తం పుస్తకం చదివేసాను, ఉబికివచ్చే కన్నీళ్ళ మధ్య, పూడుకుపోతున్న గొంతుతో.

ఇంతకీ అందులో విషాదమయమైన విషయమేదీ లేదు. అది ఒళ్ళుపులకింపచేసే ఒక సారస్వత ప్రయాణం, ఒక వాఙ్మయ యాత్ర. ఒక జాతి తన పూర్వ ఔన్నత్యాన్ని

కనుగొన్న సాహసోజ్జ్వల చరిత్ర. కానీ, మరి నాకు కన్నీళ్ళెందుకు పొంగుకొచ్చా-యంటారా?

అవును. ఎందుకు? ఎందుకు నా గుండె గళస్థమైపోయింది? ఎందుకో తెలియా-లంటే మీరీ పుస్తకం చదవాలి.

భాష కొంత గ్రాంథికమే. కాని, మొదటి పదిపేజీలు పూర్తిచేసేదాకానే మీకు ఇబ్బంది. ఆ తర్వాత మీరు పందొమ్మిదో శతాబ్ది తమిళదేశంలో ప్రయాణించడం మొదలుపెడతారు. ప్రాచీన చోళ, పాండ్యదేశాల్లో, కావేరినుంచి వైగై దాకా ఒక మహా మానవుడి అడుగుజాడల్లో నడవడం మొదలుపెడతారు. పుస్తకం పూర్తి చేసేటప్పటికి, ఎక్కడో గొప్ప సాన్నిధ్యంలో అప్పటిదాకా గడిపారని మీకు బోధపడుతుంది. మీ జీవితం మీకు చాలా అమూల్యమైనదనే స్ఫురణ కలుగుతుంది. మీ రోజువారీ జీవితంలోనే మీదైన ఒక మహిమాన్విత ప్రయోజనమేదో వెతుక్కుని దానికోసమే బతకాలనే తపన మొదలవుతుంది.

ఇందులో ఇతివృత్తం చాలా సరళమైంది. ఉత్తమాదానాపురం వెంకటసుబ్బయ్య స్వామినాథ అయ్యరు (1855-1942) అనే ఒక తమిళ విద్వాంసుడి జీవితకథ ఇది. ఆయన కుంభకోణందగ్గర ఉన్న సూర్యమూల అనే గ్రామంలో జన్మించాడు. ఆయనకి చిన్నప్పణ్ణుంచీ తమిళం మీద మక్కువ. ఊళ్ళో ఉన్న పెద్దలు ఇంగ్లీషు చదువుకొమ్మని చెప్పారు. కాని అతడి హృదయం తమిళంకోసం కొట్టుకుపోతూ ఉంది. అప్పుడందరూ అతడు మీనాక్షి సుందరం పిళ్ళై వద్ద చదువుకోవలసిందే అని చెప్తూ వచ్చారు.

ఆ రోజుల్లో సాంప్రదాయిక విద్య గురుకులపద్ధతిలో నడిచేది. మహావిద్వాంసుడు మీనాక్షి సుందరం పిళ్ళై గారి దగ్గర కూడా అటువంటి గురుకులం నడిచేది. అప్పట్లో కొన్ని వీరశైవమఠాలు తమిళదేశంలో ఉండేవి. వాటిని ఆధీనాలు అంటారు. ఆ మఠాధిపతిని దేశిగరు అని అంటారు. ఇప్పటి నాగపట్నం జిల్లాలో ఉన్న తిరువాడుదురై ఆధీనానికి చెందిన సుబ్రహ్మణ్యదేశికులు అనే మఠాధిపతి మీనాక్షి సుందరం పిళ్ళైగారినీ, వారి గురుకులాన్నీ ఆదరించేవారు. అటువంటి గురుకులంలో అయ్యరు కూడా చేరి చదువు మొదలుపెట్టారు.

ఆ తర్వాత కొన్నాళ్ళకు పిళ్ళైగారు శిష్యులతో కూడా సుబ్రహ్మణ్యదేశికుల సన్నిధికే తరలిపోయారు. అక్కడ అయ్యరు పిళ్ళైగారివద్దా, దేశికుల వద్దా కూడా విద్యాభ్యాసం కొనసాగించారు. 1871 నుంచి 1876 వరకు ఆయన మీనాక్షి సుందరం పిళ్ళైదగ్గర ఒక గురుకులవాసిగా, పూర్తికాలపు విద్యార్థిగా జీవితం గడిపారు.

1876లో పిళ్ళైగారు పరమపదించిన తరువాత సుబ్రహ్మణ్యదేశికులు ఆయన స్థానంలో మఠంలో విద్యాబోధన చెయ్యవలసిందిగా అయ్యరును ఆదేశించి అందుకు ఏర్పాట్లన్నీ చేసిపెట్టారు. అట్లా ఒక నాలుగేళ్ళు గడిచిన తర్వాత, 1880లో కుంభకోణంలో కళాశాలలో తమిళపండితుడిగా పనిచేస్తున్న త్యాగరాజ చెట్టియారు అనే ఆయన పదవీ విరమణ చేస్తూ తన స్థానంలో స్వామినాథ అయ్యరును నియమించేందుకు ఏర్పాట్లు చేసాడు. స్వామినాథ అయ్యరు 1880 నుంచి 1903 దాకా కుంభకోణంలోనూ, 1903 నుంచి 1919 దాకా చెన్నైలోనూ పనిచేసారు.

కాని, ఆయన తన ముప్ఫై అయిదవ ఏట, అంటే, 1890 లో, కుంభకోణంలో సేలం రామస్వామి మొదలియారు అనే ఒక జిల్లా మున్సిఫును కలుసుకోవడం ఆయన జీవితగతిని మార్చేసింది.

అదంతా ఒక అద్భుతమైన ఘట్టం. కనీసం మీరు ఆ ఒక్క సన్నివేశం (పే.276-283) చదివినా చాలు, ఈ పుస్తకాన్ని జీవితంలో మరిచిపోలేరు. ఆయనద్వారా మొదటిసారి సంగం కాలం నాటి కావ్యమైన 'జీవకచింతామణి' గురించి వినడంతో, ఆ కావ్యాన్ని వెతికిపట్టుకుని పరిష్కరించి ప్రచురించడంతో ఆయన తమిళ వాఙ్మయ పరిశోధన మొదలయ్యింది.

ఆ రోజు మొదలైన ఆ యజ్ఞాన్ని ఆయన 1942 దాకా అవిశ్రాంతంగా కొనసాగిస్తూనే ఉన్నారు. తమిళగ్రామాలు, మఠాలు, గ్రంథాలయాలు, సత్రాలు, మూలమూలలా శోధించి దాదాపు మూడువేల తాళపత్రగ్రంథాలు సేకరించారు. 91 పుస్తకాలు ప్రచురించారు. జీవకచింతామణితో మొదలుపెట్టి 'పత్తుప్పాట్టు' (పది దీర్ఘకవితలు), 'ఎట్టుత్తొగై' (ఎనిమిది కవితాసంకలనాలు), 'మణిమేఖలై' –అప్పటిదాకా మంచులో కప్పడిపోయిన హిమాలయ శిఖరాలు సూర్యకాంతిలో ఒకటొకటే బయటపడ్డట్టుగా,

ఒక్కొక్క ప్రాచీన కావ్యాన్నే ఆయన పరిష్కరించి, వెలువరిస్తూండగా, ఆధునిక తమిళదేశం, యావత్ప్రపంచం నివ్వెరపోయి చూస్తూండింది.

ఆ ఒక్క మానవుడికృషితో తమిళం సంస్కృతంతో సమానమైన ప్రాచీనభాషగా, కావ్యభాషగా, సర్వశ్రేష్ఠభాషల్లో ఒకటిగా మారిపోయింది. తమిళులు ఆయన్ని 'తమిళ తాత' (తమిళ పితామహుడు) అని ప్రేమగా, సగౌరవంగా, ఆరాధనాపూర్వకంగా పిలుచుకోవడం మొదలుపెట్టారు.

ఈ జీవితప్రస్థానంలోని మొదటి 44 ఏళ్ళ కథ ఈ 'నా చరిత్ర' (ఎన్ సరితిరమ్, 1940-42). ఈ చరిత్ర పందొమ్మిదోశతాబ్ది తమిళసమాజ చరిత్ర అనుకోవచ్చు. చాలా మంది దృష్టిలో ఈ రచన ప్రాశస్త్యం అదే. ప్రాచీన గురుకుల వ్యవస్థ, మఠాల ఔదార్యం మీద నడిచిన విద్యాబోధన నుంచి కళాశాలలు, పాఠ్యపుస్తకాలు, ప్రింటింగు ప్రెస్సూ, పరీక్షలూ, పట్టాలతో కూడిన ఆధునిక వ్యవస్థకు సంభవించిన ఒక యుగపరివర్తన కూడా ఇక్కడ కనిపిస్తుండవచ్చు. ఒక వాఙ్మయపరిశోధకుడు తన జీవితాయుష్షు మొత్తం ధారపోసి తన భాషనెట్లా బతికించుకున్నాడో ఆ త్యాగమయగాథగా కూడా దీన్ని చదవవచ్చు.

కాని, ఈ రచన వాటన్నిటికన్నా మించిన మరోమహావిషయాన్ని నా కళ్ళముందు స్పష్టం చేస్తూవచ్చింది.

ఒక మనిషి రాసుకున్న ఆత్మకథగా, ఒక సామాజిక చరిత్రగా మాత్రమే దీన్ని భావించలేను. అన్నిటికన్నా మిన్నగా ఇదొక సంస్కృతి చరిత్ర. మనుషులు ప్రేమతో, పరస్పర గౌరవంతో, నమ్మకంతో, ఆర్తితో, జిజ్ఞాసతో తమ దైనందిన జీవితంలోంచే ఒక జాతిసంస్కృతినెట్లా నిర్మిస్తారో చూపించిన కథ.

నేను మొదటిసారి చదివినప్పుడు, ఆ గురుశిష్యుల ప్రేమానుబంధం, ఆ పూర్వకాలపు గురుకుల విద్యావ్యవస్థ నన్ను బలంగా ఆకట్టుకున్నాయి. రెండవ సారి చదివినప్పుడు, ఆయన సంగం కాలం నాటి సాహిత్యాన్ని ఎట్లా అన్వేషించాడో, ఎట్లా వెలుగులోకి తెచ్చాడో, ఆ పరిశోధన చాల విలువైందిగా అనిపించింది.

కానీ, ఈసారి నా దృష్టి అక్కడ ఆగలేదు. ఆ మనుషులు, వాళ్ళ అన్వేషణ, వాళ్ళ ప్రేమౌదార్యం– కొన్ని ఘట్టాలు, కొన్ని వాక్యాలు, చివరికి కొన్ని పదప్రయోగాలదగ్గర కూడా నేను నిశ్చేష్టుడిగా నిలబడిపోయాను. ఏరీ అటువంటి మనుషులు? ఏదీ అటువంటి పరస్పర ప్రేమాలింగనం? ఏవీ అటువంటి విలువలు? ఎట్లాంటి కాలంలో జీవిస్తున్నాన్నేను? నాకు దుఃఖం ఆగలేదు.

గురువు శైవుడు. శిష్యుడు స్మార్తుడు. ఆదరించిన మఠం వీరశైవులది. అన్వేషించి, అధ్యయనం చేసి అచ్చొత్తించిన గ్రంథాలు జైన, బౌద్ధపారాయణకావ్యాలు. ఆ గురువు అంత్యసమయంలో ఆయన్ని తన ఒడిలో చేర్చుకుని కన్నీళ్ళతో అభిషేకించిన శిష్యుడు శవేరినాథ పిళ్ళై క్రైస్తవుడు. వారినందరినీ కలిపింది తమిళమనే ఒకే ఒక్క స్ఫూర్తి.

'మతములన్నియు మాసిపోవును జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును' అని మహాకవి రాసిన మాటలకి ఇంతకన్నా నిరూపణా ఉంటుందా?

నాకు అట్లాంటి మనుషులు కావాలి. వాళ్ళ కులంతో, మతంతో, ప్రాంతంతో నాకు పనిలేదు. వాళ్ళు భాషకోసం, సాహిత్యం కోసం పనిచేసేవారే కానక్కర్లేదు. ఏదో ఒక స్ఫూర్తి, వారినీ, నన్నూ వెలిగించేది, పదేపదే కలుసుకోవాలని పించేది, ఏదో ఒక పరమార్థం కోసం నడిపించేది, కవి అన్నట్లుగా, 'మునుముందుకు నడిపించేది, పరిపూర్ణపు బతుకిచ్చేది', అటువంటిదేదో కావాలి. ద్వేషం కాదు, ధ్యేయం పంచుకునే వాళ్ళు కావాలి. ఎక్కడున్నారు వాళ్ళు? అటువంటి ఒక మీనాక్షి సుందరం పిళ్ళై, ఒక సుబ్రహ్మణ్య దేశికులు, ఒక త్యాగరాజ చెట్టియారు, ఒక రామస్వామి మొదలియారు– ఎక్కడున్నారు వాళ్ళు?

15-6-2018

# ఆదర్శ ఉపాధ్యాయుడు

**డా. కలాం** భారత రాష్ట్రపతి కాక మునుపు రాసిన పుస్తకాల్లో 'వింగ్స్ ఆఫ్ ఫైర్', 'ఇగ్నైటెడ్ మైండ్స్' చాలా ప్రసిద్ధికెక్కాయి. ఆ రెండు పుస్తకాలూ కూడా నేను అనువాదం చేసాను. ఆయన రాష్ట్రపతి అయిన తరువాత, 'యు ఆర్ బార్న్ టు బ్లోజమ్' అనే పుస్తకంతో పాటు మరికొన్ని పుస్తకాలు రాసారు. ఆ పుస్తకాన్ని నేను 'ఈ మొగ్గలు వికసిస్తాయి' పేరిట అనువదించాను.

రాష్ట్రపతిగా కలాం ఎక్కడెక్కడ పిల్లల్ని కలిసి ఏమేమి మాట్లాడారో ఆ ప్రసంగాల నుంచి గుది గుచ్చిన భావాలతో 'ఇండామిటబుల్ స్పిరిట్' అనే పుస్తకం వెలువడింది. దాన్ని కూడా నేను 'ఎవరికీ తలవంచకు' పేరిట అనువదించాను. ఆ తర్వాత ఆయన ఆచార్య మహాప్రజ్ఞతో కలిసి 'ఫామిలీ అండ్ నేషన్' అనే పుస్తకం రాసారు. దాన్ని 'ఉత్తమ కుటుంబం, ఉదాత్త దేశం' అనే పేరిట తెలుగు చేసాను.

కానీ, ఇవి కాక కలాం తాను స్వయంగా వెలువరించినవీ, ఆయన మీద వెలువడుతున్నవీ ఎన్నో పుస్తకాలున్నాయి. అవి ప్రతి ఒక్కటీ మన కాలంలో మన కళ్ళ ముందు జీవించిన ఒక మహామానవుడి గురించి మరింత తెలుసుకోవాలన్న తృష్ణని

రగిలిస్తూనే ఉన్నాయి. మరీ ముఖ్యంగా, ఆయన చివరి పదేళ్ళ కాలంలో ఆయన్ని చాలా దగ్గరగా చూసినవాళ్ళు కలాం ఎన్నటికీ స్వయంగా చెప్పుకోడానికి ఇష్టపడని ఎన్నో అపురూపమైన సంగతుల్ని మనముందుకు తెస్తున్నారు. ఆ విశేషాలు మనం ప్రతి ఒక్కరం తెలుసుకోదగ్గవి, ముఖ్యం, మన పిల్లలతో పదే పదే చదివించదగ్గవి.

అటువంటి పుస్తకాల్లో మొదట చెప్పవలసింది The Kalam Effect (2008) రాష్ట్రపతిగా కలాం ఎటువంటి ఆదర్శప్రాయమైన జీవితం జీవించారో, ఇప్పటి కల్మష భరిత రాజకీయ వ్యవస్థలో అది ఎంత అరుదైన విషయమో వివరిస్తూ, రాష్ట్రపతి కార్యదర్శిగా పనిచేసిన పరమేశ్వరన్ మాధవన్ నాయర్ వెలువరించిన పుస్తకం అది. ఆ పుస్తకాన్ని గతంలో ఇక్కడ పరిచయం చేసాను కూడా.

ఆ కోవకే చెందిన మరొక పుస్తకం ఈ మధ్యనే చదివాను. సృజన్ పాల్ సింగ్ అనే ఆయన రాసిన What Can I Give? (2016) అనే పుస్తకం. కలాం రాష్ట్రపతిగా పదవీ విరమణ చేసినప్పటినుండీ ఆయన చివరిరోజు దాకా ఎటువంటి తపనతో, ఎటువంటి ఆదర్శాలతో జీవించారో వివరిస్తూ రాసిన పుస్తకం అది. ఆ పుస్తకానికి డా.సింగ్ Life Lessons from my Teacher, A.P.J.Abdul Kalam అనే ఉపశీర్షిక కూడా పెట్టారు.

ఆ పుస్తకం నుంచి ఎత్తి రాయదగ్గవీ, సంతోషంతోనూ, ఉత్సాహంతోనూ పరిచయం చెయ్యదగ్గవీ ఎన్నో ఉన్నాయి. మనకి తెలియని అపురూపమైన సంగతులెన్నో ఉన్నాయి. వాటిల్లోంచి, అన్నిటికన్నా ముందు, ఒక సంగతి మీతో పంచుకోవాలనిపించింది. అదేమిటో డా.సింగ్ మాటల్లోనే చదవండి:

---

1982 లో తమిళనాడులోని విరుధనగరుకి చెందిన పందొమ్మిదేళ్ళ కుర్రవాడొకడు సైన్యంలో సిపాయిగా చేరాడు. అతని పేరు వి. కదిరేశను. అతణ్ణి హైదరాబాదులో డి.ఆర్.డి.ఓ లో పనిచేస్తున్న ఒక సీనియరు సైంటిస్టుకి డ్రైవరుగా పనిచేయడానికి డెప్యుటేషను మీద పంపించారు. ఆ సైంటిస్టు డా.ఎ.పి.జె.అబ్దుల్ కలాం.

అతడు పనిలో చేరిన కొన్నాళ్ళకు ఒక రోజు కలాంని బండిమీద తీసుకువెళ్తూండగా, కలాం అతణ్ణి 'కదిరేశన్, నువ్వెన్నో క్లాసుదాకా చదువుకున్నావు?' అనడిగాడు.

'నేను పదో తరగతి ఫెయిలయ్యాను. ఇంగ్లీషులో తప్పాను సార్' అన్నాడే గాని ఒక విదేశీ భాషలో తప్పినందుకు ఆ యువకుడి కంఠస్వరంలో ఎటువంటి చింతగాని, విచారం గాని ధ్వనించలేదు.

'ఓహ్! కాని నువ్వు పదవతరగతి పాసయి తీరాలి. ఇంగ్లీషులో మంచి మార్కులు తెచ్చుకోవాలి' అన్నాడు అతడి బాస్. ఆ యాభై ఏళ్ళ యువకుడు, ఆ పందొమ్మిదేళ్ళ యువకుడి ముందొక సవాలు విసిరినట్టునట్టుగా అన్నాడా మాటలు. కాని ఆ యువకుడి సంకోచాన్ని కనిపెట్టినట్టుగా మరో మాట కూడా అన్నాడు: 'నేను కూడా నీకు సాయ పడతాను.'

తొందరలోనే కలాం, కదిరేశను గురుశిష్యులుగా మారిపోయేరు. వాళ్ళు పెట్టుకున్న లక్ష్యం చాలా చిన్నది–కదిరేశను పదవ తరగతి పాసవడం, ఇంగ్లీషులో మంచి మార్కులు తెచ్చుకోడం. అంతే. అన్న మాట ప్రకారం డా.కలాం ప్రతి రోజూ డి.ఆర్.డి.ఓలో తన ఆఫీసు పని పూర్తయ్యాక, కదిరేశనుకి ఇంగ్లీషు పాఠాలు, ముఖ్యంగా గ్రామరు బోధించేవారు. ఏడాది తిరక్కుండానే కదిరేశను పదోతరగతి పరీక్ష పాసయ్యాడు.

కాని డా.కలాం అక్కడితో ఆగలేదు. కాని అతడి గురించి తాను పెట్టుకున్న లక్ష్యాల్ని ఒక్కసారిగా కాకుండా నెమ్మదిగా ఒక్కొక్కటే అతడిముందు పెట్టడం మొదలు పెట్టారు. ఎందుకంటే, 'ఆశయాలు చిన్నవిగా ఉండటం అపరాధం' అని కలాం అనేవారని మనకు తెలుసు.

'ఇప్పుడు నువ్వు ఇంటర్మీడియేటు పూర్తిచెయ్యాలి' అన్నారు డా. కలాం ఒకరోజు కదిరేశనుతో, ఈసారి మరొక కొత్త లక్ష్యం అతడిముందు పెడుతూ. అతడికి ధైర్యంగా ఉండటం కోసం, అతడి పరీక్ష ఫీజు తానే కట్టారు, పుస్తకాలు కూడా తానే కొనిపెట్టారు. అతణ్ణింకా ఉత్సాహపరచడానికి రోజూ అతడితో పోటీ పడేవారు, రోజూ ఎవరి ఉద్యోగం వారు చేసుకున్నాక, రాత్రి పూట, ఇద్దరూ ఎవరి పుస్తకాలు వాళ్ళు చదువుకోడం మొదలుపెట్టేవారు. గురువు లైబ్రరీ పుస్తకాలు చదువుకుంటూ ఉంటే, శిష్యుడు క్లాసు

పుస్తకాలు చదువుకుంటూ ఉండేవాడు. ఎవరు ఎంత ఎక్కువ సేపు చదివితే వాళ్ళా రోజు పోటీలో నెగ్గినట్టు. ఏమైతేనేం, కదిరేశను 51.4 శాతంతో ఇంటర్మీడియేటు పాసయ్యాడు. అదంతా తన గురువు తనకందించిన స్ఫూర్తివల్లనేనని అతడికి తెలుసు. అతడు సంతోషంతో పొంగిపోయాడు. కాని, డా.కలాంకి అక్కడితో తృప్తి లేదు.

'నువ్వు కంప్యూటరు సైన్సు చదవాలి, బి.ఎస్.సి చెయ్యి' అన్నారు కలాం. రానున్న రోజుల్లో కంప్యూటర్లు ఎటువంటి పాత్ర వహిస్తాయో చూడగలిగిన దార్శనికుడు ఆయన. ఆ పిల్లవాడు కంప్యూటరు సైన్సు చదువుకుంటే, భవిష్యత్తులో గొప్ప స్థానానికి చేరుకో-గలడని భావించారాయన. కాని, ఈసారి మాత్రం ఆయన రాజీ పడక తప్పలేదు. కదిరేశను సాంఘికశాస్త్రాల పట్ల మొగ్గు చూపించాడు.

దాంతో అతడు బి.ఏ చదవడానికే ఇద్దరూ ఒప్పుకున్నారు. అప్పుడు ఆ గురువు తన శిష్యుడికి ప్రపంచ చరిత్ర, ముఖ్యంగా, రెండు ప్రపంచ యుద్ధాల చరిత్ర, స్వయంగా బోధించడం మొదలుపెట్టాడు. ఈ సారి కూడా కదిరేశను పరీక్షల్లో 51 శాతం సాధించాడు. అతడి కుటుంబసభ్యుల ఆనందానికి హద్దుల్లేవు. తాను జీవితంలో ఎంత సాధించవచ్చునో అంతా సాధించాననుకున్నాడు కదిరేశను.

కాని ఆ గురువు అక్కడితో సంతృప్తి చెందలేదు. అతడు తన శిష్యుణ్ణి మరింత ముందుకి నడిపించాలనుకున్నాడు. 'నువ్విప్పుడు పోస్టు గ్రాడ్యుయేషను చెయ్యాలి. నన్నడిగితే పొలిటికలు సైన్సు చదవడం మంచిది' అన్నారాయన. తన గురువుకి తన పట్ల ఉన్న నమ్మకాన్ని చూసి కదిరేశనుకి సంతోషంగానే ఉండిందిగాని, పోస్టు గ్రాడ్యుయేషను చెయ్యడంలో కొత్త సమస్య ఒకటి కనిపించిందతడికి. ఎందుకంటే, తన గురువు టెక్నాలజీలో గ్రాడ్యుయేషను మాత్రమే చేసాడు. ఇప్పుడు తాను పి.జి చేస్తే ఈ డ్రైవరు తన బాసు కన్నా విద్యాధికుడైపోతాడు!

కాని గొప్ప గురువులెప్పుడూ తమ శిష్యులు తమ జీవితకాలం లోనే తమను దాటి పైకెదగాలని కోరుకుంటారు కదా. డా.కలాం నిస్సందేహంగా ఒక ఆదర్శ ఉపాధ్యాయుడు. కాని కదిరేశను ప్రయాణించవలసిన మార్గంలో ఇప్పుడెన్నో అడ్డంకులు కనిపించడం మొదలుపెట్టాయి. ఒకసారైతే అతడు పరీక్ష రాయడం కొద్దిలో మిస్సయి

ఉండేవాడు. అతడు పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకోడానికి డా.కలాం విమానం టికెట్టు కొనిచ్చి మరీ చెన్నై పంపించారు.

డా.కలాం కార్యాలయంలో డ్రైవరుగా చేరి పదేళ్ళు తిరిగే లోపల, కదిరేశను, పదవ తరగతి, ఇంటర్మీడియేటు, బి.ఏ, ఎం.ఏ, బి.ఇడి, ఎం.ఇడి పరీక్షలు రాసి ఉత్తీర్ణుడైపోయాడు.

1992 లో కదిరేశను తిరిగి మళ్ళా సైన్యంలో చేరిపోవలసి వచ్చింది. దాంతో అతడు తన గురువుని వదిలిపెట్టిపోక తప్పలేదు. కాని చదువు పట్ల గురువు తనలో రగిలించిన తృష్ణ అతణ్ణి వెంటాడటం మొదలుపెట్టింది. 1998 లో అతడు ఉద్యోగం వదిలిపెట్టేసాడు. మనోన్మనియం సుందరేశన్ విశ్వవిద్యాలయంలో పి.ఎచ్.డికి రిజిస్టరు చేసుకున్నాడు. 2001 కల్లా పి.ఎచ్.డి పూర్తిచేసేసాడు. ఆ తర్వాత తమిళనాడు ప్రభుత్వ విద్యాశాఖలో చేరి చాలా ఏళ్ళ పాటు ఉద్యోగం చేసాడు. 2010 నాటికి అతడు తిరునల్వేలి ప్రభుత్వ ఆర్ట్సు కళాశాలలో అసిస్టెంటు ప్రొఫెసరుగా పనిచేయడం మొదలుపెట్టాడు.

కలాం ఈ కథ చెప్తున్నప్పుడు అక్కడున్నవాళ్ళల్లో ఒకరు కదిరేశను జీవితం నుంచి ఇప్పటి యువత గ్రహించదగ్గ సందేశం ఏమిటనుకుంటున్నారని డా.కలాంని అడిగారు. ఆయనిలా అన్నారు: 'అతడు తన తీరికసమయంలో ఏ నైపుణ్యాలు పెంచుకోవాలో వాటిని పెంచుకున్నాడు. గొప్ప నిబద్ధతతో, గొప్ప అంకితభావంతో. అది అతడి భవిష్యత్తుని సుగమం చేసింది, అతడి జీవనోపాధిని మెరుగుపరిచింది. మీక్కూడా అటువంటి భవిష్య దృష్టి అంటూ ఒకటుండి, దాన్నెట్లాగేనా సాధించాలన్న పట్టుదల ఉంటే, మీరు కూడా తప్పకుండా విజయం సాధిస్తారు.'

డా.కలాం ఈ లోకాన్ని వదిలిపెట్టినప్పుడు, ఆయన కడసారి దర్శనం కోసం రామేశ్వరం బయలుదేరుతూ, కదిరేశను అన్న మాట ఒక్కటే: '. ..కాని ఆయన దగ్గర కంప్యూటరు నేర్చుకోలేకపోయానన్న చింత అయితే ఒకటి మిగిలిపోయింది.'

7-9-2019

# ఒక భారతీయ తీర్థయాత్రీకుడు

**ప్రసిద్ధ** ప్రచురణకర్త ఒకాయన, ఈ మధ్య సుభాసుచంద్ర బోసు మీద ఒక జీవితచరిత్ర వెలువరిస్తూ, ముందుమాట రాయగలరా అని నాకు పంపించాడు. ఆయన ఆ పుస్తకం పంపి నాకు గొప్ప ఉపకారం చేసాడు. లేకపోతే, నేతాజీ పుట్టి 125 ఏళ్ళు కావొస్తున్న ఈ తరుణంలో కూడా నేనింకా నేతాజీకి యోజనాల దూరంలోనే నిలబడిపోయి ఉండేవాణ్ణి.

ఆ జీవితచరిత్ర చదవడమైతే పూర్తి చేసేసానుగాని, ఈ రెండువారాలుగా నా ఆలోచనలు నేతాజీ చుట్టూతానే పరిభ్రమిస్తూ ఉన్నాయి. ఆయన గురించి చదవవలసి-నంతగా చదవలేదనీ, తెలుసు కోవలసినంతగా తెలుసుకోలేదనీ అనిపిస్తూ ఉంది. అందుకని ఆయన రచనల కోసం వెతికాను. ఆయన జీవితకాలంలో రాసిన వ్యాసాలూ, ఉత్తరాలూ మాత్రమే కాక, ఆయన మొదలుపెట్టి పూర్తి చెయ్యలేకపోయిన స్వీయ చరిత్రకూడా ఇంటర్నెట్టు పుణ్యమా అని ఇప్పుడు మనకి లభ్యంగా ఉన్నాయి.

An Indian Pilgrim (1948) అనే స్వీయ చరిత్రతో పాటు, నేతాజీ రిసెర్చి బ్యూరో సంకలనం చేసిన Cross Roads 1938-40 (1962), Indian Struggle

1920-42 (1964) ఇప్పుడు మనకి అందుబాటులో ఉన్నాయి. తిరిగి ఈ రచనలనుండి ఎంపిక చేసిన ప్రసంగాలు పబ్లికేషన్సు డివిజను ప్రచురించిన మరో పుస్తకం ఎలానూ ఉండనే ఉంది. మొత్తం రచనలన్నీ కలిపి వెయ్యి పేజీలకు మించి లేవు.

సుభాసుచంద్ర బోసు అనే అత్యంత ప్రతిభావంతుడూ, మహాసాహసికుడూ, మహాత్ముడు అభివర్ణించినట్టుగా 'ప్రిన్స్ ఆఫ్ ద పేట్రియాట్స్', లేదా మహాత్ముడే మరోసారి అన్నట్టుగా 'పేట్రియాట్ ఆఫ్ ద పేట్రియాట్స్' గురించి సమగ్ర అవగాహన ఏర్పరచుకోడానికి ఈ కొద్దిపాటి సంచయం చాలు. కాని ఈ రచనల్లో ఎంతో స్పష్టంగా, ఎంతో జాజ్వల్యమానంగా కనిపించే ఈ వీరాధివీరుడి గురించి మనకి, అంటే ప్రజాబాహుళ్యానికి మాత్రమే కాదు, చదువుకున్నవారికి కూడా తెలిసింది చాలా తక్కువ.

ఉదాహరణకి, తక్కిన రచనలు అలా ఉంచి, ఆయన ఆత్మకథ తీసుకుందాం. దీన్ని ఆయన 'ఇండియన్ స్ట్రగుల్' (1934) పుస్తకంతో పాటు 1937 లో తన సహచరి, ఆస్ట్రియను వనిత ఎమిలి షెంకెకి డిక్టేటు చేసారు. 1897 నుంచి 1937 దాకా నడిచిన తన జీవిత ప్రయాణాన్ని ఆయన, ఆస్ట్రియాలో బడ్గస్టెయినులో ఉన్నప్పుడు, స్వీయచరిత్రగా రాయడం మొదలుపెట్టారు. మొత్తం 13 అధ్యాయాలుగా రాయాలని సంకల్పించుకున్న తన ఆత్మకథని ఆయన 1921 నాటి దాకా మాత్రమే రాయగలిగారు. ఆ తర్వాత భారతదేశానికి రావడంతో, మరి వెనక్కి తిరిగి చూడటానికి వ్యవధి లేకపోవడంతో ఆ రచన అసంపూర్తిగా ఆగిపోయింది. అయినప్పటికీ, ఆ అసంపూర్తి రచనని ప్రచురించాలని అనుకున్నప్పుడు దానికి ఏమి పేరుపెట్టాలని మిత్రులు అడిగితే An Indian Pilgrim (ఒక భారతీయ తీర్థయాత్రీకుడు) అని పేరుపెట్టమన్నారాయన.

పట్టుమని నూటయాభై పేజీలు కూడా లేని ఈ రచన నేను చదివిన అత్యున్నత జీవితచరిత్రల్లో మొదటివరసలో నిలబడే రచన అని నిస్సంకోచంగా చెప్పగలను. ఇందులో నేతాజీ తన జీవితంలోని మొదటి 24 ఏళ్ళ సంఘటనల్ని మాత్రమే వివరించినప్పటికీ, ఆ తర్వాత 24 ఏళ్ళ పాటు ఆయన ఒక మహోన్నత నాయకుడిగా ఎలా రూపొందాడో తెలుసుకోడానికి ఈ రచన సంపూర్ణ నేపథ్యాన్ని సమకూరుస్తుంది. ఈ రచనని తెలుగులో ఎవరన్నా అనువదించారో లేదో నాకు తెలియదు. కాని నేతాజీ గురించి తెలుసుకోవలసిన ప్రతి ఒక్క విద్యార్థికి కూడా ఈ రచన అవశ్య పఠనీయం.

నేతాజీ సుభాసుచంద్ర బోసు 1897 లో కటకులో జన్మించారు. (అల్లూరి సీతారామ-రాజు పుట్టింది కూడా ఆ ఏడాదే కావడం గమనార్హం. ఇద్దరి జీవితాలకీ చాలా పోలికలు ఉన్నాయి.) 1945 లో అదృశ్యమైపోయారు. ఆయన మృతి మీద ఇప్పటికి మూడు ఎంక్వయరీ కమిషన్లు, 200 నివేదికలు వెలువడినప్పటికీ, ఆయన మృతి చెందాడని పూర్తిగా నమ్మనివాళ్ళు ఇంకా ఉన్నారు. 2018 లో వెలువడిన అశీష్ రే రచన Laid to Rest లో నేతాజీ మృతి చెందినట్టే అని సంపూర్ణంగా నిర్ధారించినప్పటికీ, నేను కూడా అసంఖ్యాకులైన ఆయన అభిమానుల్లాగా, నేతాజీకి వర్ధంతి లేదనే నమ్ముతాను. తనని చూడవచ్చిన నేతాజీ బంధువులతో, 1945 లో మహాత్ముడు, నేతాజీకి శ్రాద్ధకర్మలు చేయవద్దు, కేవలం ప్రార్థనలు ఘటించండి అని చెప్పాడుట. నేతాజీకి మరణం లేదనే మహాత్ముడి నమ్మకంలో ఉన్న అమాయికత్వం నాకు కూడా సిద్ధించుగాక!.

నేతాజీ దృశ్యజీవితం మొత్తం 48 ఏళ్ళు. అందులో మొదటి 24 ఏళ్ళు బాల్యం, విద్యార్థి దశ, చివరలో కేంబ్రిడ్జిలో కేవలం ఎనిమిది నెలల ప్రిపరేషనుతో ఇండియను సివిలుసర్వీసు పరీక్షలో నాలుగవ రాంకులో ఉత్తీర్ణుడు కావడం, కాని ఆ ఉద్యోగంలో చేరకుండా రాజీనామా చేసి భారతదేశానికి రావడం ఉన్నాయి. ఆ తర్వాత 24 ఏళ్ళ మహోద్ధృత జీవితం, సంగ్రామం. ఆయన రాసిన 'ఇండియన్ స్ట్రగుల్' పుస్తకంలో ఆ ఉత్తరార్ధ జీవితం మనకి తన చరిత్రగా కాక, భారతదేశ చరిత్రగా కనిపిస్తుంది.

ఆయన ఆత్మకథలోని మొదటి 24 ఏళ్ళ జీవితం ప్రతి ఒక్క యువకుడూ చదవవలసిన పుస్తకం. ముఖ్యంగా పదిహేను, పదహారేళ్ళ వయసులో మొదలై పాతికేళ్ళదాకా ప్రతి యువకుణ్ణీ వేధించే ప్రశ్నలు సుభాసుని కూడా వేధించాయనీ, అది కూడా మామూలుగా కాదు, అత్యంత తీవ్రంగా వేధించాయనీ, వాటికి జవాబు వెతుక్కునే క్రమంలోనే ఆయన మహోన్నతుడైన వ్యక్తిగా రూపొందాడనీ అర్థమవుతుంది.

తొమ్మిది అధ్యాయాల ఈ రచనకి అనుబంధంగా 'నా విశ్వాసాలు' అనే మరొక అధ్యాయం కూడా ఉంది. నిజానికి ఆ అధ్యాయాన్ని ఆయన నా ఆధ్యాత్మిక విశ్వాసాలు, నా రాజకీయ విశ్వాసాలు, నా ఆర్థశాస్త్ర విశ్వాసాలు అని మూడు భాగాలుగా రాయాలని అనుకున్నారట. కాని ఆధ్యాత్మిక విశ్వాసాల భాగం దగ్గరే పుస్తకం ఆగిపోయింది.

అలాగని ఆ పుస్తకం అసంపూర్ణమని అనిపించకపోగా ఆయన జీవితపూర్వార్ధానికి సారాంశంగా కనిపిస్తుంది.

తొమ్మిది అధ్యాయాల్లోనూ మొదటి మూడు అధ్యాయాలూ తన తల్లిదండ్రులు, తన పూర్వీకులు, తాను పుట్టకముందు పరిస్థితుల చిత్రణ. తర్వాతి రెండు అధ్యాయా–ల్లోనూ ప్రాథమిక పాఠశాలలో, హైస్కూల్లో తన చదువు గురించిన జ్ఞాపకాలు. ఆ తర్వాత రెండు అధ్యాయాల్లో కలకత్తా ప్రెసిడెన్సీ కాలేజిలో చదువు, ఆ కాలేజినుంచి తనని బహిష్కరించడానికి దారితీసిన సంఘటనల వివరణ. ఆ తరువాతి అధ్యాయంలో తిరిగి మళ్ళా చదువు కొనసాగించిన సంగతి, చివరి అధ్యాయం, అన్నిటికన్నా పెద్ద అధ్యాయం తాను కేంబ్రిడ్జిలో చేరడం, సివిలు సర్వీసులో ఉత్తీర్ణుడు కావడం, కాని బ్రిటిషు యంత్రాంగం కింద బానిసగా పనిచెయ్యడం ఇష్టం లేక, ఆ సర్వీసుకి రాజీనామా ఇవ్వడం.

పుస్తకం చదివేక, ఆయన తనని తాను ఇండియన్ పిలిగ్రిమ్ అని ఎందుకు పిలుచుకున్నాడో మనకి అర్థమవుతుంది. ప్రాయికంగా ఆయన ఒక ఆత్మాన్వేషకుడనీ, తానొక యోగి కావాలని పరితపించాడనీ, ప్రాపంచిక బంధాల్లో కూరుకుపోకుండా, జీవిత సత్యాన్ని దర్శించడానికి తపించాడనీ ఆ జీవితకథనం ప్రత్యక్షరం మనకి పొల్లుపోకుండా వివరిస్తుంది. తన స్కూలు రోజుల్లో వేణీమాధవ్ అనే ప్రధానోపాధ్యాయుడు తన నిర్మల నైతికతతో బాల సుభాసు హృదయం మీద చెరగని ముద్రవేసాడు. ఆ నైతికతకు గొప్ప మేధ తోడైతే ఎలా ఉంటుందో తర్వాత వివేకానందుడి రచనల్లో కనబడింది. ఆ మేధకూ, ఆ నైతికతకూ అవలంబంగా ఉండే ఆధ్యాత్మిక కాంతి రామకృష్ణ పరమహంసలో కనబడింది. ఆ విధంగా ముగ్గురు ఉపాధ్యాయులు ఆయనకు దొరకడం మన అదృష్టం.

తన అన్వేషణకు మార్గం చూపిస్తుందేమోనని ఆయన కళాశాలలో తత్త్వశాస్త్ర విద్యార్థిగా చేరాడు. కాని పాశ్చాత్య తత్త్వశాస్త్రం తనకి నిశ్చయాత్మక జ్ఞానాన్ని ఇవ్వకపోగా, ప్రతి నిశ్చయజ్ఞానాన్నీ ప్రశ్నించగల critical frame of mind ని ఇచ్చిందని చెప్పుకున్నాడు. మరొకవైపు శంకరాచార్యుల మాయావాదంతో ఆయన పెనగులాడుతూనే ఉన్నాడు. దాన్ని పూర్తిగా నమ్మలేదు, అలాగని వదులుకోలేదు. చివరికి తన కళాశాల

ప్రిన్సిపాలు తనని కాలేజినుంచి సస్పెండు చేస్తున్నట్టు చెప్పిన రోజున ఆ మాయావాదం 'గోడకి కొట్టిన మేకు' లాగా నిర్జీవంగా మిగిలిపోయిందని చెప్పుకుంటాడు.

యోగుల గురించిన అన్వేషణా, ఏదో ఒక రూపంలో సంఘసేవ చెయ్యాలన్న కోరికా తనని నిలవనివ్వకుండా నడుస్తున్న కాలంలో తండ్రి తనని సివిలు సర్వీసు పరీక్ష కోసం కేంబ్రిడ్జి పంపించాడు. ఎనిమిది నెలల అతి తక్కువ వ్యవధిలో పరీక్షకు ప్రిపేరు అయ్యాడు. తీరా పరీక్షలో సంస్కృతం పేపరు రాస్తూ ఉండగానే టైము అయి పోయింది. తాను ఫెయిలవడం ఖాయమనుకున్నాడు. విధి మరోలా తలిచింది. మొత్తం దేశంలోనే ఆయన నాలుగవ స్థానంలో ఉత్తీర్ణుడయ్యాడు. అది ఆయన జీవితంలో ఆ వయసు యువకుడు ఎవరూ అంతదాకా తీసుకుని ఉండని కఠోర నిర్ణయం వైపు నడిపించింది. దాంతో ఇండియను సివిలు సర్వీసు చరిత్రలో మొదటిసారిగా ఒక భారతీయ యువకుడు సివిలు సర్వీసులో చేరకుండా తన స్వాతంత్ర్యాన్ని కాపాడు కుంటానని ప్రకటించాడు.

తాను ఆ నిర్ణయం ఎందుకు తీసుకోవలసి వచ్చిందో ఆయన తన సోదరుడు శరచ్చంద్రబోసుకి సవివరంగా ఒక ఉత్తరం రాసాడు. సుప్రసిద్ధ అమెరికను స్వాతంత్ర్య ప్రకటనలాగా అది కూడా ఒక స్వాతంత్ర్య ప్రకటన. మహాత్ముడి సుప్రసిద్ధ కోర్టు వాఙ్మూలం కూడా ఆ తర్వాత వెలువడిందేనని మనం గుర్తుపెట్టుకుంటే, అప్పటిదాకా, ఏ భారతీయుడూ అటువంటి స్వేచ్ఛా ప్రకటన చేసి ఉండలేదని చెప్పవచ్చు. అందులో ఆయన ఇలా రాస్తున్నాడు:

> ఒక మనిషి తన అత్యున్నత జీవితాదర్శాలూ ఒక ఇండియను సివిలు సర్వీసు అధికారి అంగీకరించవలసిన సర్వీసు కండిషన్లూ ఒకదానితో ఒకటి పొసగు-తాయని అనుకోవడం ఆత్మవంచన తప్ప మరేమీ కాదు.
>
> మామూలుగా దారిన పోయే ఏ దానయ్య అయినా ఎంతో అద్భుతమైందిగా భావించే ఈ ఉద్యోగద్వారం దగ్గర నిలబడ్డ ఇప్పటి నా మనఃస్థితి ఏమిటో నువ్వు గుర్తించగలవనుకుంటాను. ఇటువంటి ఉద్యోగంలో ఉండే అవకాశాల గురించి ఎంతయినా చెప్పవచ్చు. జీవనోపాధికి సంబంధించిన సమస్యని

ఈ ఉద్యోగం ఒక్కసారిగా పరిష్కరించేస్తుంది. ఇక మీదట విజయాలతోనూ, వైఫల్యాలతోనూ సంబంధం లేకుండా జీవితాన్ని నిశ్చింతగా కొనసాగించ-వచ్చు. కాని నాలాంటి వ్యక్తిత్వం, ఇంకా చెప్పాలంటే విచిత్ర వ్యక్తిత్వం ఉన్న వాడికి అలా నిశ్చింతగా జీవితం వెళ్ళదీయడం ఎంత మాత్రం ఆదర్శం కానే కాదు. సంఘర్షణ లేకపోతే, సవాళ్ళు ఎదురుకాకపోతే జీవించడంలో ఆకర్షణే లేదు. ప్రాపంచికసుఖాల పట్ల తృష్ణలేనివాడికి జీవితంలోని అనిశ్చయత భయం కలిగించే ప్రసక్తి లేనేలేదు. అదీకాక సివిలు సర్వీసు సంకెళ్ళలో తగులుకున్నాక, నువ్వు నీ మాతృదేశాన్ని సంపూర్ణంగా సేవించడం సాధ్యం కాదు. ఒక్కమాటలో చెప్పాలంటే నా జాతీయ, ఆధ్యాత్మిక ఆదర్శాలూ సివిలు సర్వీసు విధేయతా ఒకదానికొకటి ఎంత మాత్రం పొసగవు. ..

బహుశా నువ్వొక మాట చెప్పవచ్చు. అదేమంటే, ఈ క్రూరవ్యవస్థని బయట నుంచి వదిలిపెట్టడం కంటే, దీనిలో ప్రవేశించి దాంతో పూర్తిగా పోరాడటం మంచిదని అనవచ్చు. కాని అప్పుడు అటువంటి పోరాటాన్ని ఒక్కడే ఒంటిచేత్తో చెయ్యవలసి ఉంటుంది. పైనుంచి అభిశంసన, ప్రమోషన్ల నిలుపుదల, దూర ప్రాంతాలకు, అనారోగ్యకరమైన ప్రదేశాలకు బదిలీలు ఎలానూ తప్పవు. అటువంటి సర్వీసులో చేరి చెయ్యగల మంచి, అటువంటి సర్వీసులో చేర కుండా బయట ఉండి చెయ్యగల మంచిముందు లవలేశం కూడా కాదు.

నిజమే, రమేష్‌చంద్ర దత్తు ఉన్నాడు. ఆయన సర్వీసులో ఉండి కూడా గొప్పగా పనిచేయకపోలేదు. కాని ఆయన ఆ బ్యురోక్రసీలో భాగం కాకపోయుంటే అంతకన్నా గొప్ప పని చెయ్యగలిగి ఉండేవాడనుకుంటాను.

అదీ కాక, ఇక్కడున్నది సిద్ధాంత పరమైన సమస్య. నా ముందున్న యంత్రాంగం కాలం చెల్లిన వ్యవస్థ. అదిప్పుడు యథాతథవాదానికీ, స్వార్థానికీ, హృదయ-రాహిత్యానికీ, రెడ్ టేపిజానికీ పర్యాయపదంగా మారిపోయింది. అటువంటి యంత్రాంగంలో భాగం కావడం సిద్ధాంతపరంగా నాకెంత మాత్రం అంగీకార యోగ్యం కాదు.

23 ఏళ్ళ ఒక యువకుడు ఇటువంటి వాక్యాలు రాసాడంటే నమ్మశక్యంగా ఉండదు. కాని ఇటువంటి వాక్యాలు రాసాడుకనుకనే మరొక ఇరవయ్యేళ్ళ తరువాత ఆయన చరమ భారతస్వాతంత్ర్య సంగ్రామాన్ని మొదలుపెట్టగలిగాడు.

ఆ యువకుడికి ఇంత ఆత్మస్థైర్యాన్ని ఇచ్చిందెవరు? 'ఒక ప్రభుత్వాన్ని అంతం చేయాలనుకుంటే నువ్వు ఆ ప్రభుత్వంలో భాగం కాకూడదు' అని కూడా రాసాడు ఆ ఉత్తరంలో. 'నేనీ మాటలు రాయడానికి కారణం టాల్‌స్టాయి చెప్పాడనో, గాంధీ చెప్పాడనో కాదు.. నేను ఈ విషయాన్ని స్వయంగా నమ్ముతుండటమే అందుకు కారణం' అని కూడా రాసాడు.

ఆ కాలమంతటా ఆయన్ని అరవిందుడు ఆవహించి ఉన్నాడని కూడా మనకు తెలుసు. ఆధ్యాత్మిక, జాతీయ ఆకాంక్షలు ఒకదానికొకటి విరుద్ధం కాదనే నమ్మకం అప్పటికి ఆయనకి స్థిరపడింది. అయితే అది ఒకరోజులో జరిగింది కాదనీ, ఆ మొదటి ఇరవై మూడేళ్ళ జీవితమూ కూడా ప్రతి ఒక్కరోజూ, ఆయన్ని ఆ స్వేచ్ఛాసంకల్పం వైపుగా నడిపిస్తూనే ఉన్నదని ఈ స్వీయచరిత్ర చదివితే మనకి రూఢి అవుతుంది.

28-5-2022

# ప్రిన్స్ ఆఫ్ ద పేట్రియాట్స్

**భారత** జాతీయోద్యమ నాయకుల్లో నేతాజీ సుభాసుచంద్ర బోసు అద్వితీయుడు. ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న ఝాన్సీ లక్ష్మిబాయి, బహదూర్ షా జఫరు, నానాసాహెబు, తాంతియా తోపే లాగా సాయుధవీరుడు, సాహసికుడు. బ్రిటిషు ప్రభుత్వం మీద బాంబులు విసిరి వలసపాలకుల్ని భయభ్రాంతుల్ని చేసిన ఖుదీరాంబోసు, రాస్ బిహారీ బోసు, భగత్ సింగు, చంద్రశేఖర్ ఆజాదుల లాగా విప్లవకారుడు. శాంతియుత నిరసన ద్వారా దేశ ప్రజల్లో ఆత్మగౌరవాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ ప్రోది చేసిన మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా అబుల్‌కలాం అజాద్, చిత్తరంజను దాసుల లాగా సత్యాగ్రాహి, అహింసా వాది. గారిబాల్డీలాగా, మాజినీలాగా, డి వలేరా లాగా జాతి విముక్తి సేనను నిర్మించి సంగ్రామం సాగించిన మహాసేనాధిపతి, పోరాటకారుడు.  జీవించింది 48 ఏళ్ళే అయినప్పటికీ, భారతదేశ చరిత్రలో తరతరాల పాటు గుర్తుండిపోయే అమర వీరుడు.

ఒక్క మనిషిలో ఉన్న ఇన్ని పార్శ్వాలు మరే నాయకుడిలోనూ మనకు కనిపించవు. అటువంటి మహానాయకుడి గురించి ఇప్పటిదాకా ఎన్నో పుస్తకాలు వెలువడినా, వెలువడుతూనే ఉన్నా, అవన్నీ ఏదో ఒక పార్శ్వంలో అసమగ్రమనే అనిపిస్తాయి. ఎందుకంటే, ఒకటి ఆయన మరణించలేదు, జీవించి ఉన్నాడనే ఆశ. మరొకటి, ఆయన జీవితంలోని ఎన్నో అంశాలు ఇంకా వివిధ ప్రభుత్వాల ఫైళ్ళల్లోనే నిక్షిప్తమైపోయి,  ఇంకా వెలుగు చూడకపోవడం.

నేతాజీ సన్నిహితుల్లో ఒకరైన గిరిజ.కె.ముఖర్జీని భారతప్రభుత్వం నేతాజీ జీవితచరిత్ర రాయమని అడిగినప్పుడు, ఆయన అటువంటి జీవితచరిత్ర సంగ్రహంగా రాయాలంటే కూడా ఎంతో అధ్యయనం అవసరమని అన్నాడు. అయినప్పటికీ పబ్లికేషన్సు డివిజను కోసం ఆయన నేతాజీ మీద రాసిన మోనోగ్రాఫు (1973) లో నేతాజీ సమగ్ర చరిత్ర తాను రాయగలిగేది కాదనీ, అది భవిష్యత్తులో ఎప్పటికైనా రాగలదనీ ఆశాభావం వ్యక్తం చేసాడు.

ఇప్పుడు నేతాజీకి చెందిన చాలా ప్రభుత్వ సమాచారం బహిర్గతం అయినతరువాత, ఆ ఫైళ్ళని పబ్లిక్కు డొమైనులో పెట్టడం కోసం గొప్ప ప్రయత్నం చేసిన చంద్రచూర్ ఘోష ఇటీవలనే Bose: The Untold Story of An Inconvenient Nationalist (2022) అనే ఒక సమగ్ర అధ్యయనాన్ని వెలువరించారు. కాని ఆయన కూడా తన పుస్తకంలో, ఇంత దాకా ఎవరూ స్పృశించని, చర్చించని అంశాల మీదనే తాను దృష్టిపెట్టానని చెప్పుకున్నారు.

అదీ కాక, నేతాజీకి సంబంధించి మిగిలిన ఫైళ్ళు కూడా వివిధ ప్రభుత్వాలు పూర్తిగా బహిర్గతం చేయవలసి ఉంది. అవి కూడా బహిర్గతమయితే, భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఆజాదు హిందు ఫౌజు పాత్ర గురించిన అత్యంత విశ్వసనీయ సమాచారం చిక్కుతుంది. నేతాజీ మూర్తిమత్వం గురించిన సంపూర్ణ ముఖచిత్రం ఆవిష్కృతమవుతుంది.

ఒక మహానాయకుడి జీవితం గురించిన సమాచారాన్ని అరకొరగా పేర్చుకుంటూనే ఈలోగా, మనం ఆయన 125 వ జయంతి వత్సరం వేడుక జరుపుకోవడం మొదలుపెట్టాం. తెలియవలసిన సమాచారం అలా ఉంచి, ఇంతదాకా మనకు తెలిసిన సమాచారమే చాలు ఆయన నిజంగానే 'ప్రిన్స్ ఆఫ్ పేట్రియాట్స్' అని సంస్తుతించడానికి!

ఇంతవరకూ లభ్యమవుతున్న సమాచారం ఆధారంగా ఒక Netaji narrative ని సమకూర్చడంలో ఈ రచయిత జయసూర్య కృతకృత్యుడయ్యాడని చెప్పవలసి ఉంటుంది. ఎందుకంటే అందరికన్నా ముందు, తక్కిన ప్రపంచం కన్నా కూడా, నేతాజీ గురించి సరిగ్గా తెలుసుకోవలసినవాళ్ళు భారతీయులే.

ఒకప్పుడు బ్రిటిషు వాళ్ళు పనిగట్టుకు ప్రచారం చేసిన దుష్ప్రచారం కొంతా, ఆ తరువాత స్వతంత్ర భారతప్రభుత్వాలు చూపించిన నిర్లక్ష్యం మరికొంతా కలిసి, నేతాజీ పట్ల ఒక అస్పష్ట దృష్టిని, ఒక అపార్థ మనఃస్థితిని దేశస్మృతిలోకి చొప్పించాయి. ఇప్పుడు అన్నిటికన్నా ముందు ఆ మసక చూపునుంచి మనం బయటపడాలి. ఏ విధంగా చూసినా మహాత్మాగాంధికి

సమతుల్యుడైన ఆ మహానాయకుడి గురించి మనం ఇప్పటినుంచే అవశ్యం మన పిల్లలకి చెప్పాలి. ఆ శౌర్యం, ఆ త్యాగం, ఆ సాహసం వాళ్ళకి ఇప్పణ్ణుంచే నూరి పొయ్యాలి.

జయసూర్య రచించిన 'భారత స్వాతంత్ర్య జ్యోతి సుభాస్‌చంద్ర బోస్' ఆ కర్తవ్యాన్ని గుర్తించిన రచన. ఎంతో ప్రభావశీలంగా, ఎంతో విశ్వసనీయంగా, ఎంతో సాధికారికంగా సాగిన ఈ రచన ఎందరికో కనువిప్పు కాగలదు. నేతాజీ పుట్టి 125 ఏళ్ళు అయిన సందర్భంగా, భారతదేశం స్వాతంత్ర్యం పొంది 75 ఏళ్ళు అయిన సందర్భంగా నీల్ కమల్ పబ్లికేషన్సు వారు ఈ జీవితచరిత్రను వెలువరించడం నిజమైన దేశసేవ. వారికి తెలుగువారందరి తరఫునా కృతజ్ఞతలు చెల్లిస్తూ, ఈ రచనను మనసారా స్వాగతిస్తున్నాను.

31-5-2022

# విప్లవాత్మక జాతీయవాది

**నీల్‌కమల్** పబ్లికేషన్స్ అధినేత సురేశ్‌చంద్ర శర్మ, సుభాసుచంద్ర బోసు మీద పుస్తకం తీసుకువస్తూ, దానికి, ముందుమాట రాయమని నన్ను అడగడం ద్వారా నాకు మహోపకారం చేసాడు. లేకపోయుంటే, విస్మృతి అనే మంచుతో కప్పబడి పోయిన సుభాసుబోసు అనే అగ్నిపర్వతాన్ని నేనింత దగ్గరగా చూడగలిగి ఉండేవాణ్ణి కాను.

ఆ స్ఫూర్తిలో చదివిన మరొక పుస్తకం 'బిల్డర్స్ ఆఫ్ మోడర్న్ ఇండియా' సిరీసు కింద పబ్లికేషన్సు డివిజను వారికోసం గిరిజ.కె.ముఖర్జీ రాసిన 'సుభాస్ చంద్ర బోస్' (1975) మోనోగ్రాఫు. ముఖర్జీ నేతాజీకి సన్నిహితుడు. నేతాజీ రాజకీయప్రస్థానాన్ని చాలా దగ్గరగా చూసినవాడు. కాని నేతాజీ జీవితచరిత్ర రాయగలిగే సామర్థ్యం తనకి లేదని రాసుకున్నాడు. ఎందుకంటే నేతాజీ పైన చిన్నపాటి సంగ్రహచరిత్ర రాయాలన్నా కూడా అపారమైన అధ్యయనం చెయ్యవలసి ఉంటుందనీ, ఎంతో జాగ్రత్తగా రాయవలసి ఉంటుందనీ కూడా అన్నాడు. ఆయన మీద ఎన్నో పుస్తకాలు వెలువడుతున్నప్పటికీ, అవి ఏవీ నిర్దిష్టమైనవి కావనీ చెప్తూ, నేతాజీపైన ఒక సమగ్ర చరిత్ర ఇంకా వెలువడవలసే ఉందని పేర్కొన్నాడు.

1975 లో ఆయన ఈ మాటలు రాసేనాటికి నేతాజీకి సంబంధించిన చాలా ఫైళ్ళు బహిర్గతం కానేలేదు. చాలా సమాచారం పబ్లిక్కు డొమయిను లోకి రానేలేదు. అయితే అటువంటి సమాచారం విస్తారంగా అందుబాటులోకి వచ్చిన తరువాత, ఆ సమాచారం కోసం ఉద్యమించిన వాళ్ళల్లో ఒకడైన చంద్రచూర్ ఘోష్ తాను ఇటీవలనే వెలువరించిన Bose: The Untold Story of An Inconvenienet Nationalist (2022) లో కూడా తాను నేతాజీకి సంబంధించి ఎక్కువగా చర్చలోకి రాని అంశాల మీదనే దృష్టి పెట్టానని రాసుకున్నాడు. కాబట్టి, నేతాజీ పైన ఇంతదాకా తెలిసినవీ, ఇప్పుడిప్పుడే తెలుస్తున్నవీ, అన్నీ కలిపి, ఒక సమగ్ర జీవితచరిత్ర ఇంకా రావలసే ఉందనుకోవాలి.

అయితే ముఖర్జీ రచన, పట్టుమని వందపేజీలు కూడా లేకపోయినప్పటికీ, ఎంతో విలువైన రచన. ఆయన ఎంతో సంతులిత మనస్తత్వంతో, ఎంతో పరిణతి చెందిన అవగాహనతో బోసు వ్యక్తిత్వాన్ని, భారత జాతీయోద్యమంలో బోసు నిర్వహించిన పాత్రని అంచనా కట్టి మనముందుంచాడు. స్వాతంత్ర్యం వచ్చి పాతికేళ్ళు కూడా కాకుండానే ఆయన అటువంటి మూల్యాంకనం చెయ్యగలగడం విశేషమే అనిపిస్తుంది. బోసు గురించిన అవగాహన బలపడాలనుకున్నవాళ్ళూ, మరింత తెలుసుకోడానికి ఎక్కడ మొదలుపెట్టాలా అని ఆలోచిస్తున్నవాళ్ళూ ఈ పుస్తకంతో మొదలుపెట్టవచ్చు.

ఈ రచనలో నేతాజీ జీవిత ప్రస్థానానికి సంబంధించిన సంక్షిప్తచరిత్రతో పాటు ఆయన ముఖ్యప్రసంగాలనుంచి, వ్యాసాలనుంచి ఎంపిక చేసిన పది వ్యాసాలు కూడా ఉన్నాయి. నేతాజీ జీవితచిత్రణకు చెందిన భాగంలో మహాత్ముణ్ణీ, నేతాజీని తులనాత్మకంగా వివరిస్తూ ఒక ప్రత్యేక అధ్యాయమే ఉంది. నాకు అది చాలా విలువైన అధ్యాయం అనిపించింది. అలానే ఉపసంహారంగా రాసిన అధ్యాయంలో కూడా ఆయన నేతాజీ నేపథ్యాన్నీ, ఆనాటి బెంగాలు సామాజిక నేపథ్యం నేతాజీపైన చూపించిన ప్రభావాన్నీ కూడా ఎంతో నిష్పాక్షికంగా అంచనా వెయ్యడానికి ప్రయత్నించాడు.

'జర్మనుసంఘటనలు' అనే అధ్యాయంలో నేతాజీని నాజీగా, ఫాసిస్టు అనుకూలుడిగా ముద్ర వెయ్యడం ఎంత సత్యదూరమో, ఎన్నో సాక్ష్యాధారాలతో, ఎంతో ఓపిగ్గా

వివరించాడు. ముఖ్యంగా 1935 లో డా. థియర్ ఫెల్డెర్ అనే జర్మను మిత్రుడికి నేతాజీ రాసిన ఉత్తరంలో ఈ వాక్యాలు చూడండి:

> నేను 1933 లో మొదటిసారి జర్మనీ సందర్శించినప్పుడు, జర్మనీ తన జాతీయ శక్తినీ, ఆత్మవిశ్వాసాన్నీ ప్రోదిచేసుకోగల చైతన్యాన్ని సముపార్జించిదని భావిస్తూ తనలానే జాగృతమవుతున్న తక్కిన దేశాల పట్ల కూడా సంఘీభావం ప్రకటిస్తుందని అనుకున్నాను. కాని ఇప్పుడు నా అభిప్రాయం మారిపోయింది. జర్మనీలో కనిపిస్తున్న ఈ కొత్త జాతీయవాదం సంకుచితం, స్వార్థపూరితం మాత్రమే కాదు, దురహంకారపూరితం కూడా అనే తెలివిడితో నేను నా దేశానికి వెనుతిరుగుతున్నాను.

అలాగే 1939 లో ఫార్వర్డుబ్లాకు పైన ఫాసిస్టు అనుకూలవర్గమనే విమర్శ వచ్చినప్పుడు నేతాజీ ఇలా రాసారట:

> ఫాసిస్టు అనే పదం హిట్లర్లనీ, సూపరు హిట్లర్లనీ, లేదా ఇప్పుడిప్పుడే మొగ్గ తొడుగుతున్న హిట్లర్లనీ సూచించే పదం అనుకుంటే, అటువంటి నమూనాలు కాంగ్రెసు రైటిస్టు విభాగంలో మాత్రమే కనబడతారు.

ఈ సందర్భంగా లూయీ ఫిషరుకీ, మహాత్ముడికీ మధ్య జరిగిన ఒక సంభాషణ కూడా నేను చదివింది మీతో పంచుకోవాలి. నేతాజీ విమానదుర్ఘటన వార్త విన్నప్పుడు లూయీ ఫిషరుకీ గాంధీకి మధ్య జరిగిన సంభాషణలో ఫిషరు, అత్యంత సత్వరంగా భారతదేశానికి స్వాతంత్ర్యం తేవాలన్న ఆకాంక్షవల్ల నేతాజీ ఫాసిజం ప్రలోభానికి లోనై ఉండవచ్చు అని అన్నప్పుడు, గాంధీ అంగీకరించలేదు. పైగా, 'అసలు బ్రిటిషు పాలన లోనే భయంకరమైన ఫాసిస్టు శక్తులున్నాయి. వాటిని భారతదేశంలో మనం రోజూ చూస్తూనే ఉన్నాం. ఈ యుద్ధంలో బ్రిటిషు వారు గెలవాలని అనుకుంటే ముందు భారతదేశాన్ని స్వతంత్రం చెయ్యమనండి. అప్పుడు పరిశుద్ధ హృదయంతో యుద్ధానికి వెళ్ళమనండి' అని అన్నారట.

అయితే, ఇంత సమాన హృదయం, అవగాహన కలిగి ఉన్నప్పటికీ, నేతాజీ, మహాత్ముడూ ఎందుకు కలిసి పనిచేయలేకపోయారు? 1939 లో నేతాజీ కోరుకున్నట్టుగా ఆయన్ను కాంగ్రెసు అధ్యక్షుడిగా పనిచెయ్యనిచ్చి ఉంటే, భారతదేశ భవితవ్యం మరోలా ఉండేది కదా అని నాకే కాదు, చాలామందికి అనిపిస్తుంది. అయితే, మా చిన్నప్పటి సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు చరిత్రలో if అనేది లేదని చెప్తుండేవారు. 'ఇది ఇలా జరిగి ఉంటే' అనే ఊహాగానానికి చరిత్ర తావు ఇవ్వదు. ఎందుకంటే, మనుషుల వ్యక్తిగత అభిప్రాయాల కన్నా, రాగద్వేషాల కన్నా, చారిత్రకగతి శక్తులు పెద్దవి.

గాంధీ, సుభాసు విభేదాల్ని అర్థం చేసుకోవాలంటే, భారతదేశంలో బ్రిటిషుపాలన మొదటి రోజులనుంచీ సంభవించిన పరిణామాలని అర్థం చేసుకోవలసి ఉంటుంది. మనం బ్రిటిషుపాలన అంటున్నప్పుడు నేరుగా ఇంగ్లాండును దృష్టిలో పెట్టుకుని మాట్లాడతాం. కాని భారతదేశంలో బ్రిటిషు పాలన ఒక polity గా రూపొందే పరిణామం దాదాపు నూటయాభై ఏళ్ళకు పైగా జరిగింది. 1773 రెగ్యులేటింగు యాక్టు మొదలుకుని, 1935 భారతచట్టం దాకా మొదట్లో ఈస్టిండియా కంపెనీ ద్వారా, తరువాత నేరుగా, బ్రిటను భారతదేశంలో ఒక పాలనావ్యవస్థని నిర్మించడానికి ప్రయత్నిస్తూనే వచ్చింది. దాన్ని వీలైనంత ప్రాతినిధ్యంతో కూడిన ప్రజాస్వామిక పాలనగా మార్చమని భారత జాతీయవాదులు పోరాడుతూ వచ్చారు. బ్రిటనుతో సంబంధం లేకుండా భారతదేశం తనను తాను పరిపాలించుకోవాలనే సంపూర్ణ స్వపరిపాలన ఒక ఆశయంగా 1857 నుండీ మరొకవైపు సమాంతరంగా కొనసాగుతూనే వచ్చింది. 1885 లో ఏర్పాటయిన భారత జాతీయ కాంగ్రెసు 1930 దాకా సంపూర్ణస్వాతంత్ర్య సాధన తన లక్ష్యమని బిగ్గరగా ప్రకటించలేదు. అప్పటిదాకా, అంటే 1885 నుండి 1930 దాకా కాంగ్రెసు, ఇతర రాజకీయ పక్షాలు, చట్టసభల్లోనూ, సివిలు సర్వీసులోనూ భారతీయులకి మరిన్ని సీట్లు కావాలన్నదాని మీదనే పోరాటం చేస్తూ వచ్చారు. దాన్నే వారు పాలనలో వాటాగా భావించారు.

1885 నుండి 1920 దాకా ఒక దశ. పందొమ్మిదో శతాబ్దం ద్వితీయభాగంలో ఇంగ్లిషు చదువువల్లా, ఆధునీకరణవల్లా లబ్ధి పొందిన కులీన తరగతి, నూతన

మధ్యతరగతి, బ్రిటిషు పాలనలో, తమకి కూడా ఎంతో కొంత వాటా కోసమే ఆశగా ఎదురుచూస్తూ ఉన్నారు. 1909 మింటో-మార్లే సంస్కరణలు, 1919 లో మాంటేగు-చెమ్సుఫర్డు సంస్కరణలు వారి ఆశల్ని కొంత ఎగదోసాయి, కొంత నీళ్ళు చల్లాయి. అలా చట్టసభల్లోనూ, సివిలుసర్వీసులోనూ భాగం కావాలనుకునే స్వాతంత్ర్యపోరాటాన్ని constitutionalism అన్నారు.

మరొకవైపు, ఈ రాజీ జీవితాన్ని ధిక్కరిస్తూ, బ్రిటిషు పాలన సమూలంగా తొలగి పోవాలని విప్లవకారులు చేపట్టిన విప్లవ పంథా ఉండనే ఉంది. సరిగ్గా అటువంటి చీలుదారి దగ్గర భారతదేశం నిలబడ్డ సందర్భంలో గాంధీ జాతీయోద్యమంలో ప్రవేశించాడు. బ్రిటిషువాళ్ళతో రాజీ పడి, పాలనలో భాగం కావాలనుకునే శక్తుల పట్ల విప్లవకారులకున్న అసహనాన్ని ఆయన అర్థం చేసుకున్నాడు. అదే పరిస్థితిలో, అత్యధిక సంఖ్యాకులైన భారతప్రజానీకం హింసా మార్గాన్ని అనుసరించే అవకాశం లేదని కూడా గ్రహించాడు. దాంతో, ఒక కొత్త పోరాట ప్రక్రియకు అంకురార్పణ చేసాడు.

అది అహింసా పద్ధతిలో చట్టాన్ని ధిక్కరించడం, మరొకవైపు ఇంగ్లిషు చదువుని, చట్టసభల్ని బహిష్కరించే విప్లవశీలధిక్కారం. 1920 ల నాటికి కొత్త భారతీయ మధ్యతరగతి పట్టణాల్లోనూ, నగరాల్లోనూ స్థిరపడ్డారు. ఆర్థికంగా కూడా నిలదొక్కు కున్నారు. అందుకని వారు రాజకీయ స్థిరత్వాన్ని, యథాతథవాదాన్ని కోరుకుంటున్నారు. మరొకవైపు గ్రామాల్లో కొత్త తరం పుట్టుకొచ్చారు. పట్టణ మధ్యతరగతికి దక్కిన అవకాశాలు వారికి లేవు. వారి భవిష్యత్తు బ్రిటిషువారికి సహకరించడంతో ముడిపడి లేదు. వారికి సహాయనిరాకరణ చెయ్యడం ద్వారా పాలనని స్తంభింపచేసి భారతదేశానికి స్వర్యాజ్యం వస్తే తప్ప వారికి అభ్యున్నతి లేదు. అందుకనే 20 ల్లో గాంధీ సహాయ నిరాకరణ చేపట్టినప్పుడు అది దేశవ్యాప్త ఉద్యమంగా ఉవ్వెత్తున ఎగిసిపడింది.

కాని కాంగ్రెసులో ఒక వర్గం చట్టసభల్లో ప్రవేశించాలనీ, బ్రిటిషువిధానాల్ని లోపల నుండి ఎండగట్టాలనీ వాదించేరు. వారు కాంగ్రెసుతో తెగతెంపులు చేసుకుని స్వరాజ్య పార్టీగా అవతరించి చట్టసభల్లో ప్రవేశించారు. కాని రాజకీయంగా అత్యంత

క్రియాశీలమైన, విప్లవశీల భావాలు కలిగిన శక్తులు మహాత్ముడితోటే ఉండిపోయాయి. ఇది మనందరికీ తెలిసిందే.

అయితే, 1920 వ దశకంలో చట్టసభల్లో ప్రవేశాల పట్ల ఇంత విప్లవాత్మక వ్యతిరేకతని ప్రదర్శించిన మహాత్ముడు 1930 వ దశకంలో మెత్తబడ్డాడన్నది సుభాసు ఆరోపణ. 1929 నుండీ ఆయన గాంధీకి, కాంగ్రెసుకి చెప్తూ వచ్చినదేమంటే, 1920 ల్లో క్రియాశీలక పాత్ర వహించినవారి స్థానంలో ఇప్పుడు అంటే 30 ల్లో మరొక కొత్త తరం అంతకన్నా విస్తృతమైన తరం తలెత్తిందనీ, వారు బ్రిటిషువారితో రాజీలేని పోరాటం కోరుకుంటున్నారనీ, కాబట్టి కాంగ్రెసు చట్టసభల బహిష్కరణ కొనసాగించి, ఈ సరికొత్త శక్తులతో సరికొత్త ఉద్యమాన్ని మొదలుపెట్టాలనీ ఆయన వాదిస్తూ వచ్చాడు. 1933 లో నేతాజీ, విఠల్‌భాయి పటేలు వియన్నాలో సంయుక్తంగా వెలువరించిన ఒక ప్రకటనలో ఈ విషయాలు ఎంతో స్పష్టంగా చెప్పారు.

కానీ, మరొకవైపు కాంగ్రెసు, ముస్లింలీగు, ఇతర రాజకీయపక్షాలు 1935 భారత ప్రభుత్వచట్టం వైపు ఆశగా చూస్తున్నాయి. కొత్త చట్టంలో ప్రొవిన్షియలు ప్రభుత్వాల్లో జాతీయోద్యమ శక్తులకు కొంత పాలనావకాశం లభిస్తుందనే ఉత్సాహంలో వారున్నారు. 1934 కాంగ్రెసు మహాసభలో మహాత్ముడు ఆ వర్గాల ఆకాంక్షలకు అడ్డుపడకపోగా, వారిని సమ్మతిస్తూ మాట్లాడేడు.

ఆ తర్వాత 1937 నుంచి 1939 దాకా సుభాసు తన యూరోపు పర్యటనలో ప్రపంచం మరొక యుద్ధం వైపు నడుస్తున్నదనీ, ఏ రోజైనా యుద్ధం మొదలుకావచ్చునీ, కాబట్టి మరొక జాతీయస్థాయి పోరాటాన్ని ప్రకటించి, బ్రిటిషువారిని ఇరుకున పెట్టాలనీ పదే పదే చెప్తూ వచ్చాడు. కాని 1937 లో ప్రొవిన్షియలు ప్రభుత్వాలకు ఎన్నికలు జరిగాయి. దేశంలోని 11 ప్రావిన్సుల్లో 7 ప్రావిన్సులు కాంగ్రెసు గెలుచుకుంది. అప్పటిదాకా తమ జాతీయపోరాటంలో ఎంతో విప్లవాత్మకతను పోషించిన కాంగ్రెసు తన క్రియాశీలతను చట్టసభల్లో చూపించడానికి ఉవ్విళ్ళూరుతూ ఉంది. అటువంటి పరిస్థితుల్లో కాంగ్రెసు సుభాసు మాట వినకపోగా, ఆయన కాంగ్రెసు అధ్యక్షుడిగా పనిచెయ్యడానికి కూడా సుముఖత చూపలేదు. సరిగ్గా ఆ వైఖరిమీదనే, ఆ రాజీపడటం

మీదనే సుభాసు తన అస్త్రాల్ని ఎక్కుపెట్టాడు. ఆ విమర్శలో ఎంతదాకా వెళ్ళాడంటే, మారిన పరిస్థితుల్లో సరికొత్త జాతీయోద్యమాన్ని నిర్మించే శక్తి గాంధీకి లేదనీ, ఒకటి ఆయన వయోభారం, రెండవది, ఆయన శాంతిదూత కావడం అని కూడా అన్నాడు.

కాని కొత్త ప్రభుత్వాల ఉత్సాహం ఎంతోసేపు నిలబడలేదు. యుద్ధం మొదలు కాగానే, 1939 లోనే కాంగ్రెసు ప్రభుత్వాలు తమ పదవులకు రాజీనామా చేసేసాయి. చివరికి 1942 లో సుభాసు కోరుకున్నట్టుగానే గాంధీ మరొక జాతీయస్థాయి ఉద్యమాన్ని, 'క్విట్ ఇండియా' ఉద్యమానికి పిలుపు ఇవ్వక తప్పలేదు. కాని అప్పటికే జరగవలసిన ఆలస్యం జరిగిపోయింది. 1920 ల్లో తన వెంట ఎవరూ నిలబడతారన్న నమ్మకం లేకపోయినా అంత విప్లవాత్మకతను చూపించిన గాంధీ 1930ల్లో సుభాసు వంటి నాయకుడు పక్కన నిలబడినప్పటికీ, రాజీలేని తెగువ ఎందుకు ప్రదర్శించలేదనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. మనం ఇంతదాకా సుభాసు వాదన విన్నాం. అలాగే గాంధీ వాదన కూడా వినవలసి ఉంటుంది. అది మరోసారి.

కాని ఇప్పటికి లభ్యమైన సమాచారం బట్టి మనకి కొత్తగా తెలుస్తున్నదేమంటే, 1941 తర్వాత, అంటే, బ్రిటిషు నిఘావిభాగాల కన్నుకప్పి, నేతాజీ భారతసరిహద్దులు దాటిపోయినప్పటినుండీ, సుభాసు పట్ల గాంధీజీ అంచనాల్లో ఎంతో మార్పు వచ్చిందని. గుణాత్మకంగా అది ఎంత పెద్దమార్పు అంటే సుభాసు తన పక్కన ఉండి ఉంటే, దేశ విభజన జరగకపోయి ఉండేదని మహాత్ముడు భావించేటంత.

ఏమైనప్పటికీ గాంధీ-సుభాసు సంవాదంలో ఇప్పటి మన చరిత్రకి అవసరమైన విలువైన పాఠం ఒకటి ఉంది. ఇప్పుడు కూడా మన దేశంలో అన్ని రాజకీయ పక్షాల్లోనూ, రాజకీయ పక్షాల్లో భాగస్వాములు కాని రాజకీయ శక్తుల్లోనూ కూడా పాలనలో భాగం పంచుకోవాలని ఉవ్విళ్ళూరే వర్గం ఎంత బలంగా ఉందో, పదవులకోసం రాజీ పడకుండా ప్రజావిముక్తిని కోరుకునే వర్గం కూడా అంత బలంగానూ ఉంది. నిజమైన రాజనీతి విద్యార్థికాని, రాజకీయనాయకుడు గాని ఆ విప్లవశక్తుల్ని గుర్తుపట్టగలగాలి, సమీకరించ-గలగాలి, రాజీలేని పోరాటాన్ని సాగించగలగాలి.

1-6-2022

# అప్రమేయమైన ఆనందం

**యు.వి.స్వామినాథ అయ్యరు** తమిళ సాహిత్యవ్యాసాల ఇంగ్లీషు అనువాదం వెలువడింది. అందులో అధికభాగం ఆయన తన గురువు మీనాక్షి సుందరం పిళ్ళై గారి గురించిన తలపోతలే.

ఏమైనా చెప్పబ్బా, ఈ జీవితంలో గురుశిష్య అనుబంధం గురించి చదివినప్పుడు నాకు కలిగే ఆనందం మరి ఏ అనుబంధంగురించి చదివినా కూడా కలగదంటే నమ్ము. రక్తసంబంధాల్లో ప్రేమ ఉండటంలో ఆశ్చర్యంలేదు. ప్రేమానుబంధంలో రక్తం ఉప్పొంగడంలో ఆశ్చర్యంలేదు. ఉమ్మడిధ్యేయంకోసం కలిసి నడిచే కామ్రేడరీలు పరస్పరం స్ఫూర్తిదాయకంగా ఉండటంలో ఆశ్చర్యంలేదు. కాని నిజంగా నిస్వార్థం, నిష్కారణం అయిన జీవితానుబంధమంటూ ఏదన్నా ఉంటే నా దృష్టిలో అది గురుశిష్యుల అనుబంధం మాత్రమే. దాదాపుగా అది నీకూ, నీ తల్లిదండ్రులకీ ఉండే అనుబంధంతో సమానమైన అనుబంధం.

మా నాన్నగారి గురించి తలుచుకుంటే, ఆయన తండ్రిగా మాకు చేసిన మహోపకారం చదువుమీద మా దృష్టిని మళ్ళించడమే. ఆయనకి పెద్ద చదువులు

చదువుకునే అవకాశం జీవితం ఇవ్వలేదు. పిల్లల్ని పెద్ద చదువులు చదివించుకునే వనరులు కూడా ఆయనకి లేవు. కాని ఉన్నదల్లా పిల్లలు ఎలాగేనా మంచి చదువులు చదువుకోవాలన్న అపారమైన కోరిక. 'మా అమ్మాయి ఎడుకేషను లో ఫస్టు' అని ఆయన మా అక్క గురించి అడిగినవాళ్ళకీ, అడగని వాళ్ళకీ ఎన్నిసార్లు చెప్తుండటం విన్నానో!

మా నాన్నగారి తండ్రి ఆయన చిన్నప్పుడే పోయారు. ఆ చిన్నప్పటి రోజుల్లో ఆయన మా పూర్వీకుల్లో ఒక పెద్దాయన, ఆయన లాయరుగా పనిచేసేవాడు, వాళ్ళ ఇంటికి వెళ్తూ, వస్తూ ఉండేవారు. పందొమ్మిది, ఇరవయశతాబ్దాల మధ్యకాలంలో ఈ దేశంలో పట్టణాల్లో పెద్ద ఉద్యోగాలు చేసేవాళ్ళ కుటుంబాలు వాళ్ళకే పరిమితం కాకుండా ఎంతో మందికి ఆశ్రయంగా ఉంటూ ఉండేవి. ఎందరో విద్యార్థులు, బంధువులూ, బంధువులు కానివాళ్ళూ కూడా ఆ ఇళ్ళల్లో ఉంటూనో, లేదా వారాలు చేసుకుంటూనో చదువుకునేవారు. ఆ పెద్ద మనుషులు అట్లాంటి వాళ్ళకి నీడగా ఉ ంటున్నందుకే ఎక్కువ సంతోషించేవారు, వాళ్ళల్లో ఏ ఒక్కరు వృద్ధిలోకి వచ్చినా తమ పిల్లలే వృద్ధిలోకి వచ్చినట్టుగా గర్వించేవారు.

అట్లాంటి ఒక పెద్దమనిషి పేరు యర్రమిల్లి వెంకటచలం. ఆయన లాయరు. మా నాన్నగారి చిన్నప్పటిరోజుల్లో వాళ్ళ ఇంటికి వెళ్ళినప్పుడు ఆ ఇంట్లో అలా కొంత మంది విద్యార్థులు ఉండటం, చదువుకోవడం చూసేవారు. అలాంటి మరొక కుటుంబం, మా బామ్మగారి తమ్ముడి కుటుంబం. అంటే మా నాన్నగారి మేనమామ కుటుంబం. ఆయన పేరు చంద్రుడు తాతయ్యగారు. ఆ ఇంట్లోనూ పిల్లలు ఇంగ్లిషు చదువులు చదువుకోవడం, చదువు గురించి మాట్లాడుకుంటూ ఉండటం ఆయన చిన్నప్పుడు చూసేవారు.

ఆ దృశ్యాలు ఆయన్ని ఎంత గాఢంగా ప్రభావితం చేసాయంటే తన పిల్లలు కూడా అలా చదువుకోవాలనీ, పెద్ద పెద్ద గ్రంథాలు పఠిస్తూ ఉండాలనీ, ఎప్పుడూ వాటిగురించే మాట్లాడుకుంటూ ఉండాలనీ ఆయనకి పెద్ద కల ఉండేది. జీవిక కోసం ఆయన చేసిన కరణీకం, దానికి సంబంధించిన సమస్తమైన పంకం మధ్య ఆయన దృష్టి ఎప్పుడు ఆ పద్మాలయదేవి మీదనే ఉండేది.

అందుకోసం ఆయన మమ్మల్ని ఎప్పుడూ ఒక్కక్షణం కూడా ఆగనివ్వలేదు. మేము ఆ పల్లెటూళ్ళో ఎక్కడ ఉండిపోతామోనన్న భయం ఆయన్ని కుదురుగా ఉండనిచ్చేదికాదు. ఏమి చేసేనా సరే పిల్లలు బయటికి వెళ్ళిపోవాలి, పెద్ద చదువులు చదువుకోవాలి, అనే ఆయన తాపత్రయాన్ని మా ఊళ్ళో మనుషులు మాత్రమే కాదు, అక్కడి చెట్లూ, కొండలూ కూడా ఎన్నో ఏళ్ళు చూసేయి.

సెలవులు పూర్తయి మేము మళ్ళా రాజమండ్రికో, కాకినాడకో, తాడికొండకో బయలుదేరుతుంటే, మేం బస్సెక్కాక కూడా, బస్సు కదిలాక కూడా, ఆయన 'చేతులు బయటపెట్టవద్దు'. 'ఆకలేస్తే పళ్ళు తినండి, నూనెతిళ్ళు తినొద్దు', 'వెళ్ళగానే ఉత్తరం రాయి' అంటూ, తువ్వాలు దులుపుకుంటూ, ఆ బస్సు వెనకనే వడివడిగా అడుగులు వేసుకుంటూ జాగ్రత్తలు చెప్పే ఆ దృశ్యాలు నిన్ననే జరిగినట్టు ఉంటాయి.

ఇదంతా ఎందుకు రాస్తున్నానంటే నిన్న Essays of U Ve Sa (2022) చదువుతుంటే రాత్రంతా నా హృదయం ద్రవీభూతమైపోయింది. ఉ.వే.స అంటే యు.వి.స్వామినాథ అయ్యరు. ఆయన్ని తమిళానికి తండ్రిగా కొలుస్తారు. పందొమ్మిదో శతాబ్దపు చివరి రోజుల్లో ప్రాచీన తమిళ వాఙ్మయం, సంగం సాహిత్యాల్ని ఆయన వెలికి తీసి లోకానికి పరిచయం చెయ్యడంతో తమిళం రాత్రికిరాత్రే ప్రపంచ ప్రాచీనభాషల్లో ఒకటిగా మారిపోయింది. ఆయన ఆ కృషి అంతా 'నా చరిత్ర' అనే పేరిట రాసుకున్నారు. నేను ఆ పుస్తకం గురించి గతంలో ఇక్కడ పరిచయం చేసాను కూడా.

మొత్తం తమిళభాష తనకి ఋణపడి ఉంటే, తాను తన గురువు మీనాక్షి సుందరం పిళ్ళైకి ఋణపడ్డానని ఆయన పదే పదే చెప్పుకున్నాడు. ఆ గురుశిష్యుల అనుబంధం నా హృదయాన్ని ఎంతగా కదిలించిందంటే, నేను తమిళనాడు వెళ్ళినప్పుడు, ఆయన చదువుకున్న ఆ తిరువావుడుదురై ఆధీనం వెతుక్కుంటూ వెళ్ళాను. ఆ అనుభవాన్ని కూడా గతంలో ఇక్కడ మిత్రులతో పంచుకున్నాను.

ఆయన ఆత్మకథ తప్ప తక్కినదేదీ నేను చదవలేకపోయాను, ఎందుకంటే ఆ తక్కిన పుస్తకాలు, ఇంగ్లిషులోగాని తెలుగులోగాని ఏమీ అనువాదం కానందువల్ల. కానీ ఇదిగో, ఇప్పుడు తమిళనాడు టెక్స్టుబుక్ అండ్ ఎడ్యుకేషను కార్పొరేషను వారు

ఆయన వ్యాసాలు కొన్నింటిని ఇంగ్లిషులోకి అనువదింపచేసారు. ఇద్దరు అనువాదకులు. ఒకరు ప్రభాశ్రీదేవన్. ఆమె మద్రాసు హైకోర్టులో జడ్జిగా పనిచేసి పదవీవిరమణ చేసారు. మరొకరు ప్రదీప్ చక్రవర్తి. ప్రస్తుతం పాండ్యరాజుల శాసనాల మీద పి.ఎచ్.డి చేస్తున్నాడు.

ఆ పండితులిద్దరూ అయ్యరు గారివి 29 వ్యాసాలు ఎంపికచేసి చక్కటి ఇంగ్లిషులోకి అనువదించారు. ఇప్పటికి పదకొండు వ్యాసాలు చదివాను. పుస్తకం పూర్తి కాకుండా రాయడం నా స్వభావం కాదుగానీ, ఏం చెయ్యను? అప్రమేయమైన ఆ ఆనందం ఇట్లా తెల్లవారి మీతో పంచుకోకుండా ఉండలేననిపించింది.

ఆ వ్యాసాలు భాష గురించి, ప్రాచీన కాలపు తమిళసమాజం చదువునీ, సాహిత్యాన్నీ ఎట్లా నెత్తిన పెట్టుకుందో ఆ విశేషాల గురించీ, అన్నిటికన్నా మిన్నగా తన గురువు మీనాక్షి సుందరం పిళ్ళై గురించీ, తన గురుకులవాసం గురించీను.

నేను కూడా నా జీవితంలో గొప్ప గురువుల సన్నిధికి నోచుకున్నానుగాని, అట్లాంటి గురుకులవాసానికి నోచుకోలేకపోయాను. ఒక గురువు పాదాలదగ్గర ఏదో ఒక శాస్త్రమో, సాహిత్యమో క్షుణ్ణంగా అభ్యసించే అదృష్టం లేకపోయింది. ఒక విధంగా నేను కూడా వారాలు చెప్పుకుని చదువుకున్నట్టే గురువు, గురువు దగ్గరికీ తిరిగి మాధూకరభిక్ష తెచ్చుకునే బతికాను. కాని కల్పతరువులాంటి ఒక్క గురువు, ఆయన దగ్గర నేర్చుకున్న ఒక్క శ్లోకం లేదా కనీసం ఒక్క దోహా! అది లభించి ఉంటే బహుశా నేను కూడా ఉ.వే.స లాగా జీవించిఉండేవాణ్ణి కదా అనిపిస్తున్నది ఈ వ్యాసాలు చదువుతున్నంత సేపూ! బహుశా మా నాన్నగారు కోరుకున్నది కూడా అదేనేమో!

4-9-2022

# లోహియా గురించి

**ఇప్పుడు** తెలుగులో సమకాలిక రాజకీయ, సామాజిక అంశాల మీద చాలామంది సామాజిక మాధ్యమాల్లో, పత్రికల్లో రాస్తూ ఉన్నారు. కాని వాళ్ళల్లో అవధానం రఘుకుమార్‌ది ప్రత్యేకమైన గళం అనిపిస్తుంది. ఆయన దృష్టిలో సమగ్రత, సంయమనం కనిపిస్తాయి నాకు. ఆయన పుస్తకం ఒకటి రావెల సోమయ్యగారు కిందటేడాది ఇచ్చి చదవమని చెప్పారు. చదివాను. ఒకసారి వాళ్ళింట్లోనే ఆయన్ని పరిచయం చేసారు. ఆ తర్వాత మేమిద్దరం లోహియా 'పురాణ పాత్రలపైన కొత్త వెలుగు' ఆవిష్కరణ సమావేశంలో కలిసి ప్రసంగించాం కూడా.

సోమయ్యగారి స్నేహం వల్ల ఆయన ఈ మధ్య లోహియా పైన కొత్త పుస్తకం ఒకటి వెలువరించారు. Revisiting Rammanohar Lohia: Challenges to the Theory and Practice of Alternative Socialism (ఆకార్, 2022). ఈ రోజు ఆ పుస్తకం ఆవిష్కరణ ఫెడరేషను ఆఫ్ తెలంగాణా ఛాంబరు ఆఫ్ కామర్సు వారి సమావేశ మందిరంలో జరిగింది.

ప్రసిద్ధ చరిత్రకారుడు, సామాజిక విశ్లేషకుడు రామచంద్ర గుహ ఆ పుస్తకం ఆవిష్కరించి ప్రధాన ప్రసంగం చేసారు. కె. రామచంద్రమూర్తిగారితో పాటు, మరొక సుప్రసిద్ధ సోషలిస్టు రామ శంకర్ సింఘ్ గారు కూడా సమావేశంలో ప్రసంగించారు.

సమావేశం మొదట్లో రఘుకుమార్ వక్తల్ని సభకు పరిచయం చేస్తూ తాను లోహియా మీద ఒక పుస్తకం ఎందుకు రాయవలసి వచ్చిందో వివరించారు. ముఖ్యంగా ప్రపంచమంతటా పెట్టుబడిదారీ విధానంతో పాటు మార్క్సిజం కూడా సంక్షోభానికి లోనవుతూ ఉన్నదనీ, ఈ స్థితిలో ప్రజల, పాలితుల, శ్రామికుల ప్రయోజనాల్ని కాపాడే ఒక సామాజికతాత్త్వికత అవసరం ఉందనీ, కానీ పాశ్చాత్యదేశాలు అటువంటి ప్రత్యామ్నాయ ధోరణులకు అవకాశం లేదన్నట్టుగా మాట్లాడుతున్నారనీ, కానీ లోహియాని చదివినప్పుడు అటువంటి ప్రత్యామ్నాయాన్ని అన్వేషించవచ్చునని తనకి అనిపించిందని అందుకే తాను ఈ పుస్తకం రాసాననీ చెప్పారు.

రామచంద్ర గుహ పుస్తకాలు, ఆయన హిందూ పత్రికలో గాంధీ పైన రాసే వ్యాసాలూ చాలా ఆసక్తితో చదువుతుంటాను కాబట్టి, ప్రధానంగా ఆయన్ని చూడాలనీ, ఆయన మాట్లాడితే వినాలనీ ఈ సభకు వెళ్ళాను.

గుహ నన్ను నిరుత్సాహ పరచలేదు.

ఆయన వృత్తిరీత్యా ప్రొఫెసరు కూడా కాబట్టి చాలా చక్కటి వాచికంతో, చక్కటి హావ భావాల్తో, తాను చెప్పదలుచుకున్న విషయాన్ని ఎంతో స్పష్టతతో, అంశాల వారీగా వివరించాడు. ముందు లోహియా గురించి, పుస్తకం గురించి స్థూలంగా కొంత చెప్పిన తరువాత, భారత దేశంలో సోషలిస్టు భావజాలం, ఆచరణల చరిత్ర గురించి విపులంగా మాట్లాడేడు. సోషలిస్టులు ఒకవైపు కాంగ్రెసులోని జాతీయవాదులతోనూ, మరొకవైపు తమ కాలం నాటి కమ్యూనిస్టుల తోనూ ఏ అంశాల మీద విభేదించారో, అలా విభేదించడం వెనక వారిమీద గాంధీ ప్రభావం ఏ మేరకు ఉందో ఆయన సోదాహరణంగా వివరించారు.

భారతదేశంలో కమ్యూనిస్టులకీ, సోషలిస్టులకీ మధ్య విభేదం మూడు అంశాలమీద ఉందని చెప్పాడు. సోషలిస్టులు ప్రధానంగా భారతజాతీయోద్యమానికి ఎక్కువ ప్రాధాన్యత-నిచ్చారనీ, సామాజికమైన మార్పు హింసద్వారా కాక, అహింసా పద్ధతులద్వారానే సాధ్య-పడుతుందని నమ్మారనీ, ఇక మూడవది, ముఖ్యమైంది, వారు రాజకీయ-ఆర్థిక శక్తి కేంద్రీకృతం కాకుండా వికేంద్రీకృతం కావాలని భావించారనీ చెప్పాడు.

అసలు భారతీయ సామ్యవాదులు ప్రధానంగా నాలుగు అంశాల మీద జాతి దృష్టిని మళ్ళించడంలో కృతకృత్యులయ్యారని చెప్పారు. మొదటిది, వాళ్లు సోవియెటు, చైనా తరహా కేంద్రీకృత విధానాలకు బదులు ప్రజాస్వామిక వికేంద్రీకృత విధానాల్ని కోరుకున్నారనీ, రెండవది, సాంఘిక-రాజకీయ కార్యాచరణలో స్త్రీలకు సమాన భాగస్వామ్యం ఉండాలని కోరుకున్నారనీ,

మూడవది, భారతీయ సంస్కృతి, కళలు, సాహిత్యం, దేశభాషలు మొదలైనవాటిపట్ల శ్రద్ధ చూపించడమే కాకుండా ఆ రంగాల్లో చెప్పుకోదగ్గ కృషి చేసారనీ చెప్పాడు. ఇక నాలుగవది అంతే ముఖ్యమైన అంశం, వారు తమ విధానాల్లో మొదటినుంచీ ఒక పర్యావరణ స్పృహ కనపరుస్తూ వచ్చారని కూడా చెప్పాడు. ఇరవయ్యవ శతాబ్ది భారతీయ రాజనీతిచింతకుల్లో అంబేద్కరులానే లోహియా కూడా కులం గురించి విస్తృతంగా చర్చించాడని కూడా పేర్కొన్నాడు.

ఆయన తర్వాత ప్రసంగించిన రామశంకర్ సింఘ్ నాతో పాటు చాలామంది శ్రోతల్ని నివ్వెరపరిచే ప్రసంగం చేసాడు. లోహియాతో తనకున్న వ్యక్తిగత సాన్నిహిత్యం వల్ల లోహియాకు సంబంధించిన ఎన్నో విశేషమైన అంశాల్ని ఆయన వివరిస్తుంటే శ్రోతలకు వళ్లు గగుర్పొడి-చిందని చెప్పడం అతిశయోక్తి కాదనుకుంటాను. ముఖ్యంగా గాంధీతో సహా జాతీయోద్యమ నాయకులంతా ఒక్క సామ్రాజ్యవాదశక్తికి  మాత్రమే వ్యతిరేకంగా పోరాడేరనీ, కాని లోహియా మాత్రం బ్రిటిషు, పోర్చుగీసు, నేపాలీ, అమెరికను సామ్రాజ్యవాద విధానాలతో పాటు నెహ్రూవీయ ఆధిపత్య ధోరణులమీద కూడా సత్యాగ్రహం చేసిన వ్యక్తి అని చెప్పాడు. ప్రజాస్వామిక విలువలకు కట్టుబడి ఉండటంలో, భారతదేశం స్వతంత్రం అయ్యాక పదవుల్ని కాక, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంలో ఉండాలని కోరుకోవడంలో లోహియా చూపించిన వ్యక్తిత్వం ఎంత నిరుపమానమైందో ఆయన చెప్తుంటే వినడం నిజంగా ఒక అనుభవం.

గుహ తన ప్రసంగంలో, కాంగ్రెసు, కమ్యూనిస్టులు, చివరికి ఆర్.ఎస్.ఎస్ కూడా తమ దంటూ ఒక చరిత్ర రాసుకోడం మీద దృష్టి పెట్టాయనీ, కాని సోషలిస్టులే తమ చరిత్రను సరిగా డాక్యుమెంటు చేసుకోలేదనీ, ఇప్పటికైనా ముప్పై-నలభయ్యేళ్ళ మధ్య వయసుగల యువతీయువకులెవరైనా నిష్పాక్షికంగా భారతీయ సోషలిస్టు ఉద్యమ చరిత్రను గ్రంథస్థం చెయ్యవలసిన అవసరం ఉందని చెప్పాడు. ప్రొ. రామశంకర్ సింగ్ ప్రసంగం విన్నాక ఆ పని చెయ్యడం ఎంత అత్యవసరమో తెలియవచ్చింది.

ఇంత చక్కటి సమావేశం ఏర్పాటుకి కారణం సోమయ్యగారు. ఆయన సమావేశానికి వచ్చి కూర్చోలేకపోయినా ఆయన మనసంతా ఇక్కడే ఉంటుందని నాకు తెలుసు. ఎనభై ఏడేళ్ళ వయసులో ఒక పుస్తకం రాయించి, దాన్ని ఇలా ఆవిష్కరింపచెయ్యడం మామూలు విషయం కాదు. సోషలిస్టు ఉద్యమం భారతదేశంలో బలహీనపడిందని ఎలా అనగలం? సోమయ్యగారు ఉండగా!

25-2-2023

# ఒక తల్లి ఆత్మకథ

**నేను** రాజమండ్రిలో ఉన్న రోజుల్లో, నా యవ్వనకాలంలో, ఒకసారి మా మాష్టారు శరభయ్యగారితో 'నా మనసెందుకో బావుండటం లేదు, ఏదో చెప్పలేని దిగులు ఆవరిస్తూ ఉంటుంది. ఏం చెయ్యాలో తెలియడం లేదు' అని చెప్తే, 'రామాయణం చదువు' అని చెప్పారు. పూర్వకాలంలో మన దేశంలో ఎవరికైనా మనసు చింతాక్రాంతమైనప్పుడు ఇదే ఔషధంగా ఉండేది, భగవంతుడి కథలో, భగవద్భక్తుల కథలో చదవడం. తర్వాత రోజుల్లో నన్నయ భగవద్భక్తులనే మాట వాడకుండా 'ఎరుకగల వారి చరితలు' అన్నాడు. ఆధునిక యుగం మొదలయ్యాక, 'నా హృదయం గడ్డకట్టి ఎండిపోయినప్పుడు నీ కరుణావర్షంతో నన్ను తడిపెయ్యి' అన్నాడు టాగోరు.

మహారాష్ట్రకు చెందిన సంఘసేవకుడు, గాంధేయవాది, పద్మవిభూషణ్ మురళీధర్ దేవీదాస్ ఆమ్టే (1914–2008) సహచరి సాధనా తాయి ఆమ్టే (1926–2011) రాసిన ఈ 'సమిధ' ఏకకాలంలో ఒక భగవద్భక్తురాలి చరిత్ర, ఎరుకగలవారి చరిత్ర, కరుణావర్షం కూడా. ఎందుకంటే, పుస్తకం చివరి పేజీలకు వచ్చేటప్పటికి నా కళ్ళు ధారాపాతంగా కన్నీళ్ళు కారుస్తూనే ఉన్నాయి.

పుస్తకం ముగించేటప్పటికి గంగాస్నానం చేసినట్టుగానూ, గంగాపానం చేసినట్టుగానూ నన్నెవరో బయటా, లోపలా కూడా పూర్తిగా శుభ్రం చేసేసినట్టుగా ఉంది. చుట్టూ ప్రపంచం ఒక ద్వేషకర్మాగారంగా మారిపోయిన వేళ, ఇటువంటి పుస్తకం చదవడం నిజంగానే ఒక ఔషధం సేవించడం.

ఇందుకు అన్నిటికన్నా ముందు, ఈ అమూల్యగ్రంథాన్ని తెలుగులోకి మనకి అందించినందుకు భారతికి మనసారా ధన్యవాదాలు చెప్పుకుంటున్నాను.

నేను చాలా స్వీయచరిత్రలు చదివాను, తెలుగులోనూ, ఇంగ్లిషులోనూ కూడా. తమ తమ జీవితాల్లో ఏదో ఒక అద్వితీయమైన వెలుగు చూసి ఉంటేనో లేదా ఎవరూ నిర్వహించని కర్తవ్యం ఒకటి నెరవేర్చి ఉంటేనో తప్ప ఎవరూ తమ కథ తాము చెప్పుకోడానికి సాహసించరు. కాబట్టి ప్రతి ఆత్మకథా విలువైనదే, ఈ ప్రపంచానికి ఎంతో కొంత మంచి చేకూర్చేదే. కాని ఈ రచనలో ప్రత్యేకం ఏమిటంటే, ఇది ఏక కాలంలో ఒక స్వీయ చరిత్రా, ఒక జీవితచరిత్రా కూడా. ఆ ఇద్దరి కథలతోనూ పెనవేసుకున్న ఒక దేశచరిత్ర కూడా.

ఒక జమీందారీ కుటుంబంలో పుట్టి అత్యంత నిరాడంబరమైన జీవితాన్ని వరించడంలో బాబా ఆమ్టేకీ, టాల్‌స్టాయికీ మధ్య పోలికలు కనిపిస్తాయి. కాని టాల్‌స్టాయి కన్నా బాబా అదృష్టవంతుడు. ఎందుకంటే గాంధీకి మల్లే ఆమ్టేకి కూడా తనని పూర్తిగా అర్థం చేసుకుని చివరిదాకా తనతో కలిసి నడిచిన సహచరి దొరికింది. కానీ గాంధీ కన్నా కూడా బాబా ఆమ్టే మరింత ధన్యుడు. ఎందుకంటే, గాంధీ ఆశయాలకు తగ్గట్టుగా ఆయన పెద్దకొడుకు జీవించలేకపోయాడు. అది జీవితాంతం ఆయనకు రంపపుకోతగానే ఉంటూ వచ్చింది.

కాని బాబా ఆమ్టే, సాధనాతాయిలు ఎంత అదృష్టవంతులు! వారి పిల్లలు మాత్రమే కాదు, మనవలు కూడా వారి దారిన నడిచారు. తమ కొడుకు వికాస్ తమ దారిన నడవడమే ఎంతో ఎక్కువ, అటువంటిది అతడి కొడుకు దిగంత్ కూడా మెడిసిన్ చదువుకుని తండ్రి తాతల దారినే నడుస్తానని చెప్పినప్పుడు సాధనా తాయి రాసిన ఉత్తరం చూడండి. ఆ భాగ్యం అందరికీ దక్కేదీ కాదు.

ఈ పుస్తకం ఆమూలాగ్రం పఠించండి. నేనయితే అన్ని పనులూ పక్కనపెట్టి, తదేకంగా చదివాను. చదువుతున్నంతసేపూ నన్ను నేను ఆత్మపరిశీలన చేసుకుంటూనే ఉన్నాను. పాటించవలసిన నియమాల్లోనూ, అనుష్ఠించవలసిన నైతికతలోనూ నేనింకా కఠోరసాధన చెయ్యవలసిందే అని నాకు నేను పదే పదే చెప్పుకున్నాను.

ఈ రచన మొత్తం చదివాక, బాబా ఆమ్టే అపూర్వ జీవనప్రయాణం గురించి ఇంత దగ్గరగా తెలుసుకున్నాక, ఆయన జీవిత సారాంశం ఏమిటి అని ప్రశ్నించుకుంటే, 'భయాన్ని జయించడమే' అనే జవాబు వస్తుంది.

ఆయనే చెప్పుకున్నారట: కుష్ఠురోగుల కోసం తాను చేసిన సేవ ఆ రోగం పట్ల ముందు తన భయాన్ని పోగొట్టుకోడానికి చేసిందేననీ, తక్కినవన్నీ ఆ ప్రయాణంలో ఒనగూడినవేననీ. మహాత్ముడు ఆయన్ని అభయసాధకుడని పిలవడంలో ఈ భవిష్య సూచన అంతా ఉందనిపిస్తుంది.

ఆ వైనమంతా పే.76-78 లో చూడవచ్చు.

మరి సాధనా తాయి జీవితసారాంశం ఏమిటి? షిరిడీలో సాయినాథుడి దర్శనానికి వెళ్ళి బయటకి వచ్చినప్పుడు, ఒక సాధువు ఎవరో ఆమెని చూసి 'నువ్వు అందరికీ అమ్మవి' అని ఒక పలక మీద రాసి చూపించాడట. ఆమె అమ్మ, తల్లి, తాయి. ఇది నిజానికి ఒక తల్లి ఆత్మకథ.

వాళ్ళిద్దరూ కలిసి నడవడం మొదలుపెట్టాక ఆ ఇద్దరి కథలూ కలిసి ఒక కథగా మారేక, ఈ కథాసారాంశాన్ని ఏమని వివరించవచ్చు? ఆమె మాటల్లోనే చెప్పాలంటే–

> ఆయన జీవితాన్ని కొన్ని మాటలలో వర్ణించాల్సి వస్తే నిరంతరం కొత్త ప్రారంభాలే అనాలేమో. లేదా ప్రతి ముగింపూ మరొక ప్రారంభానికి నాంది అనాలేమో. ఆయన దీపాలు వెలిగిస్తూ వెళ్ళారు. నేను స్వచ్ఛందంగానే వాటిలో చమురు నింపే బాధ్యతను తీసుకున్నాను. లక్ష్యం పట్ల ఆయనకు ఉన్న నిజాయితీ, ఆయన సృజనాత్మకత నన్ను ఆ విధంగా ఆయన పనిలో భాగమ–య్యేలా చేసాయి. ఆయన లక్ష్యాలే మా లక్ష్యాలుగా మారాయి. నేనెప్పుడూ

నా వ్యక్తిత్వాన్ని, ఉనికిని కోల్పోతున్నట్లు భావించలేదు. అందుకు భిన్నంగా నన్ను నేను పునరావిష్కరించుకున్నట్టు, కొత్త ఉనికిని, అస్తిత్వాన్ని సంతరించు-కున్నట్లు భావించాను.

మరొకచోట ఆమె ఇలా రాసుకున్నారు:

బాబా వంటి వివేచన కలిగిన వ్యక్తితో కలిసి జీవించడమంటే ఇరవై నాలుగు గంటలు ఒక బడిలో ఉన్నట్టే. .. మాకున్న ఒకే ఒక ఆస్తి షరతులు లేని, అవధులు లేని ప్రేమ. జీవితం శిథిలమవ్వకుండా కాపాడే సంరక్షకురాలు అది. జీవితం మరింత రుచిగా ఉండేందుకు తోడ్పడేదీ అదే. వారి వారి వ్యక్తిగతజీవితాలను దాటి మనుషులందరూ ప్రేమించగలిగితే ఎంత బాగుంటుంది!

ఇటువంటి పుస్తకాలు చదివినప్పుడు నాలాంటి వాళ్ళకి ముందుగా అయ్యో, నేను యవ్వనంలో అడుగుపెట్టిన కాలంలో ఇటువంటి పుస్తకాలు ఎందుకు దొరకలేదు? ఎందుకు చదవలేకపోయాం? అనే అనిపిస్తుంది. కానీ చదివింది నెమ్మదిగా మనలోకి ఇంకడం మొదలయ్యాక, కొత్త జీవితం మొదలుపెట్టడానికి జీవితంలో ప్రతి రోజూ మంచిముహూర్తమే అనిపిస్తుంది. నువ్వింకా ఏవో బరువులు మోసుకుంటూ తిరుగు-తున్నావనీ, నీలో చీకటి మూలల్లో ఇంకా ఏవో భయాలూ, ప్రలోభాలూ నీడల్లాగా తారాడుతూనే ఉన్నాయనీ తెలుస్తుంది. నీలోపల నిద్రాణంగా ఉన్న అగ్ని రాజుకోవడం మొదలుపెడుతుంది.

ఇక ఈ పుస్తకం తమ చేతులదాకా చేరిన యువతీయువకులు మాత్రం నిజంగా భాగ్యవంతులు. ఎందుకంటే, అంధకారం దట్టంగా కమ్ముకుని ఉన్న ఈ లోకంలో మీ జీవితానికి అర్థం చెప్పుకోగల అరుదైన అవకాశం మీ చేతుల్లోనే ఉందని మీకు స్ఫురిస్తుంది. సింహం జూలు విదుల్చుకుని లేచినిలబడ్డట్టుగా మీలోని సాహసి మేల్కొంటాడు. ఆ తర్వాత మీరు నడవబోయే దారిపొడుగునా వెలుతురు పరుచు కుంటుంది.

రామాయణప్రస్తావనతో మొదలుపెట్టాను కదా. రెండు జీవితాలు ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఒక జీవితంగా మారిపోయిన ఈ కథ కూడా రామాయణకథనే. అయితే వనవాసానికి వెళ్ళిన సీతారాములు నగరానికి తిరిగి రాకుండా ఆ అడవిలోనే వనవాసులకు సేవచేసుకుంటూ ఉండిపోయిన రామాయణ కథ. రాముడు రాజ్యానికి తిరిగిరాకపోయుంటే, ఆ అడవిలోనే వనవాసుల్తో ఉండిపోయి ఉంటే, సీతాపరిత్యాగం సంభవించేది కాదు కదా అనిపించింది ఈ కథ చదివాక.

ఈ పుస్తకాన్ని భారతి కోడె అనువదించలేదు, తిరిగి తెలుగులో రాసారన్నంత నిర్మలంగానూ, గంగాప్రవాహంలానూ ఉందీ రచన. ఆమె రాసిన 'ఒక ఫీల్డ్ వర్కర్ డైరీ' చదివినప్పుడే ఆమె అంతరంగం ఎంత పరిశుభ్రమైందో అర్థమయింది. ఇటువంటి రచనని అనువదించడానికి ఇప్పటి యువతరంలో ఆమెకన్నా అర్హులు మరెవరుంటారు?

6-11-2023

# భవభయదారుణం

**ఎనిమిదో** తరగతి క్లాసు. తాడికొండలో ఆ తాటాకు పాక తరగతి గదిలో హీరాలాల్ మాష్టారి గొంతులోంచి కన్నీరు ప్రవహిస్తోంది. ఆయన తిరిగి తిరిగి అవే కవితాపంక్తులు పలుకుతూ ఉన్నారు:

వహ్ ఆతా
దో టూక్ కలేజో కే కరతా
పఛ్ తాతా
పథ్ పర్ ఆతా

సూర్యకాంత్ త్రిపాఠీ 'నిరాలా' రాసిన కవిత 'భిక్షుక్'.

మా పాఠ్యపుస్తకంలో కవిత. కబీరు దోహాల్ని వినిపించినప్పటిలాగా మాష్టారి స్వరం శాంతంగానూ, మధురంగానూ లేదు. ఆ కవిత పదే పదే చదువుకుంటూ ఉన్నప్పుడు ఎప్పుడో చిన్నప్పుడు తాను పోగొట్టుకున్న ఏ స్నేహితుడో, లేదా జీవితపు ఏ మలుపులోనో పోగొట్టుకున్న ఏ చల్లనిచెట్టు నీడనో తనకి పదే పదే గుర్తువస్తున్నట్టుంది ఆయనకి.

దాదాపు యాభై ఏళ్ళు గడిచాయి, ఆ కవిత ఆయనట్లా చదవడం విని. మళ్ళా ఆ పాఠ్యపుస్తకం తెరిచింది లేదు, ఆ కవిత మళ్ళా చదివింది లేదు. కాని ఈ వాక్యాలు ఎవరో ఒక ముల్లుతో హృదయం మీద గీతలు గీసిపోయినట్టుగా నా స్మృతిలో భాగమై పోయాయి.

> పేట్ పీట్ దోనోఁ మిలకర్ హై ఏక్
> చల్ రహా లకుటియా టేక్
> ముట్టీభర్ దానే కో–భూక్ మిటానే కో
> ముహ్ ఫటీ పురానీ జోలీకా ఫైలాతా
> దో టూక్ కలేజో కే కరతా
> పచ్ తాతా పథ్ పర్ ఆతా

'దో టూక్ కలేజో కే కరతా–' 'హృదయాన్ని రెండు ముక్కలు చేస్తూ–'

ఆ బిచ్చగాడు రోడ్డుమీద నడిచి వస్తున్న దృశ్యం నా కళ్ళముందు నిలబడిపోయింది. అప్పటికి నేను శ్రీశ్రీ 'భిక్షువర్షీయసి' కూడా చదివి ఉన్నాను. కాని శ్రీశ్రీ కవితలో ఉన్నది ఆక్రోశం కాదు, అవలోకనం, అశాంతి కాదు, ప్రశ్నార్థకం. ఆ కవిత చెయ్యలేని పని నిరాలా కవిత చేసింది, ఆ పసినాట అది నా హృదయాన్ని రెండు ముక్కలు చేసేసింది.

మాష్టారు మళ్ళా మరెప్పుడూ నిరాలా గురించి చెప్పలేదు. ఆయన జయశంకర్ ప్రసాదు గురించీ, సుమిత్రానందన్ పంతు గురించీ మాట్లాడుతుండేవారుగానీ, నిరాలా అనే పేరు తలవగానే ఒక నమస్కారం పెట్టి మౌనంగా ఉండిపోయేవారు. నిరాలా అంటే 'సాటి లేని వాడ'య్యా అనేవారు. ఆ తర్వాత పెరిగి పెద్దయ్యాక నేను కూడా మళ్ళా నిరాలాని ఎప్పుడూ చదివింది లేదు, ఇదుగో, ఇప్పుడు ఈ A Life Misspent చదివేదాకా.

కానీ నా దురదృష్టం ఏమని చెప్పను! యాభై ఏళ్ళకింద ఆ నా పసితనంలో నిరాలా తన కవితతో నా గుండెని ఎక్కడ రెండు ముక్కలు చేసాడో, ఇప్పుడు మళ్ళా

అక్కడే నా గుండెని చేత్తో పట్టుకున్నాడు. అప్పుడు విరిగిపోయిన ఆ గుండె ఇప్పటికీ అతుక్కోలేదనీ, ఆ పగులు ఎక్కడుందో నిరాలాకి ఒక్కడికే తెలుసనీ అనిపించింది పుస్తకం చదవడం పూర్తయ్యేటప్పటికి.

నిరాలా హిందీలో రాసిన 'కుల్లీ భాట్' అనే ఈ రచనకి సతి ఖన్నా అనే ఆయన చేసిన ఇంగ్లిషు అనువాదం A Life Misspent (2016). దీన్ని నవలిక అని అన్నారు గానీ, దీన్ని నిరాశా ఒక జీవితకథ ముసుగులో రాసుకున్న తన ఆత్మకథగా పేర్కొన్నాడు. పట్టుమని 130 పేజీలు కూడా లేని ఈ పుస్తకాన్ని ఆత్మకథగా పేర్కొంటున్నాడేమిటి అని అనుమానిస్తూనే పుటలు తిప్పానుగానీ, ఇది ఒక జీవితకథనో, ఒక కవి ఆత్మకథనో కాదు, ఆత్మలో దివాలా తీసిన భారతదేశం తాలూకు ముఖచిత్రం. ఈ కథ ఒక వ్యత్యస్త ఇతిహాసం.

మన చరిత్రలో మహానుభావులుగా ప్రసిద్ధిచెందినవాళ్ళు, జాతిని నడిపినవాళ్ళు ఇక్కడ చాలా లఘుమానవులుగానూ, ఎవరికీ అంతగా తెలియని ఒక అనామక భారతీయుడు అత్యున్నతమానవుడిగానూ ఆవిష్కారమయ్యే విలోమ కథ ఇది. ఇంత వరకూ భారతదేశమంటే నేను టాగోరు, భారతి మాత్రమే అనుకునేవాణ్ణి. కాని నిరాలా పేరు తలవకుండా భారతీయ సాహిత్య చరిత్రమాత్రమే కాదు, భారతీయ మానవత్వ కథ కూడా పరిపూర్ణం కాదనిపించింది ఈ పుస్తకం చదివాక.

ఈ పుస్తకంలో నిరాలా తనకి తన అత్తవారి ఊళ్ళో కుల్లీభాట్‌గా పరిచయమైన పండిట్ పట్వర్దిన్‌భట్ అనే ఆయన గురించి రాస్తాడు. ఆ భట్ 'తక్కువ' కులానికి చెందిన వాడు, అతడికి 'చెడు' అలవాట్లు ఉన్నాయి అనే కారణాల వల్ల, నిరాలాని అతడితో స్నేహం చెయ్యవద్దని అత్తవారి కుటుంబం హెచ్చరిస్తుంది. తర్వాత రోజుల్లో భట్ బతుకు తెరువుకోసం రకరకాల దారులు వెతుక్కుంటూ, చివరికి 'అస్పృశ్యుల' కోసం ఒక పాఠశాల తెరుస్తాడు. 'చెడిపోయింది' గా సమాజం భావించే ఒక ముస్లిం మహిళను తన భార్యగా స్వీకరించి ఆమెతో సహజీవనం మొదలుపెడతాడు.

1930 తర్వాత జాతీయోద్యమం 'అంటరాని వారి' మీద దృష్టి పెట్టడం మొదలు పెట్టాక, అతడు కాంగ్రెసు పార్టీ కార్యకర్తగా, ఉద్యమకారుడిగా మారతాడు. చివరికి,

సుఖవ్యాధికి లోనై దీనాతిదీనమైన పరిస్థితుల్లో మరణానికి దగ్గరైనప్పుడు చుట్టూ ఉండే హిందూ సమాజంగానీ, కాంగ్రెసు పార్టీ నాయకులుగానీ, ముస్లిం నాయకులుగానీ అతడికి అండగా నిలబడనప్పుడు నిరాలానే మళ్ళా అతణ్ణి బతికించుకోడం కోసం ఊరూరా తిరిగి విరాళాలు యాచిస్తాడు. చివరికి కుల్లీ భాట్ మరణిస్తాడు. అతడి పదకొండో రోజు శ్రాద్ధసంస్కారానికి ఏ ఒక్కరూ అతిథిగా రాడానికి ఇష్టపడరు. ఊళ్ళో ఉన్న ఒక్క పురోహితుడూ కూడా తనని సమాజం వెలివేస్తుందన్న భయంతో ముందుకు రాడు. చివరికి నిరాలా తనే పురోహితుడి అవతారం ఎత్తి ఆ శ్రాద్ధకర్మ దగ్గరుండి జరిపిస్తాడు.

నిరాలా అంటే ఒక మండుటెండలాంటి జీవనవిషాదమే గుర్తొచ్చేట్టుగా మా మాష్టారు మా మనసుల్లో చిన్నప్పుడు విడిచిపెట్టిన ముద్రకీ, ఈ పుస్తకం తెరవగానే ఇందులో కనిపిస్తున్న వ్యంగ్యానికీ నాకు ముందు లంకె కుదరలేదు. కాని పుస్తకం సగం గడిచేటప్పటికి, తన భార్య, తన వైపు వాళ్ళు, తన అత్తగారివైపు వాళ్ళు దాదాపుగా సగం కుటుంబం తన కళ్ళముందే ఫ్లూ జ్వరానికి ఆహుతైపోయిన సంగతి చదివాక, అప్పుడు అర్థమయ్యింది, నిరాలా అంటే ఏమిటో. తానెంతో ప్రేమించిన తన భార్యను తన ఇరవై రెండేళ్ళ వయసులో పోగొట్టుకున్నాక ఆయన మళ్ళా పెళ్ళిమాటనే ఎత్తలేదు. తల్లిని పోగొట్టుకున్న తన కూతురితో పాటు, తల్లిదండ్రుల్ని పోగొట్టుకున్న మరొక నలుగురు పిల్లల్ని పెంచి పెద్దవాళ్ళని చెయ్యడం కోసమే జీవితమంతా నిలబడ్డాడు. చివరికి తన కూతురు కూడా తన కళ్ళముందే మరణించడం చూసాడు. ఈ అనుభవాలన్నీ ఆయనకి చివరిరోజుల్లో మతిస్థిమితం తప్పించాయంటే ఆశ్చర్యం ఏముంది?

కానీ వ్యక్తిగత జీవితంలోని ఈ విషాదాలముందు ఆయన ఎంత గంభీరచిత్తుడిగా నిలబడ్డాడో, ఏ ఒక్క సందర్భంలోనూ తన విలువల్ని వదులుకోడానికి ఎలా సిద్ధపడలేదో, అది- ఆ వ్యక్తిత్వమే నిరాలాను నా కళ్ళముందు మహోన్నతమానవుడిగా నిలబెడుతున్నది. తన కూతురు చనిపోయినప్పుడు 'సరోజ్ స్మృతి' అని రాసుకున్న కవితలో ఈ వాక్యాలు చూడండి:

తల్లీ, నేనొక పనికిమాలిన తండ్రిని,
నీ కోసం ఏమీ చెయ్యలేకపోయాను, డబ్బు
సంపాదించడానికి నాకు కొన్ని దారులు
తెలియకపోలేదు, కాని కావాలనే వదిలిపెట్టేసాను.

తప్పుడు మార్గాల్లో ఆస్తి కూడబెట్టుకోడమెలాగో
నాకు తెలియంది కాదు. కాని గెలవకండా
ఉండటానికే నేను జీవితమంతా పోరాడేను.

కాబట్టి, నా తల్లీ, బంగారూ, నీకు
పట్టువస్త్రాలు కొనిపెట్టలేకపోయాను
కడుపునిండా తిండిపెట్టలేకపోయాను. కాని
ఒక్కమాట చెప్పగలను, నేనే బీదవాడి
నోటిదగ్గరనుంచీ కూడు కాజెయ్యలేదు, అతడు
ఏడుస్తుంటే చూడగలిగింది లేదు, నా కన్నీళ్ళల్లో
నేను చూడగలిగింది నా వదనాన్నీ, నా హృదయాన్నే.

చిన్నప్పుడు ఆ బిచ్చగాడిమీద కవిత విన్నప్పుడు నా గుండె రెండుముక్కలయిందంటే అది నా పసితనం వల్ల అనుకున్నాను. కాని ఇదేమిటి, ఇప్పుడు అరవయ్యేళ్ళ తరువాత కూడా, ఈ వాక్యాలు రాస్తూ ఉంటే, నాకు కన్నీళ్ళు ఆగడం లేదు?

ఒకసారి ఇండోరులో ఒక సాహిత్యసభలో ప్రసంగిస్తూ మహాత్మా గాంధీ 'హిందీ సాహిత్యంలో టాగోరు ఎక్కడ?' అని అడిగారట. వెంటనే తన చుట్టూ ఉన్న సభాసదుల్ని పక్కకి నెట్టుకుంటో నిరాలా ముందుకు దూసుకొచ్చి 'మీరు హిందీ సాహిత్యం చదివినట్టు లేదే? ముందు హిందీ కవిత్వం చదివి అప్పుడు మాట్లాడండి' అని అన్నాడట. అవును, తనకి హిందీసాహిత్యం గురించి అంతగా తెలియదని గాంధీ ఆ సభాముఖంగానే ఒప్పుకున్నారట.

అప్పుడు 'అయితే నా కవిత్వం పంపిస్తాను చూడండి' అని అన్నాడట నిరాలా. ఈ సంఘటన గురించి చదివినప్పుడు గాంధీ గురించిన నా ఆరాధన ఏమీ తగ్గకపోగా,

ఇదుగో, ఇక్కడ ఒక కవి ఉన్నాడు, టాగోరులాగా, గాంధీని ప్రశ్నించగలిగిన వాడు అని నాకు నేను సంతోషంగా చెప్పుకున్నాను.

నిజానికి నిరాలా ఈ పుస్తకంలో  గాంధీ, నెహ్రూల్ని సున్నితంగా విమర్శిస్తున్నప్పుడు నాకు పదే పదే శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గుర్తొస్తూ ఉన్నారు. శాస్త్రిగారి జీవితానికీ, నిరాలా జీవితానికీ, వారు నిండా మింగిన చేదుతనంలోనూ, అనుష్ఠించిన విలువల్లోనూ ఏమంత తేడా లేదు.

బయటి ప్రపంచానికి అంతగా తెలియని ఒక మిత్రుడి కథ రాస్తున్నట్టు నెపం మీద నిరాలా, నిజానికి తన గురించి, మనకు తెలియని ఒక మహోన్నత ముఖచిత్రాన్ని పరిచయం చేసాడు. ఈ చిన్నపుస్తకం అవశ్యం తెలుగులోకి రావలసిన పుస్తకం. ఇంగ్లిషునుంచి కాదు, నేరుగా హిందీనుంచే అనువాదం చెయ్యగలిగినవాళ్ళు ముందు కొస్తే నేను మరింత సంతోషిస్తాను.

నిరాలా బెంగాల్లో పుట్టిపెరగడంతో ఆయనకి హిందీ కావ్యభాషతో పరిచయం లేదు. ఇరవయ్యవ శతాబ్ద ప్రారంభంలో ఖడీబోలీగా ప్రాచుర్యంలోకి వస్తున్న హిందీ సాహిత్యభాష గురించి ఆయనకు ఆయన భార్య మనోహరీదేవి పరిచయం చేసింది. ఆమె స్ఫూర్తి వల్ల నిరాలా ఖడీబోలీ నేర్చుకుని హిందీ కవిత్వాన్ని ఆధునికయుగంలోకి తీసుకువెళ్ళాడు. అతడి భార్య గొప్ప గాయని కూడా.

ఒకసారి తన అత్తవారి ఇంట్లో ఆమె గానం మొదలుపెట్టినప్పుడు తులసీ ప్రసిద్ధ కీర్తన 'శ్రీరామచంద్ర కృపాళు భజు మన హరణ భవభయ దారుణం' ని ఆలపించిందట. ఈ పుస్తకాన్ని ఇంగ్లిషులోకి అనువదించిన అనువాదకుడు ఆ వాక్యాన్ని Sing Praise of Ram, Who banishes terror of being అని అనువదించాడు. అంతేకాదు, పుస్తకానికి చివరలో తాను రాసిన మలిమాటకు 'భవభయదారుణం: Terror of Being' అని శీర్షిక పెట్టాడు.

దారుణమైన భవభయం ఎలా ఉంటుందో ఈ 130 పేజీల పుస్తకం నాకు పరిచయం చేసినట్టుగా మరే పుస్తకమూ నాకింతదాకా పరిచయం చేయలేదని చెప్పగలను. కాని నిరాలా భయవిముక్తుడు. ఎందుకంటే, ఆయనే ఒకచోట ఇలా రాసాడు:

A servant is Lord Ram as much as the master.

యజమానిలోనూ, సేవకుడిలోనూ కూడా ఒకే రామచంద్రప్రభువుని చూడటానికే ఆయన జీవితమంతా నిలబడ్డాడు. అందుకనే ఈ కథలో మనకెవరికీ తెలియని ఒక కాంగ్రెసు కార్యకర్త మహాత్మాగాంధీతో సమానంగా కనబడతాడు.

భవభయం దారుణం. కాని ఇటువంటి ధైర్యశాలులు ఆ భవభయాన్ని ఎదుర్కొన్నారని తెలియడంలో ఎంత గొప్ప సాంత్వన ఉందని!

14-5-2024

# జాతిని మేల్కొల్పినవాళ్ళు

**భారత** స్వాతంత్ర్య అమృత మహోత్సవాల సందర్భంగా 'జాతీయోద్యమంలో తెలుగు సాహిత్యం నిర్వహించిన పాత్ర' అనే అంశం మీద రెండు రోజుల సదస్సు ఏర్పాటు చేసినందుకు సాహిత్య అకాడెమీని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. ఈ విషయం పైన ఇటువంటి సదస్సు, సద్గోష్టి ఇవాళ చాలా అవసరం.

ఈ సందర్భంగా నాకో సంగతి గుర్తొస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో నేను పాఠశాల విద్య డైరక్టరుగా ఉన్నప్పుడు ఒకరోజు రాజమండ్రిలో ఉన్న బి.యి.డి కాలేజి చూడటానికి వెళ్ళాను. ఆ కాలేజి మా శాఖ ఆధ్వర్యంలోనే నడుస్తూ ఉండేది. అప్పటికి చాలా కాలంగా ఆ కాలేజికి వెళ్ళాలని అనుకుంటూ ఉన్నప్పటికీ, చాలా ఆలస్యంగాగాని నాకు వీలు చిక్కలేదు. ఆ రోజు కాలేజి అంతా తిరిగి చూసాను. ఆ విద్యార్థులందరినీ ప్రిన్సిపాలు మేడ మీద సమావేశపరిచి వాళ్ళని ఉద్దేశించి నన్ను మాట్లాడమని అడిగాడు. నేను వాళ్ళతో మాట్లాడుతూ ఉండగా, నా పక్కనే ఉన్న పాఠశాల విద్య ఆర్.జె.డి, గోడ మీద ఉన్న ఒక పటం చూపిస్తూ, ఆయనెవరని పిల్లల్ని అడిగాడు. నేను కూడా నా చూపులు గోడమీదకు తిప్పాను. అది గరిమెళ్ళ సత్యనారాయణ ముఖచిత్రం. చాలామంది పిల్లలు ఆయన ఎవరో చెప్పలేకపోయారు.

కాని మొత్తానికి ఒక పిల్లవాడు ఆయన పేరైతే చెప్పగలిగాడుగాని మరే వివరాలూ చెప్పలేకపోయాడు. ఆ పేరు మాత్రం నీకెలా తెలిసిందని అడిగాను. 'ఎందుకంటే ఈ కాలేజికి ఆయన పేరే కదా పెట్టారు' అని జవాబిచ్చాడు.

నేను ఉలిక్కిపడ్డాను. అప్పటికి రెండేళ్ళుగా పాఠశాల విద్యాశాఖ కమిషనరుగా ఉన్నాను. కాని ఆ కాలేజికి గరిమెళ్ళ సత్యనారాయణ పేరుపెట్టారని నాకు తెలీదు. ఆ కాలేజి గేటుదగ్గరగాని, గోడమీద గాని ఆయన పేరు లేదు. చివరికి ఆ కళాశాల సిబ్బంది కూడా నాకు కాలేజి చూపిస్తూ, ఆ లైబ్రరీ, ఒకప్పుడు రాధాకృష్ణన్ కూర్చున్న కుర్చీ అన్ని చూపించారుగానీ, గరిమెళ్ళ సత్యనారాయణ ఊసే ఎత్తలేదు. నేను కిందకొచ్చాక మళ్ళా ప్రిన్సిపాలు రూములో అడుగుపెట్టి అక్కడ గోడమీదన్నా ఆ పేరు రాసి ఉందా అని చూసాను. పేరైతే రాసి ఉంది, కాని గరిమెళ్ళ సత్యనారాయణ అని కాదు, 'జి.ఎస్. కాలేజ్ ఆఫ్ కాంప్రహెన్సివ్ ఎడ్యుకేషన్' అని రాసి ఉంది!

గరిమెళ్ళ సత్యనారాయణ గురించి ఆ కళాశాల గుర్తుపెట్టుకోవలసినట్టుగా గుర్తు పెట్టుకోలేదు సరే, మనమేం చేస్తున్నాం అని ప్రశ్నించుకుంటే, సమాధానం చెప్పడం కష్టం. ఆయన సుబ్రహ్మణ్య భారతితో సమానమైన కవి అని తన జీవితకాలంలోనే కొనియాడబడ్డవాడు. కాని భారతియారుకి తమిళదేశంలో దక్కిన అపురూపమైన గౌరవంతో పోలిస్తే గరిమెళ్ళకు మనమేమివ్వగలిగాం? ఆయన గీతాలకి ఇంగ్లిషు అనువాదం ఇప్పటికే వచ్చి ఉండాలి కదా. 'మాకొద్దీ తెల్లదొరతనం' గీతానికి ప్రకాశం గారు చేసిన ఇంగ్లిషు అనువాదం అందులో ముందు పుటల్లో ఉండాలి కదా. కనీసం భారతీయ సాహిత్య నిర్మాతలు సిరీసులో సాహిత్య అకాడెమీ ఇప్పటికే ఆయన మీద ఒక మోనోగ్రాఫు వెలువరించి ఉండాలి కదా!

సరే, 'ఆజాదీ కా అమృత మహోత్సవ్' మొదలైన తరువాతనైనా జాతీయోద్యమ వీరుల పట్ల, ఆ ఉద్యమాన్ని ఉత్తేజితుల్ని చేసిన కవుల పట్లా, రచయితల పట్లా జాతి సంస్మరణ ఏ విధంగా ఉందో చూద్దామని ఆజాదీ కా అమృతమహోత్సవ్ వెబ్‌సైటు తెరిచి చూసాను. అందులో History Corner లో Unsung Heroes of Indias Freedom Struggle అనే పేజీకి వెళ్లి చూసాను. అక్కడ రాష్ట్రాలవారీగా, జిల్లాల

వారీగా స్వాతంత్ర్య సమరయోధుల వివరాలు పొందుపరచడానికి ఏర్పాటు చేసారు. అందులో ఇప్పటిదాకా, ఆంధ్ర ప్రదేశ్ నుంచి 138, తెలంగాణా నుంచి 61 మంది వివరాలు మాత్రమే ఉన్నాయి.

ఇంతేనా? ఈ రెండు రాష్ట్రాలనుంచి జాతీయోద్యమంలో పాల్గొని తమ సమస్తం త్యాగం చేసిన వీరులూ, యోధులూ కనీసం రెండు వందల మంది కూడా లేరా? జాతీయోద్యమ కాలంలో ఒక్క తెలంగాణానుంచే ఇరవై రెండు వేల మంది సత్యాగ్రహులు జైళ్లకి వెళ్ళారని చరిత్రకారులు రాసారు. సత్యాగ్రహులు మాత్రమే. ఇక తక్కిన వివిధ మార్గాల్లో పోరాడినవాళ్ళని కూడా కలుపుకుంటే సుమారు యాభై వేలమందిదాకా ఉండరా? కాని, పొందుపరిచిన వివరాల మేరకు చూస్తే తెలంగాణా కాస్త నయమని-పించింది. అక్కడ కనీసం రాంజీగోండు, తుర్రెబాజ్ ఖాను పేర్లేనా ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో అకారాది క్రమంలో మొదటి జిల్లా అల్లూరి సీతారామరాజు జిల్లా పేజి తెరిచి చూస్తే కనీసం సీతారామరాజు పేరు కూడా లేదక్కడ! సీతారామరాజు పోరాటంలో పాల్గొన్న గిరిజనుల వివరాలు ఈ మధ్య మా అన్నయ్య సుందర్రావు సేకరిస్తూ ఉన్నాడు. ఇప్పటికి ఎంతమంది లెక్కతేలారని అడిగితే సుమారు పదకొండు వందలమంది దాకా ఉన్నారని చెప్పాడు. సరే, ఆంధ్ర, రాయలసీమ, నైజాము మూడు ప్రాంతాల్లోనూ, రాజద్రోహనేరం కింద అరెస్టయిన మొదటి జాతీయోద్యమ యోధుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావునైనా తలుచుకున్నారా అని అని కర్నూలు జిల్లా వివరాలు తెరిచి చూసేను. ఆ ఊసే లేదక్కడ.

అంటే ఆంధ్ర, నైజాం ప్రాంతాల్లోని స్వాతంత్ర్యయోధుల వివరాలు మనదగ్గర లేవా? ఎందుకు లేవు? హైదరాబాదు రాష్ట్రంలో స్వాతంత్ర్యోద్యమ చరిత్రను సంకలితం చేయడానికి నియమించబడ్డ హైదరాబాదు స్టేట్ కమిటీ 1957 లోనే నాలుగు బృహత్సంపుటాలు వెలువరించింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో జాతీయోద్యమచరిత్ర మామిడిపూడి వెంకట రంగయ్య సంపాదకత్వంలో సంకలనం చేసినవి మరొక నాలుగు బృహత్సంపుటాలు 1974 లో వెలువడ్డాయి. మరి ఎక్కడ ఈ అగాధం ఉంది? విజ్ఞానసర్వస్వాలుగా చెప్పదగ్గ ఆ ఎనిమిది సంపుటాల్లోని సమాచారమూ పుస్తకాలకీ,

లైబ్రరీలకీ మాత్రమే పరిమితమై పోయిందా? తెలుగుజాతి స్మరణలో జాతీయోద్యమం అంటే గుర్తొచ్చేది ఆ 199 మందేనా?

అందుకనే, సాహిత్య అకాడెమీ ఈ రెండు రోజుల సదస్సు నిర్వహిస్తున్నదని తెలియగానే నాకెంతో సంతోషమనిపించింది. మహత్తరమైన మన జాతీయ వారసత్వానికీ, మన ప్రస్తుత పరిస్థితికీ మధ్య ఉన్న ఈ అంతరం గురించి ఈ సందర్భంగా నైనా బిగ్గరగా మాట్లాడుకోవచ్చు కదా అనిపించింది. మహత్తరమైన మన జాతీయోద్యమం గురించి ఇవాళ్టి భారతదేశానికి చాలా తెలియదనే విషయం తెలిసే కొద్దీ చాలా దుఃఖంగానూ, దుర్భరంగానూ అనిపిస్తూ ఉంటుంది. ఈ దుస్థితికి కారణాలు ఏమేనా గానీ, ఈ చీకటి మధ్య ఎంత చిన్న దీపం వెలిగించినా అది గొప్ప విషయమే.

అసలు జాతీయోద్యమ స్మృతి పట్లనే ఇంత ఉదాసీనత ఉన్నప్పుడు, ఆ రోజుల్లో ఆ ఉద్యమం వల్ల పుట్టిన సాహిత్యం గురించీ, తిరిగి ఆ ఉద్యమాన్ని ఉత్తేజపరిచిన సాహిత్యం గురించీ ఆసక్తి ఉంటుందని ఎలా అనుకోగలం? ఇప్పటికే స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి సాహిత్యాన్ని మనం ఎంతో పోగొట్టుకున్నాం. కొన్నాళ్ళు పోతే ఆ విషయాల గురించి సాధికారికంగా చెప్పే తరం కూడా కనుమరుగైపోతుంది. ఇక ఎక్కడేనా గ్రంథస్థంగా ఉన్నా అది కూడా అరకొరగానో, అసంపూర్తిగానో మిగిలిపోతుంది.

ఉదాహరణకి, 'అమృతమహోత్సవ్ సైటు'లోనే హిస్టరీ కార్నరులో 'స్వతంత్ర స్వర్' అనే విభాగం కింద బ్రిటిషుకాలంలో నిషేధించబడ్డ సాహిత్యం గురించిన వివరాలు పొందుపరిచారు. ఇండియను ఆర్కైవ్సు డిపార్టుమెంటు వారు ప్రచురించిన కొన్ని పుస్తకాల పి.డి.ఎఫ్‌లు కూడా అందులో అందుబాటులో ఉంచారు. గొప్ప విషయం. తెలుగుకి సంబంధించి అందులో మూడు పుస్తకాల్లో కొంత సమాచారం ఉంది. ఆ పుస్తకాలు ఒక్కొక్కటీ చూద్దాం.

మొదటిది, Patriotic Poetry Banned by Raj (1982) అనే చిన్న పుస్తకం. అందులో తెలుగు సాహిత్యానికి సంబంధించి నిషేధించిన పది పుస్తకాల జాబితా ఉంది. ఆ పదింటిలో ఒక పుస్తకాన్నే రెండు సార్లు లెక్కేసారు. కాని ప్రభుత్వమే ప్రచురించిన ఆ జాబితాలో చేరకుండా ఉండిపోయిన పుస్తకాలు కూడా తక్కువేమీ

కాదు. మొదటిది, 'మాలపల్లి' నవల. 1922 లో ప్రచురించబడ్డ మాలపల్లి నవల ఏడాది తిరక్కుండానే నిషేధానికి గురయ్యాక, తిరిగి పూర్తి నవల మీద నిషేధం 1937 కి గాని తొలగిపోలేదు.

అలాగే దామరాజు పుండరీకాక్షుడు రాసిన 'పాంచాల పరాభవం' లేదా 'పంజాబు దురంతాలు' అనే నాటకం తెలుగు నాట సంచలనం రేకెత్తించిన రచన. జలియనవాలా బాగు దురంతాల మీద పుండరీకాక్షుడు ఆ నాటకం రాసారు. ఆయన ఆ నాటకాన్ని జలియనవాలా బాగు గడ్డమీద ప్రతి రోజూ ఒక తపస్సులాగా నిష్ఠగా కూచుని రాసారట.

1921 లో రాసిన ఈ నాటకం వెంటనే నిషేధానికి గురయ్యింది. అంతేకాదు, ఆ నాటకం మీద బ్రిటిషు పార్లమెంటులో చర్చ జరిగింది. ఆ నాటకాన్ని తొలిసారి ఇంగ్లాండులో ప్రదర్శిస్తే, అందులో నటించినందుకు ఎన్.జి.రంగా అరెస్టయ్యాడు కూడా. ఇది మామూలు చరిత్ర కాదు. స్టేజీ మీద డయ్యరు దిష్టిబొమ్మను దగ్ధం చేసినందుకు బ్రిటిషు పార్లమెంటులో మంటలు పుట్టించిన నాటకం. 'శ్రీ గాంధి నామం మరువాం, మరువాం, సిద్ధము జైలుకు వెరువాం వెరువాం' అనే గీతాన్ని ఈ నాటకంలో హిందువులూ, ముస్లిములూ ఇద్దరూ కలిసి పాడతారు. ఆ తర్వాత ఇది తెలుగు నాట ఒక భజనగీతంగా మారిపోయింది. కాని నేను చెప్తున్నదంతా మౌఖిక చరిత్ర.

చెదురుమదురుగా ఉన్న ఈ మాటలెక్కడా ఒక్కచోట గ్రంథస్థం కానేలేదు. చివరికి భారతప్రభుత్వం ముద్రించిన సమాచారంలో ఈ నాటకం పేరే లేదు.

అలాగే మరొక నాటకం 'చిచ్చరపిడుగు'. ప్రపంచనాటక చరిత్రలోనే ఇదొక ప్రత్యేకమైన రచన. కొండావేంకటప్పయ్య శిష్యుడైన రామచంద్రుని వెంకటప్ప అనే రచయిత మంగళ్ పాండే మీద రాసిన ఈ నాటకాన్ని రచయిత పేరులేకుండా మద్దూరి అన్నపూర్ణయ్య 'కాంగ్రెసు' పత్రికలో ప్రచురించారు. ప్రభుత్వం ఆయన్ను కబురంపించి ఆ నాటక రచయిత పేరు చెప్పమని అడిగింది. పత్రిక నియమావళి ప్రకారం రచయిత పేరు తాను వెల్లడించలేనని అన్నపూర్ణయ్య జవాబిచ్చాడు. అయితే రచయిత బదులు సంపాదకుడే ఆ శిక్ష అనుభవించవలసి ఉంటుందని ప్రభుత్వం చెప్పింది. అన్నపూర్ణయ్య సంతోషంగా తలూపాడు. ఆయనకు అయిదేళ్ళ కఠిన కారాగారశిక్ష పడింది.

కాని రామచంద్రుని వెంకటప్పను ఆ విషయం బాధిస్తూనే ఉంది. చివరకి 1930 లో చొల్లంగి ఉప్పు సత్యాగ్రహంలో ఆయన ఆ నాటకరచయిత తానేనని బహిరంగంగా ప్రకటించాడు. ప్రభుత్వం అతణ్ణి అరెస్టు చేసి మరొక ఏడాది కఠిన కారాగారశిక్ష విధించింది. అలా ఒక నాటకానికి గాను ఇద్దరు శిక్ష అనుభవించవలసి వచ్చిన నాటకం అది. ఇప్పుడు ఆ నాటకం ఎక్కడ దొరుకుతుంది?

ఇటువంటి రచనలు, రచయితలు తెలుగులో ఎన్నో ఉన్నాయి. మరికొన్నేళ్ళు పోతే ఈ మాటలు కూడా చెప్పేవాళ్ళుండరు. నేను చెప్తున్నది ఆంధ్ర ప్రాంతంలో నిషేధించబడ్డ రచనల గురించి. నైజాం ప్రాంతంలో నిషేధించబడ్డ రచనల గురించిన వివరాల జాబితా ఇటువంటిది ఏదీ ఇప్పటిదాకా ఎవరూ రూపొందించినట్లే లేదు.

అమృతోత్సవ్ సైట్లో ఉన్న మరొక పుస్తకం Patriotic Writings Banned by the Raj (1984) అనేది. ఇందులో తెలుగు పుస్తకాలు ఇరవై దాకా లెక్కకొచ్చాయి. 'మాలపల్లి' నవల ఈ జాబితాలో చేరింది. కానీ వాసిరెడ్డి, సుంకరలు రాసిన 'ముందడుగు' (1945) నాటకం ఊసే లేదు. గోర్కీ అమ్మ నవలకు క్రొవ్విడి లింగరాజు గారి తెలుగు అనువాదంతో సహా మరెన్నో వామపక్ష రచనలు ప్రభుత్వ నిషేధానికి గురయ్యాయి. వాటి వివరాలు మనకెక్కడా ఒకచోట లభ్యం కావడం లేదు.

ఇక అమృతోత్సవ్ సైట్లో ఉన్న మూడవ పుస్తకం Publications Proscribed by the Government of India (1985) అనే సంకలనం. బ్రిటిషు లైబ్రరీ ప్రచురణ. ఇందులో పన్నెండు పుస్తకాల జాబితా ఉంది. అందులో ఒకటి రెండు తప్ప తక్కినవన్నీ ముందు జాబితాల్లో ఉన్నవే.

ఈ మూడూ కాక, మరొక విలువైన పుస్తకం కూడా ఆ సైట్లో కనబడింది. నిషేధించ-బడిన పుస్తకాల్లోంచి ఎంపిక చేసిన తెలుగు గేయాలు, పద్యాలతో 'స్వాతంత్ర్య స్వరము' (1982) అనే పేరిట వెలువరించిన 88 పేజీల పుస్తకం. మీరెవరైనా ఆ పుస్తకం చూసారా? నేనయితే ఇదే మొదటిసారి చూడటం.

ప్రభుత్వం నిషేధించిన పుస్తకాల్లో వడ్డాది సీతారామాంజనేయులు, పూడిపెద్ది కాశీ విశ్వనాథ అనే వారలు సంకలనం చేసిన 'స్వరాజ్య గీతామృతము' (U1921-23) అనే

ఒక పుస్తకం కూడా ఉంది. ఈ పద్యాల్లో కొన్ని ఆ పుస్తకంలోంచి కూడా తీసుకున్నారు. ఈ పుస్తకాన్ని నేనిప్పటిదాకా చూడలేదు. కొన్నాళ్ళు పోతే ఇటువంటి ఒక పుస్తకం వచ్చిందని కూడా మనకి చెప్పేవాళ్ళుండరు. ఇప్పుడేనా ఆర్కైవ్సు నుంచి ఆ పుస్తకం మొత్తం సంపాదించి పునర్ముద్రించవలసిన అవసరం లేదంటారా?

జాతీయోద్యమ స్మృతి పట్ల నేడు ప్రజల కనవస్తున్న సమాచారలోపానికీ, నిరాసక్తతకీ ప్రధాన కారణం మన విద్యావ్యవస్థలోనూ, మన చరిత్ర రచనలోనూ ఉందని చెప్పవచ్చు. కాని జాతీయోద్యమ సాహిత్యం పట్ల మన అజ్ఞానానికి కారణమేమై ఉంటుంది?

నలభై ఏళ్ల కిందట, రాజమండ్రిలో ప్రసిద్ధ రంగస్థల ప్రయోక్త టి. జె. రామనాథం కోసం నేను 'స్వాతంత్ర్యోద్యమ శంఖారావం' (1984) అనే ఒక నాటకం రాసిచ్చాను. అదొక డాక్యుమెంటరీ రూపకం. అందుకని జాతీయోద్యమకాలంలో ప్రజల నాలుకల మీద నానిన జాతీయ గీతాల్నీ, గేయాల్నీ అందులో సందర్భానుసారం వాడుకోవాలని అనుకున్నాం. అవెక్కడ దొరుకుతాయా అని గౌతమీ గ్రంథాలయాన్ని గాలిస్తే గురజాడ రాఘవశర్మ సంకలనం చేసిన 'జాతీయ గీతాలు' (1973) దొరికింది. దాదాపు ఏడు వందల పేజీల ఆ బృహత్సంకలనం ఒక పెన్నిధిలాగా మా కంటబడింది.

ఆవురావురుమంటూ ఆ పుస్తకం తిరగేస్తే, అందులో ఎన్నో పేర్లు, కొండపల్లి జగన్నాథదాసు, మంగిపూడి, పూడిపెద్ది, చెరుకువాడ, బెల్లంకొండ చంద్రమౌళీశ్వరశాస్త్రి, చెన్నాప్రగడ లాంటివి అప్పటిదాకా మేము విని ఉండనివి కనబడ్డాయి. జాతీయోద్యమ కవులుగా ప్రసిద్ధి చెందిన చిలకమర్తి, గరిమెళ్ళ, రామిరెడ్డి, కవికొండల, బసవరాజు, త్రిపురనేని వంటి వారివి కూడా అప్పటిదాకా మేము చదివి ఉండని ఎన్నో గేయాలు ఆ పుస్తకంలో కనిపించాయి.

ఆ పుస్తకాన్ని మొదటిసారి చూసిన చాలా రోజుల దాకా నాలో చెప్పలేని అలజడి కలుగుతూనే ఉంది. ఇదేమిటిది? ఎందుకని ఈ కవుల గురించి ప్రధానస్రవంతి సాహిత్య సంకలనాల్లో, సాహిత్య చరిత్రల్లో తెలియవలసినంతగా తెలియలేదు?

ఏళ్ళ మీదట నాకేమి అర్థమయిందంటే, అసలు ఆధునిక తెలుగుసాహిత్యం గురించి మనం చెప్పుకుంటూ వస్తున్న నెరేటివు లోనే పెద్ద లోపం ఉందని. ముద్దుకృష్ణ

‘వైతాళికులు’, నారాయణరెడ్డి ‘ఆధునికాంధ్ర కవిత్వం, సంప్రదాయాలు, ప్రయోగాలు’, ఆరుద్ర ‘సమగ్ర ఆంధ్ర సాహిత్యం, నాలుగ సంపుటం’, వెల్చేరు నారాయణ రావు ‘తెలుగులో కవితావిప్లవాల స్వరూపం’ లాంటి గ్రంథాలు చూడండి. వాటిలో జాతీయో-ద్యమ కవిత్వయుగమంటూ ఏదీ కనిపించదు. ఎక్కడైనా దేశభక్తి కవిత్వం గురించిన ప్రస్తావన ఉన్నా అది భావకవిత్వం అనే విభాగంలో ఒక ఉపవిభాగంగా మాత్రమే కనిపిస్తుంది. కానీ, అది నిజమేనా?

తెలుగు భావకవిత్వం పుట్టిందే 1920 ల తర్వాత. ఇంకా చెప్పాలంటే 1925 తర్వాత మాట. ఎందుకంటే, ‘కృష్ణపక్షం’ అచ్చయ్యింది ఆ ఏడాది కాబట్టి. కాని అప్పటికే తెలుగులో జాతీయోద్యమ కవిత్వం నిప్పులు చిమ్ముతూ ఉంది. చిలకమర్తి ‘భరత ఖండంబు చక్కని పాడియావు’, గరిమెళ్ళ ‘మాకొద్దీ తెల్లదొరనం’, మంగిపూడి ‘మేలుకొనుమీ భరతపుత్రుడ, మేలుకొనుమీ సచ్చరిత్రుడ’, కొండపల్లి జగన్నాథ దాసు ‘కనులనీరు కారునుగా కరుణలేక ఆ డయ్యరొనర్చిన వధ వినిన’, ఆయనదే మరొక సుప్రసిద్ధ గీతం ‘నిరాకరణమను మిఠాయి యిదుగో, బిరాన రుచి చూడండీ’ లాంటివి తెలుగునేలమీద దావానలంగా వ్యాపించి ఉన్నాయి. వాటిని మనం భావకవిత్వం కింద ఎలా లెక్కేయగలుగుతాం? వస్తువులో, భావనలో, స్ఫూర్తిలో భావకవిత్వం మరింత సూక్ష్మమైంది. అది రొమాంటిసిజం నుంచి ప్రేరణ పొందిన స్వేచ్ఛాగానం. కానీ జాతీయోద్యమ కవిత్వమో? నిజజీవిత పోరాటాల్లోంచి, వీధుల్లోంచి, కారాగారాల్లోంచి, కొరాడాదెబ్బల మధ్యనుంచి పుట్టిన కవిత్వం. అది మన అసలైన నెత్తుటి రచన. కాని దాన్నెందుకని మనం మన సాహిత్య చరిత్రల్లోంచి తుడిచిపెట్టాం?

మనం రాసుకున్న నెరేటివ ప్రకారం కందుకూరి వీరేశలింగంతో తెలుగునాట ఆధునిక చైతన్యం మొదలయ్యింది. గురజాడ అప్పారావుతో సాహిత్య సంస్కారం బలపడింది. రాయప్రోలు సుబ్బారావుతో భావకవిత్వయుగం మొదలయ్యింది. చివరికి ముద్దుకృష్ణ వైతాళికుల్లో కూడా గురజాడ దేశభక్తి, రాయప్రోలు జన్మభూమి గీతాలు తప్ప పైన పేర్కొన్న గీతాలేవీ కనిపించవు. కానీ నిశితంగా చూస్తే, వీరేశలింగానికీ, గురజాడకీ తర్వాతా, భావకవిత్వానికి ముందూ కవిత్వం నిప్పులు చిమ్మిన కాలం

ఒకటుంది. అది ఆధునిక భారతదేశ చరిత్రలో సంస్కరణవాద యుగానికీ, గాంధీ యుగానికీ మధ్య ఉండే ఒక ప్రత్యక్ష రాజకీయ దశ. అందులో వందేమాతరం ఉద్యమం, స్వదేశీ ఉద్యమం, బెంగాలునుంచి తిరునెల్వేలిదాకా కొనసాగిన టెర్రరిస్టు బలిదానాలూ ఉన్నాయి.

తెలుగు సాహిత్యంలో ఆ దశ ఎప్పుడు మొదలయ్యిందో మనం సులువుగా గుర్తు పట్టవచ్చు. అది బిపిన్‌చంద్రపాలు రాజమండ్రి వచ్చినప్పుడు 1907 లో ఏప్రిలు 19 న చిలకమర్తి 'భరతఖండంబు చక్కని పాడియావు' పద్యం చదివిన రోజున మాత్రమే కాదు, ఆ ఏడాదే మే 9 న లాలా లజపత్‌రాయి అరెస్టయినప్పుడు 'చెరసాలల్ పృథు చంద్రశాలలె యగున్' అని చిలకమర్తి మరో పద్యపరంపర చదివినప్పుడే కాదు, అంతకన్నా సూక్ష్మమైన సందర్భం మరొకటుంది. ఆ యేడాదే వీరేశలింగం పురమందిరం లో నాళం కృష్ణారావు ఖుదీరాంబోసు చిత్రపటం తగిలించిన రోజు కూడా.

వీరేశలింగంగారి స్వీయచరిత్ర మూడవ ప్రకరణంలో ఆ వైనం మనల్ని నివ్వెర పరుస్తుంది. ఆ పటాన్ని అక్కడనుంచి తీసెయ్యమని వీరేశలింగం చెప్పినా కూడా నాళం కృష్ణారావు ఆ పటాన్ని అక్కడే ఉంచినందుకు ప్రభుత్వం వీరేశలింగాన్ని సంజాయిషీ అడిగింది. నాళం కృష్ణారావుని ఏమీ చెయ్యలేక, వీరేశలింగం ఆ పురమందిరంతో సంబంధం తెంచుకున్నాడు.

జాతీయవాద రాజకీయోద్యమంతో సంస్కరణ ఉద్యమం తెగతెంపులు చేసుకున్న ఘట్టం అది.

గురజాడ అప్పారావు సంగతి చూద్దాం. పందొమ్మిదో శతాబ్ది తెలుగు సాహిత్యంలో కాంగ్రెసు ప్రస్తావన చేసిన ఏకైక రచయిత ఆయన. 1892 లో ప్రదర్శించిన కన్యా-శుల్కం మొదటికూర్పులో రెండవ అంకంలో వెంకటేశంతో మాట్లాడుతో తాను బండివాడితో నేషనలు కాంగ్రెసు గురించి రెండు ఘంటలు లెక్చరు ఇస్తే వాళ్ల ఊరు హెడ్‌కాన్‌స్టేబుల్‌ని ఎప్పుడు బదిలీ చేస్తారని అడిగాడు అంటాడు గిరీశం.

కాంగ్రెసు ఏర్పడ్డ ఏడేళ్ళకే ఒక తెలుగు నాటకరచయిత ఇటువంటి సూక్ష్మదృష్టి కనబరచడం అబ్బురమేగాని, స్థానికజీవితం క్షాళితం కాకుండా జాతీయస్థాయి

రాజకీయోద్యమాలు సాధించగలిగే మార్పు చాలా తక్కువనే ఒక నిరాసక్తత కూడా ఇందులో ఉందని గుర్తించాలి.

అప్పుడు కాంగ్రెసు పట్ల అటువంటి నిరాసక్తతని కనపరిచినవాడే తిరిగి కాంగ్రెసు మీద ఒక కవిత రాసాడు. 1908 లో జరిగిన మద్రాసు కాంగ్రెసుసభలో కాంగ్రెసు నాయకులు గట్టిగా నోరుమెదపలేకపోతున్నారనీ, వాళ్ళని ద్వీపాంతరం పంపిస్తారని భయమేమో అంటో ఎద్దేవా చేసిన ఆ కవితని గురజాడ ఇంగ్లిషులో రాసాడు. ఆ కవితలో వినిపిస్తున్న అవహేళనకు మురిసిపోయి శ్రీశ్రీ దాన్ని తెలుగు చెయ్యకుండా ఉండలేక పోయాడు.

కాని గురజాడకి తెలియనిదేమంటే, మద్రాసు కాంగ్రెసు 1908 డిసెంబరులో జరగడానికి ఆరునెలల ముందే 1908 జూలైలో, ఒక తెలుగు రచయిత, బ్రిటిషు ప్రభుత్వాన్ని చెండాడుతూ తెలుగులోకి రాసిన సంపాదకీయాలకు గాను రాజద్రోహ నేరం మీద మూడేళ్ళ కఠిన కారాగారశిక్షకి గురయ్యాడు. ఆ ఉదంతం గురించి గాడిచర్ల హరిసర్వోత్తమరావు రాసుకున్న ఈ మాటల్ని మీకు పూర్తిగా చదివి వినిపించాలని ఉంది. ఆయనిలా అంటున్నాడు:

> మా కేసు విచారణ చేసిన న్యాయమూర్తి కెర్షాన్సు ఒక పార్సీ పెద్ద. నా యందు ఎనలేని దయగలవాడాయెను. దానికి కారణము ప్రాసిక్యూషను వారు నా దురాలోచనలను రుజువు చేయడానికి సాక్ష్యముగా తెచ్చిన నా 'శివాజీ ఉత్సవపుటుపన్యాసము'. ప్రాసిక్యూటరు దానిని చదివి వినిపిస్తుంటే న్యాయమూర్తికి పరవశము కలిగిపోయింది. అతడు నన్ను నిర్దోషిగా ప్రకటించి విముక్తుణ్ణి చేస్తాడేమో యని మాకే భయం కలిగింది. అట్లా వదిలిపెడితే పోలీసువారు వేరే కేసుపెట్టి అయిదేండ్లు శిక్ష వేయింపిస్తారని మా భయం. కాబట్టి కెర్షాన్సుగారు తేలికగా శిక్ష వేయడమే మేలనే సూచన ఆయనకు అందింది. ఆయన నాకు ఆరునెలలు సింపిల్ ఖైదు విధించెను. గవర్నమెంటు అంగీకరిస్తుందా? ఎక్కువ శిక్షకొరకు హైకోర్టుకు అపీలు పెట్టింది. న్యాయమూర్తులైన జస్టిస్ బెన్‌సన్, మిల్లరులు నా ఖైదును మూడేండ్లు కఠిన

శిక్షకు పెంచారు. నా యందు దయచూపిన జడ్జి కెర్నాన్సు ముప్పుతిప్పలు పడవలసి వచ్చెను. సర్కారు ఉద్యోగమే మానుకుని బారిష్టరుగా వుండి పోవలసి వచ్చెను. అట్టి ఉదారహృదయుణ్ణి నేను విస్మరింపగలనా? విస్మరించవచ్చునా?

ఈ వాక్యాలు చదివినప్పటినుంచీ జడ్జిని కూడా పరవశుణ్ణి చేయగల ఆ వ్యాసం చదవాలని ఉవ్విళ్ళూరుతూ ఉన్నాను. కాని అదిప్పటికీ నాకు లభ్యం కానేలేదు. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే, మొత్తం మన సాహిత్యచరిత్రనే జాతీయోద్యమకారుల పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరించదని చెప్పడానికి.

గురజాడ కాంగ్రెసు మీద రాసిన కవితను మనకి అందించిన సాహిత్యచరిత్రకారులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు సంపాదకీయాల్ని ఎందుకు అందించలేకపోయారు?

మీకు తెలుసా? ఈ రోజు సాహిత్యఅకాడెమీ ఇలా ఒక గోష్ఠి నిర్వహించినట్టే, మహాత్ముడు కూడా ఒకసారి భారత జాతీయోద్యమకవుల్తో సబర్మతి ఆశ్రమంలో ఒక గోష్టి నిర్వహించారని? గురజాడ రాఘవశర్మ ఆ సందర్భం గురించి ఇలా రాస్తున్నారు:

> గాంధిగారొకనాడు జాతీయగీతముల రచయితల సమావేశము యేర్పరచి, సబర్మతి ఆశ్రమమున వివిధ రాష్ట్రములతో పాటు గరిమెళ్ళను కూడా పిల్వగా గరిమెళ్ళ హాజరైరి. గాంధిగారి ఆజ్ఞానుసరణి యెవరి పాట వారు పాడి వినిపించారు. గరిమెళ్ళ స్వీయ వీరావేశ గేయమొకటి పాడి 'దీనికి బహుమతి ఒక సంవత్సరము శ్రీకృష్ణ జన్మస్థానము లభ్యమైనది' అన్నారు. అనగా గాంధి గారు నమ్మలేదు... సాక్ష్యము ధృవమైన తరువాత నమ్మక తప్పలేదు, అంతియె కాదు. గాంధిగారు తారస్థాయినందుకొన్న ఆ పాట విని ఆశ్చర్యచకితులై మిగతా కవిగణమునకు సలహానిచ్చినారు, ఈ బాణిలో మీరందరు కూడా గేయములు వ్రాయుడని. అది మన గరిమెళ్ళకు గాంధిగారిచ్చిన యోగ్యతా పత్రము.

శ్రీశ్రీ మహాప్రస్థానానికి చలం ఇచ్చిన యోగ్యతాపత్రం గురించే మనకు తెలుసుగాని, గరిమెళ్ళకు గాంధీ ఇచ్చిన ఈ యోగ్యతాపత్రం గురించి తెలియనే లేదు.

కాని కాలం జాతీయోద్యమ కవుల పక్షానే నిలిచింది. తర్వాత రోజుల్లో తిరిగి మళ్ళా ప్రజలు తమ సాంఘిక, రాజకీయ అసంతృప్తిని, అసమ్మతిని ప్రకటించడానికి గరిమెళ్ళ బాటనే పట్టారు. సుబ్బారావు పాణిగ్రాహి, వంగపండులు మొదలుకుని గద్దరు దాకా కూడా తెలుగులో ఒక అవిచ్ఛిన్న గేయకారపరంపర కొనసాగుతూ వస్తున్నదని నేను ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు.

సాహిత్యచరిత్రలో జాతీయోద్యమ సాహిత్యానికి లభించిన నిరాదరణ కవిత్వానికి మాత్రమే పరిమితం కాదు. 'మాలపల్లి' నవల పట్ల కూడా మనం చూపించవలసినంత గౌరవం చూపించలేదనే అనుకుంటున్నాను. తెలుగు వికీపీడియాలో మాలపల్లి నవల గురించిన వ్యాసం రాసిన రచయిత ఎవరోగాని, ఆయన ఆ నవల ప్రాముఖ్యతను అన్ని పార్శ్వాల్లోనూ అద్భుతంగా పట్టుకున్నాడు.

తెలుగులో అభ్యుదయసాహిత్యం అంటూ మొదలయ్యింది ఆ రచనతోనే అని రాసాడాయన. అంతేకాదు, ఈ నాడు మనం చర్చించుకుంటున్న వర్ణం, వర్గం, జెండరు లాంటి మౌలికఅంశాల పట్లా ఆ నవల్లో జరిగిన చర్చ ఇంతదాకా తెలుగులో మరే పుస్తకంలోనూ మనకి కనిపించదు. ఎన్. జి. రంగా దాన్ని 'వార్ అండ్ పీస్'తో పోల్చదగ్గ నవల అని అన్నారట. కాని వార్ అండ్ పీస్‌లో లేని పాటలు మాలపల్లిలో ఉన్నాయి. ఏ విధంగా చూసినా ఆధునిక ప్రపంచ సాహిత్యంలో మాలపల్లి లాంటి నవల లేదని చెప్పవచ్చు. అందులో సంగదాసు పాడిన తత్త్వాలు, తక్కెళ్ళ జగ్గడి బోధలు సరిగ్గా గరిమెళ్ల తరహా గీతాలు. అందుకనే ఆ నవలని నాటకీకరణ చేసిన నగ్నముని తన నాటకాన్ని తక్కెళ్ళ జగ్గడి గీతంతోటే ఎత్తుకున్నాడు. ఆ పాటలు వాటికవే ఆధునిక తెలుగుకవిత్వంలో ఒక ప్రత్యేక అధ్యాయంగా గుర్తించదగ్గవి. గురజాడ ముత్యాలసరాలకు ఏ మాత్రం తీసిపోని కవిత్వం అది. కాని ఎవరేనా ఇప్పటిదాకా మాలపల్లిలోని పాటలమీద ప్రత్యేకంగా విశ్లేషణ చేసి ఉన్నారా? నాకు తెలియదు.

జాతీయోద్యమసాహిత్యం మన సాహిత్యచరిత్ర నెరేటివు లోంచి తప్పిపోవడం ఒక విషయం. అసలు మన స్వాతంత్ర్యోద్యమ చరిత్రకే సరైన నెరేటివుని మనం నిర్మించుకోలేక పోయామనేది మరొక విషయం. మన జాతీయోద్యమ చరిత్ర చూడండి. అది దాదాపుగా

1857 తిరుగుబాటుతో మొదలవుతుంది. కాని నైజాంలో స్వాతంత్ర్యోద్యమ చరిత్ర 1812 లోనే మొదలయ్యింది. 1812 నుంచి 1857 దాకా నైజాం రాజ్యంలో తలెత్తిన తిరుగుబాట్ల గురించి చదువుతూ ఉంటే మన ఒళ్ళు ఉప్పొంగిపోతుంది. ఆ కాలంలో ఆ పోరాటాల గురించి ఎటువంటి సాహిత్యం వచ్చి ఉంటుంది? ప్రజలు ఎటువంటి పాటలు పాడుకుని ఉంటారు? మనకు తెలియదు.

రాంజీగోండు ఉజ్వల పోరాటగాథ మీద కృషి చేసిన ద్యావనవల్లి సత్యనారాయణని రాంజీగోండుచుట్టూ ఏదైనా సాహిత్యం గోండుల్లో మౌఖికంగా ప్రచారంలో ఉందా అని అడిగాను. ఇంకా తెలుసుకోవలసి ఉందనే ఆయనన్నాడు. రాయలసీమలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి కొంత ప్రసిద్ధి లభించింది. కానీ కర్నూలు నవాబు గులాం రసూల్ ఖాన్ మీద ఉన్న వహాబీ ఉద్యమ ప్రభావం గురించి మనం తెలుసుకో-వలసినంతగా తెలుసుకోనే లేదు. పనప్పాకం ఆనందాచార్యులు భారతజాతీయ కాంగ్రెసు ఏర్పడ్డప్పుడు అందులో సభ్యుడైన మొదటి తెలుగువాడు. ఆరేళ్ళు తిరక్కుండానే ఆయన నాగపూరు కాంగ్రెసు సభకి అధ్యక్షత వహించే స్థాయికి చేరుకున్నాడు. ఆయన రాసిన వ్యాసాలు, ఉత్తరాలు మనమేవైనా భద్రపరచగలిగామా?

స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు ముస్లిముల పాత్ర గురించి రాస్తూ సయ్యద్ నసీర్ అహ్మద్ 1780 లోనే విశాఖపట్నంలో సుబేదార్ షేక్ అహ్మద్ అనే సిపాయి తిరుగుబాటు చేసాడని రాసారు. ఇక భారతదేశమంతటా గిరిజనులు తిరుగుబాట్లు చేసినప్పటికీ, గంజాం ప్రాంతంలో 1830 లో తలెత్తిన గుంసూరు తిరుగుబాటువల్లనే గిరిజన ప్రాంతాల్లో పాలనా విధానాన్ని ఈస్టిండియా కంపెనీ సవరించుకోవలసి వచ్చింది. ఇప్పుడు భారతరాజ్యాంగం అయిదవ షెడ్యూలు, ఆరవషెడ్యూలులో పొందుపరిచిన పాలనా విధానానికి మూలం ఒకప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలో భాగమైన గంజాం జిల్లా గిరిజనుల తిరుగుబాటే అని ఎన్నిసార్లు చెప్పడానికేనా నాకు విసుగు ఉండదు. ఇలా జాతీయోద్యమంలో ముస్లిములు, దళితులు, గిరిజనులు, స్త్రీలు నిర్వహించిన పాత్ర అపారం. వారి పోరాటాలకు చెందిన ఎన్నో చరిత్రలు, ఇతిహాసపు చీకటికోణం అట్టడుగున పడి కనిపించని కథలన్నీ ఇప్పుడిప్పుడే బయటికొస్తున్నాయి. కులమతాలకు అతీతంగా సాగిన పోరాటం అది.

మీరు కొత్లాపురం మఠం రాచయ్య పేరు విన్నారా? ఆయన మహబూబునగరు జిల్లాకి చెందిన వీరశైవుడు. 1937 లో మహాత్ముడు గుంటూరు వచ్చినప్పుడు నైజాం నుంచి పెద్ద ఎత్తున సత్యాగ్రహులు ఆయన్ని కలవకుండా ఉండటానికి నిజాం గుంటూరు దారినవెళ్ళే రైళ్లన్నీ రద్దుచేసాడు. కాని రాచయ్య ఇద్దరుముగ్గురు మిత్రుల్తో కలిసి గాంధీని చూడాలన్న కోరికతో మహబూబునగరు నుంచి గుంటూరు నడిచివెళ్ళిపోయాడు. గాంధీని కలుసుకున్నాడు. ఆ స్ఫూర్తితోటే మహాత్ముడి జీవితచరిత్ర మొత్తాన్ని 'శ్రీమహాత్మగాంధి' అనే అయిదంకాల episodic play గా రాసాడు. ఆ నాటకం కనీసం వందసార్లు ప్రదర్శించబడిందని విన్నాను.

సాహిత్యమూ, ఉద్యమమూ ఇలా ఒకదాన్నొకటి పరస్పరం ప్రభావితం చేసుకున్న సంఘటనలు ఎన్నో ఇప్పటికే పౌరస్మృతిలోంచి తొలగిపోతున్నాయి. ఇటువంటి micro narratives ని ఏరి తెచ్చుకుని ఒక grand narrative ని కూర్చుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

మా హీరాలాల్ మాష్టారు తరచు నాతో అంటుండేవారు: 'ఆంధ్రప్రాంతంలో జాతీయోద్యమం అంటే గ్రంథాలయోద్యమమేరా' అని. ఆ మాట తెలంగాణాకి కూడా వర్తిస్తుంది. పందొమ్మిదో శతాబ్దిలో కత్తితో చేసిన పోరాటం, రెండుచోట్లా కూడా, ఇరవయ్యవ శతాబ్దంలో కలంతో చేసారు. గ్రంథాలయాల ద్వారా, పత్రికల ద్వారా కవులూ, రచయితలూ, పత్రికా సంపాదకులూ, ప్రచురణ కర్తలూ జాతీయోద్యమంలో నిర్వహించిన పాత్ర మామూలు పాత్ర కాదు.

ఆంధ్రలో సరే, తెలంగాణాలో కూడా విజ్ఞాన చంద్రిక గ్రంథమాల, అణా గ్రంథమాల, దేశోద్ధారక గ్రంథమాల వంటి ప్రచురణసంస్థలు పోరాటకేంద్రాలుగా నడిచేయని మనకు తెలుసు. నిజానికి విజ్ఞానచంద్రిక గ్రంథమాల మొదటి ప్రచురణ 'అబ్రహాం లింకన్' రచన చేసిందే గాడిచర్ల.

రెండు చోట్లా కూడా జాతీయోద్యమాన్ని ప్రజ్వరిల్లచేసిన పత్రికల జాబితా చాలా పెద్దది. బ్రిటిషు ప్రభుత్వానికి కాళ్ళకింద మంటలు పుట్టించిన ఎన్నో సంపాదకీయాలు ఇప్పటికి కూడా ఆ పత్రికల్లోంచి బయటకు రానేలేదు.

సంపాదకీయాలు మాత్రమే కాదు, ఎన్నో కథలు, ఎంతో కవిత్వం కూడా ఆ పత్రికల్లోంచి సంకలనాల్లోకి ఎక్కనేలేదు. ఉదాహరణకి, మహాత్ముడు భారతదేశానికి రాకముందే ఆయన్ని ప్రశంసిస్తూ 1912 లోనే పట్టాభి సీతారామయ్య కృష్ణాపత్రికలో పద్యాలు రాసారని ఎంతమందికి తెలుసు? నాకు తెలిసి గాంధీమీద వచ్చిన కవిత్వంలో భారతదేశం మొత్తం మీద అవే మొదటి పద్యాలు. కాని ఇప్పుడు చదవాలంటే అవి ఎక్కడ దొరుకుతాయి? చివరికి గురజాడ రాఘవశర్మ సంకలనంలో కూడా అవి నాకు కనిపించలేదు.

ఈ ప్రసంగం చేసిన తరువాత ఒకరోజు రామచంద్ర గుహ రాసిన Gandhi Before India (2013) గ్రంథంలో పే. 488-89 లో ఒక తెలుగునాటకం గురించి చదివాను. 1913 లోనే గాంధీ దక్షిణాఫ్రికా పోరాటాన్ని చిత్రిస్తూ అయిదంకాల తెలుగు నాటకం ఒకటి వెలువడిందనీ, ఆ నాటకం ఇంగ్లిషు అనువాదం కూడా వెంటనే వెలువడిందనీ, కానీ పోలీసులు ఆ ప్రతుల్ని ధ్వంసం చేసారనీ, ఒక్క ప్రతి మాత్రం లండను ఆర్కైవుకి చేరిందనీ గుహ రాసాడు. ఏమిటా నాటకం? దాన్ని లండను నుంచి తెప్పించి మనం ఇప్పుడు మనం పునర్ముద్రించుకోవద్దా!

కాబట్టి- ఒకటి, మన జాతీయోద్యమచరిత్రను మళ్లా సమగ్రంగా తిరిగి రాసుకోవడం, రెండోది, ఆ ఉద్యమం వల్ల ప్రభావితమై తిరిగి మళ్ళా ఆ ఉద్యమాన్ని ప్రభావితం చేసిన జాతీయోద్యమ సాహిత్యానికి మన సాహిత్య చరిత్రలో తిరిగి సముచిత స్థానం కల్పించడం. సాహిత్య అకాడెమీ నిర్వహిస్తున్న ఈ రెండు రోజుల సదస్సు ఈ రెండు అంశాలకీ ఎంతో దోహదపడగలదని భావిస్తూ నాకీ అవకాశాన్నిచ్చిన అకాడెమీకి ధన్యవాదాలు సమర్పించుకుంటున్నాను.

29-08-2023

# ఒక తల్లిదండ్రుల కథ

**నరేంద్రలూథర్** ఆంధ్రప్రదేశ్ కాడరుకి చెందిన ఇండియను అడ్మినిస్ట్రేటివు అధికారి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రధానకార్యదర్శి హోదాలో పదవీ విరమణ చేసారు. నేను ఉద్యోగంలో చేరిన కొత్తలో ఏదో ఒక సమావేశంలో ఆయన్ని ఒక్కసారే చూసాను. ఆయన హైదరాబాదు చరిత్రపట్లా, దక్కను పీఠభూమిలోని ప్రాచీన శిలలపట్లా గొప్ప మక్కువ కలిగిన మనిషి అని కూడా విన్నాను. ఆయన గురించి నాకు తెలిసింది అంతవరకే.

రెండేళ్ళ కిందట నా మిత్రుడూ, గొప్ప ఫొటోగ్రాఫరూ అయిన చల్లా వేణుమాధవ్ ఇండియా వచ్చినప్పుడు ఒక మధ్యాహ్నం మేమొక హొటల్లో లంచి చేస్తూండగా, అతడు నరేంద్రలూథరు తనకి మంచి మిత్రుడనీ, ఫొటోగ్రఫీ పట్ల ఇష్టం తమిద్దర్నీ కలిపిందనీ, తాను హైదరాబాదు ఎప్పుడు వచ్చినా ఆయన్ని కలవకుండా వెళ్ళననీ చెప్పాడు. అప్పుడే ఆయన గురించిన చాలా విషయాలు నాతో పంచుకుంటూ, ఆయన రాసిన A Bonsai Tree (2017) చదవమని చెప్పాడు.

ఆ పుస్తకం కొన్నానుగానీ, ఆ రోజే ఆ కాపీ అట్లానే సోమయ్యగారికి ఇచ్చేసాను. తిరిగి ఇన్నాళ్ళకి మొన్న ఆ పుస్తకం మరొక కాపీ కొనుక్కోగలిగాను. నిన్న హైదరాబాదు

నుంచి విజయవాడ వస్తూండగా, ఆ పుస్తకం తెరిచినవాణ్ణి, ముగించేదాకా పక్కన పెట్టలేక పోయాను. ముఖ్యంగా పుస్తకం చివరిపుటలకు వచ్చేటప్పటికి, కళ్ళనీళ్ళతో నా కళ్ళు మసకబారిపోయాయి. అందుకని, ఆ చివరి పేజీలు చదవడం మాత్రం రాత్రికి గాని పూర్తి చెయ్యలేకపోయాను.

అది ఒక ఐ.ఏ.ఎస్ అధికారి ఆత్మకథ మాత్రమే అయి ఉండే ఆ పుస్తకం నాలో ఎటువంటి భావోద్వేగాన్నీ రేకెత్తించలేకపోయి ఉండేది. అందులో ఎక్కువ పేజీలు ఆయన ఉద్యోగజీవితం గురించి లేకపోలేదుగాని, అది ప్రధాన ఇతివృత్తం కాదు. అది ముఖ్యంగా ఒక తండ్రి కథ. తన కొడుకు మద్యానికి బానిసగా మారడాన్ని కళ్ళారా చూస్తూ నిస్సహాయంగా నిలబడిపోయిన ఒక తండ్రి కథ. తన కుమార్తె ఆమె చిన్నతనంలోనే ఒక అబ్యూజును ఎదుర్కోవలసి వచ్చి, ఆ అనుభవం ఆమెను లోపల్లోపల ఛిద్రం చేసేస్తూ ఉంటే, ఆ సంగతి ఎన్నాళ్ళకో గాని తెలుసుకోలేకపోయిన ఒక తల్లిదండ్రుల కథ అది.

ఆరేడేళ్ళ కిందట డా. రఘురామరాజు నన్ను హరిలాల్ గాంధి జీవితకథని తెలుగు లోకి అనువదించమని అడిగినప్పుడు, ఆ పుస్తకం అనువాదం చేస్తున్నంతసేపూ నా నేత్రాలు తడిసిపోతూనే ఉండేవి. రోజూ మిత్రుడు స్వామి మా ఇంటికి వచ్చి, పుస్తకం అనువాదం నేను చెప్తుంటే, కంప్యూటరు మీద టైపు చేస్తూ ఉండేవాడు. చెప్పలేనంత దుఃఖంతో చాలాసార్లు మాట పెగలక నా గొంతు పూడుకుపోతుండేది. నేను చెప్తున్నంత సేపూ విజ్జి వంటగదిలో తన పని తాను చేసుకుంటూనే ఒక చెవి ఇటు వొగ్గి నేను చెప్తున్న కథ వింటూ తాను కూడా కన్నీళ్ళు గొంతులో కుక్కుకుంటూ ఉండేది.

మద్యపానం, సెక్సువలు అబ్యూజింగు ప్రవృత్తి– ఈ రెండూ ఒక మనిషినే ఆవహిస్తే అది హరిలాల్ గాంధీ అవుతాడు. హరిలాల్–మహాత్ముడి పెద్దకొడుకు. ఒకరోజు స్వామి టైపు చేసి వెళ్ళిపోయిన తరువాత, నేనట్లానే ఆ కంప్యూటర్ టేబులు దగ్గర కూచుని ఉండగా విజ్జి నా దగ్గరకు వచ్చి అంది: 'గాంధీగారి గురించి నాకేమీ తెలీదు. కానీ ఆయన కొడుకు గురించిన ఈ సంగతులన్నీ వింటూంటే, ఆయన పట్ల నాకు అపారమైన గౌరవం, చెప్పలేనంత జాలీ కలుగుతున్నాయి. తన కొడుకు జీవితం తన కళ్ళముందే

నాశనమవుతుంటే ఆయనంత నిబ్బరంగా ఎలా ఉండగలిగాడు. తక్కినవాళ్ళ కోసం ఎలా ఆలోచించగలిగారు!' అని.

ఇప్పుడు నరేంద్రలూథర్ ఆత్మకథ చదువుతూ ఉంటే మరొకసారి నా హృదయం రుద్ధమై పోయింది. కాని, ఈయన గాంధీ కన్నా అదృష్టవంతుడు. గాంధీదంపతులకి లభించని భాగ్యం లూథర్ దంపతులకి లభించింది. మద్యానికి బానిసగా మారిన తమ కొడుకు ముప్పైఏళ్ళ పాటు సాగించిన పోరాటంలో చివరికి విజయం సాధించడమే కాక ఆల్కొహాలికుల పునరావాసం కోసం ఒక సంస్థ నడిపే స్థాయికి చేరుకోగలిగాడు. ఆ రకంగా ఇది ఒక Prodigal son కథ మాత్రమే కాదు, Paradise Regained కూడా.

మద్యం తాగడం, సెక్సువలు అబ్యూజు– ఈ రెండూ ఈ రోజు మన యువతని పట్టుకున్న వ్యాధులు. ఈ రెండింటికీ ప్రధానస్ఫూర్తి మన సినిమాలే. ఏ కమర్షియలు చిత్రమైనా చూడండి– ప్రతి పావుగంటకీ తాగే సీను ఒకటి తప్పనిసరిగా ఉంటుంది. ముప్పై నలభయ్యేళ్ళ కింద సినిమాల్లో ఆ దృశ్యాలు చాలా అరుదుగా ఉండేవి. ఉన్నా కూడా అదేదో ఇతివృత్తం కోసం చూపిస్తున్నట్టుగా, కథాగమనంలో భాగమన్నట్టుగా ఉండేవి. కాని ఇప్పుడు సినిమాల్లో చూపించే తాగుడు దృశ్యాలు చూడండి. ఆ తాగడంలో కేవలం ఒక వ్యసనం మాత్రమే కాదు, చెప్పలేనంత వైల్డునెస్సు కనిపిస్తుంది. హీరో తాగుతాడు. అతడి పోకిరీ మిత్రులు తాగుతారు. విలను తాగుతాడు. వాడి దగ్గర ఉండే కిరాయి గూండాలు తాగుతారు. హీరో తండ్రి తాగుతాడు. అతడి బావమరిది తాగుతాడు. వెరసి మొత్తం సినిమా అంతా తాగుడే ఉంటుంది.

తాగడం మంచిది కాదని ఇప్పుడెవరూ చెప్పేవాళ్ళు లేరు. ఒకప్పుడు ఉపాధ్యాయులు చెప్పేవారు. సంస్కర్తలు చెప్పేవారు, కవులూ, రచయితలూ చెప్పేవారు. కాని గత ఇరవయ్యేళ్ళుగా ఒక సాహిత్యసభ జరగ్గానే ఆ తర్వాత మరొక సభ, సభానంతర సభ, జరక్కుండా ఉండే దృశ్యాలు నేను చూసినవి చాలా తక్కువ.

ఒకప్పుడు మా ఊరినుంచి కాకినాడ లేదా రాజమండ్రి వెళ్ళేటప్పుడు రాత్రి తొమ్మిది దాటాక ఏ దుకాణాలూ కనిపించేవి కావు. ఇప్పుడు రాత్రి తొమ్మిది దాటాక మద్యం

దుకాణాలు తప్ప మరేవీ కనిపించవు. ఇంత మద్యం ఎవరు తాగుతున్నారు? ఆ కుటుంబాలు ఎవరివి? ఎవరి ఇళ్ళల్లో పెద్దలు, పిల్లలు ఆ మద్యానికి బానిసలై తమ జీవితాల్ని ధ్వంసం చేసుకుంటున్నారు? మద్యం ఏరులై పొంగిపొర్లిన తరువాతి ఘట్టం సెక్సువలు అబ్యూజు, అత్యాచారం, ఇప్పుడు కొత్తగా, ప్రతి అత్యాచారం తర్వాతా ఒక హత్య.

తాగుడు ఏమి చెయ్యగలదో హరిలాల్ గాంధీ జీవితకథ చదివితే తెలుస్తుంది. ఒక తల్లి, ఒక తండ్రి, ఒక కొడుకు– ఏదోను ఉద్యానంలాంటి ఒక కుటుంబంలో, సైతాను ఆపిలు పండుతో కాదు, ఒక మద్యం సీసాతో ప్రవేశిస్తాడు. ఆ తర్వాత ఆ కుటుంబం ఎంత నరకం అనుభవిస్తుందో ఇదిగో ఇటువంటి కథలు చదివితే తెలుస్తుంది.

నరేంద్రలూథర్ తల్లిదండ్రులు దేశవిభజన సమయంలో రావల్పిండి నుండి అమృతసరుకి కాందిశీకులుగా వచ్చారు. యాభై కిలోమీటర్ల ప్రయాణం మూడు రోజుల పాటు ప్రాణాలు అరచేతపట్టుకుని ప్రయాణించిన ఆ అనుభవం నరేంద్రలూథర్ తన జీవితం పొడుగునా గుర్తుపెట్టుకునే ఉన్నాడు. ఆ హత్యాకాండని కూడా అతడు తప్పించుకోగలిగాడుగాని, చాపకింద నీరులాగా తన ఇంట్లోకి ప్రవేశించి మద్యం ఒక రాక్షసిలాగా తన కన్నకొడుకు జీవితాన్ని తన కళ్ళముందే ఛిద్రం చేస్తూ ఉంటే చూడకుండా తప్పించుకోలేకపోయాడు.

కాని, ఇది ఒక అద్భుతమైన కథ. మద్యమో , మరొకటో చేతికి అందివస్తారనుకున్న పిల్లలు ఏదో ఒక వ్యసనం బారినపడ్డప్పుడు ఆ తల్లిదండ్రులు ఎంత నిబ్బరంగా నిలబడాలో చెప్పే కథ. తమ మానవత్వాన్ని కాపాడుకుంటూనే తమ పిల్లల్నెలా కాపాడుకోవాలో చెప్పే కథ. ప్రతి ఒక్క తల్లీ, ప్రతి ఒక్క తండ్రీ చదవవలసిన కథ. 'లెక్కకు వచ్చేవిక్కడ ఒక కిరణం, ఒక నవ్వుని, ఒక పువ్వుని. .. ' అంటాడు బైరాగి. అంతిమంగా మనిషి జీవితంలో మిగిలేది, నిజమైన ఆనందాన్నిచ్చేది, తన పిల్లాపాపల్తో, ఒక సాయంకాలం కలిసి భోంచెయ్యగలగడం, మామూలు మాటలు మామూలుగా మాట్లాడుకోగలగడం, తండ్రి కొడుకునీ, కొడుకు తండ్రినీ చూసుకోగలగడం, ఒకరి సన్నిధిని మరొకరు కోరుకోగలగడం.

'తాగకండి, మద్యానికి దూరంగా ఉండండి' అని చెప్తే అది బళ్ళో గోడమీద నీలి రంగులో రాసిన నీతివాక్యంలాగా ఎవరికీ పట్టదు, ఎవరికీ వినిపించదు. అందుకని ఇప్పుడెవరూ ఆ మాటలు చెప్పడానికి సాహసించడం లేదు. కాని 'తాగండి, విచ్చలవిడిగా తాగండి, తాగుతూ ఉద్యోగం చెయ్యండి, తాగుతూ ప్రేమించండి, తాగుతూ హీరోలుగా మారండి' అని సినిమాలు బిగ్గరగా రంగురంగుల్తో చెప్తూ ఉంటే మనమేం చెయ్యాలి? ఏమి చెయ్యగలమో నాకు తెలియదుగాని, ఇదిగో, ఇటువంటి ఒక్క జీవితకథ చాలు, ఒక ఇండుగపిక్కలాగా, మన చుట్టూ ఉన్న కలుషజలాల్ని శుభ్రం చెయ్యడానికి.

పుస్తకంలోంచి ఒకటి రెండు పేరాలు నా తెలుగులో:

నా చుట్టూ జరుగుతున్నదాన్ని చూడకుండా ఉండటానికి నా కళ్ళు మూసుకోవడం అలవాటు చేసుకున్నాను. రకరకాలుగా నన్ను నేను బిజీగా ఉంచుకోడానికి ప్రయత్నిస్తూ వచ్చాను. ముఖ్యంగా నా రచనావ్యాసంగంలో కూరుకుపోవాలని చూసాను. కాని రాహుల్ మద్యవ్యసనం నా పక్కకొచ్చి నిలబడి నన్నొకటే సాధిస్తూ ఉండేది. దాని తీవ్రత ముందు నా వ్యాపకాలేవీ నిలబడలేకపోయాయి. మేమెక్కడ ఉన్నా కూడా రాహుల్ గురించిన ఆలోచనలు మమ్మల్ని నీడలాగా వెంబడించేవి. కాదు, నీడలు కూడా మన బయటే ఉంటాయి. కాని ఈ నీడ మాత్రం మాలోపల పడేది. మేము ఏ కవచం తొడుక్కున్నా కూడా ఆ నీడదానిలోకి చొచ్చుకు వచ్చేసేది. అది ఎక్కడ పడితే అక్కడ ఆ ప్రాంతాన్ని తినేసేది. అట్లాంటి ఎన్ని నీడల్ని మాలోకి మేము ఇంకించుకున్నామని? బయట సమాజం ఎదట మాత్రం మేము దర్పంగా, నిటారుగా నిలబడేవాళ్ళం. చిరునవ్వుతుండేవాళ్ళం. చుట్టూ ఉన్నవాళ్ళతో ఏదో ఒక లోకాభిరామాయణం మాట్లాడుతుండేవాళ్ళం. మామూలు మనుషుల్లాగా కనిపించడానికి మేమేమి చెయ్యాలో అదంతా చేస్తూండేవాళ్ళం. కాని మా గాయం చాలా లోతైనది. మేమెక్కడికి వెళ్ళినా మాతో పాటే ఒక శాపాన్ని రహస్యంగా మోసుకుంటూపోయేవాళ్ళం. మేము మోస్తున్న బరువు నానాటికీ పెరుగుతూ దాన్ని మొయ్యలేక అలసిపోయి ఎక్కడన్నా కొద్దిసేపు పక్కన

పెడదామా అనుకుంటే అది పెట్టడానికి చోటే కనబడేది కాదు. 'ఆశకి రెక్కలుంటాయి' అన్నది ఎమిలీ డికిన్‌సన్. మేం మోస్తూ వచ్చిన బరువుకి ఆ రెక్కలు పూర్తిగా ఉడిగిపోయాయి.

రాహుల్ తిరిగి మళ్ళా మామూలు మనిషై, తాను ఒకప్పుడు విడాకులు ఇచ్చిన తన భార్యనే మళ్ళా పెళ్ళి చేసుకుని, ఆల్కహాలికులకు పునరావాస కేంద్రం నడుపుతూ, ఆ కేంద్రం ఆర్థికంగా కూడా నిలదొక్కుకున్నాక, ఒక పేరా–

రాహుల్, రాజేశ్వరి మా పట్ల చూపిన ప్రేమ మమ్మల్నెన్నో విధాలుగా మైమరిపించింది. మా వివాహజీవితం యాభై ఏళ్ళు పూర్తిచేసుకున్న సందర్భంలో వాళ్ళు మాకోసం ఒక పండగలాగా చేసారు. దగ్గరవాళ్ళనీ, దూరంవాళ్ళనీ అందరినీ పిలిచారు. అట్లాంటిదేదో వాళ్ళు చేయబోతున్నారని ఉప్పందగానే మేం అలాంటిదేమీ చెయ్యొద్దన్నాం. అటువంటి ఆడంబరాల కోసం మేమెన్నడూ వ్యయం చేసి ఎరగం. కాని మమ్మల్ని పట్టించుకునే పిల్లలున్నారనే ఊహ మాకు చెప్పలేనంత సంతోషాన్నిచ్చింది. ..

2007 లో నేనూ, నా భార్య బిందీ చీనాయాత్రకి వెళ్ళేటప్పుడు, రాహుల్ నా జేబులో వెయ్యి డాలర్లు పెట్టాడు. అక్కణ్ణుంచి తనకోసమేమన్నా తేవాలా అని అడిగాను. కాదు, అది మేం కర్చుపెట్టుకోడానికే అని చెప్పాడు. ఏళ్ళ తరబడి మాకు అలవాటైపోయిన పొదుపు మమ్మల్ని ఆ డబ్బుకి అనర్హుల్ని చేసింది. మేము ఆ పాకెట్ అట్లానే ముట్టుకోకుండా వెనక్కి తెచ్చేసాం. కాని ఆ దంపతులిద్దరూ ఆ డబ్బు మా నుంచి తీసుకోడానికి ససేమిరా వల్ల కాదన్నారు. ఇప్పుడు నాకనిపిస్తోంది, ఒకప్పుడు మాకొక చిన్నారి బిడ్డ ఒకడు ఉండేవాడనీ, ప్రేమాస్పదుడైన ఆ బిడ్డ బంగారు భవిష్యత్తు గురించి మాకు కొన్ని కలలుండేవనీ. ఆ బంగారు బొమ్మని, అపురూపమైన ఆ చిత్రాన్ని మానుంచి ఎవరో తస్కరించి ముప్ఫైఏళ్ళ పాటు ఏ చెత్తకుప్పకిందనో దాచేసారు. దారుణమైన దుఃఖంతోనూ, బాధతోనూ, సుదీర్ఘకాలం పాటు వెతుక్కుంటూ, తప్పుకుంటూ ఉండగా, ఇన్నాళ్ళకు మళ్ళా మాకా బొమ్మ దొరికింది. అది కూడా, శుభ్ర–

పరిచి మరీ, పూర్తిగా చికిలీ చేసి, దాని పూర్వపు రూపానికి దాన్ని తీసుకొచ్చి మరీ మాకప్పగించారు. అత్యంత ప్రేమాస్పదుడిగా రాహుల్ మాకిప్పుడు కనిపిస్తున్నట్టుగా గతంలో మేమెప్పుడూ చూసి ఉండలేదు. మాకు ఏమేమి అవసరమని అతడు అనుకుంటాడో అదల్లా మేమడక్కుండానే మా కోసం తీసుకొస్తాడు. ఎప్పటికప్పుడు మమ్మల్నేదో విధంగా సంతోషచకితుల్ని చేస్తూనే ఉంటాడు. రోజూ పొద్దున్నే తన ఆఫీసుకు వెళ్ళేటప్పుడో, లేదా సాయంకాలం వచ్చేటప్పుడో మాదగ్గరికి వచ్చి మమ్మల్ని చూసి వెళ్తుంటాడు. మేము మాట్లాడు-కునేవి చాలా మామూలు విషయాలు. అతడి పిల్లలగురించి, అంటే మా మనవల గురించిన చిన్న చిన్న విషయాలు. రోజు రోజుకీ వాళ్ళెట్లా ఎదుగు తున్నారో ఆ సంగతులు.. అప్పుడప్పుడు తన పని గురించిన కొత్త ప్రయత్నాలూ, కొత్త ప్రణాళికలూ మాతో పంచుకుంటూ ఉంటాడు. ఒక్కొక్క సాయంకాలం హటాత్తుగా మమ్మల్నేదన్నా సినిమాకో, లేదా డిన్నరుకో లాక్కుపోతుంటాడు..

పై పేరా తెలుగు చేస్తూండగా నాకు మళ్ళా కన్నీళ్ళు ఆగడం లేదు. ఒకప్పుడు అబ్దుల్‌కలాం జీవిత కథని తెలుగు చేస్తుంటే ఇట్లా కళ్ళ నీళ్ళు ప్రవహించాయి. మళ్ళా గాంధీగారి పెద్దకొడుకు జీవితాన్ని తెలుగు చేస్తుంటే. ఇప్పుడు మళ్ళా.

నేను కోరుకునేది, ఎదురుచూసేది ఇటువంటి కథల గురించి, ఇటువంటి జీవితాల గురించి. మానవజీవితానికి అద్భుతమైన స్వర్ణభవిష్యత్తు ఉందని చెప్పే మాటల్లో నాకేమీ నమ్మకం లేదు, ఉత్సాహం లేదు. రేపెన్నడో ఒక ఉజ్జ్వల భవిష్యత్తు రానున్నదని నమ్ముతూ ఈ రోజు తాగుడుతో గడిపే కవుల, రచయితల రచనలనుంచి నాకు స్ఫూర్తి లభించడం మానేసి చాలా ఏళ్ళే అయింది. నాకు కావలసింది మామూలు మనుషులు, పొరుగు వాళ్ళని కూడా ప్రేమించనవసరం లేదు, తమ తల్లిదండ్రుల్నీ, తమ పిల్లల్నీ, తమ అన్నదమ్ముల్నీ ప్రేమిస్తో వాళ్ళతో మామూలు సాయంకాలాలు మామూలు మాటల్తో మామూలుగా గడపగలిగే మామూలు మనుషులు కావాలి నాకు.

14-7-2020

# ఒక మనిషి జీవితకథ

**నా** చిన్నప్పుడు ఆరో తరగతో ఏడో తరగతో చదువుకునే రోజుల్లో, మా అక్క నన్నొకసారి కాకినాడలో మిస్సమ్మ సినిమాకు తీసుకువెళ్ళింది. ఆ రోజు మాతో పాటు, మా అక్క స్టూడెంటు కూడా  ఒకామె వచ్చింది. ఆమె టీనేజులో ఉన్న అమ్మాయి. సినిమా మధ్యలో ఇంటర్వెలులో మేం బయటకు వచ్చినప్పుడు, ఆ అమ్మాయి, ఎంతో ముద్దుగా, మురిపెంగా 'ఎంటీరామారావు ఎంత బావున్నాడు మేడమ్, కళ్ళు తిప్పుకోలేకపోయాను' అంది. నాకు ఆశ్చర్యంగా అనిపించింది. ఇదేమిటీ, అక్కినేని నాగేశ్వర్రావుకదా, ఎంత ఉషారుగాఉన్నాడు, ఎంత సరదాగా ఉన్నాడు, ఎంత పడి పడి నవ్విస్తున్నాడు, అతణ్ణి వదిలిపెట్టి ఎన్.టి.రామారావు అంటుందేమిటి అని. ఆమె ఆ రోజు ఎన్.టి.రామారావుని చూసి ఎందుకు సొమ్మసిల్లిపోయిందో నాకు ఆ తర్వాత కొన్నేళ్ళకు అర్థమయింది. కానీ నేను నాగేశ్వర్రావు దగ్గరే (మావాడే, మంచి డిఫెక్టివ్ అని ఎస్.వి.రంగారావు చెప్పిన డైలాగు దగ్గరే) ఆగిపోయాను. తెలుగు సినిమాల్లో కమేడియన్లే నిజమైన హీరోలనీ, హీరోలు కమేడియన్లనే ఒక అభిప్రాయం నుంచి నేనిప్పటికీ బయటపడలేకపోయాను.

మరీ పూర్వకాలం వదిలిపెట్టండి, ఇప్పటి తెరమీద కూడా, కనిపించే ప్రతి ఒక్క కమేడియనుకీ నేను వీరాభిమానిని అని చెప్పుకోడానికి నాకేమీ సంకోచం లేదు.

ఒకప్పుడు నార్త్ ఈస్టుకి చెందిన ఐ.ఏ.ఎస్ అధికారి ఒకాయన మాకు స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఉండేవాడు. 'నాకు మీ తెలుగు సినిమా కమేడియన్లంటే చాలా ఇష్టం. ఆఫీసు నుంచి ఇంటికి వెళ్ళాక వాళ్ళ సినిమాలు చూడటమే నా పని' అనేవాడు. నాకు తెలిసిన మరొక అధికారి, చాలా సమర్థవంతుడు, నీతిపరుడు, ఆయన ఇంటినుంచి సెక్రటేరియటుకి బయల్దేరగానే, యూ ట్యూబులో తెలుగు కామెడీ ట్రాకులు పెట్టుకుని వింటూంటాను అని చెప్పాడు. చాలాసార్లు ప్రయాణసమయాల్లో నా తీరిక సమయపు వ్యాపకం కూడా అదే. బ్రహ్మానందం, జయప్రకాష్ రెడ్డి, ధర్మవరపు సుబ్రహ్మణ్యం, పృథ్వీరాజు– నా జాబితా చాలా పెద్దది. ఇక శివారెడ్డి మిమిక్రీ వీడియోలు నేనెన్నిసార్లు చూసి ఉంటానో చెప్పలేను.

తెలుగు కమేడియన్ల మీద నాకు చాలా ఆరోపణలు ఉన్నాయి. చాలాసార్లు వాళ్ళ హాస్యం వెకిలిస్థాయి దాటి వల్గరుకి చేరుకుంటూ ఉంటుందనీ, ముఖ్యంగా పోలీసుల్నీ, ఉపాధ్యాయుల్నీ పనిగట్టుకుని మరీ అవహేళన చేస్తూంటారనీ నాకు కష్టంగా ఉంటుంది. కానీ, పూర్తి బీభత్సంగా మారిపోయిన తెలుగు సినిమాలో, పూర్తి అసంబద్ధంగా మారి పోయిన తెలుగు సామాజిక మనఃస్థితిలో వాళ్ళు చాలా సార్లు చల్లని నీడలు.

అందుకని మొన్న కుమార్ కూనపరాజు మా ఇంటికి వచ్చి తాను రాసిన 'ఎమ్మెస్ నారాయణ జీవిత కథ' (సాహితి, 2017) ఇచ్చి వెళ్తే, ఆ రాత్రే ఏకబిగిన పుస్తకం మొత్తం చదివేసాను. తీరా చదివిన తర్వాత, అది ఒక కమేడియను జీవితకథగా కన్నా, ఒక సినిమా రచయిత జీవితప్రయాణం అనే కన్నా, ఒక తెలుగు లెక్చరరు ఉద్యోగ ప్రస్థానం కన్నా కూడా, ముఖ్యంగా, ఒక మనిషి జీవితకథ అనిపించింది. ఇంకా అంతకన్నా కూడా, ఒక గాంధేయవాది జీవితకథగా కనిపించి నన్ను నివ్వెర పరిచింది.

చిన్నప్పుడు లైబ్రరీనుంచి దొంగతనంగా తెచ్చుకుని చదువుకున్న 'సత్యశోధన' అతని జీవితంలో, కాదు, వంట్లో ప్రవహిస్తున్న రక్తంలో భాగమైపోయిందనడానికి, ఆ ఆత్మకథలో ఎన్నో దృష్టాంతాలున్నాయి. గాంధీ పట్ల నమ్మకం ఆయనకు ఒక ఐడియాలజీలో భాగంగా రాలేదు. కామన్ సెన్సులో భాగంగా వచ్చింది. అందుకని,

ఆయన తన జీవితపు మామూలు అనుభవాల్లో గాంధీని ఎలా అనుసరించాడో చూడటం నాకు చాలా చకితానుభవంగా  ఉండింది.

నా ఆశ్చర్యాన్ని, సంతోషాన్ని పంచుకోడానికి చాలా పేరాలూ, ఎన్నో పేజీలు ఆ పుస్తకంలోంచి ఎత్తి రాయవచ్చు. కానీ, ఈ ఒక్క అధ్యాయం మాత్రం పూర్తిగా ఎత్తిరాస్తున్నాను. చూడండి.

ఇద్దరు ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్. ఒకాయన యాక్టివ్, మిగ్లినవారు రిటైర్డ్. నాకో పార్టీ ఇచ్చారు. దాంట్లో ఒక ఐ.ఏ.ఎస్ ఆఫీసర్ నేను వెళ్ళిన దగ్గర్నుంచి ఆయన స్టార్ట్ చేసిన టాపిక్ ఏంటంటే గాంధీని తిట్టడం. కూర్చున్న దగ్గరనుంచీ గాంధీని తిట్టడం మొదలుపెట్టారు. ఆయన అభిప్రాయం ఏంటంటే మన భారతదేశం కరప్ట్ అయిపోయింది. ఈ రాజకీయ నాయకులందరూ తినేస్తున్నారు. మంచిని సపోర్టు చేయడం లేదు. అదే బ్రిటీషువాళ్ళుంటే ఈ పాటికి పెద్దపెద్ద రోడ్లుండేవి. దేశం బాగుండును అని ఆయన మొదలుపెట్టాడు. అది విచ్ఛిన్నం చేసినవాడు గాంధీ. వాడొక యూస్‌లెస్ ఫెలో అని తిట్టాడు.

నేను ఆయన్ని ఏమనగలను? మనకు పిలిచి పార్టీ ఇచ్చాడు. నేను వాళ్ళందరి ముందూ చిన్నవాడిని, చిన్నవాడిని అంటే మెంటల్‌గానో, ఫిజికల్‌గానో అంటే అది వేరే మేటర్. కట్ చేస్తే- ఆయన బాయ్‌ని పిలిచి 1000 రూపాయల నోటిచ్చి మందు తీసుకురా అన్నాడు. ఆ సార్‌ని ఆపి మీరు ఆ వెయ్యి రూపాయల నోటు ఇవ్వద్దండి. గాంధీగారు మీ దృష్టిలో పనికిరానాయన. ఆయన బొమ్మ దాని మీద ఉంది. ఆది మీరు ఆనర్ చెయ్యొద్దు సార్. అది చింపేసి మిగిలిన నోటివ్వండి అన్నా. అలా ఎలా చేస్తారు అన్నాడు. ఇవ్వండి సార్ ఏంటీ మీకో అభిప్రాయం ఉంది, మిగిలిన నోటు పనికిరాదా, అతని బొమ్మ లేకుండా, తెమ్మనండి అన్నా.

ఆయన గ్రహించారని ఈవాళ నేనను కుంటున్నా. ఆయన మాట్లాడలా. అది కాదండీ అన్నాడు. నో ప్రాబ్లెం అండీ నేను తెప్పిస్తాను. నాకు గాంధీ అంటే గౌరవం,. చింపకుండా డబ్బులిచ్చి నేను తెప్పిస్తాను అన్నాను.

ప్రపంచదేశాల్లో ప్రతి కరెన్సీ మీద రాజు మారితే రాజు బొమ్మేస్తారు. మంత్రి మారితే మంత్రి బొమ్మేస్తారు. భారతదేశం ఒక్కటే గాంధీ బొమ్మ మొదలెట్టిన తరువాత దేశం నశించిపోయేవరకూ అంటే ప్రళయం వచ్చినా సరే ఎప్పటికైనా సరే ఈ బొమ్మ వేస్తుంది. అందుకుఏ గాంధీ ఈజ్ గ్రేట్. ఇండియన్ గవర్నమెంట్ ఈజ్ గ్రేట్ అని చెప్పా. నాది చాలీచాలని చదువండీ. నాకు వచ్చింది నేను చెప్తా.

బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ఏలుతున్నప్పుడు మొదటి స్వాతంత్ర్యం తీసుకువచ్చింది గాంధీ, ఆయన గురించి తప్పుగా మాట్లాడటం ఫూలిష్‌నెస్. అల్టిమేట్ హ్యూమన్ బీయింగ్ ఆన్ ద సర్ఫేస్ ఆఫ్ ద ఎర్త్. గాంధీని తిట్టడం ఫ్యాషన్. దానికి ఈజ్ ఈక్వల్ టు అనాగరికత అని నేననుకుంటే తిట్టనివ్వండి. గాంధీని తిట్టినోడు నన్ను తిడితే ఎంత గ్రేట్ నేను! ఆ ఆలోచన మనకెందుకు? అప్పుడు నువ్వు పుట్టలేదు. నువ్వు ఎదుర్కోలేదు. కానీ ప్రపంచదేశాల్ని గడగడలాడిస్తున్న ఒక బ్రిటిష్ వాడు ఆయుధం లేకుండా, చొక్కాలేకుండా, బూట్లు లేకుండా వున్న ఒక బక్కోడ్ని చూసి గడగడలాడిపోయి పారిపోయాడే అది నువ్వు ఎందుకు ఆలోచించవు?

ప్రతివాడికీ ఒక ఫ్యాషన్ సార్. ఎవడు గొప్పవాడైతే వాణ్ణి తిడితే నేను వాడికన్నా గొప్పోణ్ణని ఒక ఫ్యాషన్. వాళ్ళు ఫూల్స్, స్టుపిడ్స్. నువ్వు ఒక పన్జెయ్యి. ఆయనకంటే గొప్పవాడుగా నువ్వు చేసిపెట్టు. గాంధీ ఏం చేసాడయ్యా తొక్క, నేను చేస్తాను చూడు ఇప్పుడు ఇండియా ఎలా ఉందో అను, అన్నాను.

మొదటిసారి అమెరికా వెళ్ళినప్పుడు న్యూయార్క్ నగరంలో నా మిత్రునితో క్వీన్స్ నుంచి మన్‌హాటన్ సబ్-వే ట్రైన్‌లో వెళ్ళాం. బహుశా ఓ అరగంట ప్రయాణం. రకరకాల మనుషులు ఎక్కారు. నేను అందరినీ పరిశీలిస్తున్నాను. నా పక్కాయన నన్ను పలకరించాడు.

ఇండియా నుంచి కొత్తగా వచ్చారా అన్నాడు. నేను ఆశ్చర్యపోయా. మీరెలా గుర్తించారు అని అడిగా. మీ పోలికను బట్టి అన్నారు. ఇండియా గురించి

మీకేమైనా తెలుసా అన్నాను. కొంచెం తెలుసు. గాంధీ తెలుసు, గవాస్కర్ తెలుసు. ఈ మధ్య సచిన్ తెలుసు అన్నాడు. నా ఆశ్చర్యానికి అంతులేదు. నాకు రాజకీయాలు పరిచయం లేదుగానీ గాంధీ ఇండియాకి శాంతియుతంగా స్వాతంత్ర్యం తెచ్చాడని విన్నాను అన్నాడు. నేను కరీబియన్ అయిలండ్స్ నుంచి వచ్చాను. అందుకే క్రికెట్ అంటే ఇష్టం, ఇండియన్ క్రికెట్ స్టార్స్ తెలుసు అన్నాడు.

నాకు అప్పటికీ, ఇప్పటికీ బాధ అనిపిస్తూనే ఉంటుంది. ప్రపంచం గాంధీని నెత్తిన పెట్టుకుంటే మనం ఏమిటి గాంధీని ఎగతాళి చేస్తున్నాం అని. అందుకే గాంధీ టాపిక్ వస్తే నేను మనిషిని కావడానికి కొంతసేపు పడుతుంది. (పే. 150-51)

తెలుగు సినిమావాళ్ళల్లో కమేడియన్లే నిజమైన హీరోలని నామటుకు నాకు మరోసారి రుజువయ్యింది.

20-4-2022

# అద్వితీయ జయగాథలు

**నెక్కంటి** సుబ్బారావుది పశ్చిమగోదావరి జిల్లా ఆచంట గ్రామం. ఇప్పుడు ఆయన ఎనభై ఆరేళ్ళ వృద్ధుడు. ఈ మధ్య ఆయన్ని 'మింట్' పత్రిక తలుచుకుంది. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ళల్లో భారతదేశం రూపురేఖలు మార్చిన పది ఆవిష్కరణల గురించి రాస్తూ ఆ పత్రిక ఐ.ఆర్. 8 వరి వంగడాన్ని కూడా వాటిల్లో ఒకటిగా పేర్కొంది.

1966-67 కు పూర్వం దేశం ఆహారధాన్యాల్ని దిగుమతి చేసుకోవలసిన పరిస్థితుల్లో ఉండేది. ఆ పరిస్థితి నుంచి దేశాన్ని తిండి గింజల విషయంలో స్వావలంబన సాధించిన సస్యవిప్లవానికి దారి చూపించిన వంగడం అది. దాన్ని మొదటిసారిగా ప్రయోగాత్మకంగా అమలు చేసి అద్భుతమైన ఫలితాలు రాబట్టిన రైతు నెక్కంటి సుబ్బారావు.

ఆ రోజుల్లో ఎకరాకి పదిహేను బస్తాల దిగుబడి పెద్ద విషయం. కొత్తరకం వరి వంగడాలు వాడి సుబ్బారావు ఎకరాకి 45 బస్తాల దిగుబడి సాధించారు. గోదావరి జిల్లాల్లాంటి సాంప్రదాయిక సస్యక్షేత్రాల్లో కొత్తరకం వరివంగడాలు, సేద్యపు పద్ధతులు ప్రవేశపెట్టడం అంత సులభం కాదు. తన తోటి రైతుల్ని తన వైపుకు తిప్పుకోవడం ఎంతో నాయకత్వ లక్షణాలు, ప్రభావశీలమైన వ్యక్తిత్వం ఉంటే తప్ప సాధ్యమయ్యే విషయాలు కావు.

అదీకాక కొత్త వంగడాల్ని లాబరేటరీనుంచి క్షేత్రస్థాయికి తీసుకువచ్చినప్పుడు అగ్రానమిస్టులు ప్రయోగశాల పరిమితుల్లోనే ఆలోచిస్తూ ఉంటారు. ఆ వంగడాల్ని తమ శీతోష్ణస్థితులకీ, తమ నేల స్వభావానికీ అనుగుణంగా మలుచుకోవడం అందరికీ సాధ్యం అయ్యే విషయం కాదు. కాని సుబ్బారావుకు ఆ చాకచక్యం ఉంది. కాబట్టే ఇంటర్నేషనలు రైస్ రీసెర్చి ఇన్ స్టిట్యూట్ సాధించలేనిదాన్ని ఆయన తన గ్రామంలో సాధించాడు.

దాంతో 60 ల చివర్లో, 70 ల మొదట్లో భారతీయ రైతులకు ఆచంట తీర్థస్థలిగా మారిపోయింది. భారతరత్న సి.సుబ్రహ్మణ్యం, ఎం.ఎస్.స్వామినాథనుల తో సహా, భారతదేశ వ్యవసాయ మంత్రులు, ఉన్నతాధికారులు, రాజకీయనాయకులు ఆ ఊరు సందర్శించడానికి బారులు తీరారు. వరి పంటతో పాటు సుబ్బారావు మొక్కజొన్నలో కూడా అటువంటి సాహసప్రయోగాలే చేసి అద్భుతమైన ఫలితాలు రాబట్టేరు. దాంతో ఆయనకు 'ధాన్ పండిత్', 'కృషి పండిత్' లతో సహా ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు వరించాయి. 2009 లో బిల్ గేట్సు భారతదేశం వచ్చినప్పుడు ఏర్పాటు చేసిన వ్యవసాయ సదస్సుకి ఆయన్ని ప్రత్యేకంగా ఆహ్వానించేడు. అప్పుడు ఆయన్ని సలహాలు, సూచనలు అడిగితే వ్యవసాయ పరిశోధనకు గాను పరిశోధనా సంస్థలకే నేరుగా గ్రాంట్లు విడుదల చెయ్యమని కోరాడు. గేట్స్ ఫౌండేషను ఆ అభ్యర్థనను అంగీకరించింది కూడా.

భారతీయ సస్యవిప్లవంలో నెక్కంటి సుబ్బారావు పోషించిన పాత్ర క్షీరవిప్లవంలో డా.కురియన్, అంతరిక్ష పరిశోధనలో ప్రొ. విక్రం సారాభాయి, ఉపగ్రహాల ప్రయోగంలో డా. కలాం చేసిన కృషికి సమానమైన కృషి. కాని అటువంటి ఘనకీర్తి కలిగిన తెలుగు వాడికి మింటు పత్రిక జైకొట్టేదాకా మనకి తెలియకపోవడం దురదృష్టం.

ఒకసారి ఆయన గురించి తెలిసిన తరువాత మరిన్ని విషయాలు తెలుసుకోవాలనే కుతూహలం సహజంగానే కలుగుతుంది. ఆ ఆసక్తిని తీర్చడానికా అన్నట్టు ఆయన ప్రయాణాన్ని 'పుడమితల్లి నేస్తం' అనే కథగా మలిచి మనకి అందిస్తున్నారు డా.గోటేటి లలితాశేఖర్. ఆమెది కూడా ఆచంట గ్రామమే. కాని తర్వాత రోజుల్లో గుంటూరు

వచ్చేసారు. గొప్ప సాహిత్యాభిమాని, భావుకురాలు. ఆమె తన చిన్నతనంలో సుబ్బారావు గారిని చాలా దగ్గరగా చూసారు. ఆ జ్ఞాపకాల సహాయంతో, అపారమైన గౌరవంతో మన ముందుంచిన పుస్తకం పుడమి తల్లి నేస్తం.

అయితే భారతదేశం సస్యవిప్లవం రోజులనుంచి చాలా దూరం ముందుకు వచ్చేసింది. సస్యవిప్లవం భారతదేశానికి ఆహారస్వాతంత్ర్యం సాధించిన మాట నిజమేగాని, ఆర్థిక అంతరాల్ని కూడా తీవ్రంగా పెంచిందన్న మాట కాదనలేం. ఆ ఆర్థిక అంతరాలు, తర్వాత రోజుల్లో, విద్య, ఉద్యోగితల్లో కూడా అంతరాలుగా బయటపడ్డాయి. సస్య విప్లవం భూస్వాముల్ని మరింత ధనికుల్ని చేసింది. సేద్యంలో రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందుల వినియోగం అడ్డూ అదుపూ లేకుండా చేసింది. అందుకని ఇప్పుడు భారత గ్రామీణ అభివృద్ధిని, గ్రామస్వరాజ్యాన్ని కోరుకునే వారు సన్నకారు, చిన్న రైతుల్ని, రైతుకూలీల్ని సంఘటిత పరిచి వారి ఆర్థిక స్వావలంబన కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందుల్తో పనిలేని సేంద్రియ వ్యవసాయంతో ప్రయోగాలు చేస్తున్నారు. పర్యావరణ సమతౌల్యం భంగపడకుండా ఆహారభద్రతని నిలుపుకోడానికి ZBNF ఉద్యమం చేపడుతున్నారు.

నాకు ఆశ్చర్యం కలిగింది ఎక్కడంటే, లలిత గారు తన కథల పుస్తకంలో ఇటువంటి కొత్తతరం రైతుల గురించీ, నాయకుల గురించీ కూడా రెండు కథలు రాయడం. ఒకరు విజయనగరం జిల్లా బాడంగికి చెందిన శాంతి. ఆమె దీక్షా మహిళావెల్ఫేర్ సొసైటీ స్థాపించి దానిద్వారా రైతు సహకారఉద్యమం నడుపుతున్నది. మరొకరు నందేల ఏడుకొండలు. ఆయన మైక్రో బయాలజీలో ఎమ్మెసీ పూర్తిచేసి, మల్టీ నేషనలు కంపెనీలో చేస్తున్న ఉద్యోగం వదిలిపెట్టి పిడుగురాళ్ళలో ప్రకృతివ్యవసాయం చేస్తున్నాడు. తన పొలంలోనే ఇల్లుకట్టుకుని తన తల్లిని, కుటుంబాన్ని చూసుకుంటున్నాడు.

తెలుగు సాహిత్యంలో భూమిగురించి, భుక్తి గురించి రాయని వాళ్ళు లేరు. భూమి పోరాటాల గురించి విస్తారమైన సాహిత్యం దాదాపుగా అన్ని ప్రక్రియల్లోనూ వచ్చింది. కాని రైతు కడగండ్లనీ, దోపిడీనీ, పీడననీ చిత్రించడం పట్ల తెలుగు రచయితకి ఉన్న ఆసక్తి రైతు విజయగాథలు నమోదు చెయ్యడం మీద లేదు. జయగాథల గురించి

చెప్పడమంటే ప్రభుత్వానికి మద్దతు పలికినట్టుగానూ, pro-establishment వైఖరి అవలంబించినట్టుగానూ భావిస్తాడు తెలుగు రచయిత.

కాని అది అతడి పరిమితుల్నే తెలియచెప్తుంది తప్ప, అతడి అవగాహనని కాదు. ప్రతి జయగాథా ముందు ఒక మనిషి తన పరిస్థితుల మీద విజయం సాధించిన నాయకత్వ గాథ. social entrepreneur గా మారితే తప్ప ఏ రైతూ బీదరికం నుంచి బయటపడడు. ఆ ప్రయాణం ప్రధానంగా అతనిదీ, అతని సహచరులదీను. ప్రభుత్వం వారికి సహాయపడి ఉండవచ్చు, ఉండకపోవచ్చు, అది వేరే కథ.

నేను తెలుగు రచయితలనుంచి, పత్రికలనుంచి, ప్రసార మాధ్యమాల నుంచి ఇటువంటి కథలు ఆశిస్తాను. స్ఫూర్తిదాయకమైన ఇటువంటి జీవితాల గురించి తెలుసు-కుని ఒకరిద్దరు మారినా అది గొప్ప విషయమే. కాని వ్యవసాయ విశ్వవిద్యా-లయాలనుంచో, రైతుకూలీ ఉద్యమాల నుంచో కాక, ఒక సాధారణ గృహిణి, తన మధ్యతరగతి డ్రాయింగు రూము నుండి ఇటువంటి పుస్తకం వెలువర్చడం నాకు సంభ్రమాన్ని కలగచేస్తున్నది. ఈ మధ్య కుందుర్తి స్వరాజ్యపద్మజగారు రాసిన 'ఆకుపచ్చని నేల కోసం' కూడా ఇంత విస్మయాన్నీ కలిగించింది.

లలితగారికి నా అభినందనలు. ఆమె డా. సుబ్బారావు గారి జీవితప్రయాణాన్ని మరింత విస్తృతరూపంలో తీసుకురావాలనీ, అలాగే మరిన్ని జయగాథల్ని వెలుగులోకి తేవాలనీ మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

24-10-2022

# ఒక చరిత్రకారుడి ప్రయాణం

**ఆచార్య** వకుళాభరణం రామకృష్ణ గారి అనుభవ కథనం 'నన్ను నడిపించిన చరిత్ర' (2022) నాకు కిందటేడాదే పంపించారుగాని ఇన్నాళ్ళకు చదవగలిగాను. చాలా విలువైన పుస్తకం అది. పూర్వపు నెల్లూరు జిల్లాలో పొతకమూరు అనే కుగ్రామంలో ఒక బీద అర్చక కుటుంబంలో పుట్టి, అంతర్జాతీయ స్థాయి చరిత్రకారుడిగా, సామాజిక విశ్లేషకుడిగా, విద్యావేత్తగా ఆయన ఎదిగిన క్రమం, 1938 నుండి ఇప్పటిదాకా ఆయన అనుభవకథనం ఒక చరిత్రకారుడి ప్రయాణంగా అభివర్ణించవచ్చు.

ప్రొ. రామకృష్ణగారిని 95 లోనో 96 లోనో హైదరాబాదులో ఏదో సాహిత్య సభలో మొదటిసారి చూసాను. నిండైన విగ్రహం, సౌమ్య భాషణ, ప్రసన్నమందహాసం– ఆయన అప్పుడు సెంట్రలు యూనివెర్సిటీలో పనిచేస్తున్నట్టున్నారు. ఆయన్ని వెళ్ళి పలకరించాలనుకున్నానుగాని, ధైర్యం చాలలేదు. అంత పెద్ద ప్రొఫెసరుతో నేనేమి మాట్లాడగలన్న బెరుకు నన్ను ఆపేసింది.

2000 లో నేను మళ్ళా హైదరాబాదు వచ్చి గిరిజనసంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో చేరాక ఒకరోజు ప్రొ. వకుళాభరణం లలిత గారు మా ఆఫీసుకి వచ్చారు. 2003-04 లో అనుకుంటాను. తాను డీ–నోటిఫైడ్ ట్రైబ్సు మీదా, క్రిమినలు

ట్రైబ్సు చట్టం కింద హింసకు గురైన ట్రైబ్సు మీదా పరిశోధన చేసానని చెప్పారు. బ్రిటిషు పాలనాకాలంలో అటువంటి ట్రైబ్సు కోసం ఏర్పాటు చేసిన సెటిలుమెంట్లకి వెళ్ళి ఆ ట్రైబ్సుని ఇంటర్వ్యూ చేసి వాళ్ళ సామాజిక స్థితిగతులమీద సమగ్రంగా ఒక అధ్యయనం చేసానని చెప్పారు. నేను కర్నూల్లో పనిచేసినప్పుడు అప్పటి జిల్లా కలెక్టరు కోరినందువల్ల సిద్ధాపురం సెటిలుమెంటు మీద చిన్న స్టడీ చేసాను. ఐ.టి.డి.ఎ ప్రాజెక్టు అధికారిగా ఉన్నప్పుడు మహబూబునగరు జిల్లా లింగాల మండలంలో లింగాల సెటిలుమెంటు చాలాసార్లు సందర్శించాను. అప్పటికి స్టువర్టుపురం, బిట్రగుంట, కప్పట్రాళ్ళ తిప్ప వంటి సెటిలుమెంట్ల గురించి వినడమే తప్ప చూడలేదు. కాని ఆమె ఆ ప్రాంతాలన్నీ తిరిగి ఓపిగ్గా వాళ్ళమీద అధ్యయనం చేసారని చెప్పగానే నాకు ఆమె పట్ల గొప్ప గౌరవం కలిగింది.

ఆమె ఆచార్య జొన్నలగడ్డ అనూరాధగారితో కలిసి సెంట్రలు యూనివెర్సిటీ విద్యార్థుల ద్వారా గిరిజననృత్యాల మీద మోనోగ్రాఫులు రూపొందించారు. అప్పుడు మాకు ప్రేమ్‌చంద్రారెడ్డి డైరక్టరుగా ఉన్నారు. ఆ పుస్తకాల్ని గిరిజన సాంస్కృతికసంస్థ తరఫున ప్రచురిద్దామని ప్రతిపాదిస్తే ఆయన అంగీకరించారు. ఫైలు మీద ఆర్డర్సు కూడా వేసారు. కాని అప్పట్లో ఆ సంస్థ ఉద్యోగుల నిర్లక్ష్యం వల్ల ఆ పుస్తకాలు ప్రచురణకు వెళ్ళలేదు. అది మా దురదృష్టం.

ఆ రెండు పరిశోధనలూ చూసిన తరువాత ఆమె ఎప్పుడు ట్రైబలు ఏరియాకి వెళ్తానని చెప్పినా నా పరిధిలో నేనేమి సహాయం చెయ్యగలనా అని ఆలోచించేవాణ్ణి. ఆమె ఆ వయసులో స్వచ్ఛందంగా తిరుగుతున్నన్ని గిరిజన ప్రాంతాలు మా శాఖలో ఉన్నతోద్యోగులం ఎవ్వరం కూడా తిరగట్లేదనిపించేది.

ఆమె నా గురించి చెప్పిన మంచి మాటల వల్ల నాకు ప్రొ. రామకృష్ణగారి పరిచయం, స్నేహం (అంత పెద్ద మాట వాడవచ్చునో లేదో తెలీదు కాబట్టి ఆదరణ అంటాను) లభించాయి. వారు చాలాకాలం నేనుంటున్న నవోదయ కాలనీ దగ్గరలో ఉన్న అపార్టు-మెంటులో ఉండేవారు. రోజూ తెల్లవారుజామునే ఆయనా, వారి కొలీగ్ ప్రొ. లక్ష్మీనారాయణా ఆ కాలనీలో మార్నింగ్‌వాక్‌కి వచ్చేవారు. వారిద్దరూ ఏదో ఒక గంభీర

విషయం మీద మాట్లాడుకుంటూ వెళ్తున్నంతసేపూ మా కాలనీ వీథులు ఏథెన్సు వీథుల్లాగా అనిపించేవి.

అలా ఏర్పడ్డ చనువుతో ఆయన్ని నా పుస్తకం 'సోమయ్యకు నచ్చిన వ్యాసాలు' (2011) ఆవిష్కరణ సభకి అధ్యక్షులుగా ఉండమని అడిగాను. నా జీవితంలో నాకు లభించిన భాగ్యాల్లో ఆ రోజు ఆయన అధ్యక్షతన జరిగిన ఆవిష్కరణ సభ కూడా ఒకటి.

ప్రొ. లలితగారు ఈ లోకం నుంచి సెలవుతీసుకున్నాక ప్రొ. రామకృష్ణగారు వాళ్ళబ్బాయితో కలిసి ఉండటానికి మాదాపూరు వైపు వెళ్ళిపోవడం, నేను మధ్యలో విజయవాడలో ఉండవలసి రావడం వంటి కారణాల వల్ల రోజూ ఆయన్ని చూసే అవకాశం లేకపోయింది. కాని ఆయన మేలు తలపుల్లో నాక్కూడా చోటు ఉందని మాత్రం తెలుస్తూనే ఉంటుంది. లలిత గారు వెన్నెలకంటి రాఘవయ్యగారి పైన రాసిన పుస్తకాన్ని గుంటూరులో నాతో ఆవిష్కరింపచేయడానికి కారణం అదే అనుకుంటాను.

## 2

కాని ఈ పుస్తకం చదివాకనే ఆయన ఎంత పొడగరినో నాకు నిజంగా అర్థమయింది. కాలేజిలో, యూనివెర్సిటీలో చదువుకుంటున్నప్పుడు విశ్వనాథ, మల్లంపల్లి సోమశేఖర శర్మ వంటివారి సాన్నిహిత్యం, జె.ఎన్.యులో ప్రొ. సర్వేపల్లి గోపాల్, ప్రొ. బిపిన్ చంద్ర, ప్రొ. రొమిలా థాపర్ వంటి వారి మార్గదర్శకత్వం, ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ సెక్రటరీగా నిర్వహించిన బాధ్యతలు, ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ తరపున చరిత్రయుగ ప్రారంభం నుండి నేటిదాకా ఆంధ్రుల చరిత్ర మీద వెలువరించిన ఎనిమిది బృహత్సంపు-టాలు, వాటితో పాటు తెలుగు వారి చరిత్ర, సంస్కృతుల గురించిన ఆధారాల సూచికగా వెలువరించిన మరొక బృహత్సంపుటం ఆయన జీవితానుభవాలు ఎంత అమూల్యాలో చెప్తాయి. ఎనిమిదిన్నర దశాబ్దాలుగా తెలుగు నేల చరిత్రకు ఆయన ప్రత్యక్ష సాక్షి మాత్రమే కాదు, విశ్లేషకుడు కూడా. తెలుగు నేల మీద వామపక్ష ఉద్యమాలకీ, పోరాటాలకీ ఆయన పూర్తిగా సమకాలికుడు. కాబట్టే పురోగామి శక్తులతో కలిసి

నడుస్తూ వచ్చాడు. కవులకీ, రచయితలకీ, విద్యార్థులకీ, సహోద్యోగులకీ నిజమైన స్నేహితుడిగా, గురువుగా, మార్గదర్శకుడిగా ఉంటూ వచ్చాడు.

ఈ అనుభవాలు చదువుతున్నంతసేపూ మన కళ్ళముందు ఒక చరిత్రకారుడికన్నా కూడా ఒక మానవతావాది ప్రత్యక్షమవుతూ ఉంటాడు. ఒక జిజ్ఞాసి. తపనశీలి. మరింత చదువుకోవాలనీ, మరింత తెలుసుకోవాలనీ, తన పరిజ్ఞానాన్నీ తన చుట్టూ ఉన్న సమాజానికి అందించాలనీ కోరుకున్న ఒక తపస్వి కనిపిస్తాడు.

తన 29 ఏళ్ల వయసులో ఆయన మొదటిసారి అమెరికా వెళ్ళినప్పుడు, అక్కడి విశ్వవిద్యాలయాల్నీ, ఆ డిసిప్లిసునీ, ఆ విద్యాసంస్కృతినీ చూసినప్పుడు తిరిగి వచ్చేటప్పుడు తనకై తాను ఒక ప్రవర్తనానియమావళిని నిర్ణయించుకున్నారట. అందులో ఆయన పెట్టుకున్న సూత్రాలు:

- అధికారం, ఖ్యాతి– వీటికొరకు దేవుళ్ళాడవద్దు.
- వీలున్నంత తక్కువగా మాట్లాడు.
- ఇతరుల వ్యవహారాల్లో అనవసరంగా జోక్యం చేసుకోవద్దు.
- కష్టపడి పనిచేసుకో.
- సహనం కోల్పోయి కోప్పడవద్దు, ఎవర్ని గూర్చి కఠినంగా, తక్కువచేసి మాట్లాడవద్దు.

అప్పణ్ణుంచీ ఈ యాభై ఏళ్ళకు పైగా ఆయన ఈ పంచశీలను రాజీలేకుండా అనుష్ఠిస్తూ ఉన్నట్టే కనిపిస్తుంది. రామకృష్ణ గారితో నాకున్న కొద్ది పరిచయంలోనూ ఆయనలో నన్ను ఆకర్షించిన విషయాలు కూడా ఇవే అని ఇప్పుడు తెలుస్తోంది. బహుశా పుట్టుకతోనే ఆయనలో సౌమ్యత ఒక సంస్కారంగా ఉందనుకుంటాను. దాన్ని ఆయన నిలబెట్టుకోగలిగారు. అది ఆయనకు అపారమైన వినయాన్ని కూడా అలవరించింది. అందుకనే అంత మంది ప్రతిభావంతులతో, మేధావులతో, ప్రభావశీల వ్యక్తిత్వాలతో కలిసి నడిచిన తరువాత కూడా ఆయన నాలాంటి వాడిని కూడా అంతగా ఆదరించగలిగారనుకుంటాను.

నువ్వు ఒక మనిషితో మాట్లాడినప్పుడు నీ మాటలు, నీ ప్రవర్తన ఆ మనిషికి తన పట్ల తనకి గౌరవం, ప్రాముఖ్యత కలిగించే విధంగా ఉన్నాయనుకో, ఆ మనిషి నిన్ను చాలా గౌరవిస్తాడు, ప్రముఖంగా గుర్తుపెట్టుకుంటాడు. రామకృష్ణగారి స్వభావంలో ఈ లక్షణం ఉంది. ఆయన జీవితంలో అతి నిరుపేద స్థాయినుంచి పైకి రావడం వల్లా, తన పరిమితుల గురించి మొదటినుంచీ తనకి ఒక మెలకువ ఉన్నందువల్లా, తాను ఈ స్థాయికి రావడానికి ఎందరో అడుగడుగునా తనకు దారి చూపించినందువల్లా అనే స్పృహ వల్ల ఆ లక్షణం మరింత మెరుగుపడింది.

## 3

చరిత్ర కోసమో, లేదా తన సమకాలికంగా ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల్లో జరిగిన చారిత్రిక పరిణామాల్ని అర్థం చేసుకోవడానికో ఈ పుస్తకం చదవక్కర్లేదు. అదంతా ఆయన ఇప్పటికే ముందే చెప్పినట్టు ఎనిమిది బృహత్సంపుటాలుగా వెలువరించి ఉన్నారు. కాని అంత గణనీయమైన కృషి చెయ్యడానికి ఆయన్ని నడిపించిన శక్తులేమిటో తెలుసుకోడానికి మాత్రం ఈ పుస్తకం చదవాలి.

చరిత్ర అంటే శీలనిర్మాణం, చరిత అనే అర్థం కూడా చెప్పుకోవచ్చు. 'నన్ను నడిపించిన చరిత్ర' అంటే హిస్టరీ అన్న అర్థం కన్నా కూడా తనలోని మానవీయ గుణాలూ, అవి తనని ఒక సాధారణ స్థాయి విద్యార్థినుంచి అత్యున్నతస్థాయి ఆచార్యుడిగా ఎలా తీర్చిదిద్దాయో వాటి గురించిన తలపోతగా ఈ పుస్తకం కనిపించింది నాకు.

ఢిల్లీలో జవహర్ లాల్ నెహ్రూ యూనివెర్సిటీలో పరిశోధక విద్యార్థిగా తన అనుభవాల గురించి రాస్తూ రాసిన ఈ వాక్యాలు చూడండి:

> నాకిదంతా ఒక learning process. అధ్యయన అంశాల్లో కొత్తదనం, ప్రయోగాత్మకంగా చరిత్ర రచన, పఠనం, వివరించే తీరుల్లో పూర్తి సంతృప్తి వుండేది. యూనివెర్సిటీ క్యాంపసులో ఎక్కడ చూసినా చర్చలు, రాత్రిపొద్దు పోయేదాకా, 'జుగ్గీ'ల దగ్గర కూర్చొని టీలు, సిగరెట్లు తాగుతూ అదొక

విద్యాకేంద్రం. ఒకే ఒక్క మినహాయింపు, తిండి సమస్య. దక్షిణాదినుండి వెళ్ళిన వారికి అదే సమస్య. కొంతమంది తమిళ విద్యార్థులు నా దగ్గరకొచ్చి, సౌత్ ఇండియన్ మెస్ కోసం వార్డెన్ దగ్గరికి వెళ్ళాలన్నారు. నేను వద్దని వారించాను. కష్టమో, నష్టమో మనం సర్దుకుని, ఒక మెస్ లో వుండాలనీ, లేకుంటే ప్రాంతీయ తత్త్వం పెరగవచ్చుననీ, దేశానికంతకూ ఆదర్శవంతమైన విశ్వ విద్యాలయంలో వేర్వేరు కుంపట్లు పెట్టుకోవడం మంచిది కాదంటే వాళ్ళు అంగీకరించారు.

ఆయన వ్యక్తిత్వానికీ, ఆదర్శాలకీ ఇదొక మచ్చుతునక. తన సుఖంకన్నా ముందు జ్ఞానార్జన ముఖ్యం అనుకోవడం, తన బాగు చూసుకోవడం కన్నా విలువలకి కట్టుబడి ఉండటం ముఖ్యం అనుకోవడం ఆయన జీవితానుభవాలనుంచి మనం నేర్చుకోదగ్గ పాఠం.

విజయం సాధించిన ప్రతి పురుషుడి వెనకా ఒక స్త్రీ ఉంటుందనేది నానుడి. రామకృష్ణగారి జీవితంలో ఆ నానుడి ఎంత నిజమో, తన సహచరి విజయం వెనక ఆయనున్నారనేది కూడా అంతే నిజం.

లలితగారు ఉన్నతవిద్యావంతురాలు కావడానికీ, సమాజంలో అణగారిన సమూహాలు– గిరిజనులు, డి.ఎన్.టిలు, జోగినులు మొదలైన వారికోసం అపారమైన కృషి చెయ్యడానికీ, పిల్లల్ని తీర్చిదిద్దుకోవడానికీ రామకృష్ణగారు ఎంత ప్రోత్సాహం ఇచ్చి ఉంటారో ఈ పుస్తకం చెప్పకనే చెప్తుంది.

రామకృష్ణ గారు ఎం.ఫిల్ చెయ్యాలనుకున్నప్పుడు వీరేశలింగం గారి సంస్కరణను పరిశోధనాంశంగా తీసుకున్నప్పుడు ప్రొ. సర్వేపల్లి గోపాల్ అన్నారట: 'ఆయన జీవితకథ, సంస్కరణలు ఏకరువు పెట్టడం కాదు, focus on how he purified public life of his times అని. ఆ మాటలు విన్నాక తన ఆలోచనల్లో విద్యుత్తు వెలిగినట్టయిందని రామకృష్ణగారు రాసుకున్నారు. ఈ పుస్తకం చదివాక నాకు అనిపించింది కూడా ఇదే: రామకృష్ణగారు చదువుకున్న ప్రతిచోటా, పనిచేసిన ప్రతి చోటా తన చుట్టూ ఉన్న వాతావరణాన్ని purify చేస్తూ వచ్చారనే.

తన అనుభవాలు, జ్ఞాపకాలూ రాయమని తన శ్రీమతి అడిగినందుకు తాను ఈ పుస్తకం ఈ రాస్తున్నానని రామకృష్ణగారు రాసుకున్నారు. లలిత గారు జీవించి ఉండగా తన సహచరుడిలోని best బయటికి తీసుకురావాలని ఎంతగా తపించారో ఇప్పుడు భౌతికంగా లేకపోయినప్పుడు కూడా అంతే ప్రయత్నిస్తున్నారని ఈ పుస్తకం చదివితే స్ఫురిస్తుంది.

వారిద్దర్నీ కన్న తల్లిదండ్రులు ధన్యులు.

1-3-2023

# ఒక ఫీల్డ్ వర్కర్ డైరీ

**ప్రజలతో** కలిసి పని చేయటం ఒక వరం. జీవితంలో లభించగల అవకాశా-లన్నింటిలోనూ గొప్ప అవకాశం. సాధారణంగా మనుషులకు వృత్తి పరంగా లభించే అవకాశాల్ని మనిషికీ, ప్రకృతికీ మధ్య ఉండే దూరాన్ని బట్టి వర్గీకరిస్తూ ఉంటాం. మనిషి నేరుగా ప్రకృతి మధ్య, మట్టితోనూ, గాలితోనూ, అడవితోనూ, గనులతోనూ పని చేయగలిగే అవకాశాల్ని ప్రాథమిక రంగం అనడం మనకు తెలిసిందే. ఒక రైతుగా, రైతు కూలీగా మనిషి మట్టితోనూ, వానతోనూ, ఋతువులతోనూ, సూర్య రశ్మితోనూ కలిసి పని చేస్తాడు.

ప్రకృతితో నేరుగా కాకుండా ప్రకృతి నుంచి తవ్వి తెచ్చిన వాటితో మనిషికి పనిచేసే అవకాశం దొరికితే ఆ ఉత్పత్తి రంగాన్ని సెకండరీ సెక్టరు అని అంటామని కూడా తెలిసిందే. గనుల్లో ఖనిజాన్ని తవ్వి తీయడం నేరుగా మట్టితో పని చేసే అవకాశం అయితే, తవ్వి తీసిన ముడి ఖనిజంతో కర్మాగారంలో పనిచేయటం ద్వితీయశ్రేణి అవకాశం. ప్రకృతికి దూరంగా కేవలం సమాచారంతోనూ, సాంకేతిక పరిజ్ఞానంతోనూ మనం పనిచేసే రంగం మూడవ రంగం.

ఈ మూడు రంగాల్లోనూ, ప్రాయికంగా, అసలు పని చేయటం అనేదే దానికదే గొప్ప భాగ్యం. అది మనిషిని మనిషిగా మార్చే రాసాయనిక ప్రక్రియ. అది ఒక స్వస్థత. నలుగురితో కలిసి పని చేయడంలో, ఉమ్మడి ధ్యేయంతో పనిచేయడంలో మనిషి తన జీవితాన్ని పూర్తిగా జీవించిన సంతోషం పొందుతాడు.

అయితే ఈ మూడు రంగాల కన్నా ప్రత్యేకమైన రంగం మనుషుల కోసం, మనుషులతో కలిసి పని చేయటం. పొద్దున లేచి వారి పలకరించడం, వారి బాగోగులు తెలుసుకోవడం, తనకు తెలిసిన విషయాలు వాళ్లకు చెప్పడం, వాళ్ళ అనుభవాలనుంచి తాను నేర్చుకోవటం, తనూ, వాళ్లూ కలిసి ఈ ప్రపంచాన్ని ఇప్పుడున్న దానికన్నా మరింత మెరుగ్గా మార్చుకోవడం –ఈ అవకాశం ఎవరికి దొరికినా వాళ్ళు మనుషు–లందరిలోనూ శక్తిమంతులు, భాగ్యవంతులు, చైతన్యవంతులు అని చెప్పొచ్చు.

మనుషులతో కలిసి పనిచేయడం వల్ల, మనుషుల కోసం పనిచేయటం వల్ల– అన్నిటికన్నా ముందు– మనలోని ఒక బాధ్యతాయుతమైన మనిషి బయటికి వస్తాడు. ఆ బాధ్యతాపరుడైన మనిషి మనలోంచి బయటికి వస్తున్నప్పుడు అతణ్ణి లేదా ఆమెని చూడటం మనకు చాలా సంతోషంగా, ఒకింత గర్వంగా కూడా ఉంటుంది. మనలోని బాధ్యతాయుతమైన మనిషి, మన శారీరక సామాజిక గుణగణాలతో నిమిత్తం లేకుండా, తనకై తాను ఎంతో శక్తిమంతమైన, చైతన్యవంతమైన ఒక జీవితం జీవించడం మొదలు పెడతాడు లేదా మొదలుపెడుతుంది. చాలాసార్లు మనం శారీరకంగానూ, సామాజికంగానూ, మానసికంగానూ దుర్బలంగా ఉన్నప్పుడు మనలోని బాధ్యతాయుతమైన ఆ మనిషి, మనకి గొప్ప శక్తిని, ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని అందిస్తూ మనం కూలిపోకుండా నిలబెడుతూ ఉండడం మనుషులతో పనిచేసిన ప్రతి ఒక్కరికి అనుభవంలోకి వచ్చిన విషయమనే అనుకుంటాను.

నేను మొదట్లో కొన్నాళ్లు టెలికమ్యూనికేషన్సు డిపార్ట్మెంట్లో పనిచేశాను. ఆ రోజుల్లో సాయంకాలాలు కవులతో, రచయితలతో తిరగటంలో గొప్ప ఆనందం అనుభవించేవాడిని. దాని ముందు నా ఉద్యోగజీవితం వెలవెలబోయేది. నా ఉద్యోగం నుంచి నాకు ఎటువంటి సంతోషం కలిగేది కాదు. ఒక రకంగా చెప్పాలంటే ఉద్యోగజీవితంలో

నేను పూర్తి పరాయీకరణను అనుభవించాను. దాంతో చాలాసార్లు ఆఫీసు ఎగ్గొట్టేవాడిని. ఆఫీసుకి వెళ్ళినా కూడా చేయవలసిన పని చేసే వాడిని కాదు. ఎదురు తిరిగేవాడిని. గొడవలు పెట్టుకునే వాడిని. నా ప్రతిభాపాటవాలకు తగిన ఉద్యోగ అవకాశం దొరకలేదనే అసంతృప్తి వల్ల నేను నా ఉద్యోగాన్ని ఏనాడు గౌరవించుకోలేకపోయాను.

అటువంటిది నేను గిరిజనసంక్షేమశాఖ అధికారిగా ఉద్యోగంలో చేరగానే నా మీద అపారమైన బాధ్యత ఉందని తెలిసి వచ్చేటప్పటికి నాలోంచి నెమ్మదిగా ఒక కొత్త మనిషి బయటకు రావడం గమనించాను. ఆ కొత్త మనిషి మంచి మనిషిగానూ, గొప్ప మనిషిగానూ కూడా కనబడే వాడు. ఆ జిల్లాలో ఉన్న బాల బాలికలు, వాళ్ల కోసం నడుస్తున్న పాఠశాలలు, వాళ్లకు చదువు చెప్తున్న ఉపాధ్యాయులు, వాళ్ళందరి మీద ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు- వాళ్ళందరి ఆశల్ని వమ్ము చేయకుండా చూడ-వలసిన బాధ్యత నా మీద ఉందనే మెలకువ కలగ్గానే నా ఉద్యోగ జీవితం నన్ను అత్యంత బాధ్యతాయుతుడైన మనిషిగా మార్చడం మొదలు పెట్టింది.

మనుషులతో కలిసి పని చేసే అవకాశం మన సమాజంలో చాలా అయాచితంగా దొరికే వాళ్ళల్లో అందరికన్నా మొట్టమొదట ప్రభుత్వ ఉద్యోగులే ఉంటారు. గ్రామ స్థాయిలో, మండల స్థాయిలో విద్య, వైద్యం, మహిళా శిశు సంక్షేమం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, ఇంజనీరింగు వంటి రంగాల్లో ప్రజలతో కలిసి పని చేసే సిబ్బందికి వాళ్లకు లభించిన ఉద్యోగ అవకాశం ఎంత అద్భుతమైన అవకాశమో చాలాసార్లు అర్థం కాదు. వాళ్లలో చాలామంది తమకు లభించింది కేవలం ఉద్యోగ అవకాశం మాత్రమే అని అనుకుంటూ ఉంటారు. కానీ ఒక ఉద్యోగ అవకాశంగా కూడా, వాళ్లు పొద్దున లేచి రకరకాల పనుల మీద, రకరకాల బాధ్యతలతో, ప్రజలతో కలిసి పనిచేయటం తమలోని భౌతిక మానసిక శక్తుల్ని ఏ విధంగా ప్రజ్వలింప చేస్తోందో వారు గుర్తుపట్టరు.

ప్రభుత్వ ఉద్యోగుల తర్వాత, ప్రజలతో కలిసి పని చేసే అవకాశం లభించే వాళ్ళల్లో, మరొక మూడు రకాల కార్యకర్తలు ఉంటారు. ఒకరు వివిధ రాజకీయ పక్షాల కార్యకర్తలు. ఆయా రాజకీయ పక్షాల నిర్దిష్టమైన ఎజెండాను అమలు చేయడం కోసమే ఆ కార్యకర్తలు

పనిచేసేటప్పటికీ ఆ కార్యకర్తలే లేకపోతే అసలు రాజకీయ కార్యక్రమమే ఉండదు. రాజకీయ పార్టీలకి అధికారాన్ని తెచ్చిపెట్టినా, అధికారాన్ని దూరం చేసినా అందుకు ఆ కార్యకర్తల అనుభవాలే కారణమవుతాయి. కానీ ఆ అనుభవాలు ఎలాంటివి, వాళ్ళ ఆలోచనలు ఎలాంటివి, వాళ్ళకి ప్రజలతో కలిసి పని చేయటంలో లభిస్తున్న పాఠాలు ఎటువంటివి అనే విషయం మీద ఏ రాజకీయ పార్టీ కూడా మేధామథన శిబిరాలు ఏర్పాటు చేయటం కానీ, అవగాహన తరగతులు నిర్వహించడం కానీ అంతగా కనిపించదు.

రాజకీయ పార్టీలకు తర్వాత ప్రజలతో అంతగా మమేకమై పనిచేసే వాళ్లు ఉద్యమ కార్యకర్తలు. రాజకీయ పార్టీల కన్నా తీవ్ర అంకితభావం, నిస్వార్థత ఉద్యమ కార్యకర్తల్లో కనిపిస్తుంది. చాలాసార్లు ఉద్యమ కార్యకర్తలు ప్రజలతో పని చేయటంలో ఎన్నో రకాల త్యాగాలకు అడుగడుగున సంసిద్ధులు కావలసి ఉంటుంది.

రాజకీయ పార్టీల కార్యకర్తలూ, ఉద్యమ కార్యకర్తలూ కాక, ప్రజలతో పనిచేసే మూడో తరహా కార్యకర్తలు స్వచ్ఛందసంస్థల కార్యకర్తలు. నాకు తెలిసి ఆ స్వచ్ఛంద సంస్థలు ఎంత గొప్ప పేరు సంపాదించుకున్నవైనా, ఎంత అద్భుతమైన పనితీరును కనబరిచేవైనా దానంతటికీ వెన్నెముక ఆ స్వచ్ఛందసంస్థల కార్యకర్తల సేవానిరతినే అని చెప్పవలసి ఉంటుంది.

అయితే ఈ నాలుగు రకాల కార్యకర్తలు-ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ పార్టీల కార్యకర్తలు, ఉద్యమకార్యకర్తలు, స్వచ్ఛందసంస్థల కార్యకర్తలు- ఈ నలుగురి అనుభవాల్లోనూ ఒకరి అనుభవాలు గొప్పవని గాని మరొకరి అనుభవాలు తక్కువ అని గాని చెప్పలేం. ఒకరి అనుభవాలకీ, మరొకరి అనుభవాలకీ పోలిక ఉండనే ఉండదు. వారిలో ఏ ఒక్కరి అనుభవాలైనా సరే ఎంతో విలువైనవే. ఆ అనుభవాలనుంచి వారు నేర్చుకునే పాఠాలు తక్కిన సమాజమంతా తెలుసుకోవలసిందే.

కానీ ఈ నాలుగు రకాల కార్యకర్తల్లోనూ దాదాపుగా ఉద్యమ కార్యకర్తలు తప్ప తక్కిన వారు తమ అనుభవాలను నమోదు చేయరు. అలా నమోదు చేయడం పట్ల వారికి ఆసక్తి ఉండదు. అందులోనూ, ప్రభుత్వ ఉద్యోగుల్లో అత్యధిక సంఖ్యాకులకు

తమ అనుభవాలు విలువైనవన్న నమ్మకం కూడా ఉండదు. కేవలం ఉద్యమ కార్యకర్తలు మాత్రమే తమ అనుభవాలను గ్రంథస్తం చేసుకునే పరిస్థితి మన సమాజంలో కొనసాగుతూ వస్తోంది. ఉద్యమ కార్యకర్తలు మనకు ఎటువంటి నెరేటివ్వు అందిస్తున్నారో అటువంటి నెరేటివ్వుని బట్టే ప్రజలతో కలిసి పని చేయటమంటే ఎలా ఉంటుందో సమాజం అంచనా వేసుకునే పరిస్థితి ఏర్పడింది. ఇది అభిలషణీయం కాదు.

ఎందరో ప్రభుత్వ ఉద్యోగులు- గ్రామస్థాయి, మండలస్థాయి ఉద్యోగులు- ఉద్యమ కార్యకర్తల కన్నా మించిన passion తో, త్యాగశీలత్వంతో పనిచేయడం నా ఉద్యోగ జీవితం పొడుగునా చూసాను. కానీ వారి అనుభవాలు నమోదు కాకపోవడం వల్ల, సాధారణంగా ప్రజల దృష్టిలో ప్రభుత్వ ఉద్యోగుల పట్ల చులకన భావమే కొనసాగుతూ వస్తున్నది.

అలాగే కొందరు ఉద్యమ కార్యకర్తలు, సంకుచిత ప్రయోజనాల కోసం మాత్రమే పనిచేసేవాళ్లను కూడా నేను చూడకపోలేదు. కానీ అత్యధిక సంఖ్యాకులైన ఉద్యమ కార్యకర్తలు తమ అనుభవాలు కథలు, కవిత్వం, వ్యాసాలు, ప్రసంగాల రూపంలో నమోదు చేసుకుంటూ వస్తున్నందువల్ల వారి పట్ల ప్రజల్లో అపారమైన గౌరవభావం ప్రచలితంగా ఉండడం కూడా చూశాను.

అదీకాక ప్రభుత్వ ఉద్యోగి జీతానికి పనిచేస్తాడు, అతనికి ఎన్నో రకాల ఉద్యోగ సదుపాయాలు ఉంటాయి కాబట్టి పనిచేయటం అతని తప్పనిసరి బాధ్యత అనీ, ఉద్యమ కార్యకర్త స్వచ్ఛందంగా, ఐచ్ఛికంగా పని చేస్తాడు కాబట్టి అతనిది ఉన్నత స్థాయి పని అనే అభిప్రాయం కూడా ప్రజల్లో ఉంటుంది. కానీ ప్రజలతో పని చేయవలసి వచ్చినప్పుడు అది జీతం కోసం చేశాడా లేక ఒక ఉద్యమధ్యేయం కోసం చేశాడా అన్నదానికి నా దృష్టిలో ద్వితీయస్థానం మాత్రమే.

కలిసి పని చేయటం దానికదే ఒక విలువ. ఆ విలువను నలుగురూ గుర్తించి, గౌరవించాలంటే ముందు మనం దాన్ని గౌరవించుకోవడం నేర్చుకోవాలి. ప్రజలతో కలిసి పనిచేయడం వల్ల తమ వ్యక్తిత్వం ఏ విధంగా వికసించిందో గుర్తుపట్టడమూ, ఆ వ్యక్తిత్వవికాసాన్ని ఒక కథనంగా మార్చడమూ చిన్నపాటి విద్యా కార్యక్రమం కాదు.

కాబట్టి ప్రజలతో కలిసి పని చేయడంలోనూ, తమ విధ్యుక్తధర్మాన్ని తాము నిర్వహించడంలోనూ మనుషులు ఎదుర్కొనే కష్టనష్టాలకు సంబంధించిన అనుభవ కథనాలు నన్ను ఎప్పుడు ఆకర్షిస్తూ ఉంటాయి. అటువంటి అనుభవ కథనాలు నా దృష్టిలో అత్యుత్తమ సాహిత్యం. గొప్ప కథలు, నవలలు, నాటకాలు కూడా ఒక మనిషి నిజాయితీతో చెప్పుకున్న అనుభవ కథనాల కన్నా ఎక్కువ విలువైనవని నేను ఎన్నటికీ భావించలేను. ఆధునిక భారతదేశం సృష్టించిన సమస్త సృజనాత్మక సాహిత్యం అంతా ఒక ఎత్తూ, గాంధీజీ 'సత్యశోధన' ఒక్కటీ ఒక ఎత్తూ అని నాకొక నమ్మకం.

మన కాలంలో నాకు అటువంటి రచనలుగా డా. కలాం రచనలు కనిపించాయి. మనుషుల కోసం, మనుషులతో కలిసి పనిచేయటం లోని విలువని ఆయన ముందుగా తనకై తాను గుర్తించాడు, గౌరవించుకున్నాడు. అప్పుడు నలుగురితోను పంచుకున్నాడు. తనకి ఆ అనుభవాలు లభించడానికి కారణమైన తన గురువులకు, మార్గదర్శకులకు, సహచర ఉద్యోగులకు తాను జీవించి ఉన్నంతకాలం కృతజ్ఞతలు చెప్పుకుంటూనే ఉన్నాడు. డా.కలాం ఆత్మకథ 'వింగ్స్ ఆఫ్ ఫైర్' ను నేను 'ఒక విజేత ఆత్మకథ'గా అనువదించిన తర్వాతనే నా ఉద్యోగ జీవితపు అనుభవాలను కూడా నలుగురితో పంచుకోవచ్చని నాకు నమ్మకం కలిగింది. డా. కలాంని నేను చదవకపోయి ఉంటే 'కొన్ని కలలు కొన్ని మెలకువలు' పుస్తకం రాసి ఉండేవాడినే కాను.

నా ఉద్యోగ జీవితం పొడుగునా నేను ఎందరో అంకిత భావం గల ఉన్నతాధికారుల్నీ, సహోద్యోగుల్నీ, క్షేత్రస్థాయి కార్యకర్తల్నీ చూస్తూ వచ్చాను. వారి అనుభవాలు నా అనుభవాల కన్నా ఎంతో విలువైనవి. ఎంతో సమగ్రమైనవి. మనుషులతో కలిసి పనిచేయడంలోంచి వారు నేర్చుకున్న పాఠాలు నమోదైతే మన సమాజానికి మరింత లబ్ధి చేకూరగలదని నేను గాఢంగా నమ్ముతున్నాను. కానీ వారిలో ఏ ఒకరిద్దరో తప్ప తక్కిన వారు తమ అనుభవాల్ని గ్రంథస్తం చేయకపోవడం జాతి దురదృష్టంగా భావిస్తున్నాను.

ఈ నేపథ్యంలో భారతి కోడె రాసిన 'ఒక ఫీల్డ్ వర్కర్ డైరీ', (సిక్కోలు బుక్ ట్రస్టు, 2022) చదువుతుంటే నాకు కలిగిన సంతోషం మాటల్లో పెట్టలేనిది. ఆమె వివిధ

రంగాల్లో, వివిధ ప్రాంతాల్లో, వివిధ రకాల ప్రజాసమూహాలతో కలిసి పనిచేసిన తన అనుభవాలను 70 వ్యాసాలుగా ఈ పుస్తకంలో పొందుపరిచారు. బొగ్గు గనుల్లో, ఉప్పు పొలాల్లో, తేనె సేకరించే అడవుల్లో, పాల కేంద్రాల్లో, పొదుపు సంఘాల్లో– ఒకటి కాదు, ప్రస్తుత సమాజంలో ఎన్ని కార్యక్షేత్రాల్లో మనుషులతో కలిసి పని చేయవచ్చునో, అన్ని కార్యక్షేత్రాల్లో ఆమె వాళ్లతో కలిసి పనిచేయటమే కాక, ఆ అనుభవాలను గుర్తు పెట్టుకుని ఇలా గ్రంథస్థం చేయటం నన్ను ఎంత ఉత్తేజభరితుణ్ణి చేసిందో చెప్పలేను. ఇటువంటి మనుషులతో కలిసి ఒక కార్యకర్తగా పనిచేయాలనే ఉత్సాహం నాకు ఈ పుస్తకం వల్ల కలుగుతోందని చెప్పటం అతిశయోక్తి కాదు.

ప్రజలతో కలిసి పని చేయటంలోని సంతోషం సరే, అలా పని చేయటంలో సంప్రాప్తించే అనుభవాలు ఆమెను ఎంత వివేకవంతురాలు చేశాయో ఈ పుస్తకంలో ప్రతి వ్యాసం సాక్ష్యం ఇస్తోంది. నేను కలగనే భారతదేశాన్ని నిర్మించగల చేతులు ఇటువంటి మనుషులవే అని నాకు మరోసారి నమ్మకం కలిగింది.

ఈ పుస్తకంలో నుంచి కొన్ని వాక్యాలు ఎత్తి రాద్దామనుకున్నాను. దాని కన్నా కూడా ఆ మొత్తం పుస్తకం చదవటమే సముచితంగా ఉంటుందని చెప్పగలను.

అయినా కూడా పుస్తకంలో నుంచి కనీసం నాలుగైదు వాక్యాలైనా పంచుకోవాలి అనిపించినప్పుడు ఈ పేరాగ్రాఫు కనిపిస్తున్నది. భారతి ఝార్ఖండు వెళ్ళినప్పటి తన అనుభవాలు రాస్తూ ఆ వ్యాసాన్ని ఈ కింది వాక్యాలతో ముగించారు:

> హొటల్‌కు చేరే దారిలో నిలువెత్తు బిర్సాముండా విగ్రహం కనిపించింది. కేవలం పాతిక సంవత్సరాలు జీవించిన మనిషి ఈ భూమి మీద, తన జాతి మీద ఎన్ని గుర్తులు, ఎంతటి ప్రభావాన్ని వదిలి వెళ్లాడు. అంత చిన్న వయసులోనే తన జాతి మొత్తాన్ని సమీకరించే శక్తి, తమను అణగదొక్కుతున్న వర్గాలపై పోరాడే తెగింపు ఎలా సాధ్యమైంది అని బిర్సా గురించి చాలా సేపు ఆలోచన చేశాను. ఇది రాస్తుంటే కొన్ని రోజుల నాడు తాను రాసిన ఒక వ్యాసంలో మా నిర్మల మేడం అడిగిన ప్రశ్న గుర్తుకు వస్తుంది. Should one live longer life or larger life?

ఒక ప్రభుత్వ ఉద్యోగిగా పని చేయటం, ఒక రాజకీయ కార్యకర్తగా పనిచేయడం, ఒక ఉద్యమకార్యకర్తగా పోరాడడం, ఒక స్వచ్ఛంద సంస్థ కార్యకర్తగా ప్రజల్ని చైతన్య-వంతులు చేయటం- ఇవన్నీ సమానమైన బాధ్యతలే. వీటిలో ఒకటి ఎక్కువా ఒకటి తక్కువా అని అనలేం. కానీ ఈ నాలుగు రంగాల్లోనూ కూడా మెలకువతో, passion తో, నిజాయితీతో పని చేయటం అన్నిటికన్నా అత్యున్నత బాధ్యత. అది లేకుండా పని చేసినప్పుడు ప్రభుత్వంలో పనిచేసినా, పోరాటంలో పనిచేసినా రెండూ నిష్ప్రయోజనాలే. భారతి మన ముందు వేసిన ప్రశ్న స్పష్టంగానే ఉంది. Should one live longer life or larger life?

29-5-2023

# గిరోయి

**ప్రతి** ఏటా గుంటూరులో శ్రీ వెంకటేశ్వరబాలకుటీర్‌వారు జరిపే లలితాకళా ఉత్సవాలు ఈ రోజు కూడా ఘనంగా జరిగేయి. ఇది 27 వ ఉత్సవం. ప్రతి ఏటా ఇచ్చే పురస్కారాల్లో భాగంగా బాలసాహిత్య పురస్కారం డా.ఎం.హరికిషన్‌కు, మాలతీ ప్రమదా పురస్కారం ప్రముఖ రచయిత్రి, పాత్రికేయురాలు సి.సుజాతగారికి అందించారు. యువ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి నెలకొల్పిన ప్రతిభాపల్లవ పురస్కారం చిరంజీవి ఎ.లక్ష్మీ అహలకు అందచేసారు.

ఈ ఉత్సవాల్లో ఈ సారి విశేషం డా. నన్నపనేని మంగాదేవి గారి ఆత్మకథ 'అంకురం నుంచి అనంతందాకా' వెలువడటం. ఈ పుస్తకం ఇప్పటికే వచ్చి ఉండ వలసింది. ఈ రోజు ఈ గ్రంథాన్ని ఆవిష్కరించే భాగ్యం నాకు కలిగింది. అపురూపమైన ఆ పుస్తకానికి నేను రాసిన చిన్న పరిచయం ఇక్కడ మీతో పంచుకుంటున్నాను.

గిరోయి అంటే రష్యను భాషలో హీరో అని అర్థమట. డా.మంగాదేవిగారు సోవియెటు రష్యాలో ఉన్నప్పుడు ఒకసారి తూర్పుదేశాల యాత్ర ముగించుకుని రాగానే ఆమె క్లాసు టీచర్లు, కాస్మేట్సు అంతా ఆమెని గిరోయి అంటూ ఆకాశానికెత్తేసారట. ఈ పుస్తకానికి ఏమి శీర్షిక పెట్టాలి అనడిగితే గిరోయి అనే పెట్టమంటాను.

ఎందుకంటే ఇది నిజంగానే ఒక వీరవనిత కథ, ఒక ధీరవనిత కథ. ఒక సాహస మహిళ కథ, సంపూర్ణమానవి కథ.

పట్టుమని రెండువందల పేజీలు కూడా లేని ఈ పుస్తకంలో దాదాపు రెండువందల ఏళ్ళ ప్రయాణం ఉంది. మంగాదేవిగారి పసితనం ఇరవయ్యవ శతాబ్దపు ప్రారంభంలోనే మొదలైనప్పటికీ, ఆమె చిన్నప్పటి సామాజిక పరిస్థితుల్ని చూస్తే ఆ కాలం పందొమ్మిదో శతాబ్దిని గుర్తుకు తెచ్చేదిలా ఉంది. పుస్తకం చివరి పేజీలకు వచ్చేటప్పటికి 21 వ శతాబ్దపు విద్య గురించిన ఆలోచనలు, ప్రయత్నాలు, ప్రయోగాలు, ఆమె వెలిగించిన దీపాలు, వెలిగిస్తూ వస్తున్న జీవితాలు కనిపిస్తాయి. ఒక సుదీర్ఘ ప్రయాణం, ఒక సార్థక ప్రయాణం, ఒక సుసంపన్నమైన జీవనయానాన్ని చూసిన తృప్తి కలుగుతుంది మనకి.

ఆధునికమహిళ చరిత్రను తిరిగి రాస్తుందని గురజాడ రాసుకున్న మాట మనకి తెలుసు. ఆధునికమహిళ చరిత్రని తిరిగి ఎలా రాస్తుందో ఈ పుస్తకం ఒక డెమాన్స్ట్రేషను లెసను. ఎందుకంటే సమాజాన్ని మార్చేవాళ్ళు, చరిత్రని తిరిగి రాసేవాళ్ళు ముందు తమ చరిత్రని తామే రాసుకుంటారు. అవసరమైతే తిరిగి రాసుకుంటారు. అందుకు, ఇదుగో, మంగాదేవి గారి జీవితమే ఒక నిరూపణ.

ఎవరి జీవితానికేనా మొదటి పాతిక ముప్పై సంవత్సరాలు ఎంతో కీలకం. ఎవరికైనా కెరీరుకి ఒక దారి దొరికి, అంచెలంచెలుగా జీవితంలో ముందుకు సాగడానికి ఆ కాలమే నిర్ణయిస్తుంది. కాని మంగాదేవిగారి జీవితం చూడండి. యూనివెర్సిటీ చదువునా, అర్థాంతరంగా ముగిసిపోయింది. ప్రభుత్వోద్యోగమా, బదిలీలమీద బదిలీలు. ఒక ట్రయినరుగా చక్కటి ప్రాంగణంలో ఉద్యోగం దొరికిందనుకుంటే ఆ సంతోషం కూడా లేకుండా పోయింది.

మామూలు మనుషులెవరేనా అక్కడితో అన్ని ప్రయత్నాలూ ఆపేసి ఉండేవారు. పెళ్ళిచేసుకుని ఒక సాధారణగృహిణిగా జీవితంలో సర్దుకుపోయి ఉండేవారు. కాని అక్కడినుంచే మంగాదేవిగారు తన చరిత్ర తాను రాసుకోవడం మొదలుపెట్టారు. ఆ తర్వాత ఆమె చేసిన ప్రయత్నాలు, తెరిచిన బడులు, తీర్చిదిద్దిన జీవితాలు, పెంచిన

మొక్కలు, తోటలు, నడిపిన సంస్థలు– ఒక్క మనిషి ఒక జీవితకాలంలో చెయ్యగలిగిన వేనా ఇవన్నీ అని ఆశ్చర్యపోతాం.

మా మొదటి పరిచయంలోనే ఆమె మా అమ్మగా మారిపోయింది. దాదాపు ఇరవయ్యేళ్ళుగా ఆ అనుబంధం నానాటికీ బలపడుతూనే ఉంది. ఇన్నేళ్ళల్లోనూ ఎన్నోసార్లు 'చేతన' ఆశ్రమానికి వెళ్ళాను. అక్కడి పిల్లల్తో కలిసి గడిపేను. గుంటూరులో శ్రీవెంకటేశ్వర బాలకుటీర్‌కి కూడా వెళ్ళాను. అక్కడ కూడా ఒకటి రెండు సమావేశాల్లో పాల్గొన్నాను. మనసులో ఎప్పుడేనా కారుమబ్బులు కమ్ముకున్నప్పుడు ఆ పాఠశాలల ప్రాంగణాల్లో అడుగుపెడితే చాలు మనసు తేలికైపోతుంది. స్వర్గం ఎక్కడో లేదు, ఇక్కడే ఉందనిపిస్తుంది.

నేను కూడా ప్రాథమిక విద్యారంగంలోనూ, పూర్వప్రాథమిక విద్యలోనూ కొన్ని ప్రయత్నాలు చేపట్టినవాడిని కాబట్టి, ఆ రంగాల్లో మంగాదేవి గారి కృషి ఎంత అపూర్వ-మైనదో నేను సాధికారికంగా చెప్పగలను. ఒక మాంటిస్సోరికి, ఒక గాంధీజీకి, ఒక గిజుభాయికి ఆమె నిజమైన వారసురాలు. ఎటువంటి స్నేహశీల, ప్రేమమయ వాతావరణంలో పిల్లలు అభ్యసనం మొదలుపెట్టాలో, ఎటువంటి ఆరోగ్యపూరిత ప్రాంగణంలో పిల్లలు తమ జ్ఞానప్రపంచాన్ని నిర్మించుకుంటారో మంగాదేవిగారికి తెలుసు. కాబట్టే ఆమె నిర్మించిన ప్రాంగణాల్లో పిల్లలూ, పువ్వులూ కూడా ఒక్కలానే వికసిస్తారు.

ఎంతో విలువైన జీవితం ఆమెది. తన జీవనప్రయాణాన్ని ఇన్నాళ్ళకైనా ఆమె మనతో ఇలా వివరంగా పంచుకోవడం మన భాగ్యం. ఆమె చిన్నప్పటి కన్నా ఇప్పుడు ప్రపంచం మరింత పెద్దదయింది. వనరులు మరింత విస్తారంగా అందుబాటులోకి వచ్చాయి. అభ్యసనం తీరుతెన్నులు మారిపోతూ ఉన్నాయి. కాని మంగాదేవి మాత్రం ఒక్కరే కనిపిస్తున్నారు. ఇప్పుడు ఈ పుస్తకం వల్ల మరెందరో దేవమ్మలకు స్ఫూర్తి లభిస్తుందన్న ఆశ ఒకటి నాలో వెలగడం మొదలయ్యింది.

10-12-2024

# సాహసం, కానీ ఎంతో అవసరం

**కల్లూరి** భాస్కరం ప్రసిద్ధపాత్రికేయులని అందరికీ తెలుసు. కాని 1980 తర్వాత తెలుగు కవిత్వంలో వచ్చిన మార్పుని ముందే పసిగట్టిన కవి అని చాలామందికి తెలియకపోవచ్చు. 'మౌనం నా సందేశం' (1980) పేరిట ఆయన వెలువరించిన కవితాసంపుటి సమకాలిక తెలుగుకవిత్వంలో ఒక వేకువ పాట.

ఆయన చేయి తిరిగిన అనువాదకుడని కూడా కొందరికి తెలియకపోవచ్చు. పి.వి. నరసింహారావుగారి 'ఇన్ సైడర్' కు 'లోపల మనిషి' (2002) ఆయన చేసిన తెలుగు అనువాదం ప్రశస్తమైన కృషి. అలాగే రాజ్ మోహన్ గాంధి రచన 'మోహన్ దాస్' కు చేసిన అనువాదం (2011) కూడా ప్రశంసనీయమైన పుస్తకం.

ఆయన రాసిన 'కౌంటర్ వ్యూ' చదివినవాళ్ళకి ఆయన సిద్ధహస్తుడైన కాలమిస్టు అనీ, 'వేయిపడగలు నేడు చదివితే' చదివినవాళ్ళకి ఎంతో ప్రతిభ కలిగిన సాహిత్య విమర్శకుడనీ తెలుస్తుంది. 'తెలుగు కవిత్వంలో కాలికస్పృహ' పేరిట ఆయన చేసిన ప్రతిపాదన ఎంతో మౌలికమైనదని చేరాలాంటి వాడే ప్రస్తుతించాడు. ఇక 'మంత్ర కవాటం తెరిస్తే మహాభారతం మన చరిత్రే' (2019) పేరిట ఆయన వెలువరించిన

ఉద్గ్రంథం ఆయన్ని సమకాలిక తెలుగు జిజ్ఞాసువుల్లో, పరిశోధకుల్లో అగ్రశ్రేణిలో నిలబెట్టింది.

ఈ బృహద్గ్రంథాలన్నీ ఒక ఎత్తూ, ఇప్పుడు ఈ 'నానాజన్యువు లనేకవర్ణాలనంత వలసలు' పేరిట మీ చేతుల్లో ఉన్న పుస్తకం ఒక ఎత్తూ. ఇది ఒక మల్టి-డిసిప్లినరి అధ్యయనం. ఇటువంటి కృషి ఒక్క మనిషి ఒంటి చేత్తో చెయ్యగలిగేది కాదు. ఏదైనా ఒక విశ్వవిద్యాలయమో లేదా ఒక శాస్త్రవేత్తల బృందమో మాత్రమే చెయ్యగల పని. అది కూడా రోజుకి పదహారుగంటల పాటు నిర్విరామంగా పనిచేస్తే తప్ప క్రోడీకరించలేని విజ్ఞానం ఇది.

## 2

ఎంతో ఆసక్తికరంగానూ, మానవుడి చరిత్రకు సంబంధించిన ఒక సుదీర్ఘ జనకథని ఎంతో ఉత్కంఠభరితంగానూ చెప్తున్న ఈ రచనలోకి మీరు అడుగుబెట్టబోయేముందు నేను మీకు అడ్డంగా నిలబడాలనుకోవడం లేదు. కాని ఒకటి రెండు మాటలు నా మాటగా చెప్పాలనుకుంటున్నాను.

ఇంతకు పూర్వం వలసవాదం వల్లా, పారిశ్రామిక విప్లవం వల్లా మన దేశంతో సహా, ఆసియా, ఆఫ్రికా ఖండాల్లో ఎన్నో దేశాల్లో జాతీయతావాదం తలెత్తిందనీ, అది చివరికి ఆ దేశాలు రాజకీయంగా స్వాతంత్ర్యం పొందడానికి దారి తీసిందనీ మనకి తెలుసు. అయితే ముప్పై నలభయేళ్ళ కింద మొదలై, భారతదేశంలో 1990 తర్వాత ప్రధానంగానూ, గత ఇరవయ్యేళ్ళుగా అత్యంత వేగవంతంగానూ సంభవిస్తున్న గ్లోబలైజేషను నేపథ్యంలో, దేశంలోనూ, ప్రపంచంలోనూ కూడా రెండు ముఖ్య పరిణామాలు సంభవిస్తున్నాయి. ఒకటి జాతీయ రాజ్యాలు బలపడటం, మరొకటి వలసల ఉధృతి.

గ్లోబలైజేషను స్వరూప స్వభావాలు తెలుస్తున్న రోజుల్లో చాలామంది దానివల్ల ఆధునిక జాతీయరాజ్యాలు బలహీనపడతాయనీ, సరిహద్దులు కనుమరుగవుతాయనీ

అనుకున్నారు. కానీ వాస్తవానికి వచ్చేటప్పటికి జాతీయరాజ్యాలు మరింత బలపడటమే కాక, గోడలు కూడా కట్టుకోవడం మొదలుపెట్టాయి.

ఇందుకు రెండు కారణాలు. ఒకటి, ప్రపంచం నలుమూలలనుంచీ పెట్టుబడులు దేశంలోకి ప్రవహించడం, ఆ పెట్టుబడుల మీంచి జరిగే ఉత్పాదన, పాలన, నిర్వహణ ఆయా జాతీయరాజ్యాల నియమ నిబంధనల ప్రకారం జరగవలసి ఉండటం. మరొకటి, విదేశాలనుంచి వస్తున్న ఆ పెట్టుబడులతో స్వదేశీ పెట్టుబడిదారులు లబ్ధి పొందడం మొదలుపెట్టారు కాబట్టి, తోటి పెట్టుబడిదారులుగా తాము ఆ పెట్టుబడి ప్రవర్తనని శాసించలేరు కాబట్టి రాజకీయ అధికారంలోకి తాము ప్రత్యక్షంగా ప్రవేశించడం.

కాని తమ పెట్టుబడి అవసరాలు జాతి అవసరాలని జాతిని నమ్మించకపోతే తమకి రాజకీయ అధికారం సాధ్యం కాదు. కాని ఒక దేశం దానికదే ఒక జాతిగా రూపొందదు. ఒక ప్రదేశం జాతిగా మారాలంటే ఆ ప్రదేశంలో ఉన్న మనుషులకి ఒక ఉమ్మడి ధ్యేయం, స్ఫూర్తి, భావావేశం ఉండి తీరాలి. జాతీయోద్యమ కాలంలో స్వాతంత్ర్యాన్ని సంపాదించడం అటువంటి ఉమ్మడి ధ్యేయంగా ఉండేది. ఇప్పుడు అటువంటి భావావేశాన్ని దేని ద్వారా తేగలుగుతాం? ఇందుకు నిజంగా ఉన్న దారి ఒకటే. అదేమంటే, అందివచ్చిన ఈ కొత్త అవకాశంలో దేశం మొత్తాన్ని భాగస్వామ్యం చెయ్యడం. తద్వారా దేశాభివృద్ధి అనే ఒక ధ్యేయంతో జాతిని సమాయత్త పరచడం.

కాని ఇప్పుడు కొత్తగా జతకలుస్తున్న విదేశీ పెట్టుబడిదారులకి అటువంటి అవసరం లేదు, స్వదేశీ పెట్టుబడిదారులకి అది ఊహకి కూడా అందదు. కాబట్టి ఈ కొత్త పెట్టుబడిదారులు మొదట్లో దేశభద్రతని ఒక ఉమ్మడి ధ్యేయంగా చూపించడానికి ప్రయత్నిస్తారు. కాని అది శాంతిసమయాల్లో పనికొచ్చే భావావేశం కాదు. కాబట్టి వాళ్లకి చేతనయిందల్లా, ఆ దేశంలో అప్పటికే ప్రాబల్యంగా ఉండే ప్రాంతాల్నో, వర్గాల్నో, సమూహాల్నో తక్కిన దేశం నుంచి విడదీసి వారికి తమ చుట్టూ ఉన్న తోటి సమూహాలనుంచి ఒక అభద్రత  ఉందని చెప్పడం. కాని ఏ రాజ్యమూ, ప్రభుత్వమూ తన ప్రజలకి అభద్రత ఉందని నేరుగా చెప్పలేదు కాబట్టి, అలా చెప్పడం ఆ ప్రభుత్వ అసమర్థతగానే పరిగణనకి వస్తుంది కాబట్టి, వాళ్ళు ఒక సాంస్కృతిక అభద్రతని సృష్టిస్తారు. అంటే దేశంలో ప్రబలంగా ఉన్న కొన్ని శక్తులకి తక్కిన సమూహాలనుంచి

సాంస్కృతికంగా ఒక ప్రమాదం పొంచి ఉందని నమ్మిస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే పాత తరం జాతీయవాదం వలసపాలకుణ్ణి శత్రువుగా చూపితే ఈ కొత్త జాతీయవాదం తన దేశవాసులకి తన దేశవాసుల్నే శత్రువులుగా చూపిస్తుంది.

ఒకప్పుడు జాతీయోద్యమంలో దేశంలోని అన్ని ప్రాంతాలవారు, మతాల వారు, భాషల వారూ, సంస్కృతుల వారూ అన్ని పద్ధతుల్లోనూ పాల్గొన్నారు. అందులో ఎవరి పోరాటమూ మరొకటి పోరాటం కన్నా ఎక్కువ విలువైనదీ కాదు, ఎవరి త్యాగమూ మరొకరి త్యాగం కన్నా తక్కువ విలువైందీ కాదు.

కాని స్వాతంత్ర్యం సిద్ధించిన ఏడున్నర దశాబ్దాల తర్వాత పరిస్థితి చూస్తే జాతి నిర్మాణంలో అన్ని ప్రాంతాలకీ, అన్ని వర్గాలకీ, అన్ని సమూహాలకీ సమానమైన వాటా దక్కలేదు. రాజకీయ అధికారం అందరికీ సమానంగా దక్కలేదు. దేశంలోని ఉత్తరాది ప్రాంతాలు, హిందీ మాట్లాడే ప్రాంతాలు, ప్రధానంగా హిందువులు, వాళ్ళల్లో మళ్ళా అగ్రవర్ణాలు, అగ్రకులాలు, వాళ్ళల్లో మళ్ళా పురుషులూ రాజకీయ అధికారానికి ఎక్కువ నోచుకుంటూ ఉండగా, వెనకబడిన ప్రాంతాలూ, కులాలూ, తెగలూ, దళితులూ, స్త్రీలూ రాజకీయంగా ఇంకా పూర్తిగా సంఘటితపడనే లేదు. దానివల్ల ఆయా వర్గాలకు చెందిన సమూహాలు కొన్ని ప్రాంతాల, కొన్ని వర్గాల, వర్ణాల ఆధిపత్యాన్ని ప్రశ్నించడం మొదలుపెట్టగానే ఆ గొంతుల్ని సాంస్కృతికంగా అణచిపెట్టే ధోరణి ఒకటి మొదల-య్యింది. ఇది చాలా సూక్ష్మస్థాయిలో జరుగుతున్న ప్రక్రియ.

సహజంగానే ఈ ప్రయత్నాలకి ప్రతిఘటన వస్తున్నది. ఆయా జాతీయ రాజ్యాల పరిధిలో ఇంతదాకా ఒక జాతిగా మనుగడ కొనసాగిస్తున్నప్పటికీ, ఆ జాతిచిత్రంలోనూ, ఆ జాతీయవాద కథనాల్లోనూ నిరాదరణకీ, అప్రధానీకరణకీ గురైన ప్రాంతాలూ, సమూహాలూ తమ అస్తిత్వాల్ని గుర్తుపట్టడం, తద్వారా ఇంతదాకా చెప్పుకుంటూ వస్తున్న జాతీయవాద కథనాల్ని ప్రశ్నించడం మొదలుపెడుతున్నారు. ప్రజలనుంచి తలెత్తే ఇటువంటి ప్రతిఘటనని వలసవాదపు రోజుల్లో రాజద్రోహంగా చిత్రిస్తే, ఈ రోజుల్లో జాతీయవాద ప్రభుత్వాలు దాన్ని రాజద్రోహంగా మాత్రమే కాక, మరికొంత ముందుకి పోయి జాతిద్రోహంగానూ, సాంస్కృతిక ద్రోహంగానూ చిత్రించడం మొదలుపెట్టాయి.

ఇది ఒక్క ఆసియా, ఆఫ్రికా ఖండాలకే కాదు, యూరోపుకీ, చైనాకీ, రష్యాకీ కూడా అనుభవంలోకి వస్తున్న యథార్థం. ఈ కొత్త అస్తిత్వాల్ని ఎలా నిభాయించాలో తెలీక జాతీయరాజ్యాలు దేశభద్రత, అంతర్గతభద్రతల పేరిట మరింత నియంతృత్వ పోకడల్ని సంతరించుకుంటూ, ఈ సరికొత్త అస్తిత్వగళాల్ని అణచివెయ్యడానికి ప్రయత్ని-స్తుండటం ప్రపంచమంతటా కనిపిస్తున్నది.

గ్లోబలైజేషను వల్ల సంభవించిన రెండవ పరిణామం మొత్తం ప్రపంచమే ఒక సరికొత్త వలసప్రపంచంగా మారిపోవడం. అలాగని వలసలు ఉధృతమయ్యాయని కాదు. గత యాభయ్యేళ్ళుగా ప్రపంచ జనాభాలో వలసల జనాభా శాతంలో పెద్ద మార్పు లేదు. అది ఎప్పట్లానే మూడు శాతానికి దగ్గరగానే ఉంటున్నది. కాని ఈ ఇరవై, ముప్పై ఏళ్ళల్లో జరిగిన వలసల్లో గుణాత్మకంగా చాలా మార్పు ఉంది.

మొదటిది, నిష్పత్తిలో మార్పు లేకపోయినప్పటికీ వలసలు చేపడుతున్న మనుషుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. ప్రపంచం మొత్తం మీద నేడు దాదాపు 27 కోట్లమంది ఏడాది కన్నా ఎక్కువ కాలం తమ స్వదేశానికి దూరంగా గడుపుతున్నారని ఒక అంచనా. వీళ్ళల్లో సంఖ్యరీత్యా అత్యధికులు భారతీయులు కావడం గమనార్హం. వీళ్ళు అమెరికా, యూరోపు, పశ్చిమాసియా, ఆఫ్రికా దేశాలకు వలసలకు పోతున్నారు. వయసురీత్యా వీళ్ళల్లో ఎక్కువమంది యువతీయువకులు. వీళ్ళు ఆయాదేశాల్లో ఉపాధి సంపాదించు-కుని తద్వారా స్వదేశాలకు పంపిస్తున్న ఆదాయం దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంది కాబట్టి, ఇప్పుడు వలసలు జాతీయ అవసరంగా కూడా మారాయి.

ఇలా స్వచ్ఛందంగా జరుగుతున్న వలసలతో పాటు రకరకాల రాజకీయ కారణాల వల్ల, అంతర్యుద్ధాల వల్ల ఒక దేశం నుంచి పక్కనున్న పొరుగుదేశంలోకి పెద్ద ఎత్తున శరణార్థులుగా వలసలు పోతున్నవారి సంఖ్యకూడా విస్తారంగా పెరుగుతోంది. ఒకప్పుడు ఇలా ఒక దేశంలోకి శరణార్థులుగా వచ్చినవారిని ఆయాదేశాలు మానవతాపూర్వకంగా ఆదరించేవి. కాని ఇప్పుడు కొత్త జాతీయవాదాలు అటువంటి శరణార్థుల్ని జాతీయ విపత్తుగా పరిగణిస్తున్నాయి. ఇక మూడవ తరహా వలసలు, ఒక దేశం నుంచి మరొక దేశానికి జరుగుతున్నవి కావు, ఆ దేశంలోనే వెనకబడిన ప్రాంతాలనుంచి అభివృద్ధి

చెందిన ప్రాంతాలకు ఉపాధి కోసం జరుగుతున్నవి. ఇటువంటి వలసల్లో చైనా ముందుస్థానంలో ఉంది. ఆ దేశంలో పడమటి ప్రాంతాలనుంచి దాదాపు ఇరవై ముప్పై కోట్లమంది ప్రజలు తూర్పు ప్రాంతాలకి పని కోసం వలసపోతున్నారు. భారత దేశంలో ఒరిస్సా, బీహారు లాంటి రాష్ట్రాలనుంచి వింధ్యకు దక్షిణానికి వలస వస్తున్నట్టే. ఇటువంటి అంతర్గత వలసలు ఆయా దేశాల్లో సాంస్కృతికంగా కొత్త సమస్యల్ని సృష్టిస్తున్నాయి.

ఇలా చదువులకోసమో, జీవనోపాధికోసమో భారతీయులు గతంలో కూడా విదేశాలకు వలసవెళ్లారు. అలా వెళ్ళినప్పుడు, వాళ్ళు ఆయా దేశాల్లో కనబడుతున్న అభివృద్ధితో మన దేశపరిస్థితుల్ని పోల్చుకుని చూసి, మన దేశాన్ని స్వతంత్రం చేస్తే తప్ప మనకి అభివృద్ధి సాధ్యం కాదని భావించారు. మన జాతీయోద్యమ నాయకులు చాలామంది అలా విదేశాలకు చదువుకోడానికి వెళ్ళినందువల్ల జాగృతి పొందినవారే. మరొకవైపు విదేశాలకు, ముఖ్యంగా ఆఫ్రికా దేశాలకు బతుకు తెరువుకు వెళ్ళిన భారతీయులు చాలా నిరుపేదలు కాబట్టి వాళ్లకి తమ దేశం గురించీ, తమ సంస్కృతి గురించీ ఆలోచించగలిగే అవకాశం ఉండేది కాదు. వారు నెమ్మదిగా ఆయా దేశాల జీవనవిధానంలో ఏ చోటు లభిస్తే అక్కడే సర్దుకుపోయారు.

కాని ఇప్పుడు చదువుకోసమో, ఉపాధికోసమో విదేశాలకు వెళ్తున్న భారతీయులకి ఆ దేశాల్లో తమ ఉనికిని ప్రత్యేకంగా నిలబెట్టుకోడానికి తమ జాతి గురించీ, సంస్కృతి గురించీ చెప్పుకోవలసిన అవసరం కనబడుతున్నది. కాని వాళ్లల్లో చాలామంది ఇక్కడ ఉండగా ఈ దేశ చరిత్ర, సంస్కృతి, సాహిత్యాల గురించి పెద్దగా చదువుకున్నదీ, తెలుసుకున్నదీ ఏమీ లేదు. వాళ్ళల్లో అత్యధికసంఖ్యాకులు యువకులు. ఇటీవలి దశాబ్దాల్లో పుట్టినవారు కాబట్టి వీళ్ళకి భారత జాతీయోద్యమం గురించీ, ఆ ఉద్యమంలో ప్రజల్ని సంఘటితం చేసిన మహత్తర ఆదర్శాల గురించీ పెద్దగా తెలియదు.

మన పాఠశాలలు కూడా పిల్లలకి ఒక సమగ్ర చారిత్రికదృష్టినీ, వైజ్ఞానికదృష్టినీ అలవర్చడంలో వెనకబడి పోయాయి. సినిమాలూ, రాజకీయనాయకులూ, ప్రవచన కర్తలూ, వాట్సపు సందేశాలూ చెప్పేదానికి మించి వీళ్ళల్లో చాలామందికి భారతదేశమంటే ఏమిటో తెలియదు. భిన్నత్వంలో ఏకత్వమంటే ఏమిటో తెలియదు.

రాజ్యాంగ ఆదర్శాల గురించిన కనీస పరిజ్ఞానం కూడా లేదు వీళ్లకి.

కానీ, ఇప్పుడు విద్య, ఉద్యోగ అవకాశాల వల్ల బయటికి వెళ్ళినప్పుడు అక్కడ తమ దేశం గురించీ, జాతి గురించీ చెప్పుకోడానికి రకరకాల నెరేటివులని ఆశ్రయించ-వలసి వస్తోంది. ఈ కథనాల వల్ల ఒక కృత్రిమజాతీయత రూపొందుతూ ఉంది. అంటే భారతదేశం ప్రాచీనకాలంలో చాలా గొప్పదేశమనీ, అన్ని శాస్త్రాలూ ఇక్కడే పుట్టాయనీ, ఈ రహస్యాలన్నీ విదేశీయులు పట్టుకుపోయి తామే కనిపెట్టామని చెప్పు-కుంటున్నారనీ, ఇలాంటివే రకరకాల కథనాలు.

మరొకవైపు ఇంతదాకా నిద్రాణంగా ఉన్న ప్రజాసమూహాలు, నిరాదరణకు గురైన సమూహాలు అక్షరాస్యత వల్లా, కొత్త విద్యావకాశాల వల్లా ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వాల వైపు చూస్తున్నారు. అంతిమంగా ఇదంతా ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు సంబంధించిన సమస్య. దీన్ని మనం ఎంతో విజ్ఞతతో, దూరదృష్టితో, ప్రణాళికాబద్ధంగా పరిష్కరించుకోవచ్చు. కానీ ఆధునిక జాతీయరాజ్యాలకి అటువంటి పాలనాపరమైన సమర్థత లేదు. అందుకని అవి ప్రతి వలసనీ రాజకీయదృష్టితో చూడటం, రాజకీయంగా ఎదుర్కోడమే సులభమని అనుకుంటున్నాయి.

ఈ సమస్యల్ని పరిష్కరించడానికీ, అభివృద్ధి వ్యూహాలు రచించి అమలు పర్చడానికీ జాతిమొత్తాన్ని భాగస్వామ్యం చేయడానికి బదులు, మతాన్నో, కులాన్నో, ప్రాంతాన్నో అడ్డంకిగా చూపిస్తున్నాయి. ఒకప్పుడు ఈ భేదాలన్నీ మరిచి జాతిమొత్తం ఒకటిగా విదేశీపాలన మీద పోరాటం చేసింది. కాని ఇప్పుడు ఆ జాతీయనాయకుల్ని సంకుచిత దృష్టి కలిగినవాళ్ళుగానూ, స్వార్థపరులుగానూ, బలహీనులుగానూ, జాతి ప్రయోజనాల్ని తాకట్టుపెట్టిన వాళ్ళుగానూ చిత్రించే కొత్త జాతీయవాదం ఒకటి మనకళ్ళముందే బలపడుతున్నది.

అంటే ఏమిటి? ఒకప్పుడు పారిశ్రామికీకరణవల్ల వలసదేశాల్లో జాతీయవాదం మొదలైనట్టే, ఇప్పుడు గ్లోబలైజేషను వల్ల కొత్త జాతీయవాదం ఒకటి మొదలయ్యిందన్న మాట. దీనికి రెండు పార్శ్వాలున్నాయి. ఒకటి ఇది స్వదేశంలో తలెత్తుతున్న వివిధ రకాల micro-identities ని సాంస్కృతికంగా అణచివెయ్యాలని చూడటం. మరొక

వైపు విదేశాల్లో ఒక కృత్రిమ జాతీయతాస్ఫూర్తిని ప్రచారం చేయడం. ఇది భారతదేశానికి మాత్రమే పరిమితమైన ధోరణి కాదు, దాదాపుగా ఆసియా దేశాలన్నిటిలోనూ ఈ కొత్త ధోరణి కనిపిస్తూ, చాలా దేశాల్లో ఇది మతపరమైన ఛాందసవాదంగా రూపు దిద్దుకుంటూ ఉంది. మరొకవైపు పశ్చిమ దేశాల్లో కూడా ఇటువంటి పరిణామమే మొదలయ్యింది. ఆసియా, ఆఫ్రికా దేశాలనుండి తమ దేశాలకు వలసలు వస్తున్నవారివల్ల తమ ఉపాధి అవకాశాలు పోతున్నాయనే ఉద్దేశ్యంతో ఆ దేశాల్లో కూడా ఒక మూర్ఖ జాతీయతావాదం మొదలయ్యింది.

మొత్తం మీద ఇరవయ్యవశతాబ్దంలో ప్రపంచమంతటా దేశాలు సామాజిక విముక్తి కోసం, ఆర్థికాభివృద్ధికోసం వామపక్ష భావజాలం వైపు చూడగా, ఇరవై ఒకటవ శతాబ్దంలో దాదాపుగా ప్రపంచమంతా కూడా కుడివైపు చూడటం మొదలుపెట్టింది. ప్రపంచ కార్మికులు ఏకం కావడానికి బదులు, ప్రపంచ పెట్టుబడిదారులూ, ఫండమెంట-లిస్టులూ ఏకమవుతున్నారు.

గ్లోబలైజేషను మానవచరిత్రలో కొత్తది కాదు. కాని ఈ పాత గ్లోబలైజేషన్లతో పోలిస్తే ఈ కొత్త గ్లోబలైజేషను ప్రత్యేకత ఎక్కడ ఉందంటే, సమాచార వ్యాప్తిలో సాధించిన అనూహ్యవేగం. ప్రపంచంలో ఒక మూలనుంచి మరొక మూలకి సమాచారం తక్షణమే ప్రసారం కాగల అత్యధిక సాంకేతికపరిజ్ఞానం ఈ రోజు అందుబాటులోకి వచ్చింది. ఒకప్పుడు జాతీయోద్యమకాలంలో జాతీయవాదనాయకులు అప్పటి ప్రింటింగు ప్రెస్సు, పోస్టు, టెలిగ్రాఫు, రైల్వే లాంటి సాధనాల్ని వాడుకుని జాతీయతాభావాల్ని వ్యాప్తి చెయ్య-గలిగారు. ఇప్పుడు ఈ సరికొత్త సాంకేతిక సాధనాల్ని వాడుకుని ఈ తీవ్ర జాతీయతా వాదులు కృత్రిమకథనాల్నీ, ఛాందససంస్కృతినీ అత్యంత వేగంగా వ్యాప్తిలోకి తెస్తున్నారు.

ఒక్కమాటలో చెప్పాలంటే, ఒకవైపు గ్లోబలైజేషను మొత్తం ప్రపంచాన్ని ఒక కుగ్రామంగా మారుస్తుండగా, ఎక్కడికక్కడ ఈ ఛాందస జాతీయవాదులు దేశాలకీ, సమూహాలకీ, చివరికి మనుషులకీ, మనుషులకీ మధ్య గోడలు కడుతున్నారు, మామూలుగా కాదు, మెరుపు వేగంతో.

ఇలా గోడలు కట్టడానికి భారతదేశ పాలకశక్తులు అనుసరిస్తున్న విధానం మన దేశం గతంలో చాలా గొప్పదని పదే పదే చెప్తూ ఉండటం. అలా చెప్పటానికి చరిత్రనీ, సైన్సునీ కాక పురాణాల్ని ఆధారం చేసుకోవడం. సాహిత్యం, సంగీతం, కళలు, విజ్ఞానం నిర్వహించవలసిన పాత్రను మతానికి అప్పగించడం. చిత్రమేమిటంటే యూరోపులో ఫ్యూడలు సంస్కృతిని ధిక్కరించిన బూర్జువాజీ మతానికి వచ్చేటప్పటికి ప్రొటెస్టంటు వైఖరి తీసుకుంది. కాని ఇక్కడ భారతదేశంలో బలపడుతున్న పెట్టుబడిదారీ శక్తులు మాత్రం ఛాందసవాదాన్ని ప్రోత్సహిస్తున్నాయి. కారణం సుస్పష్టమే. మతం పట్ల ఎంత ఛాందస వైఖరిని ప్రోత్సహిస్తే ప్రజల్ని అంతగా విడదీసి పాలించగలుగుతారు.

కానీ మానవచరిత్ర దశాబ్దాల లెక్కకో, చివరికి శతాబ్దాల లెక్కకో కుదించగలిగేది కాదు. అది సహస్రాబ్దాల లెక్కలో అర్థం చేసుకోవలసింది. మనం ఈ రోజు అట్లాసులో చూస్తున్న ఈ ఖండాలు ఎల్లప్పుడూ ఇలానే లేవనీ, ఈ దేశాలూ, ఈ సరిహద్దులూ ఎప్పటికప్పుడు మారుతూనే ఉన్నాయనీ, ఈ రోజు భారతదేశంతో సహా ఎన్నో జాతీయ రాజ్యాలు భావిస్తున్నట్టుగా వాటి జాతి చరిత్ర అవి గీసుకున్న సరిహద్దులకే పరిమితంగా లేదనీ, నిజానికి మనం కట్టుకుంటున్న గోడలేవీ ఒకప్పుడిలా లేవనీ, ఇప్పుడు కూడా ఈ గోడలిలానే శాశ్వతంగా నిలబడిపోయేవి కావనీ మనం గ్రహించవలసి ఉంటుంది.

మన్వంతరాల చరిత్రలో మానవుడు ఈ వసుధ మొత్తాన్ని ఏకకుటుంబంగా భావించాడనీ, ఎక్కడో సుదూరప్రాంతానికి చెందిన మానవసమూహాలు మరెక్కడో సుదూర ప్రాంతానికి పోయి అక్కడ నాగరికతలు నిర్మించాయనీ ఈ రోజు ఎన్నో ఆనవాళ్ళు లభిస్తున్నాయి, సాక్ష్యాలు వినిపిస్తున్నాయి. ప్రపంచంలో ఏ ఒక్క దేశం కూడా తన సంస్కృతి, తన సాహిత్యం, తన సాంకేతికత పూర్తిగా తన ఘనత మాత్రమే అనుకోడానికి లేదనీ, మానవుడు ఏ దేశంలో ఉన్నా అతడు సాధించిన ప్రతి విజయం లోనూ ప్రపంచమానవులందరి పాత్రా ఉందని మనం ఒప్పుకోవలసి ఉంటుంది.

ఇదే మాట మన జన్యు వారసత్వం గురించి కూడా చెప్పుకోకతప్పదు. ఇప్పుడు ఈ నేలమీద నడయాడుతున్న ప్రతి ఒక్క మానవుడూ, ఇంతదాకా ఈ పృథ్వి మీద సంచరించిన ప్రతి ఒక్క మానవుడికీ జన్యుపరంగా వారసుడేనన్నది ఒక వైజ్ఞానిక

సత్యం. ఇంత కొట్టొచ్చినట్టుగా మన ముందు బయటపడుతున్న మానవుడి గతాన్ని చూడటానికి ఇష్టపడకుండా, ఇంకా శుద్ధ జాతులూ, శుద్ధరక్తమూ, శుద్ధ సంస్కృతీ ఉంటాయనుకోవడం సాంస్కృతిక అంధత్వం మాత్రమే.

ఇటువంటి గుడ్డితనం ఎవరో ఒకరిద్దరు వ్యక్తులకి ఉండటం వేరు, ఒక జాతి అత్యధికభాగం ఇటువంటి కథనాల్ని చెప్పుకుంటూ తనని తాను నమ్మించుకోడం వేరు. ఇది అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి. తాను బలపడుతున్నానుకుంటూ నిజానికి ఒక జాతి దుర్బలమైపోతున్న ప్రక్రియ ఇది. ఈ నేపథ్యంలో భాస్కరంగారి పుస్తకాన్ని మనం అర్థం చేసుకోవలసి ఉంటుంది.

ఆయనిలా కూడా అంటున్నారు:

> అలాగని నేను సరిహద్దుల వాస్తవికతను నిరాకరించడం లేదు. సరిహద్దుల స్పృహలేని, భిన్నమైన సరిహద్దులు కలిగిన ఒకనాటి ప్రపంచాన్ని అర్థం చేసుకోడానికి, కాసేపు నేటి సరిహద్దుల స్పృహని పక్కన పెట్టాలని చెప్పడమే నా ఉద్దేశ్యం... ఇలాంటి ప్రపంచ అనుభవాలను స్మరించుకునేటప్పుడు దేశాల సరిహద్దుల్ని కాసేపు మర్చిపోవాలి. అప్పుడు మాత్రమే పాక్షికజ్ఞానం, లేదా తప్పుడు జ్ఞానం మన కంటికి కప్పిన పొరలను తప్పించుకుని చూడగలుగుతాం.

ఆ పాక్షిక జ్ఞానం అంటే ఏమిటో కూడా ఆయనొకచోట ఇలా స్పష్టంగా చెప్తున్నారు:

> వీటితో పాటు వాఙ్మయాన్ని కూడా కలుపుకున్నప్పుడు ప్రాచీన వారసత్వం అని మనం దేనినంటున్నామో అదంతా కేవలం ఈ పదకొండువేల సంవ-త్సరాల కాలంలో ఇమిడిపోతుందని పురాచరిత్రకారులు, మానవశాస్త్ర వేత్తలు, అంటే ఆశ్చర్యంగా ఉంటుంది. ఎందుకంటే మానవగతాన్ని కల్పాలు, మన్వంతరాలు, యుగాలు వగైరా పేర్లతో లక్షలాది సంవత్సరాల పరిణామంలో ఊహించుకోడాన్ని మతమూ, దానికి సంబంధించిన వాఙ్మయమూ మనకు అలవాటు చేసాయి. ఇప్పుడాలోచిస్తే, నేత్రభ్రాంతిలానే అది కూడా మెదడు చేసే మాయగా తోస్తుంది.

# 3

మనం ఒక విషయాన్ని స్పష్టంగా గమనించాలి. మన జాతీయోద్యమ కాలంలో కూడా పాశ్చాత్యప్రభావానికి ప్రతిక్రియగా మతఛాందసవాదాలు పుట్టుకొచ్చాయి. అవి హిందూ, ముస్లిం మత ఛాందసవాదాలుగా బలం పుంజుకున్నాయి. కాని అత్యధిక సంఖ్యాకులైన భారతీయ ప్రజానీకం, అప్పటికి బ్రిటిషు ఇండియా పాలనలోలేనివారితో సహా, ఛాందస వాదాలకన్నా భిన్నమైన విశాల దృక్పథాన్ని కనపరిచారు. వలసపాలనమీద తమ పోరాటం నలుగురినీ కలుపుకుపోయేదిగా ఉండాలని కోరుకున్నారు. తాము రాసుకున్న రాజ్యాంగం కూడా అలానే సమానత్వ, సౌభ్రాతృత్వ ప్రాతిపదికల మీద రాసుకున్నారు. కాని మతఛాందస వాదాలు కలిగించిన నష్టం కూడా ఏమీ తక్కువకాదు. దేశవిభజనవల్ల జరిగిన అంతఃకలహాలతో పాటు మహాత్ముణ్ణి బలితీసుకున్నాయవి.

ఈ గతాన్ని దృష్టిలో పెట్టుకుని చూస్తే, ఇప్పుడు బలం పుంజుకుంటున్న కొత్త జాతీయవాదం జాతీయోద్యమ కాలంలాగా inclusive కాదనీ, స్వభావరీత్యానే అది exclusive అనీ గ్రహించడానికి మనకి పెద్ద పరిజ్ఞానమేమీ అక్కర్లేదు.

జాతీయోద్యమ నాయకులు భారతదేశ చరిత్రలో ప్రతి ఒక్కరి పాత్రనీ గుర్తించారు. వారికివ్వవలసిన స్థానాన్ని ఇవ్వడానికే నిజాయితీగా ప్రయత్నించారు. కానీ కొత్త జాతీయ వాదులు అటువంటి విశాలదృక్పథాన్ని స్వాగతించరు సరికదా, అటువంటి విస్తృత దృక్పథాన్ని సహించలేరు కూడా. తమ అసహనాన్ని ప్రకటించడానికి వారికున్న అనేక సాధనాల్లో కృత్రిమకథనాల్ని ప్రచారం చేయడం కూడా ఒకటి. ముఖ్యంగా భారతదేశ చరిత్ర గురించి వాళ్ళు శాస్త్రీయ దృక్పథానికి బదులు పౌరాణిక దృక్పథాన్ని ప్రచారం చేస్తారు. ఎందుకంటే, ప్రజల్ని ఉద్రిక్తుల్ని చేయడానికి fact కన్నా fiction ది దగ్గరి దారి అని వాళ్ళ నమ్మకం.సరిగ్గా ఈ వరదకు ఎదురీదుతూ భాస్కరం గారు ఈ పుస్తకం రాసారని చెప్పవచ్చు. ఇది సాహసమే కాని ఎంతో అవసరం. ఆయనిలా అంటున్నారు:

> ఒక్కోసారి రాజకీయం తన హద్దును, తూకాన్ని దాటిపోయి సంస్కృతి, సాహిత్యం, శాస్త్రవిజ్ఞానం తదితర జ్ఞాన రంగాలను కూడా తన పరిధిలోకి

తెచ్చేసుకుని, రాజకీయాన్నీ వాటినీ కలగాపులగం చేసి సర్వం తానే అవడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. .. ప్రతి సాహిత్యకారుడూ, ఇతర మేధారంగాలకు చెందిన ప్రతి రచయితా తన ఆలోచనాసరళి వైపు జనాన్ని ఆకర్షించుకునే వ్యూహంతోనే రచన చేస్తాడు. రాజకీయ జీవి అధికారం కోసం మరికొన్ని కూడా చేస్తాడు. అవి జనం సెంటిమెంట్లను వాడుకోవడం, అందుకోసం అబద్ధాలను ఆశ్రయించడం, లేదా సత్యాన్ని కప్పి పుచ్చడం మొదలైన రూపాల్లో ఉంటాయి. రాజకీయానికి సమాంతరంగా జ్ఞాన రంగానికి ఉన్న ప్రాముఖ్యాన్ని, దాని స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్ని గుర్తించి దాని ఉనికిని ఎప్పటికప్పుడు పటిష్టం చేసుకోవడమే రాజకీయ స్వైరవిహారానికి విరుగుడు.

కాబట్టి ఈ రచన సత్యాన్వేషణ దృష్టితో చేసిన కృషి అని గుర్తుపెట్టుకోవాలి. ఇందుకు గాను భాస్కరంగారు ఆధునిక, సమకాలిక జన్యుశాస్త్ర పరిశోధనల్ని తన ముడిసరుకుగా తీసుకున్నారు. ఎందుకంటే ఆయనే ఒక చోట రాసినట్టుగా 'జనశాస్త్ర-మంటే జన్యుశాస్త్రమే.'

## 4

ఒక ప్రాంతం నుంచి వలసపోయినవాళ్ళో లేదా అక్కడికి వలస వచ్చినవాళ్ళో మాత్రమే అక్కడి చరిత్రని నిర్మించారని భాస్కరం గారు ఈ రచనలో ఎక్కడా రాయలేదు. ఆయన చెప్తున్నదల్లా ఏమిటంటే, ఏ దేశ చరిత్రనైనా కేవలం ఆ దేశీయులు మాత్రమే నిర్మించారను కోకండి, అది బహుళ జాతుల సంస్కృతుల ఆదానప్రదానాలతో నిరంతరం సంభవి-స్తూండే ఒక ప్రక్రియ అని మాత్రమే. అలాగే, శుద్ధమైన జాతి అంటూ ఏదీ లేదనీ, అలా ఉంటుందనుకుని తమ దేశం చుట్టూ సాంస్కృతికంగా గోడలు కట్టుకోవడం మూర్ఖత్వం మాత్రమే కాదు, ప్రమాదకరమని కూడా ఆయన చెప్తున్నారు.

మన జాతీయోద్యమ నాయకులకి ఈ వివేకం ఉంది. కాబట్టే వారు భారతదేశ చరిత్ర రాసినప్పుడు, ఈ దేశం మీద దండయాత్ర చేసిన ప్రతి జాతీ, ప్రతి ఒక్క

మతం, ప్రతి ఒక్క తెగ ఈ దేశానికి సాంస్కృతికంగా ఎంతో ఉపాదానం అందించారనే గుర్తుపట్టారు, ఆ సత్యాన్నే రాసిపెట్టారు కూడా.

ఇటువంటి వివేకం అప్పటిరోజుల కన్నా ఇప్పుడు ఎక్కువ అవసరం. లేకపోతే నీలాగా మాట్లాడనివాడు, నీలాగా గుడ్డలు తొడుక్కోనివాడు, నువ్వు తినే తిండి తినని వాడు, నువ్వు పూజించే దేవుణ్ణి పూజించనివాడు ప్రతి ఒక్కడూ శత్రువేనని కొత్త జాతీయవాదులు చెప్పే మాటలే నిజమని కొత్తభారతదేశం నమ్మే ప్రమాదం చాలా ఉంది.

## 5

మరో విషయం కూడా స్పష్టంగా చెప్పాలి. ఈ రచన జెనెటిక్సుని ఆధారం చేసుకుని మొదలుపెట్టినా కేవలం జెనెటిక్సు సమాచారానికి మాత్రమే పరిమితం కాలేదు. ముందే చెప్పినట్టుగా ఇదొక మల్టి డిసిప్లినరీ అధ్యయనం. ఇందులో జన్యుశాస్త్ర పరిశీలనలతో పాటు, పురావస్తు, మానవశాస్త్ర పరిశీలనలతో పాటు, తులనాత్మక భాషాశాస్త్రం, మైథాలజీ, వేద, పురాణ, ఇతిహాసాల పరిశీలనలతో పాటు, సంస్కృత, తెలుగు సాహిత్యాలనుంచి కూడా ప్రస్తావనలు ఉన్నాయి. ఈ ఒక్క గ్రంథం చదివితే ఎన్నో గ్రంథాలు చదివినట్టు.

సాధారణంగా ఏదైనా ఒక రంగంలో కొన్నేళ్ళ పాటు, అంటే ఉదాహరణకి, ఏ పదేళ్ళ పాటో వచ్చిన అధ్యయనాల్ని చదివి వాటిని సమీక్షిస్తూ ఒక పుస్తకమో, పత్రమో వెలువరించే పని కొందరు చేస్తుంటారు. ప్రభుత్వాలో, అంతర్జాతీయ సంస్థలో, స్వచ్ఛంద సంస్థలో ఒకరిద్దరు నిపుణుల్ని ఎంచుకుని వారికి ఇలాంటి పని అప్పగిస్తారు. విద్యకి, అభివృద్ధికి సంబంధించిన అటువంటి అధ్యయనాలు నేను కొన్ని చూడకపోలేదు. కానీ అటువంటి పత్రాల్లో అప్పటిదాకా వచ్చిన అధ్యయనాల సారాంశాన్ని క్రోడీకరించడమే ఉంటుంది తప్ప, ఆ సమాచారం ఆధారంగా కొత్త ఊహాగానాలకు తెరతీయడం గానీ లేదా పూర్వపు పరిజ్ఞానాల్ని సవరించడం గాని ఉండదు. కానీ ఈ అధ్యయనంలో భాస్కరంగారు ఎన్నో హైపోథీసిసులు మనముందుంచడమే కాక, మన సంస్కృతి,

చరిత్రలకు సంబంధించిన ఎన్నో చిక్కుముళ్ళు విడిపోవడానికి అవసరమైన తాళం చెవులు కూడా ఈ పుస్తకంలో పొందుపరిచారు.

ఒకటి, ఆయన స్వయంగా పండితకుటుంబం నుంచి వచ్చిన వారు కావడంవల్లా, భారతీయ సంస్కృతికి మూలగ్రంథాలు అని చెప్పదగ్గవాటిని క్షుణ్ణంగా అధ్యయనం చేసినందువల్లా ఇది సాధ్యపడిందని చెప్పవచ్చు. రెండోది, ఏళ్ళ తరబడి ఆయన ఎంతో సమర్థవంతంగా నిర్వహించిన పాత్రికేయవృత్తి ఆయనకు సమకాలిక ప్రపంచం గురించీ, భారతీయ సామాజిక పరివర్తన గురించీ ప్రత్యక్ష పరిజ్ఞానాన్ని అందించడం మరోకారణం.

వీటికి తోడు, సత్యం పట్ల ఆయన కున్న ప్రీతీ, గౌరవమూ నిరుపమానమైనవి. తనకి తోచింది సత్యమని తెలుస్తున్నప్పుడు ఆయన తాను ఇంతదాకా ఏ నమ్మకాల్ని ఆధారం చేసుకుని నిలబడ్డారో ఆ నమ్మకాల్ని పక్కకు నెట్టేయడానికి ఏ మాత్రం సంకోచించరు. మనిషిగా, సత్యాన్వేషిగా భాస్కరం సంస్కారం అత్యున్నతమైంది కాబట్టే ఈ రచన కూడా ఇంత అద్వితీయంగా రూపొందింది అని నమ్ముతున్నాను.

ఆయనకు తెలుగు జాతి ఏమిచ్చి ఋణం తీర్చుకోగలదు? కాని తనముందర నడిచి వెళ్ళిన జిజ్ఞాసువుల్లానే తాను కూడా సత్యం తెలుసుకోవడం కోసమే ఈ యాత్ర చేపట్టారు. కాబట్టి మరింత మంది సత్యాన్వేషులు ఈ పరిశోధనను అందిపుచ్చుకుని ముందుకు వెళ్లడమే మనం ఆయనకివ్వగల బహుమానం.

20-11-2023

# పురాణపాత్రలపై కొత్తవెలుగు

**రావెల** సోమయ్యగారు, అరుణగారు నేను జీవితంలో చూసిన అత్యున్నత సంస్కార వంతుల్లో మొదటివరసలో వస్తారు. వారి స్నేహశీలత, జ్ఞానం పట్ల తృష్ణ, మనుషుల పట్ల గౌరవం నాకు ఎంతో ఆరాధనీయంగా గోచరిస్తాయి. అన్నిటికన్నా ముఖ్యం కొత్త విషయాలు తెలుసుకోవడం పట్ల వారికి ఉండే కుతూహలం, అలా తెలుసుకునేవాటిపట్ల వారికుండే openness తక్కినవాళ్ళల్లో అంత సులభంగా కనిపించేవి కావు.

ఈ సంస్కారం, ఈ openness వారికి బహుశా పుట్టుకతోటే వచ్చి ఉండవచ్చు, కాని వారిలో వాటిని ప్రోజ్వలంగా నిలబెట్టినవాడు మాత్రం లోహియా అనే చెప్పాలి. వారిద్దరికీ రామ్‌మనోహర్ లోహియా మిత్రుడు, గురువు, మార్గదర్శకుడూనూ.

సోమయ్య గారి జీవితంలో లోహియా ఎంతగా భాగమైపోయాడంటే ఆయన తన కొడుక్కి మనోహర్ అనే పేరు పెట్టుకున్నారు. తాను ఎమర్జెన్సీ రోజుల్లో అజ్ఞాతవాసంలో ఉన్నప్పుడు ఎక్కడైనా హొటల్లో తలదాచుకోవలసి వస్తే తన పేరు మనోహర్ అని రాసుకునేవారు. ఒక మనిషి తన స్నేహితుడిని ఇంత ప్రాణప్రదంగా దగ్గరకు తీసుకున్న ఉదాహరణలు నాకు తెలిసి మరొకటి కనిపించడం లేదు.

‘మా లోహియా ఏమి రాసినా నాకు నచ్చుతుంది’ అన్నారు సోమయ్యగారు ఒకసారి నాతో. అది లోహియాలోని openness వల్ల. అన్నిటికన్నా ముందు openness ని ఒక విలువగా గుర్తించడాన్ని లోహియా సోమయ్యగారికి నేర్పినందువల్ల. నాకు సోమయ్యగారు 1995 లో పరిచయం. దాదాపు మూడు దశాబ్దాలు కావొస్తోంది. వారితో స్నేహం ఏర్పడ్డాక వందసార్లేనా వారి ఇంటికి వెళ్లి ఉంటాను. ఆయన ఎన్నో సార్లు మా ఆఫీసుకు వచ్చారు, మరెన్నో సార్లు మేము ఏ సమావేశాల్లోనో కలుసుకున్నాం. జీవిత ప్రథమార్థంలో నాస్తికులుగా ప్రయాణం మొదలుపెట్టిన ఆ దంపతులు, భారతీయ ఇతిహాసాల గురించి, పురాణాల గురించి, ఋషుల గురించి, దర్శనాల గురించి నన్ను అడిగే ప్రశ్నలు, వాటి గురించి ఇంకా తెలుసుకోవలసింది చాలా మిగిలిపోయిందనే sense of urgency తో వారు చేసే సంభాషణలు నన్నెంతో ఆశ్చర్యానికి లోను చేస్తుంటాయి.

భారతదేశం తన గురించి తాను తెలుసుకోవలసింది చాలానే ఉందనీ, అది ఒకవైపు మన గతం, మన సంస్కృతి, మరొకవైపు మన గ్రామాలు, మన ప్రజలు అని సోమయ్య గారి నమ్మకం. అందుకనే ఆయన మన పురాణాల గురించి లోహియా రాసిన కొన్ని వ్యాసాల గురించి చాలా సార్లు నాతో పదే పదే చెప్పేవారు. అవి హిందీలోనే ఉండిపోయి, ఇంగ్లిషు లోకి రానందువల్ల తెలుగులోకి రాకుండా ఉండిపోయాయి. అందుకని, ఇప్పుడు, సోమయ్య గారు తన 87 ఏళ్ళ వయసులో ఆ వ్యాసాల్ని తన మిత్రులకి ఇచ్చి తెలుగులోకి అనువదింప చేసి పుస్తకరూపంగా వెలువరించారు. ఆ పుస్తకాన్ని నిన్న జవహర్‌లాల్ జాతీయ విశ్వ విద్యాలయం ఆచార్యులు ఆనందమోహన్ ఆవిష్కరించి ప్రసంగించారు. ఆ సభలో సుప్రీం కోర్టు పూర్వన్యాయమూర్తి సుదర్శనరెడ్డి, రామచంద్రమూర్తి, భాస్కరం, నాగసూరి వేణు గోపాల్, రావెల సాంబశివరావు, అవధానం రఘుకుమార్‌లు కూడా ప్రసంగించారు. ఆ సభకి అధ్యక్షత బాధ్యత సోమయ్య గారు నాకు అప్పగించారు.

‘పురాణ పాత్రలపై కొత్త వెలుగు’ అనే పేరిట వెలువరించిన ఆ పుస్తకంలో లోహియా రాసిన అయిదు వ్యాసాలు ఉన్నాయి. ద్రౌపది, సావిత్రి పాత్రల పరిశీలన, కృష్ణుడి పైన విశ్లేషణ, రాముడి, కృష్ణుడి, శివుడి అమేయవ్యక్తిత్వాల ప్రశంసలు ప్రధానవ్యాసాలు.

1957 లో లోహియా ఉత్తరప్రదేశ్‌లో సత్యాగ్రహం చేసి జైలుకు వెళ్ళిన సందర్భంలో అప్పటి జైళ్ళ శాఖామంత్రి, పండితుడు సంపూర్ణానంద్‌కు రాసిన ఒక సుదీర్ఘలేఖతో పాటు, 1961 లో చిత్రకూటంలో రామాయణ తిరునాళ్ళు జరపడానికి చేసిన సన్నాహాల వ్యాసం కూడా ఉన్నాయి. ఈ అయిదువ్యాసాలమీదా అయిదుగురి పరిశీలనాత్మక ప్రశంసలతో పాటు, మొత్తం పుస్తకానికి కల్లూరి భాస్కరంగారు రాసిన సమగ్రమైన, సుదీర్ఘమైన పరిచయవ్యాసం కూడా ఉంది. ఈ పుస్తకాన్ని వివేకానందుల స్మృతికి అంకితమిచ్చారు.

ఇందులో లోహియా రాసిన అయిదు వ్యాసాలూ భారతరామాయణాల పట్ల జీవిత కాలం మననం చేస్తూ ఉన్న భావుకుడు రాసినవి. అందులోనూ కృష్ణుడి పైన రాసిన వ్యాసం వట్టి వ్యాసం కాదు. అది ఒక కవి మాత్రమే రాయగల వ్యాసం. లోహియా ఒక మీరాగా, ఆండాళుగా ఒక స్త్రీగా మారి రాసిన వ్యాసం. ఈ అయిదు వ్యాసాల్లోనూ పురాణాలపైన నిజంగానే కొత్త వెలుగు ప్రసరిస్తోంది.

కాని ఆ వెలుగు ఒక విద్యార్థి వెతుక్కునే వెలుగునో లేదా ఒక భక్తుడు కోరుకునే వెలుగునో కాదు. సమకాలిక భారత రాజకీయ ప్రస్థానాన్ని ఎంతో దగ్గరగా గమనించే ఏ సామాజిక, రాజకీయవేత్తకైనా సరే తటిల్లున గోచరించే వెలుగు. ఆ వ్యాసాల్లో చర్చించింది అయిదువేల ఏళ్ళ కిందటి పురాణస్త్రీపురుషుల గురించి కాదు, సమకాలిక రాజకీయశక్తుల గురించి అని అర్థమవుతుంది.

లోహియా ఈ వ్యాసాలు రాసి అరవై ఏళ్ళకు పైనే కావొస్తున్నది గాని, ఆ రోజు రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు ఆ వ్యాసాల్లోని ప్రాసంగితకను గుర్తించి ఉంటే, తమ విధానాలను తాము సరిదిద్దుకుని ఉంటే, ఈ రోజు భారతదేశ రాజకీయ పరిస్థితి ఇలా ఉండేది కాదు అని అనిపిస్తుంది.

ఉదాహరణకి, లోహియా తలపెట్టిన రామాయణమేళా సంగతే చూడండి. ఆ మేళా గురించిన ఆయన తలపులు, ఏర్పాట్లు, చర్చనీయాంశాలు, ప్రజలకీ, ప్రభుత్వాలకీ విజ్ఞప్తులు, చివరకు ఏ ఒక్కరూ కలిసి రాక ఆయన ఆ మేళా ఆలోచన విరమిస్తూ రాసిన మాటలు చూడండి. నాకైతే ఆ మొత్తం వ్యాసమంతా ఒక విషాదాంత రూపకంగా

కనిపించింది. అసలు లోహియా రామాయణమేళా జరపడానికి చిత్రకూటాన్ని ఎంచుకోవడంలోనే రామాయణ రహస్యమూ, రాజకీయ వివేకమూ కలగలిసి ఉన్నాయి.

రామాయణమంతా చదివినప్పుడు మనకి రాముడు అపారమైన సంతోషాన్ని అనుభవించింది అయోధ్యలోనో, పంచవటిలోనో, తాను జయించిన లంకలోనో కాదనీ, అది రెండే చోట్ల- చిత్రకూటం దగ్గరా, పంపాసరస్సు దగ్గరా- అని తెలుస్తుంది. అన్నిటి కన్నా పంపాతీరాన్ని ఆయన ఎంతో ఇష్టపడ్డాడుగాని, అప్పుడు ఆయన పక్కన సీతలేదు. సీతతో కలిసి అడవిలో గడిపిన మరొక ఆనందధామం చిత్రకూటం. అక్కడ సీతారాముల విహారానికి ప్రకృతి మొత్తం పరవశించింది. అంతేనా? రాముణ్ణి వాల్మీకి 'గిరివన ప్రియుడు' అన్నాడు. అంటే కొండల్నీ, కోనల్నీ ప్రేమించేవాడని. కొండకోనల్ని ఇష్టపడే రాముడి గురించి చిత్రకూటం దగ్గర మాట్లాడుకోవడంలో ఎంత ఔచిత్యం ఉంది!

ఎంత రసమయభావన అది! అంతేనా? రామాయణ గానవేదికగా రామ్‌మనోహర్ లోహియా చిత్రకూటాన్ని ఎంచుకోవడంతో అయోధ్య మరుగునపడిపోలేదా! ఆ రోజు ఆయన తలపెట్టినట్టుగా రామాయణ మేళా చిత్రకూటంలో జరిగి ఉంటే తర్వాత రోజుల్లో అయోధ్యలో రామాలయం కట్టాలనే ఆ రాజకీయ తహతహకు అధికసంఖ్యాకుల మద్దతు లభించి ఉండేది కాదు కదా. రాముడుండేది రామకథాశ్రవణం జరిగేచోటతప్ప ఒక మసీదు కింద కాదని ప్రజలు సులభంగా గ్రహించి ఉండేవారు కదా. లోహియా ప్రతిపాదనలోని దీర్ఘదృష్టి, రాజకీయ వివేకాల్ని ఆనాటి పాలకులు గ్రహించని దాని పర్యవసానం 1992 నుంచి 2022 దాకా మనం చూస్తూనే ఉన్నాం.

Myth గురించి మాట్లాడేటప్పుడు మనుషులు అది ఎప్పుడో పురాణకాలంలో తలెత్తి కాలం చెల్లిపోయిన విషయంగా భావిస్తుంటారు. లేదా దాన్ని సైన్సుతో పోటీకి పెట్టి, సైన్సు రావడంతో మిత్ అవసరం తీరిపోయిందని వాదిస్తారు. కాని మిత్ ever recurrent. అది ఎప్పటి సామాజిక-రాజకీయ అవసరాలకు తగ్గట్టుగా అప్పటికప్పుడు రూపం మార్చుకుని మళ్ళా ప్రత్యక్షమవుతూనే ఉంటుంది. సైన్సు వల్ల మిత్ పక్కకు తప్పుకోదు సరికదా, టెక్నాలజీ వల్ల మిత్‌కి కొత్త అభివ్యక్తి రూపాలు దొరుకుతూనే ఉంటాయి. ప్రాకృతిక రహస్యాల్ని విప్పిచెప్పేదిగా ఒకప్పుడు మిత్‌ని భావించి ఉండవచ్చు.

ఇప్పుడు సైన్సు సమర్థవంతంగా ఆ పని చేస్తున్నది కాబట్టి మిత్ అవసరం తీరిపోయిందంటారు కొందరు. కాని మానవప్రకృతి మాట? అందుకనే మిత్ గురించి రాస్తూ ఒక విశ్లేషకుడు అన్నాడు:

> Myth and ritual are ways of coping not with nature but with human nature-with human aggression. (Robert A Segal, Myth, A Very Short Introduction, Oxford, p.117)

పురాణాలకు సంబంధించి ఇప్పుడు రెండు వైఖరులు బలంగా ఉన్నాయి. ఒక వైఖరి పురాణాల అర్థాన్ని ఎప్పటికప్పుడు స్థిరపరిచే ప్రయత్నం చేస్తుంది. అంటే రాముడు అయోధ్యలోనే పుట్టాడు, కాబట్టి రాముడు ఎంత ఆరాధనీయుడో, అయోధ్యకూడా అంతే ఆరాధనీయం అనే లాంటి వాదన. రెండో వైఖరి, అసలు రాముడు ఆరాధనీయుడే కాదనే వైఖరి. కాని అత్యధిక సంఖ్యాకులకి అయోధ్యతో నిమిత్తం లేకుండా రాముడు ఆరాధనీయుడు. వాళ్ళు రాముడికోసం అయోధ్యలో కాదు, తమ గుండెలో గుడికట్టుకున్నారు. రామరాజ్యం కోసం 'జై శ్రీరాం' నినాదంలో వెతకరు, రామనామంలో వెతుక్కుంటారు. వారిని ఉద్దేశించి వారి విశ్వాసాల్నీ, మన్ననసీ, మర్యాదనీ ఉద్దేశించి మాట్లాడే ఒక కబీరు, ఒక కంబరు, ఒక త్యాగయ్య నేడు ఎక్కడున్నారు? వాళ్ళకి మనం చోటు ఇవ్వనందువల్లనే కదా, మనుషులు మందగా మారి పక్కవాళ్ళ ప్రార్థనాస్థలాలు కూలగొడుతున్నారు!

ఇన్నాళ్ళకు ఈ వ్యాసాలు ఆ చోటుని మనముందుకు తీసుకొచ్చాయి. రండి, కొంతసేపు ఇక్కడ విహరిద్దాం. అయితే ఇక్కడ ఆహ్లాదం ఎంత ఉందో ఆవేదన కూడా అంతే ఉంది. నిన్న నేను ప్రసంగిస్తూండగా, ముందు వరసలో ఒక శ్రోత పుస్తకానికి పరిమితమై మాట్లాడండి అన్నాడు. నేనన్నాను కదా, 'ఇదే లోహియా చెప్తున్నది, ముందు నేనేం చెప్తున్నానో విను, ఎందుకు చెప్తున్నానో ఆలోచించు, అప్పుడు నువ్వు చెప్పాలనుకున్నది చెప్పు. నన్ను మాట్లాడనివ్వకపోతే రేపు నిన్ను కూడా మాట్లాడనివ్వరు గుర్తుపెట్టుకో' అన్నాను.

18-11-2022

# కొత్తవెలుగులో మహాభారతం

**మహాభారతాన్ని** పునర్వ్యాఖ్యానిస్తూ సృజనాత్మకరచనలు దాదాపు ప్రతి భారతీయభాష లోనూ వచ్చాయి. ఆ భాషలలో అవి క్లాసిక్కుగా కూడా మిగిలిపోయాయి. కేరళకు చెందిన ఎం. టి. వాసుదేవన్ నాయర్ 'సెకండ్ టర్న్' రాశారు, కన్నడంలో భైరప్ప 'పర్వ' రాశారు, మరాఠీలో విష్ణుసఖారాం ఖండేకర్ 'యయాతి' రాశారు, తమిళంలో సుబ్రహ్మణ్యభారతి 'పాంచాలి శపథం' రాశారు, ఒరియాలో ప్రతిభారాయ్ 'యాజ్ఞసేని' రాశారు. ఇక హిందీలో చెప్పనక్కర్లేదు. వీళ్లంతా ఆధునిక, సమకాలీనసమస్యల్ని దృష్టిలో పెట్టుకుని, సమకాలీనసందర్భంలో భారతాన్నివ్యాఖ్యానించే ప్రయత్నం చేశారు.

కానీ, ఈ భాషల తాలూకు ప్రాచీనసాహిత్యాలు మహాభారత ప్రధానసాహిత్యాలు కావు. రామాయణప్రధానసాహిత్యాలు. తమిళంలో కంబరు ఉన్నాడు, హిందీలో తులసీ దాసు ఉన్నాడు, మరాఠీలో వైష్ణవసాహిత్యం, పాండురంగసాహిత్యం ఉన్నాయి. తెలుగులో ప్రాచీనసాహిత్యం మొదలు కావడమే మహాభారతంతో మొదలైంది. దాదాపు 300 ఏళ్ల పాటు జరిగింది ఆ మహాయజ్ఞం. ఆశ్చర్యంగా ఆధునిక తెలుగుసాహిత్యంలో మహాభారతానికి చెప్పుకోదగ్గ పునర్వ్యాఖ్యానాలు ఏమీలేవు. యథార్థానికి తెలుగువాడి మనస్తత్వం, తెలుగువాడి జీవలక్షణం భారతానికి చాలా సన్నిహితంగా ఉంటాయి.

అది రామాయణజీవలక్షణం కాదు. కానీ, తెలుగులో రామాయణకావ్యాన్ని రాసిన ఆధునికకవికి జ్ఞానపీఠపురస్కారం వచ్చింది. ఇదొక వైరుధ్యం.

భారతానికి తెలుగులో సవిస్తరమైన వ్యాఖ్యానాలు రాని లోటును, భారతమని పేరు పెట్టకుండా, దాదాపుగా భారతకథ లాంటి కథ రాసిన 'కన్యాశుల్కం' కొంతవరకు పూరించిందనిపిస్తుంది. 'కన్యాశుల్కం' ఎట్లా మహాభారతం తాలూకు ఆధునికరూపమో వివరిస్తూ అద్లూరి రఘురామరాజు ఒక పెద్ద పుస్తకం రాశారు. గురజాడ 'కన్యాశుల్కం' రాయడంతో నన్నయ ప్రారంభించిన వెయ్యేళ్ల భారతసంప్రదాయం పక్కకిపోయి ఆధునిక సాహిత్యసంప్రదాయం వచ్చింది. కన్యాశుల్కం భారతానికి పూర్తి ప్రతినిధి కాదు కానీ, భారతం తాలూకు కొన్ని సమస్యలను దృష్టిలో పెట్టుకుని గురజాడ అప్పారావు గారు దానిపై పునర్వ్యాఖ్యానం చెయ్యడానికి ప్రయత్నం చేశారు. అలాగే, ఈనాటి కాలంలో మహాభారతాన్ని అర్థం చేసుకుని పునర్వ్యాఖ్యానించుకోవలసిన అవసరం ఉంది. అలా అర్థం చేసుకునే ప్రయత్నాలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నాయి. 'మంత్ర కవాటం తెరిస్తే మహాభారతం మన చరిత్రే' అనే పుస్తకం ద్వారా కల్లూరి భాస్కరం తెలుగులో అటువంటి ఒక లోటును పూరించే ప్రయత్నం చేశారు.

నేటి భారతదేశంలో ఈ పుస్తకానికి నిస్సందేహంగా ఒక ప్రాసంగికత ఉంది. మహాభారతాన్ని హిందువుల తాలూకు ఒక ఇతిహాసమన్నాం కానీ, పురాణం అనలేదు. ఇతిహాసమంటే, 'ఇలా ఉండే' దని చెప్పేది. అందులో మంచి- చెడుల గురించిన తీర్పు ఉండదు. ఇలా చేసేవారు, ఇలా ఉండేవారు, ఇలా పుట్టేవారు, ఇలా పెళ్లి చేసుకునేవారు, ఇలా చంపుకునేవారని చెప్పడమే అందులోని విషయం తప్ప ఇలా ఎందుకు పుట్టారు, ఇలా ఎందుకు పెళ్లి చేసుకున్నారు, వాటిద్వారా ఏమైనా విలువలు నిలబెట్టారా అన్నది కాదు. భగవద్గీతను హిందువుల ప్రస్థానత్రయంలో ఒక ముఖ్యమైన పుస్తకమని మనందరం అంగీకరిస్తాం. మహాభారతాన్ని తమ వారసత్వంగా తీసుకున్న హిందువులూ, ఇప్పుడు హిందూమతం గురించి మాట్లాడుతున్న హిందువులూ- వీరిద్దరూ ఒకళ్లేనా? ఇప్పుడు హిందూమతం గురించి మాట్లాడుతున్న హిందువులు మహాభారతాన్ని చదివారా? అర్థంచేసుకున్నారా అనే ప్రశ్నలు ఈ పుస్తకాన్ని చదివే క్రమంలో ముందుకు వస్తాయి.

భాస్కరం ఒక సనాతనమైన శ్రోత్రియకుటుంబంలో జన్మించారు. వారి నాన్నగారు చాలా గొప్ప పండితులు, కవి, పౌరాణికులు. 'నాలోని పౌరాణికుడు విజృంభిస్తున్నా' డని భాస్కరం ఒకచోట రాస్తారు. మామూలుగా అయితే, ఒక పౌరాణికసంప్రదాయానికి చెందిన మనిషిగా, ఉన్న పుస్తకాన్ని యథాతథంగా చదివి, ఒక మూఢవిశ్వాసిగా నమ్మి ఆ పుస్తకాన్ని ముందుకు తీసుకురావచ్చు.  అలా కాకుండా ఒక విద్యార్థిగా, ఒక అన్వేషిగా, ఒక జిజ్ఞాసిగా ఆయన తనను తాను తెరుచుకుంటూ వెళ్లడం చాలా గొప్ప విషయం.

ఈ పుస్తకం తాలూకు విశేషమైన విలువ ఎక్కడుందంటే – నిజంగా మీరు హిందూ సంప్రదాయాన్ని నమ్ముతున్నవారైతే మొట్టమొదటిగా మీరు చేయవలసింది ఏమిటో ఇది చెబుతుంది. మీ మూలాల గురించి మాట్లాడుతున్నప్పుడు, మీ గ్రంథాల గురించి మాట్లాడుతున్నప్పుడు మీరు వీలైనంత జాగరూకులుగాను, ఓపెన్ గాను, నిష్పాక్షికంగాను ఉండండి మీ పుస్తకాలు ఏం మాట్లాడుతున్నాయి, వాటిలో ఉన్న పురావస్తు అవశేషాలు ఏం మాట్లాడుతున్నాయి, ఫలానా శబ్దం ఏం చెబుతోందనేది దృష్టిలో పెట్టుకోండి, ఇది చాలా అత్యవసరమైన విషయమని ఈ పుస్తకం అంటుంది.

అసలు హిందూమతం ఏది, ఈ హిందూమతానికి ఆధారగ్రంథంగా భావించే ఒక పుస్తకం ఏమని చెప్తోందనే ఒక వెతుకులాట ఈ పుస్తకంలో కనబడుతుంది. అలాగని హిందూమతాన్ని వ్యతిరేకించే వాళ్ళని సమర్థిస్తూ భాస్కరం ఈ పుస్తకం రాశారని కాదు. ఆయన ఎవరి పక్షమూ తీసుకోలేదు. ముందే చెప్పినట్టుగా, ఒక ఇతిహాసంగా మహాభారతం 'ఇలా ఉండే'దని చెప్పేది మాత్రమే. భాస్కరం ఆ ఇతిహాస లక్షణాన్నే తన పుస్తకంలోనూ అనుసరించారు.

యథార్థానికి ఈ పుస్తకం మహాభారతం గురించిన పుస్తకం మాత్రమే కాదు మహాభారతాన్ని ఒక ఉదాహరణగా తీసుకుని, ఆ టెక్స్టును ఆధారం చేసుకుని జరిపిన ఒక తులనాత్మకపరిశీలన. ఇది ప్రధానంగా భారత్, ఆసియామైనరు,  యూరపు, మధ్య ప్రాచ్యాలకు సంబంధించిన పురాణగాథల మధ్య సారూప్యతను చర్చిస్తుంది. ఇలాంటి పరిశీలన యూరపులో 19వ శతాబ్దంలో మొదలైంది. సైన్సు వెలుగులో,

ఇప్పుడు మన దగ్గర జరుగుతున్నట్టే, అప్పుడు యూరపులో కూడా పురాణాలన్నీ పుక్కిటి కథలనీ, వాటిని  చదవాల్సిన అవసరం లేదనీ, సైన్సు వచ్చాక పురాణాలతో పనిలేదనీ భావించారు. 18వ శతాబ్దిని 'ఏజ్ ఆఫ్ ఎన్లైటెన్మెంట్' (జ్ఞానవికాసయుగం) అంటాం. ఆ ప్రభావంతో హోమరుని గాని, వర్జిలుని గాని, మొత్తం ఓల్డ్ టెస్టమెంటు ప్రాఫెట్సును కానీ వాళ్లు పట్టించుకోలేదు. 19వ శతాబ్దికి వచ్చేసరికి సైన్సు తాలూకు ఉద్రేకం తగ్గి, సైన్సు చెప్పని చాలా అంశాలు, చాలా సమాధానాలు పురాణాల్లో దొరుకుతాయనీ, ఒకసారి వాటిని పరిశీలిద్దామనీ, పరిశోధిద్దామనే తపన మొదలైంది. 19వ శతాబ్ది మధ్యభాగం నుంచి, అంటే 1840 నుంచి మొదలైన ఆ పరిశీలన ఇప్పటికీ ఇంకా ఇంకా విస్తృతస్థాయిలో కొనసాగుతూ ఉంది.

భాస్కరం ప్రధానంగా 19వ శతాబ్ది చివరికాలానికి, 20వ శతాబ్ది  పూర్వార్థానికి సంబంధించిన తులనాత్మకపౌరాణిక అధ్యయనాలను, ముఖ్యంగా గ్రీకు పౌరాణిక అధ్యయనవేత్త జార్జి థామ్సనును, తెలుగులో రాంభట్ల కృష్ణమూర్తిని, కొంతమంది తొలినాటి మార్క్సిస్టు భౌతికవాదతాత్వికులను, లూయీ హెన్రీ మోర్గను వంటి మానవ శాస్త్రవేత్తలను బాగా అధ్యయనం చేశారు. తులనాత్మకపౌరాణిక అధ్యయనాలలో అన్నిటి కన్నా ఉత్తమమని చెప్పదగింది, జోసెఫ్ కాంబెల్ అధ్యయనం. ఆయన  'ఓరియంటల్ మైథాలజీ', 'ఆక్సిడెంటల్ మైథాలజీ', 'ప్రిమిటివ్ మైథాలజీ', 'క్రియేటివ్ మైథాలజీ' అనే నాలుగు పుస్తకాలు రచించాడు. ఇలాంటి అధ్యయనాల వెలుగులో భాస్కరం మహాభారతాన్ని అర్థంచేసుకునేందుకు ప్రయత్నం చేశారు.

మన విశ్వాసాలు, మన పురాణాలు, మన చరిత్ర, మన సంస్కృతి ఏం చెప్తున్నాయి మన పూర్వగ్రంథాలు ఏం చెప్తున్నాయి, మన జాతికి మన సంస్కృతికి మూలనిర్మాతలైన వాళ్ళు ఏం మాట్లాడుతున్నారు, టెక్స్టు ఏమి మాట్లాడుతోంది అనేదాన్ని పక్కన పెట్టి కొన్ని విశ్వాసాలను ఏర్పరచుకొని వాటిని నమ్ముకుంటూ వాటికోసం ఒకరితో ఒకరం యుద్ధం చేసుకుంటున్న సందర్భంలో నేడు మనం ఉన్నాం.

ఇలాంటి సందర్భంలో, భారతదేశం ఒక్కటే ప్రపంచంలో అత్యున్నతదేశమని గాని, తక్కిన దేశాలన్నీ నిద్రపోతుంటే భారతదేశంలోనే సంస్కృతి వికసించిందని గాని, భారత

దేశం మాత్రమే ప్రపంచంలో అత్యుత్తమ సంస్కారం పొందిన దేశమని కానీ భావించ-కండని ఈ రచయిత అంటారు. ఒకప్పుడు భారతదేశమని గాని, లెబనాను అని గాని, సిరియా అని గాని, గ్రీసు అని గాని లేవు, ఇవన్నీ ఒకే ప్రాంతంగా ఉన్నాయి, ఆనాటి జనం ప్రాంతాలు, మతాలు, సంస్కృతులు, సాహిత్యాల మధ్య సరిహద్దులు ఎరగరు, ఇవన్నీ మానవులందరి ఉమ్మడి ఆస్తి అని రచయిత నొక్కిచెప్తారు.

ఈ విషయాన్ని చాలా కాలం కిందట యూంగ్ అనే మనస్తత్వశాస్త్రవేత్త కనుక్కొని చాలా ఆశ్చర్యపోయాడు. తన దగ్గరికి వచ్చే రకరకాల జాతులకు చెందిన రోగులు తమకు వస్తున్న కలల గురించి  చెబుతూ ఉంటే ఈ కలలన్నీ వాళ్ళ జాతికి, భాషకి మతానికి సంబంధం లేకుండా ఒకే రకమైన ప్రతీకలుగా, ఒకే రకమైన భాష మాట్లాడు-తున్నవిగా ఆయన గమనించాడు.

దాంతో, 'మనుషులకు రకరకాలుగా ఒక వైయక్తిక చేతన ఉండొచ్చేమో కానీ, మానవ జాతి మొత్తానికి ఒక ఉమ్మడి చేతన ఉంది, మనందరం ఒక సామూహిక చైతన్యంతో అనుసంధానమై ఉన్నాం, అంటే నీ మనసులో, నా మనసులో; నీ స్వప్నావస్థలో, నా స్వప్నవస్థలో మనం ఒక్కరిగానే ఉన్నాం, జాగృదావస్థకు వచ్చిన తర్వాత నీ జాతి నా జాతి, నీ మతం నా మతం, నీ భాష నా భాష అని కొట్టుకుంటున్నాం కానీ మనం కలలు కంటున్నప్పుడు మన కలలు మాట్లాడే భాష ఒక్కలాగే ఉంటుం' దన్న అవగాహనకు ఆయన వచ్చాడు.

ఆయన అలా అన్న తర్వాత ప్రపంచం చాలా ఆశ్చర్యపోయింది. ఆయన చెప్పినది ఆధారంగా రెండు దారుల్లో అన్వేషణ మొదలుపెట్టారు. ఒక దారిలో మనస్తత్వశాస్త్రవేత్తలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పురాణకథలను పరిశీలించడం మొదలుపెట్టారు. వాటన్నిట్లో కూడా అవే భయాలు, అవే ఆందోళనలు, అదే నెర్వస్ నెస్, అదే దీక్ష, అదే పోరాట పటిమ, అదే మూఢత్వం ఉన్నట్టు గ్రహించారు. వాటిని వర్గీకరించడం మొదలుపెట్టారు. ఇది ఒక రకమైన అధ్యయనం. ముఖ్యంగా యూంగ్  అనుయాయి జోసెఫ్ కాంబెల్ ఈ రకమైన అధ్యయనం చేశాడు. ఆయన 'ఏ హీరో విత్ థౌజండ్ ఫేసెస్' అనే పుస్తకం రాశాడు. ఈ పుస్తకాన్ని నేను 30 ఏళ్ల క్రితం చదివినప్పుడు, నా ప్రపంచం

ఒక్కసారిగా ఏడు సముద్రాల పరిధికి విస్తరించి పోయింది. 'అరె, నేను నా ఊరు, నా భాష, నా సంస్కృతి, నా జాతి అని అనుకుంటున్నాను, కాదు, ప్రతి ఒక్క మనిషీ ప్రతి ఒక్క మనిషికీ సంబంధించిన వాడే' ననుకున్నాను. శ్రీశ్రీ ఒకచోట 'ఈ నేల మీద నడయాడుతున్న ప్రతి ఒక్కరూ ఈ నేల మీద ఒకప్పుడు నడయాడిన ప్రతి ఒక్కరికీ వారసుడే' నని రాసాడు.

రెండోవారు యాంత్రొపాలజిస్టులు. వీరు వివిధ ఆదిమజాతులను అధ్యయనం చేయడం మొదలుపెట్టారు. వారిలో బ్రొనిస్లావ్ మలినోవస్కీ ఒకరు. ఆయా తెగలు, వారికి సంబంధించిన క్రతువులు, విశ్వాసాలను పరిశీలిస్తే వాటికీ, ఉన్నతసంస్కృతులుగా చెప్పుకునే గ్రీకు, రోమను, ఇండియను, ఈజిప్షియను సంస్కృతుల తాలూకు అత్యుత్తమ గ్రంథాలకీ మధ్య ఆయనకు  చాలా పోలికలు కనిపించాయి. ఉదాహరణకు, టోబ్రియాండు దీవులలో ఉండే తెగలకి ఈజిప్షియను సంస్కృతి గురించి తెలియదు, హోమరు గురించి తెలియదు, వ్యాసుడి గురించి తెలియదు. కానీ వాళ్ల నమ్మకాల్లో వాళ్ళ కథల్లో, వీళ్ళ నమ్మకాల్లో వీళ్ళ కథల్లో ఒక ఉమ్మడితనం కనపడుతుంది. లెవిస్ట్రాసు అనే ఆయన దానిని ఒక స్ట్రక్చరుగా ప్రతిపాదించాడు. వీళ్ళనే మనం స్ట్రక్చరలిస్టులని అంటూ ఉంటాం. వీళ్ళు యూనివర్సలు స్ట్రక్చరలిస్టులన్నమాట. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పురాణకథలు, నమ్మకాల మధ్య వారు ఒక ఉమ్మడితనాన్ని ప్రతిపాదించారు. 20వ శతాబ్ది ద్వితీయార్థం నుంచి దానిపై విస్తృతమైన పరిశోధనలు జరుగుతూ వచ్చాయి.

భాస్కరం దాదాపుగా వీరందరి పరిశోధనల సరళిని ఈ పుస్తకంలో ప్రతిబిం-బించారు. జిజ్ఞాసి అయిన వాళ్ళు, ముఖ్యంగా ఈ కాలంనాటి యువతీ యువకులు ఖచ్చితంగా చదవవలసిన పుస్తకం ఇది. ఈ పుస్తకం ఒక మ్యూజింగు, ఒక అన్వేషణ, ఒక ప్రయాణం. ఈయన ఎక్కడా కూడా ఒక చోట మొదలుపెట్టి, ఒకచోట ముగించే ప్రయత్నం చేయలేదు. చివరికొచ్చేసరికి, 'ఈ వ్యాసపరంపరలో ప్రస్తుతానికి ఇది చివరి వ్యాసమే తప్ప ముగింపు కా'దని 789వ పేజీలో రాస్తారాయన. వీటిలో చర్చించిన అనేక అంశాలకు పూర్తి న్యాయం చేశానని తను అనుకోవట్లేదంటారు. అంతేకాదు, 'షరా మామూలుగా మళ్లీ క్రాస్ రోడ్సుకి చేరా'నంటారు.

భాస్కరం ఈ అన్వేషణను కొనసాగించాలి. ముఖ్యంగా ఆయన 20వ శతాబ్ది సగం దాకా వచ్చిన అధ్యయనాలను చదివారు. 20వ శతాబ్ది ద్వితీయార్థంలో కూడా చాలామంది, ముఖ్యంగా జీన్ ప్రియరీ వెర్నాంటు అనే ఆయన, గ్రీకు మైథాలజీ మీద అద్భుతమైన కృషి చేశారు. గత 10, 20 ఏళ్లలో మైథాలజీ మీద యూరోపులో గొప్ప పుస్తకాలు వచ్చాయి. నలదమయంతులు, తపతీసంవరణులు, యయాతీశర్మిష్టల కథలతో సహా అనేక అంశాలను భాస్కరం ఈ పుస్తకంలో అద్భుతంగా వ్యాఖ్యానించారు. వీటిని ఈ కొత్త పరిశోధనల వెలుగులో మరొకసారి పునర్వ్యాఖ్యానించాలని, పునరాలో-చించాలని కోరుకుంటున్నాను. ఇలాంటి ఒక విలువైన కానుకను తెలుగువారికి అందించినందుకు ఆయనకు తెలుగుజాతి ఋణపడి ఉంటుంది.

13-3-2023

# పెరిప్లస్ ఆఫ్ ద ఎరైత్రియన్ సీ

**లీలా అజయ్** చరిత్ర ఉపన్యాసకురాలు. సాహిత్యాభిమాని. నా మిత్రురాలు. కిందటేడాది విజయవాడ నుంచి వచ్చేసే ముందు ఆమె గుడివాడలో ఒక పుస్తకం ఆవిష్కరణ సభకి నన్ను పిలిచారు. ఆశ్చర్యం, అది Periplus of the Erythraean Sea అనే ఒక ప్రాచీన సముద్రయాత్రారచనకి తెలుగు అనువాదం! అటువంటి పుస్తకం ఉందనే తెలుగువారిలో చాలామందికి తెలియదు. అటువంటిది రెవెన్యూ శాఖలో తహశీల్దారుగా పనిచేసి రిటైరు అయిన మహమ్మద్ సిలార్ అనే పండితుడు తెలుగులోకి అనువదించడం, ఆ పుస్తకాన్ని లీలా అజయ్‌గారు తాను స్వయంగా ప్రచురించి ఆవిష్కరణ సభ ఏర్పాటు చెయ్యడం నన్ను ఆశ్చర్యానందాల్లో ముంచెత్తాయి.

ఆ పుస్తకం గురించి వెంటనే రాసి ఉండవలసింది. కానీ విజయవాడనుంచి వచ్చేస్తున్నప్పుడు పుస్తకాలు సర్దుకునేటప్పుడు ఈ పుస్తకం ఎక్కడో లోపల ఉండిపోయి ఇన్నాళ్ళకు బయటపడింది.

'పెరిప్లస్' అంటే సముద్ర ప్రయాణానికి ట్రావెలు గైడు అన్నమాట. ఈ 'పెరిప్లస్ ఆఫ్ ఎరైత్రియన్ సీ' సముద్రం మీద ప్రయాణానికి సంబంధించిన మార్గదర్శిని. దీన్ని సా.శ. మొదటి శతాబ్దంలో ఒక అజ్ఞాత రోమను నావికుడు గ్రీకులో రాసాడు. దానికి

ఎన్నో అనువాదాలు వెలువడ్డాయి, వెలువడుతూ ఉన్నాయి కూడా. వాటిల్లో 1912 లో విల్‌ఫ్రెడ్. హెచ్. స్కాఫ్ అనే ఆయన చేసిన ఇంగ్లిషు అనువాదాన్ని సిలార్ తెలుగు చేసారు. అనువాదంతో పాటు కొన్ని ముఖ్యమైన స్థలనామాలకీ, పారిభాషిక పదాలకీ ఇంగ్లిషు అనువాదకుడు పొందుపరిచిన నోట్సు కూడా అనువాదకుడు తెలుగు చేసాడు.

పెరిప్లస్ గురించి నేను పదిహేనేళ్ళకిందట మొదటిసారి చదివాను. ప్రాచీన కాలంలో కథారూపాల గురించి అధ్యయనం చేస్తూ ఉండగా, ఇప్పటికి మూడువేల ఏళ్ళకిందట, Shipwrecked Sailor అనే ఒక ఈజిప్టు నావికుడి కథ గురించి తెలిసింది. ఆ సందర్భంగా ప్రాచీనకాలంలో సముద్రప్రయాణ గాథల గురించి తెలుసుకుంటూ ఉండగా పెరిప్లస్ నా కంటపడింది.

ఈ రచనకి మూడు విశిష్టతలున్నాయి. మొదటిది, ఇది కథ కాదు, కల్పన కాదు, సాహిత్యరచన అసలే కాదు. ఆ కాలం నాటికి గ్రీకు, రోమను, ఈజిప్షియను నావికులకి అందుబాటులో ఉన్న భూగోళ పరిజ్ఞానమంతటినీ పొందుపరిచి రాసిన సమగ్ర రచన. అందులో భూగోళశాస్త్రముంది, చరిత్ర ఉంది, సామాజిక శాస్త్రం కూడా ఉంది. అనువాదకుడు ముందుమాటలో పెరిప్లస్ గురించి ఇలా రాస్తున్నాడు:

> రోమను జాతీయుడు, ఈజిప్టు నివాసి, గ్రీకు సాహసికుడు, పేరు తెలుపని నావికుడు– ఒక సాధారణ వ్యాపారి కష్టనష్టముల కోర్చి అనంత సముద్రంలో తన నౌకలో ప్రయాణించి, ఆయాదేశపు మార్కెట్ల ఎగుమతి, దిగుమతి సరుకుల గురించిన సమాచారంతో పాటు, అక్కడ నివసించే దేశప్రజల స్థితిగతులు, సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు, సంబంధ బాంధవ్యాల గురించిన సమాచారంతో తిరిగి వచ్చాడనే విషయం పెరిప్లస్ ఆఫ్ ద ఎర్రైత్రియన్ సీ అనే గ్రంథంలో విశేషంగా చెప్పబడింది. అప్పటివరకు చరిత్ర– కెక్కని, శతాబ్దాల తరబడి జరిగిన సముద్రవర్తకం విశేషాలు గ్రంథస్థం చేయ– బడిన ఒకే ఒక రికార్డు పెరిప్లస్. స్ట్రాబో, ప్లినీ, టాలమీ లాంటి చరిత్ర– కారులు వారెంత జ్ఞాన సముపార్జన చేసినా సరే, వారు తెలుపని అప్పటి ప్రపంచానికి తెలియని విశేషాలు, ఆనాడు తాను స్వయంగా చూసిన విశేషాలు, తాను

కలిసిన ప్రజలు ఇచ్చిన సమాచారం, గొప్ప శ్రమజీవులు, విశేష పరిశ్రమ చేసే తూర్పు తీరవాసుల వర్తక ఆధిపత్యం తెలిపే గొప్ప విషయాలతో గ్రంథ రచన చేసాడు పెరిప్లస్ రచయిత.

రెండవది, అది భారతదేశానికి సముద్రం మీద ప్రయాణించే దారి గురించిన వర్ణన. మరొక పధ్నాలుగు శతాబ్దాల తర్వాత వాస్కోడగామా భారతదేశానికి సముద్రం మీద ప్రయాణించడానికి దారి చూపిన రచనల్లో అది కూడా ఉందని చెప్పడం అతిశయోక్తి కాదు. ఇక మూడవది, సిలార్ గారు ఈ రచనలో ప్రతిపాదిస్తున్నది, ఎరైత్రియన్ సీ అంటే ఇండియను ఓషను అని చెప్పడం. మామూలుగా ఎరైత్రియన్ సీ అంటే ఎర్రసముద్రం అనీ, పర్షియను సింధుశాఖ, ఎర్రసముద్రం కలిసే చోటుని ఎరిత్రియన్ సీ అనీ పిలుస్తారనీ అనుకునేవారు.

కాని ఈ అనువాదకుడు అగధార్ ఛిడెర్ అనే ఒక పండితుడి ప్రతిపాదనలు ఆధారం చేసుకుని ఎర్ర సముద్రం అంటే ఆధునిక ఇండియా చుట్టూ ఆవరించి ఉన్న ఇండియను ఓషను మాత్రమేనని చెప్పడం.

పెరిప్లస్ మొత్తం 66 పేరాల రచన. అంటే పది పదిహేను పేజీలకు మించని రచన. ఆ రచయిత సాహిత్యకారుడు కాడు. గొప్ప భాషాజ్ఞానం ఉన్నవాడు కూడా కాడు. కాని లోకజ్ఞుడు. రెండువేల ఏళ్ళకింద యూరోపు, ఆఫ్రికా, అరేబియా, ఇండియాల గురించిన చాలా పరిజ్ఞానాన్ని ఆ పదిపన్నెండు పేజీలు యథాతథంగా మనకి అందిస్తు-న్నాయి. అందులో  చాలా స్థలనామాల మీద ఇప్పటికీ అధ్యయనం జరుగుతూనే ఉంది.

మొత్తం 66 పేరాల పెరిప్లస్‌లో 41 నుంచి 66 దాకా భారతపశ్చిమ తూర్పుతీర వివరాలున్నాయి. అంటే మొత్తం రచనలో మూడవంతు భారతదేశం గురించే అన్నమాట. ప్రస్తుత గుజరాతు తీరంలోని భరుకచ్ఛంతో మొదలైన సముద్రప్రయాణవర్ణన చేర, చోళ, పాండ్య రాజ్యాల వివరాలతో పాటు ఆంధ్రతీర వర్ణనతో చీనా సరిహద్దుదాకా సాగుతుంది.

పెరిప్లస్ రచనకాలం మీద చాలా చర్చ జరుగుతూ ఉంది. సిలార్‌గారి లెక్క ప్రకారం ఈ రచన సా.శ 58 వేసవికన్నా ముందు లేదా 62 వేసవి కన్నా తర్వాత జరిగి ఉండాలి. అది ఆంధ్రశాతవాహనుల పాలనా కాలం.

ఈ రచనలో 52 వ పేరాలో పేర్కొన్న elder Saragunus, Sandares అరిష్ట శాతకర్ణి, సుందర శాతకర్ణి అయి ఉండవచ్చునని, కాబట్టి పెరిప్లస్ రచనాకాలం కూడా సా.శ 83-84 మధ్యకాలం అయి ఉండవచ్చునని మరొక వాదం. కాని పెరిప్లస్‌లో ప్రస్తావించిన ఇతర ప్రాంతాలు, రోము, అరేబియా, పార్థియన్లు మొదలైనవారి గురించిన వివరాలిచ్చే సాక్ష్యం ప్రకారం ఈ రచన సా.శ.60 ప్రాంతానికి చెందింది అయి ఉండ వచ్చునని అనువాదకుడి ప్రతిపాదన.

పెరిప్లస్‌లో 62 వ పేరా మొత్తం మసాలియా గురించిన వివరణ. ఇది కృష్ణానదీ ముఖద్వారంగా చెప్పబడే మచిలీపట్నం ఓడరేవు గురించిన చిత్రణ. 'మాసాలియా పెరిప్లస్ రచనా కాలం నాటికి ఆంధ్ర రాజ్యానికి అతి గొప్ప మార్కెట్ అనటంలో సందేహం లేదు' అని రాసాడు అనువాదకుడు.

ఆ రోజు పుస్తకావిష్కరణ సభలో ఆ పుస్తకం గురించి మాట్లాడుతూ నేను ఈ విషయమే చెప్పాను. ఒకప్పుడు రోము నుంచి వర్తకులు, యాత్రీకులు, నావికులు మచిలీపట్నాన్ని వెతుక్కుంటూ వచ్చిన చరిత్ర ఈ రచన అని చెప్తూ ఆ రచనని మళ్ళా మరొక మచిలీపట్నం వాసి అనువదించడం, దాన్ని గుడివాడలో ఆవిష్కరించడం ఎంతో సమంజసంగా ఉన్నాయని చెప్పాను.

చరిత్ర పట్ల ఆసక్తి ఉన్న ప్రతి ఒక్క విద్యార్థీ, రచయితా తప్పక చదవవలసిన పుస్తకం పెరిప్లస్. ఇన్నాళ్ళూ ఇంగ్లిషులో ఉంది కాబట్టి, ఆ స్థలనామాలు మరీ కొరుకుడు పడేలా ఉండవు కాబట్టి చదవలేకపోయాం అని సరిపెట్టుకున్నా, ఇప్పుడు సమగ్రమైన వివరణలతో ఆ పుస్తకం తెలుగులోకి వచ్చిందికాబట్టి అవశ్యం చదవక తప్పదు. అట్లాసులూ, ఇంటర్నెట్లూ, జి.పి.ఎస్సులూ లేని రోజుల్లో ఒక అజ్ఞాత నావికుడు రాసిపెట్టి పోయిన ఈ రచనలో మన దేశం గురించీ, మన ప్రాంతం గురించీ రాసి ఉన్నందుకేనా మనం చదివితీరాలి.

ఏ విధంగా చూసినా ఈ రెండువందల పేజీల అనువాదం తెలుగు వాఙ్మయానికి గొప్ప కానుక. ఏ విశ్వవిద్యాలయంలోని చరిత్రశాఖనో, లేదా తెలుగు విశ్వవిద్యాలయమో చెయ్యవలసిన ఈ పనిని ఒక రిటైర్డు తహశీల్దారు చెయ్యడం, ఆ పుస్తకాన్ని ఒక చరిత్ర ఉపన్యాసకురాలు తన స్వంతఖర్చుతో ముద్రించడం తెలుగువాళ్ళకి సంతోషం కలిగిస్తుందేమోగాని, నాకు బాధ కల్గిగిస్తుంది.

కాని సిలార్‌గారిని రెవెన్యూశాఖ ఉద్యోగిగా నేను పదే పదే పేర్కోడం కూడా సమంజసం కాదు. ఆయన 'తరతరాల బందరు చరిత్ర', 'కృష్ణాజిల్లా చరిత్ర', 'మచిలీపట్నం చరిత్ర', దివిసీమ సర్వస్వం' వంటి విజ్ఞానసర్వస్వాల్ని ఇప్పటికే వెలువరించారు. ఇంకా చెప్పుకోదగ్గ విషయం 'కృష్ణాజిల్లా జమీందారులు- రైతాంగ ప్రజాపోరాటం' అనే రచన కూడా వెలువరించారు. ఏ విధంగా చూసినా ఈయన ఋణం తెలుగుజాతి తీర్చుకోలేనిది. కాని ముందు, ఆయనకి ఋణపడి ఉన్నామని కూడా మనకి తెలీదు, అదే నన్ను మరింత బాధిస్తున్న అంశం.

8-6-2023

# స్పష్టంగా చెప్పగలిగేనా?

**ఒక** మిత్రుడు నాకొక మెసేజి పెట్టాడు: 'మీ విశ్లేషణలు చాలా బావుంటాయి, చదువుతుంటే ఒక తన్మయత్వం లాంటిది కలుగుతూంటుంది. కాని వాటి తక్షణ, దీర్ఘకాల ప్రయోజనాలేమిటో అర్థం కావడం లేదు. వాటిని రాయడం వెనక మీ దృక్పథమేమిటో తెలిస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది' అని.

అతడికి వెంటనే నాలుగు మాటలు జవాబురాస్తే సరిపోదనిపించింది. స్పష్టంగా చెప్పకపోయినా చాలామందికి నా పట్ల ఇటువంటి ప్రశ్న ఉందని నాకు తెలుస్తూ ఉంది. కొన్నేళ్ళ కిందట, ఒక ప్రచురణ కర్త, వామపక్షవాది ఇట్లాంటి ప్రశ్ననే అడిగాడు. 'ఈ మధ్య రచయితలం చాలామందిమి కలుసుకున్నాం. ఒకరి గురించి ఒకరం అర్థం చేసుకోవడానికి ప్రయత్నించుకున్నాం. వాళ్ళంతా నాకు చాలా బాగా అర్థమయ్యారు. కాని మీరే నాకిప్పటికీ అర్థం కావడం లేదు, ఎందుకని' అని.

ఇందుకు రెండు కారణాలున్నాయి. ఒకటి, నేను చేసే విశ్లేషణలు, రాసే కవితలు, కథలు నా కోసం నేను చేసుకుంటున్నవి. లోపల్లోపల మథనపడి, సమాధానం ఒకటి వెతికి పట్టుకుని, ఆ తెలుసుకున్న విషయాన్ని మాత్రమే తక్కిన ప్రపంచంతో పంచుకునే

వాళ్ళుంటారు, గురజాడలాగా. వాళ్ళ అంతస్సంగ్రామం ఏమిటో మనకి తెలియదు. కాని తమ సంఘర్షణ తాము పడి వాళ్ళు ప్రపంచానికి చెప్పేది ఒక బుద్ధవాక్యంలాగా తేటగా, స్పష్టంగా, దిక్సూచిగా ఉంటుంది. కాని నాలాంటివాళ్ళు వేరు. నా నలుగులాట నేను నలుగురినుంచీ దాచుకోవాలనుకోలేను, చలంలాగా, బైరాగిలాగా, నేను రాసుకునే-దంతా ఒక interior monologue. కాబట్టి, అందులో చాలా సంకీర్ణతా, సంక్లిష్టతా తప్పని సరి.

ఇక రెండవకారణం మరింత ముఖ్యమైంది. అదేమంటే, ఏదైనా విషయం గురించి ఆలోచించడంలో, నలుగురితో చర్చించడంలో మూడు దశలుంటాయనిపిస్తుంది.

మొదటి దశలో, ఆ చర్చకొక తక్షణత (immediacy) ఉంటుంది. అక్కడ స్పష్టమైన దృక్పథం ఏర్పడటం కన్నా ముందు, ఆ విషయం పట్ల సద్యఃస్పందన ప్రకటించడమే ముఖ్యంగా ఉంటుంది. ఉదాహరణకి పెద్ద నోట్ల రద్దునే తీసుకుందాం. ఈ విషయమ్మీద, పత్రికల్లో, ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లో, సోషలు మీడియాలో జరుగుతున్న చర్చ చాలావరకు ఈ స్థాయిలోనే నడుస్తున్నది. తక్కిన పౌరుల్లానే నేను కూడా పెద్దనోట్ల రద్దువల్ల చిల్లర కరెన్సీ చేతికందక ఇబ్బందులు పడుతున్నవాణ్ణే. కరెన్సీ రేషను కోసం ప్రజలు పగలూ రాత్రీ క్యూలు కట్టడం చూస్తున్నవాణ్ణే. కాని, ఈ విషయం మీద ఒక స్పష్టమైన దృక్పథం ఏర్పరచుకోకుండా ఏదో ఒకటి మాట్లాడటం నాకు సాధ్యం కాదు. అయితే దీనిగురించి మాట్లాడుతున్నవాళ్ళందరికీ స్పష్టమైన దృక్పథం లేదని కాదు. నిజానికి ఈ అంశం మీద తక్షణ స్పందనలు ప్రకటించే ప్రతి ఒక్కరూ కూడా, ఈ విషయం మీద, నా దృక్పథం crystallize కావడానికి తోడ్పడుతున్నవాళ్ళే.

ఇటువంటి అంశాల్లో తక్షణ పరిశీలనల్ని దాటి, దీనిలో ఉన్న సామాజిక-రాజకీయ అంశాల్ని గుర్తించి వివేచించడం చర్చలో రెండవ దశ. పెద్దనోట్ల రద్దు-దాని వెనక ఉన్న ఆర్థిక వివేకం లేదా అవివేకం, దాని వల్ల సంభవించగల క్రమశిక్షణ లేదా కల్లోలం మొదలైన విషయాలతో మొదలుపెట్టి, గ్లోబలైజేషను కాలంలో ఆధునిక జాతీయ రాజ్యం బలహీనపడటం, కాని modern nation state మళ్ళా బలాన్ని సంతరించు కోవాలని జాతీయవాదులూ, వామపక్షవాదులూ కూడా ఒక్కలానే కోరుకోవడం, ఆర్థిక

వ్యవస్థ మీద రాజ్యానికి నియంత్రణ ఉందని చెప్పడానికి ప్రభుత్వం పెద్దనోట్ల రద్దు నిర్ణయం చేసిందనో, లేదా, అర్థికవ్యవస్థ మీద రాజ్యం నియంత్రణ కోల్పోయిందని ఈ చర్యతో పూర్తిగా అర్థమయిందనో–ఇట్లా మరింత లోతుగానూ, మరింత ఉపపత్తుల తోనూ చేసే చర్చలో తక్షణ–దీర్ఘకాల ప్రయోజనాలు రెండూ స్పష్టంగా ఉంటాయి.

కాని, నా ఆసక్తి ఇక్కడ లేదు. అది ఇంతకన్నా కూడా మరింత సూక్ష్మస్థాయిలో సంచరిస్తూ ఉంటుంది. ఏ విషయం మీదనైనా చర్చ మూడవ దశకి చేరుకున్నప్పుడు, అది ఆర్థిక–రాజకీయ–సామాజిక పార్శ్వాల్ని దాటి ఒక తాత్త్విక కోణాన్ని సంతరించు కుంటుంది. ఒక విషయం తాలూకు manifestations నుంచి దాని మూలాల్లోకి ప్రయాణించడం తాత్త్వికవివేచనగా మారుతుంది.

ఉదాహరణకి, ఇప్పుడు భారతదేశంలో ఒక కొత్త జాతీయతాధోరణిని సంతరించు కుంటున్న రాజకీయవాతావరణం ఏర్పడుతున్నది. ఇది కొత్త పరిణామంగా కనిపించ–వచ్చు గాని, ఆదినుంచీ భారతదేశ చరిత్రని నిశితంగా పరిశీలించినవాళ్ళకి, ఈ పరిణామంలో చరిత్ర పునరావృత్తి కనిపిస్తుంది. భారతదేశ చరిత్రలో ఒకసారి కేంద్రంనుంచి అంచులదాకా (centrifugal), మరొకసారి అంచులనుంచి కేంద్రందాకా (centripetal) రాజకీయ–సాంస్కృతిక నిర్మాణాలు సంభవిస్తూ కనిపిస్తాయి. ఒకసారి బలమైన కేంద్రం కోసం, మనమంతా ఒకే జాతి అనే ధోరణి ప్రబలమవుతుంది. అది మతపరంగా ఏకేశ్వరోపాసనగా, రాజకీయంగా totalitarian గా వ్యక్తమవుతుంది. దాన్ని unity గా ప్రతిపాదించడం జరుగుతుంది. దాని తరువాత మరొక ఆవర్తనం విస్తరించినప్పుడు బలమైన ప్రాంతాలూ, అంచులూ ముఖ్యమై మనమంతా వివిధ సంస్కృతులూ, వివిధ భాషలూ, వివిధ ఆరాధనా సమూహాలూ అనే జాగృతి బలంగా వ్యక్తమవుతుంది. దాన్ని diversity అంటుంటారు.

ఉదాహరణకి పద్ధెనిమిదో శతాబ్దం చివరి రోజులనుంచి ఇరవయ్యవశతాబ్దంలో స్వాతంత్ర్యం వచ్చేదాకా మనమంతా ఒక జాతి, మనదొకటే దేశం అనే జాతీయతావాదం బలంగా ఏర్పడింది. 1950 తర్వాత, మళ్ళా వివిధ ప్రాంతాలూ, వివిధ కులాలూ, వివిధభాషలూ ఇంతదాకా అప్రధానీకరణకు లోనయ్యాయనీ, ఇంతదాకా జాతీయరాజ్యం

పేరుమీద కొన్ని ప్రాంతాలూ, కొన్ని కులాలు, కొన్ని మతాలూ మాత్రమే లబ్ధి పొందాయనే ఆందోళన మొదలయ్యింది.

ఇవన్నీ మనకు తెలిసినవే. కాని నేను చూసేదేమిటంటే,భారతదేశ చరిత్రలో ఈ alternation ఎందుకు సంభవిస్తూ ఉంది, దీనికీ ప్రపంచపరిణామాలకీ ఏమైనా సంబంధం వుందా అని. చాలా కాలంగా చేస్తూ వచ్చిన అధ్యయనం మీద నేను చేసు కుంటున్న ఊహాగానం (hypothesis) ఏమిటంటే, భారతదేశానికీ, అంతర్జాతీయ విపణికీ మధ్య సంబంధాలు బలంగా ఉన్నప్పుడు, ప్రపంచవిపణిలో భారతదేశం ముఖ్యపాత్ర పోషించగలదనుకున్నప్పుడు బలమైన కేంద్రం గురించి ఆరాటం నడుస్తుందనీ, ప్రపంచ విపణితో సంబంధాలు బలహీనపడ్డప్పుడు అంచులు (periphery) బలపడుతున్నాయనీ. ఒకప్పుడు అంచులే కేంద్రంగా మారవచ్చు కూడా. ఉదాహరణకి డచ్చి, పోర్చుగీసు, ఫ్రెంచి, బ్రిటిషు వలసలు భారతదేశంలో అంచులతోనే మొదలైనట్టు.

ఈ క్రమంలో భారతదేశంలో నా కళ్ళముందు సంభవిస్తున్న పరిణామాల్ని చరిత్ర, తత్త్వశాస్త్రం, సాహిత్యం ఆసరాగా మరింత లోతుగా అధ్యయనం చేయాలనేది నా కోరిక.

ఉదాహరణకి నేను ఈ ఏడాది పొడుగునా కబీరు గురించి మాట్లాడుతూ (మాట్లాడు కుంటూ) ఉన్నాను. పైకి చూడటానికి, ఆ విశ్లేషణకి ఎటువంటి తక్షణ, దీర్ఘకాల ప్రయోజనాలు లేవనిపించవచ్చు. కాని, నేడు భారతదేశమంతా రెండు శిబిరాలుగా చీలి పోయి ఉంది, హిందుత్వవాదమూ, హిందుత్వవాదాన్ని వ్యతిరేకించేవాదాలూ అని. కాని రెండు దృక్పథాల్లోనూ కూడా లోతులేదనీ, వాళ్ళకి సంబంధించని విశాలభారత దేశమొకటి ఉందనీ, దాని గురించి రెండు వర్గాలవాళ్ళకీ తెలిసింది చాలా స్వల్పమనేననీ నా అభిప్రాయం.

కాని భారతదేశానికి తామే ప్రాతినిధ్యం వహిస్తున్నామని ఇట్లా మాట్లాడేవాళ్ళు ఇప్పుడే కొత్తగా రాలేదు. కబీరు కాలంలో కూడా ఈ సమస్య ఇంత బలంగానూ ఉంది. ఆయన ఆ రెండువర్గాల సంకుచితత్వాన్నీ ఎట్లా పసిగట్టాడో, ఎత్తి చూపాడో

తెలుసుకోవడంలో ఒక మెలకువ ఉంది. అది ఇప్పటి నా చుట్టూ ఉన్న భారతీయ సమాజంలో నా పాత్ర ఏమిటో నాకై నేను స్పష్టం చేసుకోవడానికి నాకు చాలా ఉపకరిస్తుంది అని అనిపిస్తుంది.

నా సమకాలిక భారతదేశం గురించి కబీరువల్ల నాకు కలుగుతున్న స్పష్టత, జె.ఎన్.యు ప్రొఫెసర్లవల్లగానీ, ఆక్సుఫర్డు యూనివెర్సిటి రచయితలవల్లగానీ, పత్రికా సంపాదకులవల్లగానీ, వివిధ పార్టీల అధికారప్రతినిధులవల్లగానీ కలగడం లేదు.

కాబట్టి నేను చదువుతున్న, చర్చిస్తున్న కబీరు పదిహేనో శతాబ్దానికి చెందిన ఒక నిర్గుణభక్తి కవి కాడు, నా ఆధ్యాత్మిక విశ్వాసాలకూ, నా సామాజిక బాధ్యతలకూ మధ్య నా సమకాలిక భారతదేశం రేకెత్తిస్తున్న సంఘర్షణలో నాకు దారి చూపించే నా సమకాలికుడు.

మిత్రుడా, మీకు స్పష్టంగా చెప్పగలిగేనా?

22-12-2016

# మన పిల్లలకి మంచిది కాదు

మృత్యువును చూసి కాదు నేను, జీవితాన్ని చూసి జంకుతున్నాను
హంతకుని కత్తి చూసి కాదు, కనుల ద్వేషం చూసి గొంకుతున్నాను
మనసులోని క్రౌర్యం చూసి జంకుతున్నాను.

బైరాగి (ఆగమగీతి: నాకు చావు లేదు)

**గౌరీ లంకేష్** హత్య ఒక విషయాన్ని చాలా బిగ్గరగా, మనం ఎక్కడ వినకుండా పోతామో అన్నంత బిగ్గరగా, మన చెవులు చిల్లులుపడేటట్టుగా, భరించలేనంతగా ఘోషిస్తోంది, అదేమంటే: మనం రాజకీయంగా సరే, సాంస్కృతికంగా కూడా పతనం అంచులకి చేరుకున్నామని.

రెండవ ప్రపంచయుద్ధం అయిన తరువాత ఇంటికి వస్తున్న జర్మను సైనికులకి (ఇంటికి తిరిగి రాగల అదృష్టానికి నోచుకున్నవాళ్ళు), తమ పదజాలమంతా హటాత్తుగా అదృశ్యమైపోయినట్టు అనిపించిందట. 'దేశం', 'కుటుంబం', 'మనిషి', 'ప్రేమ', 'మానవ సంబంధాలు'–ఈ మాటలకి అర్థం లేదని అనిపించిందట.

గౌరిని హత్య చేసిన మర్నాడే, హత్యను ఖండించకపోగా, మరణానికి చింతించకపోగా, ఈ అమానుషాన్ని ప్రతి ఒక్కరూ తమ మీద తీసుకుని ఎంతో కొంత ప్రాయశ్చిత్తం ప్రకటించకపోగా, సోషలు మీడియాలో నడిచిన, నడుస్తున్న కొన్ని వ్యాఖ్యలు నన్ను చాలా బాధిస్తున్నాయి, భయపెడుతున్నాయి. మనం ఏ దేశంలో ఉన్నాం? ఏ విలువల గురించి ఇంతకాలం గర్విస్తూ వచ్చాం? ప్రాచీనకాలం నుంచీ ఎవరిని మన ఆదర్శాలుగా ప్రకటించుకుంటూ వచ్చాం? నిర్దాక్షిణ్యంగానూ, నిస్సిగ్గుగానూ చేసినహత్య కన్నా, నిర్దాక్షిణ్యంగానూ, నిస్సిగ్గుగానూ మాట్లాడుతున్న ఈ మాటలు నన్నెక్కువ కలవరపెడుతున్నాయి.

దుర్మార్గమైన ఈ రాతలు చదివి ఎందరో యువతీయువకులు, ముక్కుపచ్చలారని పిల్లలు తామేదో మహత్తర హిందూసంస్కృతికి వారసులమనీ, తమ మతానికీ, సంస్కృతికీ ఏదో పెద్ద ప్రమాదం వాటిల్లుతోందనీ, అట్లాంటి ఒక ప్రమాదకరమైన మనిషిని చంపేస్తే వీళ్ళంతా ఎందుకిట్లా ఖండిస్తున్నారనీ, దుఃఖిస్తున్నారనీ ఆశ్చర్య పోతున్నారు. ఎవరు చెప్తారు వీళ్ళకి? ఈ రాజకీయశక్తులు మాట్లాడుతున్న హిందుత్వానికీ, అనాదికాలంగా ఈ దేశంలో కొనసాగుతున్న హిందూజీవనవిధానానికీ సంబంధమే లేదని. అసలు 'హిందుత్వం' వేరు, హిందూ జీవనవిధానం వేరని. అసలు హిందూ మతమంటూ ఒకటి లేనేలేదని. పోనీ, అటువంటి మతమంటూ ఒకటుందని అనుకున్నా, ఇట్లాంటి అమానవీయ, militant ధోరణుల్ని అది గతంలో ఎప్పుడూ ఇంత నిస్సిగ్గుగా చూపించి ఉండలేదనీ, ఇప్పటీ ఈ దుర్మార్గస్వరూపం గ్లోబలు పెట్టుబడికీ, రాజకీయకట్టుకథకీ పుట్టిన విషపుత్రిక అనీఎప్పుడు గుర్తిస్తారు!

మరొక మాట కూడా చెప్పాలి. నేను కూడా హిందువునే. కాని నా మతానికి బయటి మతాల వల్ల ప్రమాదం ఉందని నాకెప్పుడూ అనిపించలేదు. ఏ మతమైనా ఆ మతం పేరు చెప్పుకుంటూ కూడా దాన్ని అనుసరించలేని ఆత్మవంచనవల్లా, కాలక్రమంలో సంతరించుకునే దురాచారాల వల్లా ప్రమాదంలో పడుతుంది తప్ప బయటివాళ్ళ వల్ల కాదు. ఏ మతాన్నైనా కాపాడగలిగేది, ఆ మతం ప్రబోధించే మంచి విషయాల్ని విశ్వసించి అనుసరించగలిగేవాళ్ళే తప్ప, రాజకీయనాయకులూ, గూండాలూ కాదు.

నేనీ మాటలు రాస్తే, నేను ఎదుర్కోబోయే ప్రశ్నలేమిటో కూడా నాకు తెలుసు. అన్నిటికన్నా ముందు అడిగే ప్రశ్న: మరి వామపక్ష తీవ్రవాదులు అమాయికుల్ని చంపితే నువ్వెందుకు మాట్లాడలేదు అని, కేరళలోనో మరో చోటనో ఎవరో ఎవరినో చంపుతుంటే నువ్వెందుకు మాట్లాడలేదని. హింస ఎక్కడైనా హింసనే, ఎవరు చేసినా హింసనే. కత్తితో కుడివైపు నుంచి పొడిచినా, ఎడమవైపు నుంచి పొడిచినా కారేది రక్తమే, దుఃఖమే. కాని నేను ఈ దేశంలో ఇంతదాకా చూసిన హింసకీ, ఈ హింసకీ పోలికనే లేదు. గతంలో ఎవరైనా ఎవరినైనా చంపితే ఎంతో కొంత పశ్చాత్తాపాన్ని వ్యక్తం చేసేవారు. చివరికి గాడ్సే కూడా తన వాఙ్మూలంలో గాంధీ పట్ల ఎంతో కొంత సానుభూతి కనపర్చకుండా ఉండలేకపోయాడు. కాని ఒక హత్యని ఇట్లా celebrate చేసుకుంటున్న అత్యంత హీన సందర్భాన్ని ఇప్పుడే చూస్తున్నాను. అది కూడా హిందుత్వం పేరిట!

ఆమె హత్యని ఎవరు ఖండించారన్నది కాదు. ఎవరు ఖండించలేదన్నది నన్నెక్కువ బాధపెడుతోంది. ఇది జాతికి మంచిది కాదు, దేశానికి మంచిది కాదు, మన పిల్లలకి మంచిది కాదు. బహుశా, చిదానంద రాజఘట్ట రాసుకున్న ఈ జ్ఞాపకాలు చదివి ఉండకపోతే, ఈ నాలుగు మాటలు మాట్లాడటానికి కూడా నా గొంతు పెగిలి ఉండేది కాదు. మరీ ముఖ్యంగా ఈ వాక్యాలు:

> Death was just incidental. Respect, affection, and admiration for the good people did and what they stood for was important.
>
> Amazing Grace. Forget all other labels: leftist, radical, anti-Hindutva, secular etc. For me, there is just this: She is the epitome of Amazing Grace.

పిల్లలూ చదవండి, నీకు నచ్చని ప్రతి ఒక్కరినీ నిర్మూలించుకుంటూ పోనక్కర్లేదని తెలుస్తుంది. విభేదాలతో విడిపోయినా, స్నేహితులుగా కొనసాగడమెలానో తెలుస్తుంది. మనుషులుగా మిగలడం అన్నిటికన్నా ముఖ్యమని తెలుస్తుంది.

8-9-2017

వాడ్రేవు చినవీరభద్రుడు

# ఉదారచరితులు

వారిది వసుధైక కుటుంబం

◎

తెలుగుసమాజంలోనూ, దేశస్థాయిలోనూ, అంతర్జాతీయ రంగంలోనూ సామాజికంగా, సాంస్కృతికంగా సంభవిస్తున్న పరిణామాల పట్ల వాడ్రేవు చినవీరభద్రుడు గతపాతికేళ్ళుగా వ్యాసాలు రాస్తూ ఉన్నారు. అటువంటి కొన్ని వ్యాసాలతో ఒక సంపుటిని 'సోమయ్యకు నచ్చిన వ్యాసాలు' (2012) పేరిట గతంలో వెలువరించారు కూడా. అదే క్రమంలో రాస్తూ వచ్చిన 34 వ్యాసాల సంపుటం ఈ పుస్తకం. ఇందులో నేతాజీ, నెల్సన్ మండేలా, లోహియా, డా.కలాం, బాబా ఆమ్టే వంటి లెవెలు-5 నాయకుల గురించీ, స్వెత్లానా, గూగీ, బెన్ ఒక్రి, సల్మాన్ రూష్డి, మహాశ్వేతాదేవి వంటి రచయితల గురించి, నిరాలా, గరిమెళ్ళ వంటి కవుల గురించి, యు.వి. స్వామినాథ అయ్యరు, ష్లీమను వంటి పండితుల గురించి ఎన్నో ఆలోచనలు పంచుకున్నారు. వాడ్రేవు చినవీరభద్రుడు వెలువరిస్తున్న ఈ 68 వ పుస్తకం పాఠకుల ఆదరణ పొందుతుందని ఆశిస్తున్నాం.